# గ్రంథాలయసర్వస్వము

## ప్రథమసంపుటము

ఆంధ్రదేశ గ్రంథభాండాగారసంఘ పక్షమున సంవత్సరమునకు నాలుగు సంచికలుగా ప్రకటింపఁబడు గ్రంథము.

"వాయువెల్లవారికి నెట్లు స్వాధీనమై యున్నదో జ్ఞానముకూడ నట్లు స్వాధీనము కావలయును. ఉదక మెల్లవారికి నెట్లు సేవ్యమై యున్నదో జ్ఞానమట్లు సేవ్యమై యుండవలెను. సూర్యచంద్రమండలముల తేజస్సు నెల్లవారికి నెట్లు సౌఖ్యప్రదముగా నున్నదో జ్ఞానమట్లు సౌఖ్యప్రదముగ నుండవలయును."

—చిలకమర్తి లక్ష్మీనరసింహము.

కార్యస్థానము : బెజవాడ.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు

బి. కే. స్వామిచే ముద్రింపఁబడియె.

వార్షికమూల్యము రు ౨-౬-౦] ౧౯౧౬. [విడిసంచిక వెల అ. ౧౦.

# విన్నపము

...స్ట్రహాము కలన 'గ్రంథాలయ సర్వస్వ ...క్కు నాలుగుభాగముల ప్రకటించి, ప్రథమ ...ంపు ముగించితిమి. గ్రంథాలయోద్యమ ...పరిశీలన గూర్చి ఫలముగ బోధించునట్టి ...ములు ప్రతిభాగమునందును ఆయావిషయములను ప్రత్యేక పరిశీలన జేసిన సమర్థులచే రచింపబడి ...వి. ఈవ్యాసములందు, పాశ్చాత్య దేశములయం ...బరోడారాజ్యము నందును గ్రంథాలయోద్యమ ...ముఖముల పనిజేయుచున్నదియు చూపబడినది; ...ము ఆయాదేశములయందు యుద్యమ ప్రచారము ...వలంబింపబడుచున్న అభివృద్ధి మార్గములు మన ...నకు అనుగుణముగ నుండునటుల అనుభవసిద్ధముగ ...పబడినవి. ఆంధ్రదేశమునందు స్వంతభవనములు ...యున్న గ్రంథాలయముల చరిత్రములను గూడ ...ముగ ముద్రించుచున్నారము.

ఆంధ్రసారస్వతాభివృద్ధి మార్గములను దెలుపున..., మహాపురుషుల జీవితచరిత్రలను దెలుపునట్టియు ...ములు సమర్థులగువారిచే వ్రాయించి... ...ధనతో గూడిన వ్యాసములు ప్రకటించిక... ...కానగును. ప్రాచీన నవీన గ్రంథముల యం...రాత్రిల ఔచిత్యమును విమర్శించుటకు ప్ర... ...లు సలుపబడినవి. నేన్యాగముల ప్రాగుచున్న ...వాణికి బూజ్యస్థానమిచ్చితిమి. ధ్వని మోహనము... ...తములు ప్రచురించి, అర్థనిక కావ్యపికాసముననకు ...లిదోహదము గల్పించితిమి. ఉదాత్తమును... ...సుందరమునగు సాహిత్య చర్చ ప్రారంభింపబడి ...మరచిపోయిన కవులయొక్కయు, మాసిపోయిన ...ప్రపంచము యొక్కయు అభిజ్ఞానప్రసారమును ...కు అవకాశము లొసగితిమి. సోదరభాష...దు రసనమణీయములగు కవులయు భక్తులయు ... స్వభాషాముఖమున ...సించుటకు తలపెట్టితిమి. ...ర్యమునకు సహజబాంధవ్యగు చిత్రకళనుజీవింపజేయుటకు గూడ కొంత సంకల్పించితిమి.

...శా వీణ్యాపరమావధి నందిన ...

...క్రోత్సాహకుల దను ... ...మునకు పాలమైతిమి. ఇం...డలి వ్యాసము లనేకముల ...యొక్కల గాంభీర్యశనను సూచింపకపోవు. ...యగు కవుల యావేశము స్ఫుటముగ ధ్వనించుచున్నది. ఇంచుంచియు శుభమయిన యాభ్యుదయము. ఏలిన్నిపోషణమె నిర్వాహకుల సంకల్పము.

'సర్వస్వము'ను నిర్విఘ్నముగ నిర్వహించుటకు దోడ్పడిన లేఖకులకును, పోషకులకును కృతజ్ఞ...ము. శ్రీ పిఠాపురము రాజాగారు తమ సహజౌదార్యముతో, నూరురూపాయల వార్షికము నొసగుచు రాజపోషణచే మాకు కేలూతనొసంగిరి.

ప్రథమసంపుటమునకు ఆదాయ వ్యయములు.

ఆదాయము.

| | |
|---|---|
| చందాలు | రు ౮౦౧-౧౨ |
| విరాళములు | ౪౪౧- ౦-౯ |
| ... | ౧౭- ౫-౬ |
| మొత్తము | రు ౨౬౦- ౮-౬ |

వ్యయము.

| | |
|---|---|
| అచ్చు | రు. ౮౭౯- ౯-౦ |
| సామానులు | ౯౫-౧౯-౦ |
| "బ్లాకులు" | ౧౩౦- ౦-౦ |
| కాగితములు | ౯౫౩-౧౯-౬ |
| తపాలాఖర్చు | ౧౨౨-౧౦-౩ |
| చిల్లర | ౩౯- ౬-౯ |
| మొత్తము ఖర్చు | రు. ౧౩౬౪- ౫-౬ |
| బాకీ | రు. ౯౦౪- ౪-౦ |

ఈ పట్టికనుబట్టి ప్రథమ సంపుటమునకు రు ౯౦౪-౪-౦ లు నష్టమువచ్చినటుల తేలుచున్నది.

# రా జ పో ష కు లు

శ్రీరాజా రావు వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

# పో ష కు లు

మోతే గంగరాజుగారు, జమీందారు, విస్సన్నపేట.

బెల్లంకొండ రాఘవరావుగారు.

రాయప్రోలు రామచంద్ర ప్రసాదరావుగారు.

చిగురుపాటి వేంకట సుబ్బారావుగారు.

బండి వేంకట కృష్ణయ్యగారు.

శ్రీ లక్ష్మీకాంత పుస్తక భాండాగారము, కొవ్వూరుపాడు.

నాళం కృష్ణారావుగారు.

కుప్పా శ్రీరామశర్మగారు.

పోణకా పట్టాభిరామారెడ్డిగారు.

# అ భి మా ను లు

పెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.

సూరి వేంకట నరసింహంగారు, బి.ఏ.

అద్దంకి సత్యనారాయణ శర్మగారు.

బొడ్డపాటి హనుమంతరావుగారు.

# స హా యు లు

చిదానంద సరస్వతీ పుస్తకభాండాగారము, పెద్దచెరుకూరు.

ఆంధ్ర వాణీపుస్తక భాండాగారము, పెద్దచెరుకూరు.

# విషయసూచిక


ప్ర... ౧౬౮
సూరి సుబ్బారావుగారు.
ర్వ ప్రకటన ౪౨
ర్వసిద్ధాంతము (మేధాసిధి) ౨౯౪
రాశ్వరము (విమర్శన) రా. అ. ౩౮౪
ధ గ్రంథాలయోద్యమము ౨
సూరి వేంకట నరసింహంగారు, బి.ఏ.
ధ గ్రంథవిభజనము ౧౩
వెలిదెండ శ్రీనివాసరావుగారు.
ధుల జనహితపరత్వము ౧౫
డూకార్న్ జీ ౩౩
పెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.
థ గ్రంథములు విరివిగ వ్యాపించు
టెట్లు? కొండాలి శివరామకృష్ణారావుగారు. ౬౨
ధమునందనుస్వారము ౮౩
వే. శివస్వామి శాస్త్రులుగారు.
ని కాంధ్రసారస్వతము ౧౨౧
రాయప్రోలు సుబ్బారావుగారు.
ధదేవుని పద్యములు ౧౮౯
ధ నాటకములు ౧౯౮
పురాణం సూరి శాస్త్రిగారు, బి. ఏ.
ధ వార్తాపత్రికలు ౨౧౮
కొండాలి శివరామకృష్ణారావుగారు.
ధ వాఙ్మయస్థితి ౨౪౦
ఆదిరాజు వీరభద్రరావుగారు.
ధదేశ చరిత్రాంశములు ౩౧౪
వెలిదెండ శ్రీనివాసరావుగారు.
ధదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ
రెండవది ౪౯
మూడవది ౩౬౧

ఆంధ్ర భాషాసర్వస్వము (విద్యాధికులు) ౩౨౨
ఆంధ్రమాత స్తుతి ౩౮౦
ఉపన్యాసము ౧౯౬
ఆనరబిల్ పింగళి వెంకట్రామారెడ్డిగారు.
ఎవరు? (పద్యములు) ౮౫, ౨౬౩
రాయప్రోలు సుబ్బారావుగారు.
ఏనుగు పెదలక్ష్మణకవి ౨౫౩
పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు
కథ—కలాపము ౨౯౬
కాపుపాట ౩౪౦
అబ్బూరి రామకృష్ణారావుగారు.
'కానిమరా' సర్వజన గ్రంథాలయము ౨౪౪
ఎం. వి. యస్. శర్మగారు.
కాశీ - రామేశ్వరము ౨౬౧
కామాసుర (పద్యములు) ౨౨౮
బసవరాజు వేంకటప్పారావుగారు. బి.ఏ.
కోకిల ౩౨౬
పింగళి లక్ష్మీకాంతముగారు.
కేంద్ర గ్రంథాలయము—బరోడా ౧౮
కృష్ణదేవరాయలు (పద్యము) ౨౦౬
మైలవరపు నృసింహశాస్త్రిగారు.
కృష్ణవేణి (పద్యము) ౨౯౩
సాటిబండ అప్పారావుగారు.
కృష్ణ రామభారము—శ్రీ ౨౮౧
కంటు శ్రీనివాసరావుగారు.
గోదావరి మండల గ్రంథాలయోద్యమము
అద్దంకి సత్యనారాయణ శర్మగారు. ౩౨౧
గ్రంథ భాండాగారాధిపతి ౨౫
తేకుమళ్ళ వెంకాజీగారు.

గ్రంథభాండాగారము (పద్యము) ౩౨
పోచిరాజు సీతారామయ్యగారు.

గ్రంథ భాండాగార సంఘములు ౭౦

గ్రంథరచన ౧౦౬
మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు.

గ్రంథాలయములు (పద్యములు) ౧
ముట్నూరి వేంకట సుబ్బారాయుడుగారు, బి.ఏ.

గ్రంథాలయములు (పద్యములు) ౩౮౯
మైలంపాటి హనుమంతకవి.

గ్రంథాలయములు (పద్యములు) ౧౬౫
ఉమర్ ఆలీషాకవిగారు.

గ్రంథాలయములు (పద్యములు) ౨౮
రాయప్రోలు సుబ్బారావుగారు.

గ్రంథాలయమన నేమి? అది చేయవలసిన ధర్మము లేవి? ౪

గ్రంథాలయములు-అవి చేయవలసిన పనులు: ౧౨౭

గ్రంథాలయములు చేయవలసినపని ౧౬
వంగూరు సుబ్బారావుగారు.

గ్రంథాలయములు ౩౨
అకునుమిల్లి గోపాలకృష్ణయ్యగారు.

గ్రంథాలయ ప్రదర్శనము-మహేశనపట్టణము ౧౩౧

గ్రంథాలయములు - వంగదేశము ౧౩౫
పాలపర్తి నరసింహంగారు.

గ్రంథాలయములు-- గ్రామచరిత్ర ౧౯౨
మ. వేంకట రంగయ్యగారు, ఎం.ఏ.

గ్రంథాలయములు - గ్రామములు ౩౪౬
రాయ్యూరు రామచంద్ర ప్రసాదరావుగారు

గ్రంథాలయములు - పౌరజీవితము ౩౦౬
చల్లా శేషగిరిరావుగారు, బి.ఏ.

గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ
రెండవది
మూడవది

గ్రంథమాలికలు
మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు.

గ్రంథాలయోద్యమము-బరోడా ౧
సూరి వేంకటనరసింహంగారు, బి.ఏ.

గ్రంథాలయములు-బరోడారాజ్యము ౩

గ్రంథాలయపాలనము ౩
దంటు కృష్ణమూర్తిగారు.

గ్రాహ్యాపుస్తకవిమర్శ
దంటు సుబ్బావధానులుగారు.

గ్రంథాలయోద్యమము (పద్యము) ౩
సత్తెనపల్లి హనుమంతరావుగారు.

గీతప్రపంచము ౩
పాటిబండ అప్పారావుగారు.

చారిత్రికపరిశోధనము
ఆలూరి గురురాజారావుగారు.

జనసామాన్యమునందు విద్యను వ్యాపింపజేయుటెట్లు? ౩
సూరి వెంకటనరసింహంగారు బి. ఏ.

జపానుదేశమందలి ప్రాచీనపుస్తకాగారములు

జన్మకథ (పద్యములు)
అత్తిలి సూర్యనారాయణరావుగారు.

జాతీయధర్మగ్రంథాలయము-అమెరికాదేశము ౨
దాసు త్రివిక్రమరావుగారు.

జ్యోతిశ్శాస్త్రము ౧
పిడపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

డాక్టరు మెల్విడేవీ ౧౬
ఎం. వి. ఏన్. శర్మగారు.

విషయసూచిక


…ంకా గ్రంథాలయ సంఘము—

…రామచంద్రపురము ౨౫౦

…ివురము ౩౭౦

కొండముది శ్రీరాములుగారు.

…య ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధుల మహాసభా వృత్తాంతము ౪౫

…నసోమనాథుఁడు ౬౬, ౩౬౪

వంగూరి సుబ్బారావుగారు.

…వ్వడను? (పద్యములు)-జలబిందువు ౨౨౫

…రాళ్ళు-గ్రంథాలయములు ౧౪౮

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

…ని ౧౪౭, ౩౫౦

వేలూరి శివరామశాస్త్రిగారు.

…శెట్టి సీతారామయ్యగారు ౧౭౦

పాలపర్తి నరసింహంగారు.

…క భాండాగారములు ౩౮

ఇప్పగుంట సుబ్బుకృష్ణయ్యగారు.

…కములు (పద్యములు) ౩౮౧

కలచవీడు వేంకటరమణాచార్యులుగారు.

…క సాంగత్యము (పద్యములు) ౧౧౭

అబ్బూరి రామకృష్ణారావుగారు.

…కావాహన (పద్యములు) ౭౨

రాయప్రోలు సుబ్బారావుగారు.

…గ్రప్రయాణము ౨౫౦

…నరాధిక (పద్యములు) ౨౫౯

…యభంగము—(వసంతుఁడు) ౩౭౨

…ంభవిద్యార్థి గ్రంథాలయముల

…ోడ్పాటు ౩౮

సత్తెనపల్లి హనుమంతరావుగారు.

…లో బెట్టు తెలుగుపుస్తకములు ౧౪౦

సూచి నరసింహంగారు, బి. ఏ.

…ళూరు గ్రంథాలయము ౩౨

భక్తుఁడు కవియగునా? ౧౪౯

వంగూరి సుబ్బారావుగారు.

భక్తగీతములు— ౨౬౫-౩౯౩

కన్యామీరాబాయి, దాసీ క్షేమ

భావనాశక్తి ౧౩౫

దంటు సుబ్బావధానులుగారు.

భారత రంగమాలిక ౨౧౭

దంటు సుబ్బావధానులుగారు.

భీష్ముఁడు-ఆయన జీవితసారము ౨౨౪

వేమూరి శివస్వామిశాస్త్రులుగారు.

భీష్ముఁడు-ఆయన గుణగణము ౨౩౧

చెలికాని లచ్చారావుగారు.

భీష్ముఁడు-ఆయన శపథము ౨౩౬

మంగిపూడి పురుషోత్తమశర్మగారు.

మనుచరిత్ర నాయికలు-వరూథిని ౮౮

రాయప్రోలు సుబ్బారావుగారు.

మధుమాలి (పద్యములు) ౨౭౯

రాయప్రోలు సుబ్బారావుగారు.

మేఘము ౩౬౬

రాయప్రోలు సుబ్బారావుగారు.

మూలపురుషుఁడు (శతపత్రగ్రంథము) ౨౭౪

మిక్కిలి మల్లికార్జునకవి ౩౩౭

పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

యుద్ధరంగము-పుస్తకభాండాగారములు ౧౩౭

రయిలుస్టేషనులయందు గ్రంథాలయములు ౨౪

రవీంద్రనాథఠాకూరు ౩౨౧

రాయప్రోలు సుబ్బారావుగారు.

రాధాకృష్ణ నాటకవిమర్శనము ౨౨౦

ఓలేటి పార్వతీశ్వరకవిగారు.

రామమోహన ధర్మగ్రంథాలయము—శ్రీ

బెజవాడ ౯౫

రామమోహన ధర్మపుస్తకభాండాగారము

యొక్క నూతనభవనప్రవేశ మహోత్సవ

సమయమున పింగళి వేంకట్రామారెడ్డిగా
రిచే నీయబడిన ఉపన్యాసము ౧౫౬

లాహోరునను విశ్వవిద్యాలయము- గ్రంథభాండా
గారము.— నెద్దిభొట్ల కావయ్యగారు. ౧౬౦

నరూధిని ౭౭

వసంతోత్సవము (పద్యములు) ౧౬౫
ఓలేటి పార్వతీశ్వరకవిగారు.

వసంతవికాసము ౨౩౮
రాయప్రోలు సుబ్బారావుగారు.

వాసంతిక (పద్యములు) ద. సు. ౨౩౮

'వాసో' సార్వజనిక గ్రంథాలయము ౧౬౪

విరహిగీతములు (పద్యములు) ౧౭౦
రాయప్రోలు సుబ్బారావుగారు.

విస్మృతవేణుగీతి (పద్యములు) ౧౭౫
రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు.

విద్యాభ్యాసతరుణము ౧౮౬
కొండిపర్తి వీరభద్రాచార్యులుగారు బి. ఏ.

విద్య ౩౬౫
కొండముది శ్రీరాములుగారు.

వీరేశలింగపుస్తకభాండాగారము—శ్రీ
రాజామహేంద్రవరము ౬౩

వీరేశలింగకవి సమాజము-కొముదవల్లి ౫౩

వీరేశలింగకవి సమాజముయొక్క పదునెనిమి
దవ వార్షికోత్సవసమయమున అగ్రాస
నాధిపతిగారిచే నీయబడిన ఉపన్యా
సము ౮౮

శంకరాచార్యులకాలము ౩౯౦
వావిలాల వేంకటశివావధానులుగారు బి. ఏ.

శాయాజీగాయక్వార్ (పద్యములు) ౯౮
దంటు సుబ్బావధానులుగారు.

"శ్రావణ భాద్రపదములు" ౩౩౩
వడ్డాది సుబ్బారాయకవిగారు.

శ్రీశైలము (యాత్రికుడు) ౨౬

శ్రీకృష్ణరాయభారము ౨

శ్రీసత్యనారాయణ వరప్రసాద పుస్తకభాం
డాగారము— బొడ్డపాటి హనుమంతరావుగా

సహస్ర స్తంభముల మంటపము—
హనుమకొండ ౩౩
ఆలూరి కుసుమాయాతావుగారు.

సఖిసంవరణం (పద్యములు) ౩౨
రాయప్రోలు సుబ్బారావుగారు.

సర్వకళాశాల గ్రంథాలయము—
బొంబాయి ౧

సంచారగ్రంథభాండాగారము ౨
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

సన్మానపత్రము ౧౬
మాడపాటి హనుమంతరావు గారు.

సుజనరంజనీ పుస్తకభాండాగారము ౩౮

సారస్వతజీవనము ౪
చిలుకూరి వీరభద్రరావుగారు.

సాహిత్యచర్చ (సహవాసి) ౨౯

సింహాద్రినారసింహశతకము ౨౧౬
జూపూడి హనుమచ్ఛాస్త్రిగారు.

స్త్రీలుచేయదగిన పరిశ్రమలు ౧౧

స్త్రీలకు కళాశాల ౨౪౭

స్వాగతము (పద్యములు) ౩౬౧
రాయప్రోలు సుబ్బారావుగారు.

త్రేతాయుగమునాటి హిందూవ్యార్యులు:—
-వారియుడుపులు ౭౨
-వారియాహారము ౧౧౫
-వారివివాహములు ౨౧౧
-వారిసాధారణ రాజ్యాంగస్థితి ౩౮౧
మాడపాటి హనుమంతరావుగారు.

VIII

# చిత్రపటములు

[illegible]

# GRANDHALAYA SARVASVAM

**Published in four parts every year**

ON BEHALF OF

## The Andhra Desa Library Association,

BEZWADA.

# గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథ భాండాగారసంఘపక్షమున సంవత్సరమునకు నాలుగు
సంచికలు చొప్పున ప్రకటింపబడు గ్రంథము.

---

"వాయువెల్లవారికి నెట్లు స్వాధీనమైయున్నదో జ్ఞానముకూడ నట్లు స్వాధీనము కావలయును. ఉదక మెల్లవారికి నెట్లు సేవ్యమై యున్నదో జ్ఞానమట్లు సేవ్యమై యుండవలెను. సూర్యచంద్రమండలముల తేజస్సు ఎల్లవారికి నెట్లు సౌఖ్యప్రదముగా నున్నదో జ్ఞానమట్లు సౌఖ్యప్రదముగ నుండవలయును."

చిలకమర్తి లక్ష్మీనరసింహము.

---

వార్షికమూల్యము అంచెకూలితో రు 2—6—0 లు మాత్రమె.

కార్యస్థానము : బెజవాడ.

---

PRINTED AT THE VANI PRESS, BEZVADA.

గుల పటములు. # అపూర్వ గ్రంథములు. రంగుల అచ్చు.

# Rare Books in Telugu.

## 1 సతీదేవి [వెల రు 0-8-0] 2 సావిత్రీదేవి [వెల రు 0-8-0]

ఈ రెండుగ్రంథములయందును మూడురంగులతో ముద్రింపబడిన పటములు జేర్చబడినవి. పుటల యు రెండురంగుల సిరాతో ముద్రింపబడి యున్నవి. సతీదేవి యను గ్రంథమునకు మ.రా.రా. ండా వేంకటప్పయ్యపంతులు, బి.ఏ., బి.యల్., గారు ఉపోద్ఘాతమును వ్రాసియున్నారు. ంచి కాగితములమీద మిక్కిలి సుందరముగ ముద్రింపబడి యున్నవి. ఇట్టి గ్రంథములు ఆంధ్ర షయం దింతవరకును వెలువడి యుండలేదు.

## మల్లికాగుచ్ఛము

ఇందు మనోహరములగు చిన్నచిన్న నవలలు గలవు. ప్రతివారును చదివి తీరవలయును. . రా. రా. మాడపాటి హనుమంతరావు పంతులుగారి విరచితము.

వెల కాలికో బైండు రు 1—0—0. రాపరు బైండు రు 0—12—0.

క్కని అచ్చు. ## మతగ్రంథములు చక్కని బైండింగు.

### భక్తియోగము.

దీనిని బంగాళాభాషలో బాబు అశ్వనీకుమారదత్తు ఎం.ఏ., బి.ఎల్., గారు రచియించి యున్నారు. ఆంధ్రులు పఠించి కృతార్థులు కావలయునను నుద్దేశముతో నాంధ్రీకరింపబడినది. ఇందు (౧) భక్తియనగేమి ? (౨) భక్తికి అధికారి యెవడు ? (౩) భక్తి యేవిధముగ సంపాదముగును ? (౪) భక్తి మందుండు కంటకములు ; వాటిని తొలగించు మార్గములు (౫) కామము క్రోధము లోభము మోహము మదము మా ర్యము వదురుబోతుతనము సాంసారికదుశ్చింత ధర్మాడంబరము లోకభయము మొదలగువానినుండి తప్పించుకొను టెట్లు? ) సాధుసంఘము కృష్ణసేవ భాగవతపారాయణ హరినామమహిమ తీర్థయాత్ర ఆత్మవేదన ఏకాగ్రసాధనము అను యముల సాధించు టెట్లు ? (౭) భక్తియొక్క క్రమము భక్తునియొక్క లక్షణము (౮) ప్రేమ. ఇట్టి గొప్పవిషయము గూర్చి నూతనపక్కని సర్వజనరంజకముగ వర్ణింపబడినది.

వెల పోస్టేజిగాక క్యాలికోబైండింగు రు 1—0—0; రాపరుబైండింగు రు 0—12—0.

౧౫౦ పుటలు] ## తుకారాము చరితము కాలికోబైండు]

భక్తాగ్రేసరుడును మహారాష్ట్రజాతీ యోద్ధారకుడును అగు తుకారాముని చరిత్ర. ఎల్లరు ఠింపదగినది. ఇందు తుకారాముని చిత్రపటము గలదు. శైలి కడుసులభము.

పోస్టేజీగాక వెల రు 0—8—0 మాత్రమే.

## విదుషీమణులు

వేదకాలమునుండి భారతవర్షమును పవిత్రవంతముగ నొనర్చిన, విద్వాంసురాండ్ర చరిత్ర ందు చిత్రింపబడినవి. స్త్రీ పురుషులెల్లరు చదువతగినది. మ.రా.రా. కొవల్లె హనుమంతరావు ంతులు, యం.ఏ., బి.యల్., గారు చక్కని యుపోద్ఘాతమును వ్రాసియున్నారు.

వెల కాలికోబైండింగు రు 1—0—0; రాపరుబైండింగు రు 0—12—0.

ఈ గ్రంథములు కావలయువారిట్లు వ్రాయవలెను:—మేనేజరు సరస్వతీనికేతనము, మచిలీపట్నము.

# విషయసూచిక

పుట.

1 గ్రంథాలయములు (పద్యములు) 1
మట్నూరి వేంకటసుబ్బారాయుడు గారు.

2 ఆంధ్రగ్రంథాలయోద్యమము. 2
సూరి వేంకటనరసింహంగారు.

3 గ్రంథాలయమననేమి ? అది చేయదగిన ధర్మములెవ్వి ? ౮
అయ్యంకి వేంకటరమణయ్యగారు.

4 ఆంధ్రగ్రంథవిభజనము. 13
వెలిదెండ శ్రీనివాసరావుగారు.

5 ఆంధ్రుల జనహితపరత్వము. 15

6 గ్రంథాలయములు చేయవలసినపని. 16
వంగూరి సుబ్బారావుగారు.

7 కేంద్రగ్రంథాలయము, బరోడా. 18

8 సర్వకళాశాల గ్రంథాలయము, బొంబాయి. 19

9 సంచారగ్రంథభాండాగారములు. 20
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

10 జపానుదేశమందలి ప్రాచీనపుస్తకాగారములు. 23

11 గ్రంథాలయములు (పద్యములు) 24
రాయప్రోలు సుబ్బారావుగారు.

12 రయిలుస్టేషనులయందు గ్రంథాలయములు. 24

13 గ్రంథభాండాగారాధిపతి. 25
తేకుమళ్ళ వెంకాజీరావుగారు.

14 ప్రారంభవిద్యకు గ్రంథాలయముల తోడ్పాటు. 28
సత్తెనపల్లి హనుమంతరావుగారు.

15 గ్రంథాలయములు. 30
అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు.

16 బెంగుళూరు గ్రంథాలయము. 32

17 గ్రంథభాండాగారము (పద్యము) 32
పోచిరాజు సీతారామయ్యగారు.

18 ఆంధ్రమూకార్నెజీ. 3
పెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ.,బి.యల్.

19 పుస్తకభాండాగారములు. 3
ఇప్పగుంట సుబ్బుకృష్ణయ్యగారు.

20 జన్మకథ (పద్యములు) 4
అత్తిలి సూర్యనారాయణగారు.

21 సారస్వత జీవనము. 4
చిలుకూరి వీరభద్రరావుగారు.

22 అపూర్వ ప్రకటన. 4

23 గ్రాహ్యపుస్తక విమర్శ. 4
డాక్టరు దంటు సుబ్బావధానులుగారు.

24 ద్వితీయ ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధుల మహాసభావృత్తాంతము. 4

25 శాయాజీగాయక్వాడ్ (పద్యములు) 5
దంటు సుబ్బావధానులుగారు.

26 శ్రీరామమోహన ధర్మపుస్తక భాండాగారము. 5

27 సమస్యలు. 61

28 ఆంధ్రగ్రంథములు విరివిగ వ్యాపించుటెట్లు ? 6
కొండాలి శివరామకృష్ణారావుగారు.

29 శ్రీ వీరేశలింగకవి పుస్తక భాండాగారము. 63

30 నాచన సోమనాథుఁడు. 66
వం. సుబ్బారావుగారు.

31 గ్రంథభాండాగార సంఘములు. 70

32 క్షాత్రయుగమునాటి హింద్వార్యులు, వారి యుడుపులు. 72
మాడపాటి హనుమంతరావుగారు.

33 మనుచరిత్ర నాయికలు. 77
రాయప్రోలు సుబ్బారావుగారు.

34 పుస్తకావాహన. 82
రాయప్రోలు సుబ్బారావుగారు.

35 ఆంధ్రమునందనుస్వారము. ౮3
వే. శివస్వామి శాస్త్రులవారు.

# చిత్రపటములు


| | పుట. |
|---|---|
| 1 శ్రీ శాయాజీ గాయక్వార్ | 1 |
| 2 ఆండ్రూకార్నీజీ | 33 |
| 3 బరోడా మహారాణి | 49 |
| 4 పానుగంటి రామారాయనింగారు | 49 |
| 5 బాబు శ్రీరామనరసింహారావుగారు | 49 |
| 6 శ్రీ రామమోహనధర్మపుస్తక భాండాగారముయొక్క నాల్గవసాంవత్సరీకోత్సవ సమయమున దీయబడిన పటము | 60 |
| 7 శ్రీరాజా వెల్లంకి చినవెంకట్రామారావు బహద్దరు జమీందారుగారు | 60 |
| 8 శ్రీ రామమోహన ధర్మపుస్తక భాండాగారమువారిచే నిర్వహింపబడుచున్న పంచమపాఠశాలయందు జదువుచున్న బాలురు, బాలికలు. | 60 |
| 9 శ్రీ వీరేశలింగ పుస్తకభాండాగారమునందున్న ఆంగ్లేయగ్రంథయల బీరువాల వరుస | 65 |
| 10 శ్రీ వీరేశలింగ పుస్తకభాండాగారమునందున్న ఆంధ్రగ్రంథముల బీరువాల వరుస | 65 |
| 11 శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు | 65 |
| 12 నాళం కృష్ణారావుగారు | 64 |



000 మంది చందాదారులు. **కృష్ణాపత్రిక** చందా రు 3—0—0.

సుప్రసిద్ధ వారపత్రిక.

కథలు, గంభీరవ్యాసములు, కబుర్లతోడ పత్రిక భావపూరితమై యుండును.
దీని నొక్కమారు చదివినవారు విడువరు.

మేనేజరు, కృష్ణాపత్రిక, మచిలీపట్నము.


## శ్రీ గోపాలకృష్ణగోఖలే జీవితము


తపాలా కర్చులకొరకు మాత్రము ఒక అణా పోస్టుబిళ్ళను బంపు ఆంధ్రదేశ గ్రంథ భాండాగారములన్నిటికిని నెల్లూరునందుండు సుబోధినీ గ్రంథమాలవారు ఈ మహనీయుని జీవితచరిత్రమును ఉచితముగా బంపెదరు. కావున గ్రంథాలయములవారందరు ఈ తరుణమును బోగొట్టుకొనకుండెదరు గాక.

RSVM01A101

# ఉపోద్ఘాతము

ఈ కాలమున జనసామాన్యమునకు విద్యను గఱపుటయందు గ్రంథాలయములు మ
సాధనములుగా ప్రసిద్ధిగాంచుచున్నవి. మన యాంధ్రదేశమున గడచిన పది పదునైదు సంవ
ములనుండియు గ్రంథాలయోద్యమము ప్రారంభమై దినదినాభివృద్ధి గాంచినది. మనదేశవ
దీయుద్యమము నలుదెసల వ్యాపించి అందువలన చేకూరులాభమును పూర్తిగా మన దేశీయ
పడయవలెనన్న నీయుద్యమ మెక్కువ సమర్థతతో జయప్రదముగ నిర్వహింప బడు
దేశాంతరముల యందును ఖండాంతరముల యందును ఏయేమార్గముల నవలంబించి యభి
గాంచుచున్నదో మనము బాగుగ గమనించి మనదేశముయొక్క స్థితిగతులనుబట్టి ఆ యా
ర్గముల దీని నెట్లు నడప వలయునో నిర్ణయించుకొనవలసి యున్నది. ఈకాలమున గ్రంథా
ములు అమెరికా ఖండమున మిక్కిలి ప్రసిద్ధి గాంచియున్నవి. ఆదేశమున గ్రంథభాండా
పదము నధిష్ఠించగోరువారు పట్టపరీక్షయందు తీర్ణులైన పిదప మూడు సంవత్సరములకాల మి
స్త్రమును ప్రత్యేకమభ్యసింపవలెను. ఈవిషయమువలన నీయుద్యమసంబంధమగు వాఙ్మయమ
ట నెంత విపులముగ వ్యాప్తిజెందినది మనమూహింపవచ్చును. మన దేశమున నీయుద్యమము
వావస్థయందుండుటచే నిందునుగూర్చిన గ్రంథము లేవియు లేవు. ప్రత్యేక మీవిషయమును
ర్చి పరిశ్రమ జేసినవారలచే గ్రంథాలయోద్యమముయొక్క వివిధాంశములపై వ్యాసములు వ్రా
చి దేశమందు వ్యాపింపజేయవలసి యున్నది. మనదేశమందును ఇతరదేశములయందునున్న
థాలయములయొక్క చరిత్రలు తెలిసికొనవలసియున్నది. ఈవిషయముల నన్నిటినిగూర్చి చ
చుటకు "గ్రంథాలయసర్వస్వము"ను పేరుతో గ్రంథమాల నొకదానిని ఆంధ్రదేశ గ్రంథా
సంఘపక్షమున మూడు మాసముల కొకమాఱు ప్రచురించుటకు తీర్మానింపబడినది. గ్రంథాల
ద్యమము గ్రంథములనుగూర్చిన దగుటచేతను గ్రంథములు వాఙ్మయాత్మకములగుటచేతను
యాభివృద్ధినిగూర్చినట్టియు చరిత్ర పరిశోధనలనుగూర్చినట్టియు వ్యాసము లిందు ప్రచురింపబడ
డును. ఈనాటి గ్రంథాలయములు ప్రత్యేకగ్రంథసమూహము లేగాక మనుజునియొక్క సను
నేంద్రియముల మూలకముగను మనుజుని మనుష్యత్వము నువ్యక్తీకరింపజేయు సాధనములన
ర్చునవై యుండుటచే చిత్రకళలయభివృద్ధినిగూర్చిన వ్యాసములుకూడ నిందు ప్రకటింపబడును.
ధ్రదేశాభిమానులును ఆంధ్రభాషాభిమానులును ఇందు ప్రచురించుటకు వ్యాసములనుబంపియు
గ్రంథమాల యభివృద్ధి నొందుటకు ప్రోత్సాహపరచియు నీయుద్యమమును జయప్రదముగ
టకు ప్రార్థితులు.

# గ్రంథాలయ సర్వస్వమునకు చందాలు

ఈక్రింది చందాలు వందనములతో నందుకొనబడినవి

| | | |
|---|---|---|
| 1 | అయ్యంకి వేంకటరమణయ్యగారు | రు 100 |
| 2 | బెల్లంకొండ రాఘవరావుగారు | 80 |
| 3 | సూరి వేంకటనరసింహంగారు | 25 |
| 4 | చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు | 25 |
| | | రు 230 |

వేయబడిన చందాలు.

| | | |
|---|---|---|
| 1 | రొయ్యూరు రామచంద్రప్రసాదరావుగారు | రు 100 |
| 2 | పెద్దిభొట్ల వీరయ్యగారు | 50 |
| 3 | బండి వేంకటకృష్ణయ్యగారు | 50 |
| 4 | నాళం కృష్ణారావుగారు | 50 |
| 5 | చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు | 25 |
| 6 | చట్టి నరసింహారావుగారు | 25 |
| 7 | బెల్లంకొండ రాఘవరావుగారు | 20 |
| 8 | అద్దంకి సత్యన్నారాయణ శర్మగారు | 20 |
| 9 | చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు | 5 |
| 10 | కే. కళ్యాణస్వామిగారు | 5 |
| 11 | పులిపాక వేంకటరామారావుగారు. | 5 |
| 12 | చుండూరి శ్రీరాములుగారు (సంవత్సరమునకు) | 5 |
| 13 | తమ్మన మాణిక్యంగారు (సంవత్సరమునకు) | 5 |
| | | రు 365 |

అ. వేంకటరమణయ్య.

సంపాదకుఁడు.

XV

భారతవర్ష గ్రంథ భాండాగారోద్యమమునకు
కల్పతరువు.



శ్రీ శాయాజీ గాయక్వార్.
బరోడా మహారాజు.

# గ్రంథాలయ సర్వస్వము.

## గ్రంథాలయములు.

సీ. అఖిలకాలములఁ బ్ర♦ఖ్యాతిఁగన్న మహాత్మ, మంజులాలాప ♦ సంపదయనంగ
సర్వదేశములఁ బ్ర♦శస్తిఁజాటిన ధీర, శేముషీవిభవ వి♦శేషమనఁగ
కర్ణేంద్రియప్రీతిఁ ♦ గావించు కవిరాజ, సత్కావ్యకల్పనా ♦ సారమనఁగ
షట్ఛాస్త్రనిర్మాణ ♦ చణమైన పండిత, ప్రజ్ఞాతిశయ వి♦జృంభణమనంగ
గీ. రాశిఁజేసిన జ్ఞాన స♦ర్వస్వమనఁగ । ధర్మపుస్తకనిలయంబు ♦ తనరుచుండు
నుచితగతి దాని నెవఁ♦డుపయోగపరచు । నతఁడె వెలలేక విజ్ఞాన ♦ మందువాఁడు

ఉ. బాలురవిద్యలన్ దనుపు ♦ ప్రౌఢులకున్ ముదమున్ ఘటించు సు
శ్రీలఁ జెలంగువారలకు ♦ చెల్వొనగూర్చును కష్టజాలముల్
జాలఁగఁగూరియున్న తఱి ♦ శాంతినొసంగి సతంబుమంచు; గ్రం
థాలయముల్ జగంబున ♦ కనంతశుభోదయముల్ దలంపగన్.

సీ. అరువదినాల్గువిద్యలు ♦ నొక్కచోనేర్వఁ, దగు నిలయంబు గ్రం♦థాలయంబు
దరిలేని దుఃఖసా♦గరములనీదంగఁ, దరణితుల్యంబు గ్రం♦థాలయంబు
బుద్ధిమదగ్రణుల్ ♦ పూర్వులొసంగిన, ధననిధానంబు గ్రం♦థాలయంబు
అజ్ఞానతిమిర సం♦హారంబుగావించు, నర్కతేజంబు గ్రం♦థాలయంబు
గీ. యశమె కాయంబుగాఁగల ♦ ప్రాజ్ఞసుకవి । బృందముల రూపములఁ బ్రద♦ర్శించిజన
గరము సమ్ముదితాత్ములు ♦ గానొనర్చు । నట్టి సన్మందిరంబు గ్రం♦థాలయంబు.

ఉ. దీని నిజంబెఱింగి మన♦దేశమునంగల పట్టణంబులన్
జానపదంబులన్ సులభ♦సాధ్యములై తగ గ్రంథమందిరాల్
మానుగనిల్పి సర్వజన♦మండలి విద్యలనేర్వకున్న స
న్మానమొనర్తురే మనల ♦ నాగరికాగ్రణులంచు నన్యులున్.

ముట్నూరి వేంకటసుబ్బారాయుడు.

# ఆంధ్రగ్రంథాలయోద్యమము.

**రెండవ ఆంధ్రగ్రంథాలయ మహాసభయందు సూరి వేంకటనరసింహముగారిచే చదువబడినది.**

ంధ్రదేశగ్రంథభాండాగార సంఘమువా
ప్రచురింపబడిన గ్రంథాలయ చరిత్ర వల
క్రింది సంగతులు తెలియుచున్నవి. ఆం
శమున రమారమి 160 గ్రంథాలయము
వి. అందురమారమి 30 వరకు 1914
ప్రియలునెల మొదలు యిప్పటివరకును
ినవిమై యున్నవి. మొత్తముగ్రంథాల
లలో నైదు స్త్రీల యుపయోగము
కు స్త్రీలవలననే స్థాపింపబడినవిమై యు
. తక్కినవాటిలో చాలాసంఘములయం
పురుషులును స్త్రీలునుగూడ సామాజికు
రున్నారు. ఈ సంఘములన్నిటియందును
సామాన్యమున కందఱకును ధర్మముగా
కములను వార్తాపత్రికల నుపయోగిం
ను నధికారముండియున్నది. 19 సం
లకు స్వంతభవనములున్నవి. 12 సంఘ
చే పాఠశాలలుగూడ నిర్వహింపబడుచు
. 22 సంఘముల యాజమాన్యము క్రిం
పురాణపఠనము జరుగుచున్నది. కొన్ని సం
ములవారు మాజిక్కులాంతరు సహాయము
ప్రజాసామాన్యమున కుపయోగమగున
ప్రకృతిశాస్త్రములను గూర్చియు ఆరోగ్య
స్త్రమునుగూర్చియు నీతిసంబంధమైనట్టియు
న్యాసముల నిచ్చుచున్నారు. గంజాంజిల్లా
యను పట్టణమందలి గ్రంథాలయసంఘ
గ్రామమునందు దీపములుపెట్టుటకు స
హాయముల నేర్పరచి పట్టణ పారిశుద్ధ్యము
గూర్చి గూడ పాటుపడుచున్నట్లు తెలియు
న్నది. ఒక సంఘమువారిచే పరిశ్రామిక వ
స్తుప్రదర్శనము జరుపబడినది. పది సంఘము
లవారు బహుమతీ పరీక్షలను జరపి తన్మూల
మున విద్యాభివృద్ధికి దోడ్పడుచున్నారు. నా
లుగు సంఘములవారలు గ్రంథముల యొక్క
యు కరపత్రముల యొక్కయు ప్రచురమును
బూనియున్నారు. ఈయంశములన్నిటి వలన
ఈ యుద్యమముయొక్క స్వరూప స్వభావ
ములనుగూర్చి మనకేమిబోధపడుచున్నది? ఈ
సంఘములు స్థాపింపవలెనని ఎవరుపదేశము
చేసిరి? ఈసంఘములను స్థాపించిన వారలెవ
రు? దొరతనమువారివలన బిరుదులను సంపా
దించు యాశయా వీరినీయుద్యమమునకు బురి
కొల్పినది? ధనవంతులమన్నదయా? లేకద్ర
వ్యాభిలాషయా? ఈసంఘముల స్థాపకులను
సంరక్షకులను ఈయుద్యమవిషయమై బూను
కొనుటకు ప్రేరేపించిన మహాశక్తియెద్ది? వీ
రుబడయగోరుమన్నదయెద్ది? వీరు వాంఛించు
ఫలమెద్ది? ఈప్రశ్నలన్నిటికిని మనము జవాబు
నీయవలసియున్నది.

ఈయుద్యమమునకు ప్రేరకము తానుబా
గై తనతోడివారలను బాగుచేయవలెనను మ
నుష్యస్వభావమున నాటియున్న తీవ్రమగువాం
ఛయేయనియు, ఈయుద్యమ ప్రచారకులు
కోరుఫలము తామును తమతోడివారును జ్ఞా
నాభివృద్ధివలన పొందెడు యానందముకంటె
వేరొండుకాదనియు వీరినీయుద్యమమునకు పు
రికొల్పు మహాశక్తి ప్రపంచాభివృద్ధికొరకు
అప్పుడప్పుడావిర్భవించు మహాదుద్యమము
లను పాదుకొల్పి, వానికి జవసత్వములను గ

ల్పించు ఈశ్వర ప్రేరిత మహాశక్తియే యని యు, ఈయుద్యమ ప్రచారకులందరు తామీశ్వర ప్రేరితులమనియు, ఈశ్వరాదిష్టకృత్యములను తాము నెరవేర్చుచున్నామను దృఢతర భక్తిపూరితులుగ నున్నారనియును జెప్పవచ్చును.

ఏయుద్యమము సరియైన మార్గముల నవలంబించి అందుకు నిర్ణీతమగు పనిని నిర్వర్తించవలెనన్న ఆయుద్యమావలంబకులకు అందలి ప్రాప్యముల స్వరూప స్వభావముల యొక్కయు, ఆయుద్యమమునకును తోడియుద్యమములకును గలయన్యోన్య సంబంధములయొక్కయు జ్ఞానము దృఢముగ నుండితీరవలయును. ప్రతియుద్యమమును అవయవ సమన్వితమై వృద్ధిక్షయములకు లోనై యుండును. ఆదర్శమేదీనికి ప్రాణము. ఆదర్శము లేనియుద్యమము ప్రాణము లేని యాకారము అట్టియుద్యమములు వృద్ధిబొందవలెనన్న తమయందు స్వాభావికముగానున్న జవసత్వముల వల్లగాక సతతము పరాపేక్షను బొందియుండును. పైనుండివచ్చు సహాయ మెప్పుడుతగ్గునో ఆయుద్యమమప్పుడే భగ్నమైపోవును. అట్లుగాక ఆదర్శముతో గూడిన యుద్యమము ఈశ్వర నిర్మిత సావయవయవిక జీవివలె దినదినాభివృద్ధి గాంచును. ఆదర్శముయొక్క శక్తి మహత్తరము. ఆకాశమునొరయు శిరపంక్తిగల హిమవంతమున బుట్టి భూభాగమునజొచ్చి తాబోవుదేశమునంతను సస్యశ్యామలముగను ఫలభరితముగను జేయు గంగాప్రవాహముబోలె ఆదర్శము ఫలప్రాప్తినిబొందించును. ఆదర్శము నేకాగ్రచిత్తతతో ధ్యానము చేయుచుండిన కార్యాచరణయందు వచ్చిన కష్టములన్నియు సుఖములుగా పరిణమించి కార్యదీక్షను ప్రజ్వలింపజేయును. కావున గ్రంథాలయోద్యమము వృద్ధిజెంది అందువలన రా... ఫలమంతయు సమకూడవలెనన్న అందలి ప్రాప్యములను తదవలంబకులు బాగుగ గ...రుంగవలెను.

గ్రంథాలయోద్యమమునకు ప్రాప్యవె... దేశమునందు జ్ఞానాభివృద్ధినిజేసి మనుజుని యాత్ర పవిత్రముగను పురుషార్థప్రాప్తి... కముగను చేయుటయే ఈ యుద్యమముయొక్క ప్రాప్యము. ఈ ప్రాప్యమును దృ... మునందుంచుకొని ఈ యుద్యమము పే... జరగు ప్రతిపనియు ఈ ప్రాప్యమును కా... రూపముగా పరిణమింపజేయుటకు ఎట్లు స... కారి యగుచున్నది, ఎట్లు విరోధమునుగ... చుచున్నది యను యంశములను తర్కించ... ఉద్యమప్రచారకులు కార్యాచరణను బ... వలయును.

ఇక నీయుద్యమమునకును ఇతరయుద్య... ములకును గల సంబంధమును గూర్చియు, సంబంధమును దెలిసికొనవలసిన యావశ... తనుగూర్చియు తెలుపవలసి యున్నది. ... జాతియొక్క ఔన్నత్యముకొఱకనేక యు... మములు వెలువడి పనిజేయుచున్నవి. ఇం... లో గొన్ని సంఘసంస్కరణకొఱకును, కొ... మతవ్యాపకముకొఱకును, కొన్ని రాజకీ... సంస్కరణకొఱకును ప్రయత్నించుచున్న... ఈయుద్యమము లన్నిటియొక్కస్వభావము... వ్యాప్తిని బాగుగ గుర్తెరిగి ఆయుద్యమము యొక్క సిద్ధాంతములకు విరోధము లేకుం... నట్లు గ్రంథాలయోద్యమము నెట్లు వ్యాపిం... జేయవలయునో ఆ యుద్యమ ప్రచారకు... జాగ్రతతో విచారింపవలయును. సాధనిర...

...ను బూను శిల్పి సాధాకారమును ముం కాగితముపై లిఖించి దానియొక్క ...భ భాగముల కెట్టెట్టి సంబంధము లుండవల నో ఎట్లునిర్ణయించునో ప్రతియుద్యమము ...ంబించి పనిచేయు వారలు తా మభి ...నముతో పనిజేయు యుద్యమమునకును ...యుద్యమములకును గల యన్యోన్యసం ...ధములను బాగుగ గు ర్తెరింగి ఇతరయుద్య ...ముల సిద్ధాంతాంశములకు వ్యతిరేకము లే డునట్లు తమయుద్యమమును నడపుచుండ ...ను.

ఇక నీ యుద్యమమును ప్రచారణ జే ...టయందు గమనింపవలసిన సూత్రములను ...ర్చి ముచ్చటింపవలసి యున్నది. జనసా ...న్యమునకు విద్య వ్యాపకము చేయుటయం దేశభాషలే ముఖ్యసాధకములను యంశ మనము ముఖ్యముగా గమనించవలెను. మొదటిసూత్రము. చక్షురక్షురసంయో ...ువలన నేగాక శ్రవణమూలకముగను, చిత్ర ...ములమూలకముగను జ్ఞానాభివృద్ధి జేయ ...నని గ్రహించుట రెండవసూత్రము. చిర ...లమునుండి మనదేశమున జ్ఞానము పుస్తక ...పమున నేగాక లిపివ్యాపకమునకు పూర్వ ...నుండిగూడ, శృతిమూలకముగ నభివృద్ధి ...గుచుండెననుట మనకుసుప్రసిద్ధముగ దెలి యంశమే. శృతిమూలకమగు జ్ఞానము ...రాతనకాలమందేగాక నేటికిని ధారణాశక్తి ...యముతో వ్యాపింపజేయుట యావశ్య ...ు యున్నది. చిత్రపటముల మూలమున ...వ్యాపకము జేయు మార్గము మనము ...శ్చాత్యదేశములనుండి నేర్చుకొన వలసియు ...ది. ఇందునుగూర్చి ఆదేశములయందు జరు ప్రయత్నములు బహు మహత్తరములు.

బయోగ్రాఫు, సినిమోటాగ్రాఫు, మాజిక్కు లాంతరు మొదలగు యంత్ర సహాయముచే అక్షరజ్ఞానములేని మన నిమ్నసోదరులకు జ్ఞానాభివృద్ధిచేయుటకు ఎన్నియో సదుపాయము లున్నవి. ఇది మూడవసూత్రము. అధికారి భేదమునుబట్టి విద్యావ్యాపక సాధనములయం దు భేదమును పాటింపవలెనను యంశము నాలుగవ సూత్రము. వయస్సునుబట్టియేమి, జ్ఞానమునుబట్టియేమి, వృత్తినిబట్టియేమి, అభిరుచులనుబట్టియేమి, చుట్టునుండుస్థితిగతులను బట్టియేమి ప్రజలు వివిధములుగా నున్నారు. వీరందరికిని ఎవరికితగినట్లు వారికి జ్ఞానాభివృద్ధికరములగు పరికరములను అవసరము బట్టి వేరువేరుగా కల్పించుట ఆవశ్యకమని మన ము ముఖ్యముగా గమనించవలసియున్నది.

ఇక నీయుద్యమముయొక్క వ్యాప్తిని నిరూపించవలసియున్నది. ఈ యుద్యమమునకు పరమావధి జనసామాన్యముయొక్క జ్ఞానాభివృద్ధియని ఇదివరకే చెప్పబడియున్నది. జ్ఞానాభివృద్ధికి ముఖ్య సాధనము వాఙ్మయము; కావున వాఙ్మయాభివృద్ధితో కూడిన అన్ని యంశములును ఈయుద్యమమునకు సంబంధముకలవియేయైయున్నవి. మనయాంధ్రవాఙ్మయము ఇదివరకేయేదారులనవలంబించి వృద్ధిబొందినది? ఎట్టిగ్రంథము లీభాషయం దున్నవి? ఇందు లోపములేమిగలవు? ఆలోపములను సవరించుటెట్లు? అన్నితరగతులజనులకు తగినగ్రంథములు మనభాషయం దున్నవా? లేనిచో ఆగ్రంథములు వెలువడునట్లు చేయుటకు మనమేమిప్రయత్నములను జేయవలయును? అను యంశము లన్నియు ఈ యుద్యమమునకు సంబంధించినవియే యైయున్నవి.

ఇందుకొరకై మన భాషయందున్న గ్రంథములన్నిటియొక్క పట్టిక నొకదానిని తయారుపరచి అందుండి గ్రంథస్థాంశములను బట్టి గ్రంథములను విభాగము జేయవలసియున్నది. ఇందునుగూర్చి ఆంధ్రదేశ గ్రంథ భాండాగార సంఘపక్షమున కొంతకృషి జరిగినది. ఎక్కువ సమర్థతతో ఎక్కువ కాలమును వెచ్చించి ఈసంబంధమగు పనిని జరపిన శ్రీవెలిదెండ శ్రీనివాసరావుగారు ఆంధ్రలోకముయొక్క కృతజ్ఞత కెంతయు పాత్రులు. అప్పుడప్పుడు దొరతనమువారిచే ప్రచురింపబడు ముద్రితగ్రంథముల పట్టికలనుండి ముఖ్యమైన గ్రంథముల నామములను విడదీసి గ్రంథాలయముల యుపయోగము కొరకు ప్రచురించుట కర్తవ్యము. వార్తాపత్రికలయందును మాసపత్రికలయందును ప్రచురింపబడు యుపన్యాసములనుగూడ వాటియందలి యంశములను బట్టి విభజించుట ముఖ్యావశ్యకము. మఱియు ఆంధ్రభాషాగ్రంథముల పట్టికను పూర్తి జేసిన పిదప దానినుండి కొద్దిసొమ్ముతో స్థాపింపబడు గ్రంథాలయముల కుపయోగముగా నుండునట్లు పండితులచే పరిష్కరింపబడిన 250, 500, 1000 ముఖ్యగ్రంథములయొక్క నామావళ్ళ తయారుచేయింప వలసియున్నది. ఇదిగ్రంథాలయోద్యమమునుయొక్క ప్రథమవిధి.

పాఠశాలలలో విద్యనభ్యసించెడి వారలకు విద్యాభ్యాసమునకు సాధకమగు పరికరములను సంగ్రహించుటయు, పాఠశాలలను వదలిన వారికి వారిదివరకు సంపాదించిన విద్యనుబలపరుచుటకు తగినసాధనములను, గ్రంథములను చేర్చుటయు, అక్షరజ్ఞానము లేనివారికి చిత్రపటముల మూలముగను, ఉపన్యాసముల మూలముగను, పురాణపఠనము మూలముగను
విద్యావ్యాపకము జేయుటయు మన రెండవ:
గ్రంథాలయములను స్థాపించుటతోడనే
తృప్తినొందక వానియొక్కయుపయోగము
గూర్చి జనసామాన్యమునకంతకును ప్రచు
రచుట ఈయుద్యమము యొక్క మూడవ:
ప్రతిసంఘమందున్న సామాజికులందరు
లో వారు అన్యోన్య సహాయకులుగాను
టయేగాక వీలయినంతవరకు అందుబాటు
నున్న సంఘములన్నియు ఒక సమూహ
గాగూడి అన్యోన్యాశ్రయభావము గలిగి
మువలన గలిగెడు లాభములను బొందుట
ప్రయత్నించుట మన నాలగవవిధి. జనసామ
న్యమునకు మనయుద్యమమునం దభిమాన
గలుగజేసి ఈయుద్యమమును ప్రతిపట్టణవ
దును ప్రతి పల్లెయందును వ్యాపింపజేయు
మన మైదవ విధి. ఇంక నెన్నియో విధు
గలవు.

ఇక నీవిధులను నిర్వర్తించు మార్గముల
గూర్చి చర్చింపవలసియున్నది. ప్రతియుద్య
మును నిర్వహించుటకు ధనమును, కార్యభ
రమును వహించెడువారును ఉండితీరవలయ
ను. ఈ యుద్యమము మిక్కిలి జయప్రదవ
గ జరుగుచున్న పాశ్చాత్యదేశములయందే
బరోడాదేశమందేమి ఈయుద్యమమునకు దొ
రతనమువారి యాదరణ మెండుగాగలదు.
చటి ప్రభుత్వమువార లిందుకొరకై విశేష
ద్రవ్యమును బొక్కసమునుండి వ్యయపెట్టు
చున్నారు. ఇంతియగాక ఆదేశములయంద
విద్యాధికులును ద్రవ్యసంపన్నులు నెక్కు
గానుండుటచేత అమూల్యములగు విరాళము
లీయుద్యమము కొరకై వారలచే నివ్వబడు
చున్నవి. మన దేశమునందట్టి సదుపాయము
లు లేవు. అయినను మనము ద్రవ్య లేమిచే

నిరుత్సాహము కావలసిన యావశ్యకము
ను.

మొట్టమొదట పల్లెటూండ్ల సంఘములను
ర్చి విచారింతము. ఈసంఘములకు ముఖ్య
ుగా నాలుగుపనులకు ద్రవ్యముగావలసియు
ది. మొదటిది స్వంతభవననిర్మాణము. రెం
వది సిబ్బందీఖర్చు. మూడవది పుస్తకములు
వార్తాపత్రికలును తెప్పించుటకగు వ్యయ
ు. నాలుగవది దినచర్య కగు ఖర్చు.

మనపల్లెటూండ్లలో చాల గ్రామముల
ందు దేవళములకు సంబంధించి సావళ్ళు
ాని, రామభజన మందిరములుగాని, ఉండి
ున్నవి. స్వంతభవనమును కట్టుకొను శక్తి
ంఘమునకు కలుగువరకును గ్రామసంఘ
ులీ కట్టడములను తమ కార్యస్థానములుగా
ుకొనవచ్చును. స్వంతభవనమును కట్టుకొ
వలచినవారలు దొరతనమువారికి దరఖాస్తు
ను బంపుకొనినయెడల ఉచితముగా గ్రామ
ంతములోగాని పోరంబోకలలోగాని ఖాళీ
లముల నిచ్చెదరు. ఇందుకు దొరతనమువా
యుద్యోగస్థులుకూడసహాయభూతలగుదురు.

కార్యనిర్వాహకులనుగూర్చి జర్చించునపు
ు రెండవయంశమగు సిబ్బందినిగూర్చి చెప్ప
ుదును. ఇకను దినచర్యకును గ్రంధములు
వార్తాపత్రికలు దెప్పించుకొనుటకును కావల
ిన సొమ్మును సంపాదించుటను గూర్చి జెప్ప
వలసియున్నది. చాల పల్లెటూళ్ళ యందు
ఏదోవిధముగ ఉమ్మడిసొమ్ముకొంత ఏర్పడుచు
న్నది. కొలగారపుపాటలమీద గడ్డి వేలంపా
టమీద ఇంక నెన్ని యోవిధముల ప్రతిపల్లె
టూరునందును ఎక్కువ సొమ్ము వసూలగుచు
న్నది. ఇందులో కొంతవరకు డెల్టా మొదలగు
ఖర్చులక్రింద పోయినను కొంతసొమ్ముయినను
నిలువ యుండును.

ఈద్రవ్యమును జనసామాన్యాభివృద్ధికొరకై వెచ్చించునట్లు గ్రామస్థులమనంబులుత్రిప్పుట కష్టసాధ్యమే యైనను ఈయుద్యమావలంబకులు ఎక్కువ కృషిజేసి ఇందును గూర్చి ప్రయత్నములు సఫలమగునటుల చేయవలెను గ్రామముల యందు జరుగు శుభకార్యముల సందర్భమున చులకనగా కట్నములను వసూలు జేయవచ్చును. ఈసొమ్మంతయు వసూలు పరచి ఉచితముగా వ్యయపెట్టి అందుకు సరియైన లెక్కలనుంచి సంవత్సరమునకొకతూరి గ్రామస్థుల నందరిని జేర్చి ఆలెక్కలను చదివి వినిపించిన యెడల జనసామాన్యమునకు ఈ యుద్యమ పక్షమున జరుగు పనియందు నమ్మకమునుఅభిమానమును కలుగకమానవు. దీనికితోడు సామాజికులిచ్చు చందాలవలనను విరాళములవలనను కార్యనిర్వాహకమునుకొనసాగింపవచ్చును. ఇంతేగాక మనదేశమునందిప్పుడుబయలుదేరుచున్న పరపతిసంఘముల వల్ల వచ్చెడి లాభములో కొంతవరకు ఈయుద్యమము కొరకై వ్యయపెట్టునట్లు చేయవచ్చును. ఇంకనుకార్యనిర్వాహకులనుగూర్చి చెప్పవలసియున్నది. చాల పల్లెటూళ్ళయందు ఆంగ్లవిద్యను కొంతవర కభ్యసించి పిదప విరమించి విశ్రాంతిగానున్నవా రనేకులున్నారు. వీరిలో కొందరు స్థితిపరులు. మరికొందరు సామాన్యులు. వీరుగాక చాలచోట్లు ఆంధ్రమునందును గీర్వాణమునందును పరిచయము గలవార లున్నారు. వీర లందరకును ఈ యుద్యమమునం దభిమానముగలుగజేసి పలుచోట్ల స్థాపింపబడు సంఘములయాధిపత్యము క్రింద వీరలచే విద్యావ్యాపకము చేయించవలెను. వీరవలంబించవలసిన మార్గములను

గూర్చియు, వీరభ్యసింప జేయు విషయములను గూర్చియు ప్రత్యేకముగ చర్చింపవలసియున్నది. కావున దీనినిగూర్చి సూచనమాత్రము జేసి విడువబడినది. వీరందరకును ఈయుద్యమమునందభిమానముకలుగునట్లు చేసినయెడల వీరే యాంధ్రదేశసేవకు లగుదురు. వారు ఆయాచోట్ల స్థానికులగుటచే వారికి పలుకుబడి ఎక్కువయుండును. కార్యసాధనమును సుకరముగా జేగలరు.

ఇక పట్టణములయందు స్థాపించు గ్రంథాలయముల కిట్టిసదుపాయము లెవ్వియు లేవు. ఆసంఘములు యుదారవంతులధనసహాయము మీదనే యాధారపడవలసియున్నవి. ఇంతవరకును ఈయుద్యమమువ్యాపింపజేయుటకున్న సాధనములనుగూర్చియు, అవలంబించవలసిన మార్గములనుగూర్చియు జర్చింపబడియున్నది. ఇంకను ఈయుద్యమప్రచారకులు వెంటనే చేయువలసిన పనినిగూర్చియు అందువలన గలిగెడి ఫలమునుగూర్చియు వివరింపబడును.

పల్లెటూళ్ళయందును, పట్టణములయందును గ్రంథాలయసంఘముల నేర్పరచి సాంఘికులు వారివారి శక్త్యనుసారము గ్రంథములను చేర్చవలయును. వీలైనచో ప్రతిదినమును సాంఘికులలో నెవరో యొకరు ఏదో యొక యుద్గ్రంథమునుండి జదివి అక్షరజ్ఞానము లేనివారికి అర్థముజెప్పి బోధింపవలెను. ఇందుకు మన భాగవత, భారత, రామాయణము మొదలగు యుద్గ్రంథములును నవీనముగా బయలుదేరుచున్న ఆరోగ్యశాస్త్రము మొదలుగాగల గ్రంథములును ముఖ్య సాధకములు. పురాణపఠనమువలన గలుగులాభములు కడుమెండు. ఇంతియగాక పట్టణములందలి విద్యాధికులు వ్యాజికులాంతరు సహాయముతోని మ్నసోదరులకు ఉపన్యాసము లీయవలసియున్నది. వ్యాజికులాంతరులు మ్యాజిసిపాలిటీలు కొనునట్లుజేయవచ్చును. విద్యాశాఖవారివద్దకూడఅరువునకుదొరకును. వీలయినప్పుడు ప్రముఖులచే ఉపన్యాసములిప్పించవలయును.

విద్యాధికులును విద్యావిహీనులును, భాగ్యవంతులును పేదవాండ్లును, హిందువులును మహమ్మదీయులును, ఉద్యోగులును నిరుద్యోగులును, భూస్వాములును రైతులును, ఏకసమావేశము గావలెనన్న మన సంఘము అట్టివీళ్ళను గల్పించును. ఇంక నేప్రతిష్ఠాపయందట్టివీళ్ళులేవు. అధికారభేదమును బట్టి విద్యావ్యాపకమును జేయుటకు మన సంఘములే శరణ్యములు. విద్యాధికులు జనసామాన్యముతో గలసి తాము నూతనముగ గ్రహించిన సంగతులను వారికి బోధపరచి తాము దేశాభివృద్ధికొరకై చేయు పనులయందు వారికి విశ్వాసమును కల్పించుటకు ఈసంఘములే సాధనములు. స్వార్థత్యాగము కట్టుదిట్టములకు లోబడి యుండుట జనసామాన్యము యొక్క క్షేమము కొరకు తమయభిప్రాయమును ఇతరుల యభిప్రాయమునకు అవసరమయినంతవరకు లోబరచుకొనుట, నీతిప్రవర్తన, జాతీయభావము, దేశాభిమానము, భాషాభిమానము మొదలగు తత్వములను జనసామాన్యమునందు వ్యాపింపజేయుటకు గ్రంథాలయములే ముఖ్యసాధకములు. కావున గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమునందంతటను వ్యాపింపజేసి ప్రతిపట్టణమునందును పల్లెయందును గ్రంథాలయములను స్థాపించి తన్మూలమున జనసామాన్యమునకు జ్ఞానాభివృద్ధిని జేయుట ప్రతి ఆంధ్రదేశాభిమానికిని ముఖ్యకర్తవ్యము.

# గ్రంథాలయమన నేమి? అది చేయదగిన ధర్మము లెవ్వి?

గ్రంథాలయమన గ్రంథములనన్నిటిని ఒక ోట జేర్చిపెట్టునట్టి గృహమనియు, అట్టిగృ ముసందున్న గ్రంథములనన్నిటిని దాచి గ్రతగ కావలి కాయునట్టి పురుషుడే గ్రంథ ండాగారియనియు ఆంధ్రప్రపంచమునందు ాలమంది తలంచుచున్నారు. పండితులు ాత్రమే అట్టి గ్రంథాలయములకుఁబోయి ానినుపయోగింప నర్హులనిగూడ వారియభి ాయము.

అట్టి యభిప్రాయములు ప్రబలియుండుట గారణములు లేకపోలేదు. దినదినాభివృ ి గాంచుచున్న యీనాగరకకాలమున పా ్చాత్యదేశముల యందీ గ్రంథాలయోద్యమ ు ఎన్నిముఖములనో పనిజేయుచున్నది. ఇ దెలసికొని యుండకపోవుట దీనికొక ప్ర లకారణమని యూహించుట కవకాశములు ుక్కులుకలవు.

వివిధశాస్త్రవేత్తలచే వ్రాయుబడిన గ్రం ముల నొకచోసేకరించి యుంచుటయే గ్రం ాలయము యొక్క పనిగాదు. పాశ్చాత్యదేశ ులయందు పుస్తకములనమ్ము పెద్దదుకాణ ులనన్నిటియందును గూడ అక్కడకువచ్చు ానులెల్లరును ఉచితముగ జదువుకొనుటకు ాను కొన్ని గ్రంథముల బీరువాలుండును. ్రంతేల, మిఠాయిదుకాణములయందును పానీ ంములనమ్ము దుకాణములయందును తుదకు ంగలి దుకాణములయందునుగూడ, ఆయా ేశములందు ప్రకటింపబడు సుప్రసిద్ధ వార్తా ిికలుండును. ఆయాసరకులను కొనుటకు బోవువారెల్ల కొంచెము కాలమక్కడ విశ్ర మించి వానిని జదువుకొనవచ్చును.

అట్లయిన, మనదేశమునగల ధర్మగ్రంథాల యముల నిర్వాహకులు పాశ్చాత్యదేశముల యందలి దుకాణదారులకన్న ఎక్కువగ జేయు చున్న పనియేమి? ఆదేశములయందలి స్థితిగతు లకును మనస్థితిగతులకును జాలవ్యత్యాసము న్నదని మీరందురేమో! ఆమాట సత్యమే. అయినను మనస్థితి గతుల కనుకూలములగు పద్ధతులనెల్ల ననుసరింపవలసియుండుట మన కు విధ్యుక్తధర్మముగాదా?

జనులయందు జిజ్ఞాస దినదినాభివృద్ధిని గా వించుటయు, పలువిషయములయందు వారిక భిరుచినిగల్పించుటయు, సామాన్యజనులయొ క్క హృదయములను విశాలవంతములుగను వికాసవంతములుగను అగునట్లు జేయుటయు గ్రంథాలయము యొక్క ముఖ్య ధర్మములై యున్నవి.

పాఠశాలయందు విద్యాభ్యాసము జేసినట్టి జనులయందు బహుస్వల్పభాగము మాత్రమే ఉన్నతవిద్య నభ్యసించిన వారై యున్నారు. నూర్గురు విద్యాభ్యాసము జేసిన అందు నలుగు రైన ఉన్నతవిద్య నభ్యసించినవారుండుట అ రిది. ఇట్టివారందరికిని గ్రంథాలయమే ఉన్నత విద్యాలయమై యున్నది. పాశ్చాత్యదేశముల యందు వ్రాయను జదువను జేతకానివారుం డరు. అక్కడ విద్య నిర్బంధము. అందు వి ద్యాదేవత తాండవమాడుచున్నది. అట్టిదేశ ములయందు నీగ్రంథాలయోద్యమ మెంతవర

కు అభివృద్ధి జెందియున్నదో ఊహించుటకైన మనకుశక్తి చాలదు. అచటి గొప్పగ్రంథాలయములనుంచిన భవనములవంటి కట్టడములనైన మనలో జాలమంది జూచియుండమని నేనుదృఢముగ జెప్పగలను.

మనదేశముయెడల విద్యాధిదేవతకు దయ లేదు. ఆమె యెడల మనకు భక్తి లేదు. పరస్పరము సమానమగు ప్రేమనే జూపుచున్నారము. ఇదిస్వాభావికమే. మన దేశమునందు చదువుకొన్న జనులు నూటికి ౭ మంది కన్న నెక్కువలేరు. నిశానీదారులతో సమానులగు దస్కతు మాత్రము జేయగలిగిన వారందరు నుగూడ ఈసంఖ్యయందే జేరియున్నారు. విద్యాధిదేవత తాండవమాడుచున్న పాశ్చాత్య దేశములయందే గ్రంథాల యోద్యమము మహోన్నతదశను వహించియుండ ఇంతమంది విద్యావిహీనులచే నలరారుచున్న మనదేశమునందది ఇంకను ఎన్నిరెట్లు మహోన్నతదశను జెందవలసియున్నదో మీరూహింపవచ్చును. ఇతర దేశములందీయుద్యమ మభివృద్ధి జెందుటకు అనేకవిధములగు సౌకర్యములు గలవు. మనదేశమునందో అట్టి సౌకర్యములు లేవు. అదియట్లుండ కరవులో నధికమాసమన్నట్లు విద్యావిహీనుల సంఖ్య అధికము. విద్యావిహీను లనగా చదువను వ్రాయను జేతకాని వారని నాయాశయము. ఈవిద్యా విహీనులను విద్యావంతులను చేయుట మనకు దుస్సాధ్యముకావచ్చును. కానివారిని జ్ఞానవంతులనైనజేయుట మన విధ్యుక్త ధర్మమై యున్నది.

గ్రంథాలయము పరీక్షపట్టాలను బొందగోరువారికిగాదు. అదిసామాన్యజనులయొక్క సర్వకళాశాలమైయున్నది. కాబట్టి మన ధ గ్రంథాలయములు ఎవరికుపయోగ పడున ల జేయవలెను?

మనమందరమును ఈ ప్రశ్ననుగూర్చి క్కలి తీవ్రముగ నాలోచింపవలసి యున్న ధనాఢ్యులును, విద్యాధికులును నగువా తమకు కావలసిన గ్రంథములను ద్రవ్యము వెచ్చించి తెప్పించుకొనగలరు. లేక ఎ యొద్దకైన బోయి సంపాదించుకొనగలరు. చదువుకొన నాసక్తిగల మనుజుడు ఎన్ని ములనైన శ్రమపడి వాడ వాడల దిరిగి తనకు గావలసిన గ్రంథములను సేకరించుకొని వా యుపయోగమును బొందును. గ్రంథాలయములు ఇట్టి వారికి గూడ నుపయోగపడునప్పటికిని, వీరి విషయమై మనము విశేష శ్రద్ధ వహింపవలసిన యావశ్యకత లేదు. ఏలనన వారు తమంతట తామే గ్రంథాలయమునకు వచ్చి దాని లాభమును బొందెదరు.

అట్లయిన ఇంకెవరికొరకై మనము శ్రద్ధను బూనవలసియున్నది? అనిమీరు ప్రశ్నింపవచ్చును. ప్రతిదేశమునందునుగూడ గ్రంథాలయములయొక్క లాభములను బొందవలెనని తమంతటతామే ప్రయత్నించువారి సంఖ్య బహుస్వల్పముగ గానబడుచున్నది. ఇది స్వభావ జనితము. మన దేశమునందీ రోగము అన్ని దేశములకన్న నెక్కువ తీవ్రముగ ప్రబలియున్నది. చదువుకొనగలిగి, గ్రంథముల చదువ నపేక్షింపని మందు లనంతముగ మనదేశమునం దున్నారు. ఇట్టివారికి చదువుకొనునభిలాషను జనింపజేయుట మన ప్రధాన కర్తవ్య మనక తీరదు. మన గ్రంథాలయము సంపన్న ప్రతిగ్రంథమునకు అర్థమొక చదువరినైన

ము సంపాదింపవలెను. ప్రతిచదువరికిగా
న ఒక పుస్తకమునైన మనము సంపా
పెట్టవలెను. అట్లు చేయలేని యెడల
ధాలయము యొక్క యుపయోగమేమి?

వేయేల! సంఘసముద్ధరణ భారమంతయు
లమున గ్రంధాలయముమీాదనే పడియు
. సంఘమునకు గావలసిన నీతివిద్యావి
వ్యాసంగమును, రసజ్ఞతావ్యవసాయ
ు, సహానుభవాభివృద్ధిని, జ్ఞానసముపార్జ
ను—ఇంతేల, ఈ ఇరువదియవ శతాబ్ద
సంఘమును కలందివై చుచున్న సకలో
మములనుగూర్చి అనుభవసిద్ధముగ నుండు
కరణము గ్రంధాలయముననందే జరుగవల
న్నది. ఇట్టి సాంఘికసేవారతి నెట్లు జరు
గునో కొంచెము విచారింతము.

పిల్లలే సంఘమునకు జీవమని జెప్పవచ్చు
వారియందు అనంతమైనశక్తులు గర్భిత
లై యున్నవి. ఈ శక్తులను ప్రథమమున
శాలయందు వర్ధిల్ల జేయవలసియున్నను
చితములగు నిర్బంధపాఠపుస్తకములను
ంచుటయందే వారి నణగద్రొక్కక, ఆశ
లు వికాసము నొంది విశాలములగుటకు
వలసిన దోహదముసంతను మనమీాయవల
మున్నది. పిల్లలయొక్క మనస్సులు అతి
మలములు. కావున అట్టిసమయముననే వా
మంచిదారులయందు బెట్టుట మిక్కిలి
ావశ్యకము. అట్లు చేయగలిగితిమేని వారి
సంపూర్ణ ధైర్యసాహసము లలవడుననుట
తమాత్రమును సందేహము లేదు. ఈదిన
న పిల్లలుగ నుండువారు రేపటిదినమున
లుగుదురు. అందుచేత పిల్లలకు సన్మార్గ
లవడునటుల జేసితిమేని మనజాతి ఔన్న
త్యము నొందుట కేమియు సందియము లేదు.
కాబట్టి వారికి ఉపయోగకరములగు ప్రత్యేక
పుస్తకములను సేకరించి వేరుగనుంపవలెను.
అవి విశేషముగా బొమ్మలుగలిగినవై యుండ
వలెను. గోడలయందు వస్తుపాఠబోధకము
లగు పటములనుబెట్టి వాటినిగురించి బాలుర
కు బోధింపుచు అందు సంబంధించిన పుస్తక
ములను వారు చదువునటుల అభిరుచిని గల్పిం
పవలెను. మఱియు సుబోధకములును నీతి
బోధకములును నగు కథలనుజెప్పి వారి మన
స్సుల నాకర్షించి గ్రంధపఠనమునకు వారిని
ప్రోత్సహింపవలెను.

స్త్రీలవిషయమున మనము మూకీభావము
ను వహించుటయం దనర్థకము లనేకములు
కలవు. పాశ్చాత్యదేశములయందు ప్రత్యేక
ముగ చదువుకొనుటకు వలయు సౌకర్యముల
నెల్ల స్త్రీలకు గల్పించిరి. అక్కడ స్త్రీలు
భాండాగారిణులుగగూడ గలరు. ప్రారంభ
దశయందు మనమట్టిప్రయత్నములకు బూను
కొనకపోయినను గృహములకు పుస్తకముల
నుబంపి స్త్రీలు విశేషముగ జదువునటుల జే
యవలెను. పురుషులకంటెస్త్రీలయందువిద్యా
విహీన లెక్కువగగలరు. అందుచేత విద్యా
వతులగు స్త్రీల నేర్పరచి చదువుకొనజాలని
స్త్రీలకు వారి గృహములకుబోయి వారు కో
రినవిషయములుగల గ్రంధములనెల్ల చదివి
వినిపించునటుల జేయవలెను.

గ్రంధములను చదువుకొన గుతూహలము
గలిగినవారికి వాని నందిచ్చుట పురుషులకు
మనము జేయగలిగిన మొదటిపని. గ్రంధము
లను చదువుకొనుటకు శక్తిగలిగి, వానిని పఠి
యింప నిచ్చలేనివారల కట్టియిచ్చను గలుగ

జేయుట మనము వారికి జేయదగిన రెండవపని. ఇందుకొరకై మనము తరుచుగా ఉపన్యాసములను హరికథలను, భజనలను పెట్టి వారి నాకర్షించి, ఎవ్వరెవరి కే గ్రంథము లనువుగ నుండునో అట్టివారి కట్టి పుస్తకములనే అందజేయుచుండవలెను. పుస్తకముల యోగ్యతను బట్టి జనులు, వారి అధికారము ననుసరించి పుస్తకములు, అమరి యుండవలెను. పరస్పర మెవరు తగియుండకపోయినను మనము జేయు పనియంతయు వ్యర్థము. సామాన్యజనులు పుస్తకములకు తగియుండరనుట నిజముకాదు. ఏలయన వారికి తగిన పుస్తకములనే మనము సమకూర్పవలెను. గ్రంథములు తమంతటతాము చదువుకొనజాలని జనులు మనదేశమునందు విశేషముగగలరని ఇదివరకే జెప్పియుంటిని. పైన జెప్పిన రెండురకములజనులకంటె వీరిని జ్ఞానవంతులుగ జేయుటకే మనమువిశేషముగ శ్రద్ధవహింపవలసియున్నది. దేశమునందు ఇంతమంది జనులు జ్ఞానవిహీనులై యున్న నాదేశ మెన్నటికిని బాగుపడదు. అది కలలోనివార్త యనవచ్చును. వీరికి చదువుజెప్పి విద్యావంతులుగ జేయుదమన్న అసంభవము. కావున వీరిని జ్ఞానవంతులుగ జేయుటకే మనముప్రయత్నింపవలెను. పరిశ్రామికములు, శాస్త్రములు ఆదిగాగలవిషయములనుగూర్చి వారికుపన్యాసములిచ్చి వారిబుద్ధికి వికాసమును గలుగజేయవలెను. మహాగ్రంథముల నెల్లవారికి జదివి వినిపించి బోధింపవలెను. ఇంకను వీలగునేని మాజిక్కులాంతరునుగాని, సినిమోటాగ్రాఫునుగాని, సంపాదించి వానిమూలమున పలువిషయములను బ్రదర్శింపుచు బోధనలను జేయవలెను. అది ఎక్కువ హృదయరంజకముగను చిత్తసంస్కారముగను నుండు. వారిని మనమున్నచోటికి రమ్మనమనిన రా మనమే వారున్న స్థలమునకు బోవలెను. వేష భేషజముల నన్నిటిని వదలివేయవలె వారియం దొకనిగ భావించునటుల బోయి రేమి కోరుదురో అడిగి దెలసికొనవలె, కోరబడుదానినుండియే వారికొరతను బూ పవలెను. కొన్నిసమయములయందు వా కొరతలు మనభావనలకు భిన్నములై యుం ను. ప్రథమమున, వారేమిగోరెదరో తె కొనుడు. వారిలోకొందరు ఏకాకులుగనుం గోరెదరు. అట్టివారి నటులనే నుండనిం వారిపిల్లల ఉన్నతిని గోరవచ్చును. కావ వారికొరకై వేచియుండుము. ఈ కార్య వేసవికాలపు శలవులలోగాని శీతకాలపుశల దినములలోగాని చేయదగినదిగాదు. ఇది జీ తమునంతను ధారపోయవలసిన మహాత్కా ర్యము.

ప్రతిగ్రంథాలయమును తనగ్రామమున దు గాని లేక పట్టణమునందుగాని గల పా శాలతో సంబంధమును గలుగజేసు కొనవ ను. పాఠశాలయందుపాధ్యాయులు పాఠవ లను బోధింపునపుడు, వివిధవిషయముల గూర్చిజెప్పునపుడు ఆయావిషయములనుగు ర్చిన విపులగ్రంథములు అచటి గ్రంథాలయ మునగలవని జెప్పి వానిని విద్యార్థులు జదు నటుల జేయవలెను. ఇంతియగాక ఉపాధ్యా యులప్పుడప్పుడు తమవిద్యార్థులను గ్రంథా యమునకు గొనివచ్చి, అచట గల వారి కు యోగకరములగు గ్రంథములయందు అభిమా నము గలుగు నటుల ఉపన్యాసముల నొసగ చుండవలెను.

శాఖాసంఘముల నేర్పరచి తల్లి గ్రంథా
యము ఆశాఖలమూలమున తనపుస్తకము
నెక్కువగ వ్యాప్తినొందునటుల జేయవలె
ం. శాఖాసంఘములయందు స్వల్పమూల్య
ుగల గ్రంథములను మాత్రముంచి, విశేష
ూల్యముగల గ్రంథములనెల్ల తల్లి భాండా
ారమునుండి దెప్పించుకొనవచ్చును. కేంద్ర
ంథాలయములను ముఖ్యప్రదేశములయం
ం స్థాపించి, పల్లెటూళ్ళయందుగల చిన్నగ్రం
ాలయములు వాటికి శాఖాసంఘములుగ
ేర్పడుటవలన ఇట్టిలాభము లెన్ని యోగలవు.

సంచారపుస్తకాలయ స్థాపనమువలనగూ
జనులకనేక యుపయోగములుగలవు. కొ
న్నపుస్తకముల నొకపెట్టిలోపెట్టి, వాటినిజా
గతపరచి గ్రామస్థులచే చదువునటుల జేయగ
ుగు ఒకమనుజుడుగల గ్రామములకెల్ల మన
ూగ్రంథములనుబంపవచ్చును. ఈప్రకారము
ంపుటకు వివిధగ్రంథములు గలిగిన కొన్ని
ెట్టెలనుంచితిమేని, ఒకగ్రామమునందున్న ఒ
పెట్టియందలి గ్రంథములను జదివిన పిమ్మట
ానిని వేరొక గ్రామమునకు బంపి, ఆగ్రామ
మునకు వేరొకపెట్టెనుబంపవచ్చును. ఈప్ర
కారము మిక్కిలి స్వల్పమగు వ్యయముతో
అమితమగు ఉపకారమును మనముపల్లెలవారి
జేయగలము.

గ్రంథాలయముయొక్కపని విద్యనుగరపు
ంయేగాక వినోదపరచుటగూడనై యున్నది.
గ్రంథాలయముల నెన్నడును ద్రొక్కిచూడని
మనుజుల నాకర్షింపుటకు క్రీడలు మిక్కిలి సా
ర్థ్యముగలవి. ఇంతియగాక ఒకేపనిని చాల
సేపు చేయుచుండుటచేత విసుగుచెందిన మన
సుగల వారికి క్రీడలు బుద్ధిమాంద్యమును హ
రించి సంతోషములవరచుటకు సిద్ధౌషధముల
వంటివి. కావున గ్రంథాలయములయందు వి
నోదపరచునట్టి క్రీడలనుగూడ నేర్పాటుజేయు
ట మిక్కిలి యావశ్యకమై యున్నది.

ఆలోచించిన కొలదిని, గ్రంథాలయము
యొక్క ఉపయోగము నభివృద్ధిజేయుట కనం
తములగు మార్గములు దొరకుచునేయుండు
ను. గ్రంథాలయమునందున్న గ్రంథములను
గూర్చియు అదిచేయుచున్న పనిని గూర్చియు
తరుచుగా ప్రకటనలను బంచిపెట్టవలయును;
ఇంతియగాక దానినిగూర్చి తరుచుగా ఇతరు
లతో జెప్పుచుండవలెను.

గ్రంథాలయములను ఇన్నివిధములచే జను
లకుపయుక్తములగు నటుల జేయుటెందులకు
అటుల జేయనియడల హానియేమి? అని మీ
రు ప్రశ్నింపవచ్చును. జనులకుపయోగకర
మగు నటుల ధర్మగ్రంథాలయముల నుంపని
యెడల, అవి పుస్తకదుకాణములని పిలువదగి
యుండునుగాని ధర్మగ్రంథాలయములని పిలు
చుట కావంతయైన నర్హతగలిగియుండవు. కా
వున ఆంధ్రదేశమున గల ప్రతిగ్రంథాలయ
ము వారును ఆలోచింపవలసిన సంగతులు
రెండు. తమగ్రంథాలయమును పుస్తకదుకా
ణమని పిలువదలతురా? లేక ధర్మగ్రంథాల
యమని పిలువవలతురా? ఈప్రశ్నలనే ప్రతి
గ్రంథాలయమువారును తీవ్రముగ నాలోచిం
పవలెను.

**అయ్యంకి వేంకటరమణయ్య.**

# ఆంధ్రగ్రంథ విభజనము.

కడచిన సంవత్సరము ఏప్రిలు 10వ తేదీన బెజవాడలో జరగిన ఆంధ్ర గ్రంథభాండాగార ప్రతినిధుల సభయందు, శ్రీబ్రహ్మపురాంధ్ర భాషాభివర్ధనీ భాండాగార పక్షమున "ఆంధ్ర గ్రంథవిభజనము" ను గూర్చి నేనొక చిన్న వ్యాసమును జదివియుంటిని. అందు ఆంధ్రమున నింతవరకు గల గ్రంథనామములను, తత్కర్తలనామములతో సయితము సేకరించి, వాటిని కొన్ని ముఖ్యతరగతులక్రింద విభజించి, అకారాదిపట్టికలను తయారు చేయించినచో, నవి యనేక గ్రంథభాండాగారముల వారికి మిగుల నుపయోగకారిగా నుండునని సూచించి యుంటిని. ఆసభయందు ఏర్పాటు కాబడిన ఆంధ్రదేశ గ్రంథ భాండాగార సంఘమువారు క్రిందటిసంవత్సరము మే నెల 10వ తేదీన కృష్ణాజిల్లాలోని ఉంగుటూరునందు సమావేశమై ఆంధ్రగ్రంథవిభజన మవసరమని తీర్మానించి, ఆపనిని నెరవేర్చుటకు బరంపురములోనినన్ను, రాజమండ్రిలోని వీరేశలింగ భాండాగారమువారిని నియమించిరి. ఈపనిని నిర్వహించుటకు గావలసిన సాధనసామగ్రి బాగుగాలే [illegible] ఓఢ్రదేశములోని బరంపురమునందు నేను [illegible]వసించుట చేతను సర్కారు ఉద్యోగమున సందుటవలన తగిన కాలవ్యవధి లేకుండుటచే [illegible]ను, తృప్తికరముగా నెరవేర్పలేనని నాకు తెలిసినను, ఈవిషయమున నాకుగల అభిమానమే నేనునర్చిన కొద్దికార్యమునకైనను ప్రోత్సాహము కలిగించినది.

## ఇంతవరకు చేసిన పని.

గ్రంథనామములను, తత్కర్తల నామములను సంగ్రహించుటకు ముఖ్యముగా మూడు ఆధారములుగలవని నేను బెజవాడయందు చదివిన వ్యాసమునందు సూచించియుంటిని. [illegible]టిలో మొదటిది పూర్వప్రణీత గ్రంథముల తెలుపు కవులచరిత్ర; రెండవది అచ్చుప[illegible] గ్రంథనామములను మూడుమాసముల కొ[illegible]సారి కడచిన ఇరువది ముప్పది సంవత్సర[illegible]లుగ ప్రచురించుచున్న సర్కారువారి పో[illegible] సెంటుజార్జి గెజెటు; మూడవది భాండాగ[illegible] గ్రంథముల పట్టికలు. వీటిలో నాకు దొరికి[illegible] కవుల చరిత్ర, కడచిన ఎనిమిదిసంవత్సరము[illegible] గెజెట్లు, హైదరాబాదులోని శ్రీ కృష్ణదేవ[illegible]య పుస్తకభాండాగార గ్రంథములపట్టికయు[illegible] బరంపురములోని ఆంధ్ర భాషాభివర్ధనీ సమ[illegible]జ గ్రంథముల పట్టికయు మాత్రమే. ఈస్వ[illegible] సామగ్రితో నేను తయారుచేసిన "ఆంధ్రగ్రం[illegible]థవిభజనపట్టికావివరము" ఆంధ్రదేశ గ్రం[illegible] భాండాగార సంఘమువారు ప్రకటించిన 191[illegible] 1915 సంవత్సర వృత్తాంతమునందు ముద్రి[illegible]పబడియున్నది.

నాకు దొరకిన గ్రంథనామముల నన్నిటి[illegible] ఆయాతరగతులయందు సరిగా విభజింపగలి[illegible]తినని చెప్పజాలను. ఏలననగా చాల భాగమ[illegible] గ్రంథములను నేను స్వయముగా చూచుటకు[illegible] దొరకనందున కొంతవరకు ఊహను బట్టియు కొంతవరకు వినికడినిబట్టియు ఆయా తరగత[illegible]ల క్రింద భాగించితిని. మరియు ఒకే గ్రంథమ[illegible] అందుగల పలువిషయములనుబట్టి 2,3 తరగ[illegible]తుల క్రిందను రావచ్చును. అట్టి విషయమ[illegible]నవాటిని ఏదోయొక తరగతిక్రింద మాత్రమే చేర్చితిని. ఇదిగాక కొన్ని గ్రంథముల-విభజనమునుగూర్చి అభిప్రాయభేదముండుటకు అవకాశమున్నది. ఈమూడుయిబ్బందులచేత నా[illegible]

ాజనము నిర్దుష్టమైనదని చెప్పసాహసింపను. ని ఈవిషయమున ఇంకముందు తగినవారు యవలసిన మహాకార్యమున కిది కొంత వర అస్థిభారముగ నుండవచ్చునేమోయని ద సుచున్నాను. నేనుసేకరించిన 3259 గ్రంథ మములలో గొన్నిటికి గ్రంథకర్తల నామ లు దొరకనందున వాటికి ప్రచురకర్తల మములను దెలిపితిని. మరియు ఆయా తర తులక్రింద విభజింపబడిన గ్రంథనామముల చాల భాగము అకారాదిగా కూర్చితిని. ందువలన కావలసిన గ్రంథమును కనుగొను బహు సులభము. ఒకే పేరుగల గ్రంథముల పలువురు కవులుచేసియున్నారు. అవి య యు ఆయాతరగతుల క్రింద నొక్క చోట దెలుపబడినవి.

అంతర్భాగ విభజన వివరములు.

(1) పురాణములక్రింద పురాణమను పేరు ల గ్రంథములను మాత్రమేగాక పోతనా మాత్యుని భాగవతము, కవిత్రయము వారి రతము, వావిలికొలను సుబ్బారావుగారి వాల్మీకిరామాయణమునుగూడ జేర్చితిని.

(2) కొన్ని గ్రంథములు కావ్యలక్షణము న్నిటిని సరిగా కలిగియుండక బోయినను వా టిని సామాన్య పద్యగ్రంథములనుండి వేరుప రచుటకై పద్యకావ్యములను తరగతిక్రిందనే ర్చితిని.

(3) కొన్నికొన్ని గ్రంథములు వచనకావ్య ములక్రింద జేరునో, నవలలక్రిందజేరునో, చా రిత్రకకథలక్రిందజేరునో, లేక నీతి, వినోద, క థలక్రింద జేరునో యను సంశయము బుట్టు చుండును.

(4) కొన్నికొన్ని నాటకములనిగాని ప్రహసనములనిగాని నిర్ధారణ జేయుటకు వీలగాకయున్నది.

(5) కృషి, వైద్య, న్యాయ, గాన, పాక, జ్యోతిషాది విషయకములగు గ్రంథములను వేరువేరుగా విభజించినను మొత్తముమీద వాటిని శాస్త్రముల తరగతిక్రిందనే జేర్చితిని.

(6) కొన్ని లక్షణగ్రంథములు, వ్యాకరణము, చందస్సు, అలంకారము మొదలగువాటి నన్నిటిని గురించి చెప్పుచున్నను యేదో యొక తరగతిక్రింద మాత్రమే విభజించితిని.

(7) కొన్నికొన్ని శతకములు, నీతి, మత వినోద, తరగతులక్రింద విభజింపవలసియుండినను గ్రంథములు నాకు స్వయముగా దొరకమిచే నిర్ధారణచేయలేక ప్రస్తుతమున వాటి నన్నిటిని "మతపద్యముల" క్రింద జేర్చితిని.

(8) మహాత్మ్యములలో పాండురంగమహాత్మ్యము, భూతపురిమహాత్మ్యము, మున్నగువాటిని పద్యకావ్యతరగతిక్రింద జేర్చితినిగాని విగిలినవాటిలో ఏవిపద్యములో, ఏవిగద్యములో భాగుగా తెలియనందున ప్రస్తుతమున "మత పద్యముల" క్రింద జేర్చితిని.

(9) ఇదేవిధముగా పద్యములయందు జేర్చిన స్తోత్రములలోగొన్ని గద్యములేమోయని యనుమానముగానున్నది.

(10) కవుల చరిత్రలో జేర్కొనబడిన సర్వప్రణీత గ్రంథములన్నియు, నిపుడచ్చుపడి లేకున్నను, వాటినిగూడ పైతరగతుల క్రింద విభజించితిని. అచ్చుపడినవేవో, లేనివేవో తెలిసికొనవలసి యున్నది.

### ఇకముందు చేయవలసిన పని.

ఆంధ్రగ్రంథవిభజనవిషయమునందు నాకు గలఅభిమానమువలన నేనీపనినిర్వహింపమొట్టమొదట నొడంబడితినిగాని పనిప్రారంభించినవెంటనే అది దరిలేని మహాసాగరమువలె గన్పట్టెను. ఆపనిని తృప్తికరముగ నెరవేర్చుటకుతగినసాధనసామగ్రి కాలవ్యవధి నాకుచాలనితెలిసెను. ఇకముందుచేయవలసినపనులు రెండువిధములు. (1) నేనుచేసిన పనియందు నిప్పుడుజూపినవి లోపములుగానున్న యెడల వాటినిసవరించవలెను. (2) నాకు దొరకని, (ఇంకను, కనీసము రెండువేలవరకు ఉండవచ్చును) ఆంధ్రగ్రంథనామములను తత్కర్తల నామములతో సేకరించి ఆయాతరగతులక్రింద విభజించి అకారాదిగా పట్టికలనుతయారు చేయవలెను. ఈరెండుపనులనుజేయుట, అందుకుతగిన సాధనసామాగ్రిగల చెన్నపట్టణమునగాని, వేరుచోట సాధ్యముగాదనితోచుచున్నది. ఇరువది, ముప్పదిసంవత్సరములుగా నచ్చుబడుచున్న గ్రంథనామముల నన్నిటిని విషయములతోసహాప్రచురించు ఫోర్టుసెంటు గెజెట్లు అక్కడనే దొరుకును. ఈ సామగ్రితోడు, ఆధునికప్రసిద్ధగ్రంథకర్తలపేర్లు, వారొనర్చినగ్రంథనామములు, మరియుపెద్దపెద్ద ఆంధ్రగ్రంథభాండాగారముల గ్రంథపట్టికలు గూడ నవసరము. వీలయినయెడల వావిళ్ల రామస్వామిశాస్త్రులవారి పుస్తకాలయముల వంటి విక్రయశాలలయందుండు గ్రంథములను స్వయముగాజూచి విషయములను గ్రహించి సరిగా తరగతులక్రింద విభజించుటకు అవకాశముకూడ కలిగించవలెను.

కావున ఈ ఆంధ్రగ్రంథభాండాగారప్రతినిధులసభవారు పైవిషయములను ఆలోచించి సరియైన ఆంధ్రగ్రంథ విభజనమును గావించి, దానిని పుస్తకరూపమున అచ్చొత్తించుటకు తగినప్రయత్నములుచేయుదురుగాక యని ప్రార్థించుచున్నాను.

వెలిదెండ శ్రీనివాసరావు.

### ఆంధ్రుల జనహితపరత్వము.

మద్రాసునందు బ్రచురింపబడు హిందూపత్రికయందు ఒక యుపవిలేఖరి యిట్లు వ్రాయుచున్నాడు.

ఆంధ్రులెంతమాత్రమును లోకహితకార్యములందు వెనుదీయువారు కారు. అందులకీక్రిందియంశములే నిదర్శనములు. ర్య మొనర్చినచో నిండ్లలో పోరుపులు పుట్టి గృహసౌఖ్యమునకును భంగము కలుగునో అట్టి సంఘసంస్కరణ యమునగూడ గాఢతత్పరులగువారీ యాంధ్రసంఘమునందున్నారు. లెక్కలేని రాజకీయ సమావేశములును సభలును రికి నీవిషయమునగల పట్టుదలకు నిదర్శనములు; ఇటీవలజరుగుచున్న కమ్మవారు వైశ్యులుమున్నగు కులసభలవలన నాగర ద్యమములందు వెనుకబడినసంఘము లేతీరున మేల్కొనుచున్నవనుసంగతి స్పష్టమగుచున్నది. ఈరాజధానియందలి తక్కి సంఘములవారికంటె నాంధ్రులే తమభాషాభివృద్ధివిషయమున నెక్కుడుశ్లాఘ్యమగు శ్రద్ధనుగొనుచున్నారనుట యాంధ్ర కమున నొక్కిచెప్పవలసిన విషయమే. దొరతనమువారివలన నెట్టిసహాయమును బొందకయే, ముఖ్యగ్రామములన్నిటియం దు దేశభాషాగ్రంథభాండాగారములను స్థాపింపప్రయత్నించుచున్నారు. ఈప్రయత్నములందు వీరికి చాలవరకు జయముగ నున్నది. పల్లెయందుగాని పట్టణమందుగాని నివసించుచు నేమాత్రమైనజ్ఞానముగల ప్రతివానికిని స్వదేశాభివృద్ధివిషయ మును అందులోముఖ్యముగ నాంధ్రమండలాభివృద్ధినిగురించియు నపరిమితమగునుత్సాహముజనింపజేసిన యీ యాంధ్రోద్య మెంతయు బ్రశంసనీయము. ఏదేశమునకైన నెట్టిసంఘమునకైన కీర్తినిదెచ్చునంతటి ప్రజానాయకులను కార్యతత్పరులు ఇచ్చటగలరు. ముఖ్యములగు పట్టణములన్నిటియందును డంబమునకుగాక యథార్థముగ కార్యములను బూనుకొని తాత్పర్యముతో నిర్వహించు యౌవనులు కలరు.

# గ్రంథాలయములు చేయవలసిన పని.

## పట్టణములయందలి గ్రంథాలయములు.

పట్టణముల యందు గల భాండాగా
ములు కొంతవరకు తృప్తికరముగ పనిచే
ుచున్నవి. కాని పాశ్చాత్యదేశములయందు
లె పట్టణములయందలిబీదలు నిశ్చయముగ
భాండాగారప్రయోజనములను వశముచేసి
ొనవలసినవారలయ్యు నట్లుచేయుటలేదు. చె
్నపురియందలి 'కానిమరా' భాండాగారము
ంనరాజధానియందు పెద్దది. అచ్చటకైన
నమున కిరువదిమందివచ్చుటయరుదు. ఇంక
తరపట్టణములయం దెట్లుండునో యోచింపు
ు! అచ్చటకనేకములగువార్తాపత్రికలుగూ
ివచ్చును. కాని బందరు, రాజమహేంద్రవ
ము మున్నగుపట్టణములయం దిటీవల పాఠ
ులసంఖ్య కొంతవరకుహెచ్చి తృప్తికరము
నున్నది. పఠనమందిరమునకుతోడు వ్యా
ూమములుగూడనున్నచో భాండాగారము
కు చదువువా రధికముగవచ్చుట గలుగును.
ియినను పల్లెటూళ్ళయందు కొందరు భాం
ాగారములస్థాపించి, పాఠకులులేక, యారం
శూరత్వముపోయి, నిరుత్సాహము చెంది,
్థాపకులాగ్రంథములను కొన్నిచోట్ల కొంత
ాలములోయంతరించిపోవుటచూచుచున్నా
ు. పట్టణములయందువలె పల్లెటూళ్ళయం
ు పాఠకులురారు. పురాణశ్రవణమునకు వ
్చువారయిన నీ భాండాగారములకు రాచు.
ారంభకులు విసిగియు, సేవచేయించుకొను
ుజలులేకయు, స్వార్థత్యాగముగలవా రెల్ల
్పుడు కాలానుసారము భాండాగారముం దెర
చి ప్రజలకభిరుచిగలిగించువరకు నోపికలేక
యు, స్థాపించినరెండుమూడువత్సరములలోనే
కొన్నిభాండాగారము లంతరించుచున్నవి. కా
వున నిటీవల కొందరవలంబించినట్లు పుస్తక
ముల నిండ్లకంపియు, పురాణపఠన మారంభిం
చియు, వారమునకొకసారి సభలజరిపియు, వీ
లయినచోట్ల వ్యాయామములు ఉపహారము
లు, కలుగజేసియు, ప్రజలనుక్రమముగ తమ
వైపున కాకర్షించవలయును. ప్రథమమున
చందాలనిచ్చుపద్ధతు లుండినచో నెవ్వరును
రారు. ఇది ధనవంతులును, విద్యాధికులును
మొదట భరించవలసియుండును.

చెన్నపురియందు రెండుమూడువందల నవ
లలు కొని, యరవవారియిండ్లకుఆపుస్తకముల
నంపి నెలకు నాలుగణాలచందాలగైకొనుచు
వారమునకొకసారి పుస్తకముల మరలదీసికొ
నుచు నెల కిరువది ముప్పదిరూప్యంబులవరకు
సంపాదించి కొందరుమొదలియార్లు వ్యాపా
రమునడుపుదురు. ఇది మిక్కిలి యాశ్చర్యము
కలిగించును. ఒక్క తిరువళిక్కేణిలో 200
మందిచందాదారులుగల "సర్క్యులేటింగులై
బ్రరీ"కలదు. ఇందువలన చందాదారులు నా
లుగణాలతో నవలలు నెలకు నాలుగుచదువు
కొనగలుగుదురు. క్రొత్తగా ప్రకటింపబడిన
వన్నియు నీవర్తకులుతెప్పించి తమతమ చం
దాదారులకొసగుచుందురు. ఇట్టి పద్ధతి మన
పెద్దపట్టణములలో ముందు ప్రవేశపెట్టుకొన
వలసియేయుండును.

## పల్లెలయందలి గ్రంథాలయములు.

గ్రంథములను, పాఠకులను వీలయినంతవరకు పైన చెప్పినపద్ధతులననుసరించి పెట్టుటకు కార్యనిర్వాహకులు ప్రయత్నించుచు వీరు తమపై మరియొక భారము వైచికొనినచో నెంతయుమంచిది. దీనివలన భాషాసేవయు, చరిత్రసాధక సముపార్జితమును గూడ కలుగుచుండును. పట్టణములయం దుండు వారలు పూర్వాపూర్వగ్రంథములను ముద్రించి తమ కంపుచు సేవ యొనర్చుచుండిరి. పల్లెటూళ్ళయందలి భాండాగారములు తమ చుట్టుపట్ల గ్రామములయం దటగలవై క్రిమిభక్షితములై నాశనములగుచున్న తాళపత్రగ్రంథములను సంపాదించి, వానికి మట్టినూన్ప్రతిపత్రమున వ్రాసి, నూతనసూత్రములకుపసవురాచి జాగ్రతపఱచవలయును. ఇందువలన రెండు ప్రయోజనములుకలవు. మనపూర్వీయచ్చుగ్రంథములేమియు లేనప్పు డీతాటియాకులగ్రంథములు వ్రాసికొని యెంత కష్టపడెడువారో వారెంతటివిద్యాప్రియులో తెలిసికొనుట కిప్పటివారికి బ్రబలనిదర్శనములగుటయేగాక, ప్రతిమానవున కాయద్భుత కాయకష్టఫలితములగు గ్రంథములను జూచుటతోడనే తనమాతృభాషావైముఖత్వమునకు సిగ్గుగలిగి భాషాభిమానమొదవును. ఈ వాక్యము లసత్యములని త్రోసివేయక ప్రయత్నించిచూడుడు! భాండాగారములు వారు భాషకుఁజేయు సేవయందిది ప్రధానస్థానము నాక్రమించును. రెండవప్రయోజన మంతరించిన మాయయముకానున్న యనేక గ్రంథములు బయటపడుట. ప్రాతగ్రంథములయం దచ్చుపడినవిదొరికినను వానిని నిరసింపక, పట్టుగుడ్డలతో నలంకరించి తాళపత్రగ్రంథములపైనున్న గబ్బిలపుపెంటల మలిపి, యుచితగౌరవమునిచ్చి ఘంటముల వ్రాయసకాండ్రయాత్మలకు తృప్తినిగలుగఁజేయుట ప్రతియాంధ్రునకుఁ గర్తవ్యము. ఈపని పల్లెటూళ్ళయందలిభాండాగారములవారు ప్రారంభించినచో స్వల్పకాలములోనే ఫలితములత్యద్భుతములుగ పరిణమించును. వారి భాండాగారములయందలి గ్రంథములు ప్రజలుప్రయోజనపఱచుకొననికొ అంతతీరగలదు! "ఏకక్రియా ద్వ్యర్థకరి!" మిత్రులారా! ఈపైవాక్యముల ననుగ్రహించిచేయుఁడు. దీనివలన ధననష్టము లేదు. కేవలమభిమానము. కొంచెము ఓపిక కావలయును. అట్టిగ్రంథములను పరిశీలించుటకు వాఙ్మయచరిత్రకారులకు విడిచిపెట్టవచ్చును. మదరాసు ఓరియంటల్ లైబ్రరి, ఆంధ్రసాహిత్యపరిషత్తు లేక మీరందరు కలసి ముందుస్థాపింపఁబోవు "సెంట్రలులైబ్రరి"కి యీయవచ్చును. మీరు భద్రపఱచజాలనియెడల వారాపనిచేయుదురు. సోదరులారా! ఆలసింపకుఁడు! ఇంతలో మరియొక గ్రంథము క్రిమిభక్షితమో, యగ్నిపరమో కావచ్చును. దయయుంచి త్వరలో భాషాభిమానులందరీకార్యమునకు పూనుకొనుఁడు!

వంగూరి సుబ్బారావు.

# కేంద్రగ్రంథాలయము, బరోడా.

బరోడారాజ్యమునం దిది ముఖ్యపుస్తకాగారము. దీని కార్యక్రమ నిర్వాహకమునకు శ్రీమహారాజా గయిక్వార్ అమెరికాదేశము నుండి గ్రంథభాండాగార వ్యాపనా కుశలుండగు బోర్డనుదొరగారిని పిలిపించెను. బోర్డనుదొరగారు ప్రప్రథమమున నొక సంవత్సరముండుటకై కోరఁబడిరి. మహారాజు వారిని మఱిరెండుసంవత్సరములవరకు వదలిపెట్టలేదు. బోర్డనుదొరయాజమాన్యముక్రింద బరోడారాష్ట్రమునం దెల్లభాగములను 451 గ్రంథాలయములు స్థాపింపబడినవి. క్రొత్తక్రొత్త పుస్తకనిలయములు స్థాపింపబడనిమాసము కట్టియును లేదు. తాను స్వయముగ పాటుపడి వ్యాపనముఁ జేయుటయేగాక తత్కార్యమునం దనేకయువకులకు బోర్డనుదొర నిరుపమానమగు నావేశమునుగలిగించెను.

కేంద్రగ్రంథాలయమున 57296 గ్రంథములును, 3000 పాఠకులును గలరు. పాఠకుడు ఒక్కనికి సాలునకు 19 గ్రంథములచొప్పున జదివిరి. అమెరికాదేశమునందలి పురాతనగ్రంథభాండాగారములుగల బ్రాన్ఫర్డు, కనెక్టికట్ పట్టణములయందలి పాఠకులుగూడ నింతటికంటె విశేషముగాఁ జదివియుండలేదు.

ఈ భాండాగార చర్యయం దనేకశాఖలు కలవు.

1. బాలశాఖ:—ఇందన్నివయసులబాలురకు నుపయుక్తములగు పుస్తకములనేకము [illegible] నగుమగలబాలురకు బొమ్మలపుస్తకములు విశేషముగాసమకూర్పఁబడినవి. గ్రంథాలయముయొక్క గోడలయందును వస్తుపాఠబోధకములగు పటము లనేకము లలంకరింపఁబడినవి. పిల్లలకు వినోదముల మూలమున విద్యగరపఁబడుచున్నది. బాలుర లాలించుటయందు స్త్రీలకెక్కువ సామర్థ్యముకలదు గనుక ఈశాఖకధ్యక్షపదవికి నొక స్త్రీయే నియమింపఁబడినది.

2. క్రీడలు:—గ్రంథాలయమున క్రీడ లేమిటికని చదువరుల కందరికిని గొప్పసందేహముకలుగవచ్చును. కాని మనమిప్పుడు యదార్థమును గూర్చి మాట్లాడుచుంటిమి కాని కల్పనాకథలనుగూర్చి కాదు. యదార్థమైనను మనకు వింతగానేయున్నది. దీనిరహస్యమును దెలిసికొనుట యొక కష్టసాధ్యమైన పనిగాదు. "గ్రంథాలయముయొక్క కార్యక్రమము ద్వివిధము. వినోదపరచుట, విద్యఁగరపుట. గ్రంథాలయమును ద్రొక్కిచూడనిమనుష్యులనేకులు కలరు. అట్టివారి నాకర్షించుటకు క్రీడలు మిక్కిలిసామర్థ్యముకలవి. ఒకేపనిని చాలసేపుచేయుచుండుటచేత విసుగుజెందిన మనసుగలవారికి క్రీడలు బుద్ధిమాంద్యమును హరించి సంతోషమలవరచుటకు సిద్ధౌషధములువంటివి."

3. ప్రదర్శనశాఖ:— మాజిక్ లాంటరన్ (వింతలలాంతరు) మొదలగు యంత్రముల సాహాయమున ననేకవిషయములు జనులకుఁ బోధింపఁబడుచున్నవి. ఈకార్యమొకసంవత్సరముజరిపిచూచుటకుగాను, మహారాజా శ్రీ గయిక్వార్ 10,000 రూప్యము లొసంగెను.

రెండుమాసములలో నీశాఖవారు 14 స్థలములలో 36 ప్రదర్శనములనొసంగిరి. ప్రతి ప్రదర్శనమునకును సగటున వేయిమంది జనులు వచ్చిచూచిరి. ఇందు ముఖ్యముగా విదేశపరిశ్రమలనుగూర్చినట్టియు, వ్యవసాయములఁగూర్చినట్టియు విషయములు ప్రదర్శింపఁబడుచు వచ్చెను. జనులు వీనియందాదరమును మెండుగాఁజూపుచువచ్చిరి.

ఈ కేంద్రగ్రంథాలయమునుగూర్చిన విశేషాంశ మింకొకటికలదు. ఇందు ప్రపంచకమునందంతటనుగల వివిధ పరిశ్రమలను గూర్చిన వివరణపట్టీలు సంపాదింపఁబడి జాగ్రత్తపెట్టబడినవి. కృషి, పరిశ్రమ, గృహకృత్యవిషయములలో నేవిషయములనేనిఁ దెలిసికొనఁగోరువారును, ఏవస్తువులనేనిఁ గొనఁగోరువారును ఆజాబితాలను జూచి సర్వమును గ్రహింపవచ్చును.

ఇంతేగాక, యీ గ్రంథాలయాధ్యక్షుల వ్యవసాయపుఁ బనిముట్లను ప్రదర్శనార్థము ప్రతిపట్టణమునకును బ్రతిపల్లెకును దిప్పి, ప్రజలకు నాటి యుపయోగమును బోధించుచున్నారు.

## సర్వకళాశాల గ్రంథాలయము, బొంబాయి.

ఢిల్లీ దర్బారుసమయమున శ్రీ జార్జిచక్రవర్తి, జనసంఘముయొక్క విద్యాభివృద్ధికి యేబదిలక్షల రూప్యముల నొసంగెనుగదా. అందుండి బొంబాయిరాజధానివారు మూఁడు లక్షలరూపాయల రొక్కమును, సంవత్సరమునకు 45 వేల రూప్యముల ఆదాయమును సర్వకళాశాల కొసంగిరి. ఈధనము నొసగునప్పుడు సర్వకళాశాలాధ్యక్షుఁడు శ్రీబొంబాయి గవర్నరుగారు దానిని వ్యయపరచుటను గూర్చి కొన్ని సలహాలను జెప్పెను. అందులో ముఖ్యమైనదొకటి గ్రంథాలయమును గూర్చి-

“బొంబాయిరాజధానియందు మంచి స్థితిలోనున్న గ్రంథాలయము లేకపోవుటచే, ఉన్నతవిద్య కెంతయు నవకాశము లేకున్నది. సర్వకళాశాలకు పుస్తకాగారమున కనువగు మందిర మొకటి కలదుగాని, యవసరములగు పరికరములందుఁ సమకూర్పఁబడలేదు. ప్రస్తుతమీగ్రంథాలయము తగినస్థితిలోలేదు. శిక్షనందిన యధిపతిలేనిలోపముచే సర్వకళాశాలకత్యగత్యమైన యీగ్రంథాలయము ప్రస్తుతమిందలివిద్యార్థుల కెంతమాత్రమును నుపయోగకరముగానుండుటలేదు. ఇట్టిలోపమును నివారించుట కిది మంచితరుణము. పట్టపరీక్షాభద్రుఁడగు కుశాగ్రబుద్ధిగలవానినొకని కార్యక్రమము నెఱింగివచ్చుట కొకసంవత్సరము ఐరోపాఖండమునకుఁబంపవలెను. గ్రంథసామగ్రికూడ విశేషముగావృద్ధిఁజేయవలెను” అని చెప్పబడినది. సర్వకళాశాల వారా సలహాను మన్నించి సంవత్సరమునకు 6500 రూప్యములచొప్పున గ్రంథసామగ్రిని వృద్ధిచేయుటకును, సంవత్సరమునకు 3500 రూప్యముల వెచ్చించి గ్రంథాలయాధ్యక్షపదవికి నొకనికి ఐరోపాలోగాని, అమెరికాలోగాని విద్య నేర్పించుటకును తీర్మానించిరి.

# సంచారగ్రంథ భాండాగారములు.

సంచారగ్రంథభాండాగారము లాంధ్రుల పరిచితములు. వీనినిగుఱించి వినినవారుగూడ సునలోఁ జాలఁ దక్కువగనుందురు. మన దేశ ములో గ్రంథభాండాగారములు దినదినము నేకములు నెలకొల్పఁబడు నిక్కాలమున సం చారభాండాగారమొక్కటియైన నింతవఱకుఁ బ్రారంభింపఁబడకపోవుటకుఁ దెలియనివారికిఁ దెలియకపోవుటయుఁ, దెలిసినవారికిఁ గార్య శూరత్వము లేకపోవుటయు, గార్యశౌర్యము గలవారికి మనస్థైర్యమును సహాయమును లేకపోవుటయును గారణములు. గ్రంథకర్త లను, బత్రికాధిపతులను, మొగమోటంపెట్టి యో, నిర్బంధపఱచియో, ప్రార్థించియో, సగము వెలలిచ్చియో, మఱి యేయితరమా ర్గములనో కొన్నిపుస్తకములను, గొన్ని పత్రి కలను సంపాదించి, యొకచోఁబెట్టుకొని, స్నే హితులనందఱను జందాదారులుగాఁ జేర్చికొ ని, సాధ్యమైనంతవఱకుఁ దమమాటను జవ దాఁట లేనివారినే కార్యనిర్వాహకసంఘము లోఁ జేర్చికొని, నిశ్చింతమై యొక్కచోఁ గూ ర్చుండి నిరంకుశాధికారము వెలిగించుచుఁ గ డుపులోనిచల్ల గదలకుండ మేము భాషాభివృ ద్ధియు, దేశాభివృద్ధియుఁ జేయుచున్నామని ప్రగల్భములు కొట్టుట కవకాశమీయక యివి సంచారము చేయవలసినవగుట మఱియొక ప్రబలకారణము; ఇన్నికారణములవలన నివి యింతవఱ కాంధ్రదేశమున బయలుదేర లేదు.

నిర్బంధవిద్యాదానములేని మన దేశమున వీని యావశ్యకత మితిమీఱియున్నది. చదు వన నెట్టిదో యెఱుంగక, విద్యవలనఁ గలుగు ప్రయోజనములు తెలియక, విద్యాభ్యాసము నందాసక్తిలేక, తమ దేశస్థితి నుంతయుఁదెలి యక, పరదేశములున్నవనియైన నెఱుంగక, తామున్నస్థితియే మహోత్కృష్టమైనదని భా వించి యధఃపతితులమై పోవుచున్న జనసా మాన్యమునకు విద్యాతృష్ణకలిగించుట కీ సం చారభాండాగారములు చాల నుపయోగప డును. వీనివలన, నిర్బంధ విద్యాశాసనము నెత్తిమీఁద మొట్టకున్నను, బ్రజలు చాలవ ఱకుఁ దమబిడ్డలను బాఠశాలలకుఁ బంపుట యు, వారి విద్యాభ్యాసము విషయమున శ్ర ద్ధతీసికొనుటయుఁ దటస్థించును. అప్పుడు ని ర్బంధవిద్యాశాసన ప్రభావమును దెలిసికొని తమనాయకులవెనుక నిలిచి, నిర్బంధ విద్యా శాసనమును జేయవలసినదని జనసామాన్య ము ప్రభుత్వమువారిని మాటిమాటికిఁ బ్రా ర్థింపగా ప్రభుత్వమువారు మనకోరికను సిద్ధిం పజేతురని నేనిప్పుడు సిద్ధాంతివలె భావిస్థితిని నిరూపించుట సాహసము కాఁజాలదు.

ఇట జనసామాన్యమనఁగాఁ బల్లెటూరి ప్ర జలని నాయభిప్రాయము. దేశమునకుఁ బునా ది పల్లెటూరు. దేశాభివృద్ధి కాధారభూతులు పల్లెటూరిప్రజలు. కావున దేశాభివృద్ధికావలె నని యెవరుకోరినను బల్లెటూళ్ళను బాగుచే యవలయును. వానిమాట మనము మఱచిన చో నభివృద్ధి మనమాట మఱచిపోవును. ప

ల్లెటూళ్ళను, బల్లెటూరి ప్రజలను మిారేవగించుకొందురేని యభివృద్ధి మిమ్మేవగించుకొనును. పట్టణములయందలి న్యాయాధికారి కుమారుఁడుగాని, న్యాయవాది కొడుకుగాని పెద్ద సాహుకారి పుత్రుఁడుగాని జమీందారుని కుమారుఁడుగాని, వారి కుమార్తెలుగాని, పెద్దపెద్ద పరీక్షలలో నెగ్గినను, విదేశములకుఁబోయి క్రొత్తవిద్యలు నేర్చివచ్చినను, మిన్నంటు మేడలపై నివసించినను, గుఱ్ఱపుబండ్లమిాఁద షికారుపోయినను, నభివృద్ధి వారిని వరింపదు. భారతమాతకనుంగుఁ బుత్త్రిఁడై, యామెవలనఁ బ్రత్యక్షముగ నుత్కృష్టఫలములను బడయు పల్లెటూరి కర్షకుని కొడుకు, ప్రారంభవిద్యలోఁ దేలినను, నాతఁడు పట్టణయువకునివలె గంభీరముగ వేషము వేయఁజాలని యమాయకుఁడైనను నభివృద్ధి నిస్సందేహముగ వానినే వరించును. అభివృద్ధివలన, అనఁగా మహాలక్ష్మివలన వరింపఁబడుటకు యోగ్యుఁడగు పల్లెటూరి కర్షకునిఁ జూచి తల కంటగించుకొను మన నాయకులు నాయకాభాసులు.

సంచార భాండాగారములు జనసామాన్యమును, ముఖ్యముగాఁ బల్లెటూరి కర్షకులను విజ్ఞానులుగాఁ జేయుట కుద్దేశింపఁబడినవి. ప్రకృతమున మనపల్లెటూళ్ళు స్వతంత్రముగ నొక్కొక్క స్థిరభాండాగారమును నెలకొల్పుకొనుస్థితిలో లేవు. క్రొత్తగ్రామములవారు పట్టణమువారిని జూచి భాండాగారములను స్థాపించినను, వానివలన రవంతయుఁ బ్రయోజనము గలుగుటలేదు. జనసామాన్యము విద్యావిహీనమైయుండుటయే యిందులకుఁగారణము. చదువురానివానియెదుట నెన్ని పుస్తకరాసులుంచినను నేమిప్రయోజనము?

ఇంతవఱకీ భారతభూమిలోఁ దొలుదొ[illegible] నెన్నదగిన యొక్క బరోడారాజ్యమునంద[illegible] మాత్రము సంచారభాండాగారములు కలవు[illegible] వంగమహారాష్ట్రములు ప్రస్తుతోన్నతస్థితిని[illegible] బట్టి యాదేశములయందుఁగూడ సంచా[illegible] భాండాగారము లుండెనని యూహింపవచ్చు[illegible]ను. గాని విశేషముగ సంచారభాండాగా[illegible]ములు గలదియు, వానివలన సంపూర్ణ ఫలమ[illegible]ను బడయుచున్నదియు నింతవఱకు బరోడ[illegible] రాజ్యమొక్కటియే.

బరోడారాజ్యమునందలి సంచారభాండ[illegible]గారముల కార్యక్రమమెట్టిదియో వివరిం[illegible]ను. సంచార భాండాగారికులు పరమో[illegible]యోగములగు పుస్తకములు కొన్ని అన[illegible]నొకటి రెండు పెట్టెలు, అక్షరాస్యులై, చ[illegible]వుకొనుటకు గ్రంథములు కొనుగొనఁజాల[illegible] బీదవారి కుటీరములమధ్యకుఁ బంపెదరు. [illegible]క్కడ నాబీదవారాపుస్తకములను జదివి[illegible]చినతరువాత నాపుస్తకములను మఱియొ[illegible] చోటికిఁ బంపివైచి వేఱొకతరగతి పుస్తక[illegible]లను మొదటిచోటునకుఁ బంపుదురు. మ[illegible]జిక్కులాంతరులు, సినిమెటోగ్రాపులుగూ[illegible] బంపి ప్రకృతిచిత్రములను జూపుటయు, [illegible]గోళజ్ఞానమును గలిగించుటయుఁ గూడఁ [illegible]దు. కాని మొదటిపద్ధతి యిప్పుడు బరో[illegible] రాజ్యముకంటె విద్యావిషయమున వె[illegible]కఁబడియున్న మనదేశమునకుఁ బనికిరా[illegible] రెండవపద్ధతి, యనఁగా మ్యాజిక్కులాంత[illegible]లను, సినిమెటోగ్రాపులను బంపుటకు విశే[illegible]ధనమావశ్యకమగుటచే ప్రథమమున మన[illegible] వాటిని నిర్వహింపజాలము. ఇఁకమనమిప్పు[illegible] సంచార భాండాగారములను నిర్వహించ[illegible] యెట్లు?

దేశచరిత్రములు, వ్యక్తిచరిత్రములు, ప్ర తి శాస్త్రములు, సాంఘిక చరిత్రములు, తిపనులను గుఱించిన గ్రంథములు, జనాక ణముకొఱకుఁ గొన్ని నవలలు, నాటకము , ప్రబంధములు, నొకటి రెండువందలకు ంచకుండ నేర్పాటుచేసి వివిధవిషయముల గుఱించి తెనుఁగులో ధారాళముగను, లభశైలియందును, జక్కఁగ విషయనిరూ ణము గావించుచు నుపన్యసింపఁగల యుప ్యసకునకిచ్చి పల్లెటూళ్ళకుఁ బంపవలెను. క్తృ, జనపదులను జూచియు, వారిప్రవర్త నునుజూచియు నసహ్యపడువాఁడు కాఁగూ దు. పెద్దపెద్దవేషములువైచి పల్లెటూరి రికి దూరముగా నిలుచువాఁడు కాఁగూడ . మఱియు ముఖ్యముగాఁ బల్లెటూరి ప్రజ నడవడులు తెలియని పట్టణవాసుఁడు కాఁ డదు. పల్లెటూరిప్రజల ప్రశ్నలకు విసు కొనువాఁడు కాఁగూడదు. వారితోఁగలిసి లసి యవసరమైనచోఁ జెప్పినదే మఱలఁజె వలసివచ్చినచో నందులకు వెనుదీయఁగూ దు. అతడు ముఖ్యముగా రాజకీయ, వాణి చారిత్రిక విషయములను దెలిసినవాఁడై ండవలెను. ఇట్టి యేర్పాటులు జరిగినచో దేశమునకు జాతీయ మహాసభవలనను, జధానీసభలవలనను, మండల సభలవలన జాతి సభలవలనను, వీరేశలింగకవి భాం గారము మున్నగు వేలంకొలంది గ్రంథము గల గ్రంథభాండాగారములవలనను, బత్రి వలనను, నాంధ్ర సాహిత్య పరిషత్తువలన దక్కఁగల యిట్టియితర సమావేశముల నను గలుగు ఫలముకంటెఁ దొంబదిరెట్లో దిరెట్లు ఎక్కువఫలము కలుగును.

దేశమిట్టి బీదస్థితిలో నున్నపుడు వక్తను బోషించుట యెట్లనియు, నందులకుఁ బూనుకొనఁదగువారెవరనియు నడుగవచ్చును. ఈ పని బూనుకొనఁదగువారు ముఖ్యముగా భాండాగార స్థాపకులు. వారిదివఱకొక విధమైన భాండాగారములను నడుపుచున్నవారు గావున నీరెండవ పద్ధతి భాండాగారములను నడుపుట కష్టము గాదు. అధమపక్షమిరువది రూపాయల జీతమైన లేకున్న నుపన్యాసకుఁడు రాఁడు. మనభాండాగారములలో నేదియైన నెలకింత మొత్తమును జెల్లింపఁదగినది కలదాయని మీరుసందేహపడవచ్చును. మన భాండాగారములలోఁ గొన్ని నెలనెలకును గరపత్రములను బ్రకటించుచున్నవారు. విద్యాధికు లనుకొను వారు వానినిఁ జూచుటయే లేదు. జనసామాన్యము తెలియకపోవుటచేఁ వానిని జూచుటలేదు. లేఖకులుమాత్రము తమవ్యాసములు ముద్రితములైనవను నుత్సాహముతోఁజూచి యుప్పొంగిపోవుట తక్క నీ కరపత్రములవలన మఱియెట్టి ప్రయోజనములు కలుగుటలేదు. కావునఁ గేవలధనవ్యయమైకప్రయోజకములగు నీకరపత్రముల బ్రకటించుటమానివైచి నాలుగైదు భాండాగారములవారు కలిసియైన నొక సంచారభాండాగారమును నెలకొల్పుట చాలనుపయోగకరము. జనసామాన్యమున విరివిగ విద్యవ్యాపించియున్న ఖండాంతరములయందు కరపత్రములవలన నేమైన ఫలముకలుచున్నదేమోగాని మనదేమున రవంతయైన ఫలముగలుగఁబోదని మఱియొకమాఱు నొక్కిచెప్పుచున్నాను. మున్ను చెప్పిన సుగుణములుగల యుపన్యాసకుఁడు వ్యగ్రోత్సాహముతో మనస్ఫూర్తిగఁ బనిచేసినచోఁ దమకొఱకు పా

టుబడుచున్న యీసంచార భాండాగారముల కుఁ పల్లెటూరివారు కొంతవరకైన సాయప డకపోరు.

పల్లెటూరిప్రజలు వర్తకులకుఁ బెండ్లికొడుకులకుంబోలె భోజనాదివసతులను గల్పించుట లో వెనుదీయరు. కావునను, ఒకగ్రామము నుండి మఱియొక గ్రామమునీభాండాగారసామాగ్రినిఁ దీసికొనివెళ్ళుటకుఁ గూలి యీన క్కఱలేకుండ భారవాహకుల నొసంగుటకుఁ గూడ సందేహింపరు గావునను, ఆవ్యయములనుగుఱించి నేను చెప్పలేదు. అంతియేగాక ప్రతిగ్రామమునకు వందలకొలఁదిగ నుమ్మడి సొమ్ము ప్రతియేట వసూలగుచున్నది. ప్రజ యందైకమత్యమును నెలకొల్పి యాధనమ ను సద్వినియోగముచేయునట్లు తత్తద్గ్రా వాసులకుఁ బురికొల్పుటకుఁ దగిన యవకా ములున్నవి. కావున, సంచారభాండాగారమ ల వారావిషయమును బూనుకొనినచోఁ జ వేవేలుగఁ జేతిసొమ్మీయనక్కఱ లేకుం సంచారభాండాగారములను బోషింపఁగలర కావున జనసామాన్యమునకు విజ్ఞానము సంగి దేశాభివృద్ధిని గావించు నీసంచార భా డాగారములనుగుఱించి మనము తగు శ్రద్ధ హింపవలయును.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

## ప్రాచీన పుస్తకాగారములు.

### జపానుదేశము.

ప్రపంచమందలి ప్రతిఖండమందును ప్రాచీనకాలమునుండి విద్యావ్యాసంగమునం దభిలాషగలవార లుండిరి. జపా దేశమందును నట్టివారుండిరని చరిత్రప్రతీతి.

షిమెత్సూపరగణాలోని అషికగానగరమందున్న భాండాగార మతిప్రాచీనమైనది. పూర్వము 8 మొదలు 11 శత బ్దముల వరకుగల హెయినా రాజులకాలము జపానీయుల స్వర్ణయుగమని పిలువబడెను, ఆకాలమున పద్యగద్యాత్మకమ లగు ననేక గ్రంథముల వ్రాతప్రతులు చేర్చబడెను.

నియుమీయను చక్రవర్తి కాలమున ననగా క్రీ. శ. 842 సం॥ ప్రాంతమున టమూరాబనో అను నొక గవర్న పరిసరమున నొక పాఠశాల స్థాపించెనని యింకొక ప్రతీతి కలదు. ఎట్లయినను 1467 సంవత్సర ప్రాంతమ నిచ్ చ నాగావో అను నతనిచే నింకొక పాఠశాల స్థాపింపబడుట రూఢి. ఇందులోనే యొక ప్రసిద్ధపు భాండాగా ంపబడెను. 15 వ శతాబ్దమున నొరిజానీయునూజీయను నుద్యోగస్థుడీ భాండాగారమునకు భూ తులనిచ్చి గ్రంథము లనేకములను జేర్చెను. కాలక్రమమున నిచ్చోటనే పుస్తకము లచ్చుబడెను.

టోకుగా వాయియాషు అను నాతడు కన్ఫ్యూషియసుయొక్క ప్రతిమనొకటి యీపాఠశాలలో నుంచెను. అ నేటికిని గలదు. కన్ఫూషియసు అనునాయనచే రచియింపబడిన గ్రంథములు 13 ఇందుగలవట.

తరువాత కనజావాలో 12 వ శతాబ్దమధ్యమున స్థాపింపబడిన యింకొకపుస్తక నిలయము కలదు. సానిటోకీహ జోయనువానిచే నిది స్థాపింపబడెనని చరిత్రకారులు నమ్మెదరు.

ఈపుస్తకభాండాగారములు రెండును లేచినకాలముననే యూరపునందును భాండాగారములు స్థాపితములాయెన జపానీయు లిప్పుడీ పుస్తకభాండాగారములను జూచునప్పుడు వాని సంస్థాపకులను కొనియాడుచున్నాడు. పఠనమంది ములు, పుస్తకాగారములు దేశమున నన్నివైపుల నెలకొల్పబడినపుడు ముందుయుగమున రాబోవు జనులు మిగు కృతజ్ఞత గలవారుగ నుందురు.

# గ్రంథాలయములు.

యుగయుగాంతరముల ప్రజాభ్యుదయదీక్ష
శ సేవా తపస్సు గీతికలు పాడి
నిన మహనీయుల ప్రబోధ సరళరాగ
ాలపించు వీణెలు పుస్తకాలయములు.

ఎడుగట్టు సముద్రాల • కడలయందుఁ
ాద్దు గ్రుంకుట లెఱుఁగని • భూములందుఁ
త్రుఁడెందెందు మేల్కొని • భుజముసాచెఁ
త్రి యెందెందుమునుఁ గ్రొత్తి • ముందునడచె

ందు నందెల్లఁ బూచి పొల్పారుచున్న
ైన సుమములు దండలు • గట్టి తెచ్చి
ంథముఖ వీధికలకు సింగారమిడెడి
భ్యుదయ బాంధవంబు గ్రంథాలయంబు.

నిత్య విజ్ఞాన దీపికల్ • నిండి వెలుఁగు
పుస్తకాలయముల మాత్ర • పూజనెపుడు
సప్రదక్షిణ నియతిమై • సలుపునెవఁడు
ఆతఁడజ్ఞాన దాస్యము • నవలఁద్రోయు.

ధర్మపుస్తకనిలయ సంస్థాపనమ్ము
లెంతవఱ కాంధ్రదేశ మాద్యంతములను
అల్లుఁబెట్టి వర్ధిలఁజేయ • మంతవఱకు
నాగరకులము గాఁబోము నాగరకుల
దశల నైచ్యము నించుక • దాటలేము.

రాయప్రోలు సుబ్బారావు.

---

## రయిలు స్టేషనులయందు గ్రంథాలయములు.

ఇంగ్లాండు దేశమునందున్న కొన్ని రయిలు స్టేషనులయందు 'ఫ్రాన్కు లటుఛెల్' ... నుభావుడు
ంచార ధర్మగ్రంథాలయములను స్థాపనజేసెను. రయిలు స్టేషనులయం దాయన గ్రంథముల బీరువాలనుంచెను. ప్రయాణీ
లు తమకిచ్చవచ్చిన గ్రంథములను అందుండి తీసుకొనిపోవచ్చును. అట్లు తీసుకొనిపోవువారు తమ నామములనుగాని,
ునామాలనుగాని వ్రాసిపెట్టవలసిన యగత్యములేదు. గ్రంథము లింతకాలములో తిరిగి ఈయవలయుననెడి నియమము
ు. తమ ప్రయాణములనుండి తిరిగి వచ్చునప్పుడు దీసికొనిపోయిన గ్రంథముల నివ్వవచ్చును. లేదా స్టేషను మాస్టరు
ు పోస్టుద్వారా పంపవచ్చును. ఈ ప్రకారము స్థాపింపబడిన గ్రంథాలయములయం దొక్క గ్రంథమైన తస్కరింపబడ
ు. 'లట్ ఛెల్' గారిని వారి యుదారగుణమునకు అభినందించుచు అనేకమంది ఉత్తరములు వ్రాసిరి. వీటియందలి
ంథములు అప్పుడప్పుడు మార్చబడుచుండును.

# గ్రంథభాండాగారాధిపతి.

గ్రంథభాండాగారములు సరస్వతీ దేవాలయములు. అందుండు భాండాగారాధిపతియే యర్చకుఁడు. భాండాగారములకు వచ్చుట యందు ముఖ్యోద్దేశము జ్ఞానాభివృద్ధిగావించుకొని తన్మూలమున ముక్తినిబడయుట. ఇందులకు సాధనము లెవ్వి?—గ్రంథములు. అట్టిచో సరస్వతీయాలయమునకు బోవునెడల మనకు ప్రచ్ఛన్నవిగ్రహమయి కాన్పించువాడు భాండాగారాధిపతి.

కోపమన నేమొ భాండాగారాధిపతి యెఱుంగకూడదు. సర్వదా శాంతస్వభావుడై యెవరే గ్రంథమడిగినను విసుగుకొనక కావలసిన గ్రంథములు వారికిచ్చుచుండవలెను. ఆలయమందు దైవభక్తి కందరును సమానమే. అందుచేతనే, జ్ఞానమును వృద్ధిపొందించుకొనుటకై వచ్చువారిని యాదరముతో భాండాగారాధిపతి ధనికులను, బీదలను యొకేరీతిగ చూడవలెను. అప్పుడుగాని సరస్వతీదేవి ప్రసాదమున కందరిని సమానహక్కుగలవారినిగా చేసినవారుగారు.

భాండాగారకుడు అన్ని విషయములు తెలిసికొనినవాడుగనుండవలెను; అధునిక కవీశ్వరులను గురించియైనను సరే, దేశనాయకులాచరించిన కార్యములు వారవలంబించిన పద్ధతులను గూర్చియైనను సరే, పరరాష్ట్రరాజ్యాంగపద్ధతులను గూర్చియైనను సరే, ప్రస్తుతమందున్న యేవిద్యను గూర్చియైనను సరే, వెయ్యేల! ఆబాలగోపాలపర్యంతము యవసరమగు యన్ని విషయములందారి తేరియుండవలయును. వీటియందెట్టి సందేహమయిన తీర్పగల పాండిత్యముండవలెను. ఏవిషయమందెట్టి గ్రంథము లుపయోగకరములో వానినెల్లభాండాగారాధిపతి తెలిసికొనియుండవలెను. ఎవరయిన నాకాంధ్రభాషయందు పాండిత్యమెట్లలవడునని యడిగిన వానికే యే గ్రంథము లుపయోగకరములో వానినెల్ల చూపవలెను. ఎవరయిన నొకవిషయమును గూర్చి వ్యాసము వ్రాయవలెనన్నచో వానికి వలయు గ్రంథములనెల్ల జూపవలెను. ఎవరయిన దేశసేవ యొనర్చుటకు కుతూహలము గలదని మీరీగ్రంథముల జదువుడు; ఈపద్ధతుల ననుసరించిన మీమనోభీష్టములు నెఱవేరును అని సూచింపవలెను, ఎంత విద్యావిహీనుడేతెంచి ఏవిషయమును గూర్చియైన ప్రశ్నించిన, విసిగికొనక, కసరక, ఆవిషయమునుగూర్చి వానికి దెలియజెప్పవలెను.

ఇట్లుగాక యెవరేవిషయమును గూర్చి యడిగినను వారికి సలహానియ్యకుండిన, యే గ్రంథమడిగినను విసుగుకొనుచుండిన, యెవ్వరయిన భాండాగారమునకు మరునాడరుదెంతురా! వారి మనస్సులయందలి సందేహములను దీర్చినచో మరుసటిదినమునుండియు వారు భాండాగారమునకు ప్రాతకాపులై యుందురు.

ఈవిషయమున గ్రంథభాండాగారాధిపతులొక చిన్నసంగతి గమనింపవలెను. భాండాగారమందున్న గ్రంథముల నన్నింటిని భాండాగారాధిపతి చదివియుండవలెను. భాం॥ గా॥

ంథములను చదివిన మంచిదో తెలిసికొన
లెను. వృద్ధు లెట్టిగ్రంథములను చదువవలె
అను విషయముగూడ తెలిసియుండవలెను.
కబాలు డెవరయినవచ్చి దుష్టగ్రంథమునేదైన
కసారి యిండనిన, యిన్వనని చెప్పిన, వాడు
డలిపోవునను భయమువదలి, "నాయనా!
ంకను కుఱ్ఱవాడవు. నీవడిగిన గ్రంథము నీ
చదువతగినది కాదు. మరేమంచిగ్రంథము
యిన యడుగుము. చూడు యీగ్రంథమెట్లు
ద్దో"యని మంచిగ్రంథమునొకదాని నాబా
నకిచ్చిన, వాడు సంతసించి, మనము గావిం
న నీతిబోధను మనమునందుంచుకొని, సదా
ంథాలయమునాశ్రయించియుండి, త్వరలో
భివృద్ధిలోనికి రాగలడు. కొన్ని వేళలందు మ
ముచూపినగ్రంథము, వానికిరుచించునట్లుగా,
ంచిపుట నొకదానిని వానిముందర చదివి
ంగిలినది గృహమున పఠింపుమని చెప్పినను
ాల లాభకరముగనుండును.

కొన్ని సమయములందు యంత్యంతాతుర
తో, యెవరయిన నాకాగ్రంథము కావలె
యిచ్చెదరాయనిన ఆగ్రంథము లేనియె
ల లేదనిన వానికెంతయో నిరుత్సాహమ
ను. అందులకు ప్రతిగా, ఆగ్రంథమునందలి
షయములే యీగ్రంథమునందునుగలవనిమ
ొక్కగ్రంథమునయిన చూపవలెను. లేనియె
ల యాగ్రంథమెచ్చట దొరుకునో అచ్చట
ండి తెప్పింతునని చెప్పిన, వానికెంతయో
త్సాహముకలుగును. ఆహా! ఈభాండాగా
ధిపతియొక్క యౌదార్యమేమని చెప్పవ
చ్చునని, శ్లాఘించుచు, మరుసటిదినమునుండి
ము సూదంటురాయికి యినుమెట్లు అంటు
ిపియుండునో యట్లే వారును భాండాగార
మునంటి తిరుగుదురు.

ఇక కొందరు తమంతట తాము భాండా
గారమునకు చదువుకొనుటకు రాక, తమస్నే
హితులు వచ్చుచున్నారుగదా యని వచ్చు
వారు గలరు; మర్యాద చెల్లించుకొనుటకై
వచ్చువారు కొందరును గలరు. అట్టివారు
భాండాగారమందిరమున కరుదెంచిననే, అ
య్యా! యీదినమున మంచి గ్రంథములు
రెండువచ్చినవి చూచినారా! యని వారికివ్వ
వలెను. లేక యేదో వారికింపుగనుండు యుప
యోగకరమగు విషయమునుగూర్చి చక్కగ
సంభాషించుచు, తన భాండాగారమందున్న
గ్రంధములలోని యుదాహరణలతో చెప్పిన
యెడల, ఆగ్రంథములను గూర్చి వినినవారికి
వానిని చదువుటకు కుతూహలముజనించును.
ఎప్పుడొక గ్రంథమును చదువుట కుత్సాహ
ము జనించినదో యింకను కొన్ని గ్రంథములు
చదువను అప్పుడే నభిలాష కలుగును.

ప్రతి భాండాగారకుడును, అడిగిన వారి
సందేహముల నివారింప జూచుచుండవలెను.
కంటబడిన గ్రంథమునెల్ల భాండాగారాధిపతి
చదువుచుండవలెను. పాఠకమహాశయుల యు
పయోగార్థము తా నుచితరీతిని వానినెల్ల వి
మర్శించుచుండవలెను. అతనికిదెలియని విష
యముండరాదు. జనులకు భాండాగారాధిపతి
దైవమువలె కాన్పింపవలెను. శాంతమూతని
మోమున తాండవమాడుచుండవలెను. ఓర్ప
తని నీడయై సంచరించుచుండవలెను. మాట
లాడినపుడెల్ల ప్రేమరస మొలుకుచుండవలె
ను. ఎల్లరితో నాతడు నిష్కపటమైత్రితో
మెలంగుచుండవలెను. భాండాగారాధిపతి వి
ద్యార్థులకు గురువుగను, బాలురకు సహోద
రుడుగను, వృద్ధులకు హితునివలెను, దుష్టప్ర
వర్తకులకు భయంకరుడుగను, నీతిబోధకుడు

గను నుండవలెను.

ప్రస్తుతమందాంధ్రదేశమందున్న కొన్ని గ్రంధభాండాగారములు పురాణేతిహాసంబుల చెప్పించి, చదువరుల నాకర్షించుచున్నవి. మరికొన్ని యాటలను బెట్టి చదువరుల నాకర్షించుచున్నవి. కొన్ని వార సభలను గావించుచున్నవి. ఇంక నివియేగాకుండ, బాలురబుద్ధిని వికసింపజేయు యాటలను అనగా 'వర్డ్సు బిల్డింగు' మొదలగు నాటలనుబెట్టి బాలురను రప్పింపవలెను. ఎప్పుడు ప్రచురింపఁబడిన గ్రంధమునప్పుడే తెప్పించుటవలన, పౌరులు చాలామంది రాగలరు.

సభలను సమకూర్చి జనులనాకర్షించుటనుగూర్చి చెప్పదలచితిని. చాలస్థలములందు సభలను గావించుచునేయున్నారు; కొన్ని చోట్ల యవి స్వల్పకాలముననే నశించుచున్నవి. సభ్యులను సభలకు రప్పించుటకు కార్యదర్శులుపడు కష్టముల నేను కళ్లార చూచియున్నాను. కాని యీవిషయమందు రెండంశములు ముఖ్యముగ చెప్పదలచియుంటిని. హాశ్యప్రధానములుగాక, నీతిబోధకములగు నాటకములను ప్రదర్శించినయెడల కొంతమంది సభ్యులు రాగలరు. కొందరు కార్యదర్శులు, నాటకములేల యాడవలెను, హాస్యములోనికి సభదిగుననవచ్చును. సభయొక్క తీవ్రము తగ్గకుండగ, సభ్యుల నాకర్షించు చిన్న చిన్న అంకములను, ప్రదర్శించిన బాలురయొక్క వాగ్ధోరణి హెచ్చుటయేగాక సభ్యులును చాలమంది రాగలరు. సభ్యులు విశేషముగ రాని సమయములందు కార్యదర్శులు నిరుత్సాహపడరాదు. అగ్రాసనాధిపతి, కార్యదర్శి, ప్రధానోపన్యాసకుడు యింకొక సభ్యుడుండిన చాలును. నేనొక భాండాగారమునకు కార్యదర్శిగానుండి రెండు సంవత్సరములు సభలను జరిపినాను. కొన్ని సభలకు నలుగురయిన వచ్చియుండలేదు. కొన్ని సమయములందు, అగ్రాసనాధిపతిగారితో ముగ్గురయిన లేరు. అట్టిసమయములందు నిరుత్సాహపడకూడదు. కొన్ని సమయములందు ప్రధమమున సభ్యులు కొద్దిగనున్నను, సభజరుగుచున్న సమయమందు మరి కొంతమంది సభ్యులు నిశ్చయముగ రాగలరు. ఒకవేళ రాకపోయినను మనము పట్టువిడవకుండ సభజరుపవలెను. ఇందుకుదాహరణముగ, 'క్రిస్టియను యెస్సోషియేషను' ప్రధమమున స్థాపింపఁబడినప్పుడు యిద్దరు సభ్యులుండిరట. ఇద్దరధైర్యపడక, పరిశ్రమచేయ, ఇప్పటికి ప్రపంచమందున్న ప్రతి పట్టణమందు, యట్టి క్రైస్తవసభలు గలవు. అట్లనే కలకత్తాలో బ్రహ్మసమాజము ప్రధమమున స్థాపించినప్పుడు యిద్దరుండెడివారలట. ఇప్పుడన్ననో, యామతము ప్రపంచమందంతటను వ్యాపించినది. కాన యీసభలను జరుపువారధైర్యమెంతమాత్రము పడకూడదు. ఇట్లెన్నియోవిధముల గ్రంధభాండాగారికులు తమగ్రంధాలయములను జనోపయోగకరములగునటుల జేయవచ్చును. మానవులెందరెన్ని బిరుదులను పొందినను లాభము లేదు. ఎన్ని యుద్యమములుతలపెట్టిన నవియన్నియు వృధాయగును. ఈయుద్యమమును దలపెట్టినవారే దేశవీరులు. అట్లు తలపెట్ట తగ్గవారే భాండాగారికులు.

తేకుమళ్ళ వెంకాజీరావు.

# ప్రారంభవిద్యకు గ్రంధాలయముల తోడ్పాటు.

ఏనాడు ప్రాథమికవిద్య సర్వజనసాధారణమై పట్టణములయందెట్లో పల్లెలయందట్లె తాండవమాడగలదో, ఏనాడు ప్రారంభవిద్య నభ్యసింపగోరు ప్రతిబీదవాడును చదువుకొనుటకు విద్యాశాలలు బహిరంగముగ తెఱచియుంచబడునో, ఆనాడే యాంధ్రదేశౌన్నత్యమున కాదిమదివసమని జెప్పవచ్చును. కావున వర్తమానకాలపు విద్యాస్థితిని అనగా "వ్యాప్తి" నారయుదము. అందులకుగాను ఆంధ్రదేశములో గల జనావాసములయొక్కయు, చదువతగిన యీడుగలిగి చదువుచున్న బాలబాలికలయొక్కయు, చదువుకొనువారికి వేర్వేర ప్రభుత్వమువారియొక్కయు ప్రజలయొక్కయు గల తోడ్పాటుల వివరములను గూర్చియు చక్కగా తెలిసికొనవలెను.

ఆర్యులారా ! ఎనుబదిమూడువేలకు పైగల చతురపుమైళ్ళ వైశాల్యముగలిగి ప్రత్యేక రాష్ట్రవిశ్వవిద్యాలయాదులను గోరు మన ౧౧ ఆంధ్రమండలములయందు గల ౧ కోటి ౨౦ లక్షల జనసంఖ్యలోను ౬౪ లక్షలజనులు మాత్రమే చదువగలిగినవారున్నారు. అనగా ఆంధ్రదేశమందొక్కొక్కనూరుగురిలో నైదుగురుమాత్రము చదువుకొనినవారు. తొంబదియైదుగురా జనాభాలెక్కకేనివచ్చు చదువెరుగని నిరక్షరకుక్షులు. అయిదింటికిని తొంబదియైదింటికిని ఎన్ని అంతరములు గలవు. అజగజాంతరమా ? కాదు కాదు. హస్తిమశకాంతరము. కడచినదానికి వగచిన నేమి ఫలము. పాఠశాలకుపోదగిన యీడు బాలురు అనగా ౫ మొదలు ౧౫ సంవత్సరముల వయస్సు గల వారీ యాంధ్రదేశమందు ౪౩,౯౫,౯౪౧ మందిగలరు. ఇందులోచదువుకున్నవారు ౩,౯౧,౩౭౫మంది. అనగాచదువతగిన యీడుగల ప్రతి నూరుగురు బాలురకును సగటున పదిమందిమాత్రమే చదువుచున్నారు. ఆంధ్రదేశమందొక కృష్ణామండలముమాత్రము ౧౦ సంఖ్యను మించుచున్నది. జనపరిగణనము ననుసరించి తెలుగు మండలములలో సుమారు ౩౧౦౦౦ గ్రామములు గలవు. ఈగ్రామములలో పైబాలురకు దాదాపు ౧౦ వేల బడులుగలవు. ప్రభుత్వమువారి సాహాయమువలన చదువుచున్న బాలుర సంఖ్య నూటికి నలుగురుగా నున్నారు. వారు జేయుచున్న సహాయముచేతనే మనమింతవరకైన విద్యాభివృద్ధిని గావించుకొన నవకాశముగలిగినది. ఇంతేగాక ఇప్పుడిప్పుడు విద్యాభివృద్ధి కాంధ్రదేశమునం దనేక సత్ప్రతిష్ఠాపనము లేర్పరుపబడినవి. ఏర్పరుపబడుచున్నవి.

అందెల్ల నగ్రగణ్యమైనవియు పండితపామర జనోపకరమైనవియు నగు గ్రంథభాండాగారముల ప్రశస్తము సుప్రసిద్ధము. వాక్శూరులుగాక కార్యశూరులై పేరుప్రతిష్ఠలకొఱకు బాటుపడువారుగాక, సహజదేశాభిమానముతో శ్రమపడు యువజనులచే స్థాపింపబడినయట్టి గ్రంథాగారము లాంధ్రలోకమున ౨౦౦వరకునుగలవు. కాని మొన్న మొన్ననే వెలువడినగతవత్సరగ్రంథాలయచరిత్రలో ౧౬౦ మాత్రమేచేరియున్నవి.-ఈ గ్రంథాగారము లే

మిచేయుచున్నవి? వివిధవిద్యలను ప్రోత్సహింపజేసి పండితులను, ఉచితముగా విద్యనొసగి పామరులను సంతుష్టిపరచుచున్నవి. మఱియు కొద్దిగనో గొప్పగనో చదువనేర్చియు తమ విలువగల కాలమును దుశ్చింతలతోను దుష్కృత్యములతోను వెళ్ళబుచ్చువారికొక విధమగు నూతనోత్సాహమును జనింపజేసి, సుమారు దినమునకు రెండువేలమందికి పైబడు జనులను గ్రంథాలయముల దర్శింపించి గ్రంథములను వార్తాపత్రికలను చదువఁజేసి, కాలమును బుద్ధిని సద్వినియోగము జేయుచున్నదీ గ్రంథాలయముల పరిశ్రమయే! ఈ భాండాగారముల యౌదార్యముచేతనే స్థాపింపబడిన ముప్పదికిలోబడిన పాఠశాలలలోను, సుమారేనూరు బాలబాలిక లుచితముగా విద్యనభ్యసించుచున్నారు. ఈ గ్రంథనిలయముల కృషివలననే కొన్ని గ్రంథమాలలు కొన్ని సదుపన్యాసములు కొన్ని వ్యాయామపు బరిశ్రమములు బయలువెడలి, జనులలో విద్యనభివృద్ధిఁజేసి నీతిని బలపఱచి యారోగ్యవంతులను జేయుచుండినవి. ఇట్టి గ్రంథాగారములే నిజముగా ప్రారంభవిద్యాభివృద్ధికి ముఖ్యసాధనము లనవచ్చును. అయిన నీ గ్రంథభాండాగారములు ప్రత్యేకించి ప్రారంభవిద్యాభివృద్ధికెట్లు తోడ్పడగలవు?

సోదరులారా! ఆంధ్రదేశగ్రంథ భాండాగారసభవారి యాదర్శముల ననుసరించియే, ప్రతితాలూకా గ్రంథాగారికులును తమతమ తాలూకాలోగల గ్రంథభాండాగార సమాజముల జేర్చుకొని, ప్రారంభవిద్యాభివృద్ధికొక సంఘము నేర్పరచనగును. వీలువెంట ననగా జనులనుండిచందాలనువసూలుచేసి పాఠశాలల నెలకొల్పవలెను. పల్లెలకేగి యచ్చటవారికి విద్యయందభిరుచిని గల్పించి వారిచే పాఠశాలలు స్థాపింపజేయవలెను. ఇట్లుతగుకట్టుబాట్లతోడను, పట్టుదల యభిమానాదులతోడను పనిఁజేసిన భాండాగారముల కృషివలన ప్రారంభవిద్యాభివృద్ధికగు తోడ్పాటమేయము. ప్రారంభవిద్యాభివృద్ధి కిట్టి తాలూకా, జిల్లా సంఘము లావశ్యకములేయని విదేశీయురాలయ్యు మన దేశాభివృద్ధికి బాటుబడుచుండిన సుప్రసిద్ధనారీతిలకమగు అనిబిసెంటు దొరసానియు, తన 'న్యూయిండియా' పత్రికయందు దేశీయులకు సలహా నొసగుచున్నది. ఈ సలహాను గ్రంథభాండాగార సభవారును పరిశీలించి మండల, తాలూకా భాండాగారసభలకు ప్రోత్సాహము నొసగి, ప్రారంభవిద్యకు భాండాగారముల తోడ్పాటును వెలువరింతురు గాక!

ప్రారంభవిద్యాభివృద్ధిని చేయు నుద్దేశముతోడనే దాదాపు ముప్పది భాండాగారములుగల మా తెనాలితాలూకాలో ప్రథమమున నొక యువకునిచే ప్రేరేపింపబడి యేడు సమాజములతో మాత్రము ప్రారంభవిద్యాభివర్ధనీ సంఘము స్థాపింపబడినది. ఇప్పటికి నలుమూడు సమాజము లందుజేరి పనిని చేయుచున్నవి. వరదలువగయిరాలవలనమాతాలూకాకీయేడునష్టముగలిగినది. అందుచే యీనూతనోద్యమమునకు నిదర్శనముగా చూపబడిన తెనాలితాలూకా ప్రారంభ విద్యాభివర్ధనీ సంఘము మిమ్మందర నక్కజపరుప దగినంత కృషి సల్పజాలకున్నను, రెండు పాఠశాలలో ముగ్గురుపాధ్యాయులచే నూరుగురు బాలబాలికల కుచితముగా విద్య నొసగుచున్నది. మఱియు నిట్టిసంఘముల తోడ్పాటు ప్రారంభవిద్యాభివృద్ధి కత్యగత్యమనియు; అనుకూల

మార్గమనియు, ఆచరణయోగ్యమనియు మాతము గ్రహించి యేతాలూకావారా తాలూకాయం దిట్టి సంఘముల నెలకొల్పి విద్యనభివృద్ధిజేయ మిమ్మందర ప్రార్థించుచున్నది. కనుక గ్రంథభాండాగారికులారా ! మహాజనులారా !! చదువన నెట్టిదియో యెరుగక, చదువరులఁజూచి సిగ్గుఁజెందుచు, తమ జీవితము నెట్లు గడుపవలయునో గ్రహింపక యుండు విద్యావిహీనులగు మీదేశీయ సోదరుల దుస్థితిఁజూచి మీ చేతనైనంత సాయము జేయక మీరూరకుండవచ్చునా ! ఎట్లూరకుండగలరు ? మీతోపాటాంధ్రమాతృగర్భమున జనించి మీకన్న హైన్యస్థితియందుండ, వారి హీనత్వమే మీ హీనత్వముకాదా ? మనమందర మాంధ్రమాతృగర్భమునం దుద్భవించిన యేకోదరులమని తెలసుకొని, ఆంధ్రమాతృరక్తమె మన యెల్లరదేహములను బ్రవహించుచున్నదని యెఱింగికొని, యేకోదరత్వము, రక్తబాంధవ్యములకన్న మిన్నయగునది సున్నయని గ్రహించినచో నిదియొక ఘనకార్యము గాదు.

కావున మీసోదరులై మీకన్న బీదలై, మీదయాభిక్షములకు వేచియున్నట్టియు, నాశించియున్నట్టియు, విద్యావిహీనులకు నిరక్షరకుక్షులకు విద్యాదానముఁజేయ గంకణము కట్టుకొని గ్రంథభాండాగారములు దేశమునకు నిజమగు నుపయోగవంతములుగా జేయుదురు గాక ! మఱల జరుగబోవు గ్రంథాగారసభనాటి కిట్టి సంఘము లొండు రెండేని స్థాపింపబడి ప్రారంభవిద్యాభివృద్ధికి దోడ్పడును గాక !

సత్తెనపల్లి హనుమంతరావు.

## గ్రంథాలయములు.

(శ్రీ) అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు అంగలూరు బాలసరస్వతీ పుస్తకభాండాగార వార్షికోత్సవ సమయమునందిట్లు జెప్పిరి:—

విద్యాశాలలవలెనే గ్రంథాలయములు ప్రాచీనకాలమునందు మన భరతఖండమునఁ జాలఁగలవు. అవి చేసినకార్యములు వర్ణనాతీతములు. కవి యొక గ్రంథమును రచించును. భాషకెల్ల నొక్కే ప్రతియుండిన దానివలన లోకము నెందఱకుపయోగముగల్గును? ఇప్పటివలె నప్పుడు ముద్రాలయములు లేవు. చక్కని కాగితములు లేవు. అచ్చులేదు. అందుచే గ్రంథములు విశేషవ్యాప్తింగాంచెడివి కావు. అయినను మహాకవులయందుఁగల యాదరమునంజేసి పెక్కురు గ్రంథములను దాటియాకులపై వ్రాసి లేక వ్రాయించి పఠించుకొనుచుండెడివారు. ఆగ్రంథములు వారికే యుపయోగించుచుండెవి. పోయిన మరల నట్టి గ్రంథములను సంపాదించుట దుర్ఘటమని యెఱింగి వారు పరుల కా పుస్తకముల నిచ్చెడు వారు కారు. ఆయీవిషయములం గమనించి మన భరతఖండపుఁ బూర్వరాజులు పెక్కు గ్రంథములను వ్రాయించి యొక భవనమున నుంచి చదువుకొనఁగోరు పండితుల కుచితము

గా నిప్పించుచుండెడివారు. ఆపండితులు తమ పని ముగియఁగనే ఆగ్రంథములను మరల నిచ్చెడివారు. ఇట్లేమనప్రస్తుత భాండాగారముల కంకురము భరతవర్షమున వేలకొలఁదివత్సరములక్రిందనే యేర్పడినది.

ఇది నవీనయుగము. మానవప్రపంచము సర్వవిధముల నభివృద్ధినందుచున్నది. భావములు, శాస్త్రములు, తెలివి, నాగరికత దినదినము హెచ్చుచున్నవి. ప్రపంచయాత్ర నీనూతనయుగకళలందెలియక చేయుట దుర్ఘటము. అందు కేమిచేయవలయును? గ్రంథములం బఠియించుటే. వివిధవిషయికజ్ఞానముం గల్గించుకొనుటే. అందుకుఁదగిన సాధనము లేవి? గ్రంథభాండాగారములే.

తక్కిన హిందూసామ్రాజ్యముతోపాటు మన యాంధ్రదేశమును ఈవిషయమున వెనుకపడియే యున్నది. అయినను గొలఁదికాలమునుండి మన యాంధ్రులు విశేష యుత్సాహముంబూని వీనిని స్థాపింప యత్నించుచున్నారని చెప్పుటకుఁ గొంత సంతసింపవలసియున్నది. దినదినమును ఆంధ్రపత్రికలలోఁ గ్రొత్తభాండాగారములు జన్మించుచున్నట్లు చదువుచున్నాము. దేశమున నన్నిభాగములను ఈయుద్యమము కదలుచున్నది. అయినను ఇంతవరకు మనదేశమున గొప్పవి అయిదారు కంటె హెచ్చుగా లేవు. బందరు, ఏలూరు, కాకినాడవంటి పెద్దపట్టణములలోఁ గూడఁ దగిన భాండాగారములు లేకపోవుట చూడ మనమెంత దుస్థితియందున్నది తెలియఁగలదు. అయినను ఈలోపములను దొలఁగించుటకై ఆంధ్రదేశ పుస్తకభాండాగారసంఘము నొకదానిని గతసంవత్సరము స్థాపించినారని చెప్పుటకు నాకానందమగుచున్నది. కాని యిదిరట్టిపనిని జేయునో ముందు చూడవలసియున్నది. ఈసంఘమువారు సంవత్సరమునకొకసారి సమావేశమయి మంచిచెడ్డలను జర్చించుకొనుటతోనే తృప్తినొందక కొందఱు సంచారకులను నియమించి యాంధ్రలోకమున వివిధభాగములందున నీసదుద్యమునెడ ననురాగము జనించునట్లును భాండాగారములను స్థాపించునట్లును జేయింతురుగాక. మరియుఁ గొందరు గొప్పవారు పోఁగయి జమీందారులను బెద్దవారిని యాచించి కొంతధనమును సంపాదించి మూలధనముగానుంచి దానిపైవచ్చు డబ్బులోఁ గొంతభాగమును గ్రొత్త భాండాగారములకిచ్చుచుఁ బ్రోత్సాహముచేసిన మేలుగానుండును.

అమెరికాదేశమున భాండాగారములు మహత్కార్యముల నొనరించుచున్నవి. కొన్ని గ్రంథములను ముద్రించుచున్నవి. దీనికై కొన్నిటికి ముద్రణాలయములు కలవు. మఱికొన్ని రాత్రిపాఠశాలలు స్థాపించి బాలురకు బాలికలకు భాండాగారముల నెట్లుపయోగించుకొనవలసినది తెల్పుచున్నవి. పాఠశాలలందు, రచ్చావడులందు, న్యాయస్థానములముందు, బజారులందు, జిల్లాసభలందు, మతసభలందు, రాష్ట్రసభలయందు అన్నిచోట్లను భాండాగారముల తరఫున బయలుదేఱిన కార్యనిర్వాహకులు ప్రత్యక్షమై భాండాగారోపయోగముల నుద్ఘోషించుచు లోకమెల్ల భాండాగారములతో నింపుచున్నారు. బాలురను, బాలికలను ఆకర్షించు జక్కనియాటల భాండాగారావరణములలో నేర్పఱచి వారికిఁ జదువునందుఁ బ్రీతి కల్పించుచున్నారు. శాఖలను స్థాపించి సమీపస్థలములలో గ్రంథము...

లేనివారిలోపములను దొలఁగించుచున్నవి.

శాస్త్రజ్ఞులకు, బండితులకు వివిధ విషయములలో నూతన పరిశోధన చేయువారికి నవి చేయుసాయము అమితము. గొప్పగొప్ప భాండాగారము లిట్టివారికి నిశ్శబ్దముగానుండు గదులను బ్రత్యేకముగా వందలకొలఁది పుస్తకములతోఁగూడ నిచ్చి మేలుచేయుచున్నవి. ఉచితముగాఁ గొన్నియెడలఁ జందానైన స్వీకరింపకయే వారికి వలయు గ్రంథములనెన్నియైనను సేవకునిమూలముగా నింట్లకుఁ బంపి మరలఁ దెప్పించుకొనుచున్నవి.

ఆదేశమునందు చౌరకులను జక్కగానాదరింతురు. చనవుగా నెల్లరను బీరువాలదగ్గఱకేగి గ్రంథములం దీసికొననిత్తురు. ఇందుచేఁ గొన్నియెడలఁ బుస్తకములు పోవచ్చును. కాని వీరిమూలమున నెల్లరకు నష్టము కల్గింపకుండుట మేలని యీయనష్టము సహించుచున్నారు. ఇంకను వారుచేయు లోకోపకారకార్యములు వర్ణింపశక్యముగాదు.

ఈవిషయములనన్నిటిని నెఱవేర్చుట మనదేశపు భాండాగారములకు సాధ్యమగునని నాయాశయముకాదు. మనకాసాయము, ప్రోత్సాహము, పట్టుదల, సంపద, ఐకమత్యము, విద్య, దేశారాధన, జీవనములేవు. అయినను మీ.రాయుత్కృష్టాదర్శములను మదిలో నుంచుకొనుఁడు. వీలైనప్పుడెల్ల నాయాదర్శములలో నొకలేశము నేని మీశక్తికొలఁది చేయుఁడు. ఉదారాశయములు కల్గియుండుట మానవులకు జాలలాభకరము. మన భాండాగారములవారెల్లఱు నీవిషయమును గమనింతురేని, నెరవేర్ప శక్తికొలఁదిం బ్రయత్నింతురేని ప్రపంచమునకు మహోపకారముకల్గును.

## బెంగుళూరు గ్రంథాలయము.

మైసూరు ప్రభుత్వమువారివలన బెంగుళూరునందు సార్వజనిక గ్రంథనిలయము స్థాపింపబడినది. ఇట్టి గ్రంథనిలయములను స్థాపించు విషయము తొలుదొలుత 1912వ సంవత్సరమున మైసూరు ఆర్థికసభలో విద్యాశాఖవారిచే ప్రస్తావింపబడెను. 1914వ సంవత్సరమున దొరతనమువారట్టిగ్రంథనిలయములను బెంగుళూరునందొకటియు, మైసూరునందొకటియు నెలకొల్పుటకు అనుజ్ఞనిచ్చిరి. బెంగుళూరు గ్రంథనిలయమునకు గ్రంథములను కొనుట మొదలగు ఖర్చులకుగాను రు 2000 ల నిచ్చిరి. ఇదిగాక సంవత్సరమునకు రు1500ల గ్రాంటునుగూడ నిచ్చుచుందురు.

### గ్రంథ భాండాగారము.

మ. అతివాచావిభవంబుతో సభలయం దాటోపమేపార ధీ
యుతులై యెంత యుపన్యసించినను లేదొక్కింతయుఁ లాభ మూ
ర్జిత కార్యాచరణ ప్రవీణతయె వాసింగూర్చు జ్ఞానాప్తికై
ప్రతియూరన్నెలకొల్పు డాంధ్రులు సమగ్రగ్రంథ భాండారముల్.


పోచిరాజు సీతారామయ్య.

32A

(R)

323

అమెరికాదేశ గ్రంథ భాండాగారోద్యమమునకు
కల్పతరువు.



ఆండ్రూ కార్నెజీ.

కోటీశ్వరుడు.

33

# ఆండ్రూ కార్నెజీ.

33569

## అమెరికా కోటీశ్వరుడు.

### అమెరికాదేశ గ్రంథభాండాగారోద్యమమునకు కల్పతరువు.

R

ఇదివరలో గొంతకాలముక్రిందట నాచే వ్రాయబడిన అమెరికావర్తక చరిత్రపీఠికయందు మహనీయుడగు కార్నీజీయెడ నాకుగల గౌరవమును దెలిపియున్నాను. ఇప్పుడు కార్నీజీయొక్క జీవితచరిత్రను ముఖ్యముగ భాండాగారాభ్యుదయములతో సంబంధించినంతవరకు వ్రాయుటకు బూనితిని.

అమెరికాయందు సార్వజనిక గ్రంథాలయముల యభివృద్ధికి మూలపురుషుడనదగిన ఆండ్రూకార్నీజీ యొక్క నామము పవిత్రవంతమై గ్రంథభాండాగారముల యభివృద్ధితో నెల్లప్పుడును పరిగణింపబడుచున్నది. కార్నీజీయొక్క పేరు తలంచినంతమాత్రమున ఆయనయెడ మనకుగల గౌరవభావము స్ఫురింపకమానదు. కార్నీజీ యెటుల కోటీశ్వరుడయ్యెనో తన ధనము నెటుల పుస్తకభాండాగారములకై వెచ్చింపుచుండెనో తెలియుటవల్ల మనకు ఎక్కువ సంతోషమును ఉద్రేకమును కలుగుటకవకాశము గలదు.

ఇప్పటికి ఎనుబది సంవత్సరములక్రిందట స్కాట్లాండు దేశములో డంఫర్‌లైను నగరమునందు ఆండ్రూ కార్నీజీ అను మన కథానాయకుడు జననమందెను. ఆయనతండ్రి విల్లియము కార్నీజీ యను నాయన మగ్గములచేత వల్ల జీవించుచుండెడివాడు. మన యాండ్రూకార్నీజీ బాల్యమునందు తల్లివద్దను పినతండ్రివద్దను విద్యాభ్యాసము జేసెను. తల్లి ఆయనకు అక్షరాభ్యాసమును జేసెను; అతని నడవడిని మంచిమార్గమున నుంచగలిగెను. అట్టి మాత ఆతనికి ఏబదిసంవత్సరముల వయస్సు వచ్చువరకును జీవించియుండి మన కథానాయకుని మేధాశక్తిని సానపట్టినదై వజ్రముకన్న విలువగలదిగా జేసెను. అతని పినతండ్రి రాచకీయ తంత్రజ్ఞుడై యుండుటచేత చిన్నతనములోనే యాండ్రూకార్నీజీకి ప్రజాపరిపాలనాపద్ధతు లలవడి చరిత్రాభ్యాసప్రాప్తి సిద్ధ[illegible] అందుచేత అతడు పదియవయేటనే ప్రజాపక్షమున రాచకీయపద్ధతులందు మెలంగుచుండెను.

కార్నీజీకి పదునొకండవ సంవత్సరము వచ్చెను. ఆకాలమున దేశమునందు నూతనముగా ఆవిరియంత్రములు ప్రబలసాగెను; వానిముందర చేతిమగ్గముల పసతగ్గిపోవుటచే నాపోటీకి తాళజాలక విలియముకార్నీజీ తన కుటుంబముతో జీవయాత్రకై అమెరికాలో పిట్సుబర్గ పట్టణమునకు బోవలసివచ్చెను. కార్నీజీని 12 వ యేట దూదిఫ్యాక్టరీలో వారమునకు 2 రూపాయిల కూలిని బుచ్చుకొని దూది నేరు పనిలో తండ్రి ప్రవేశింపజేసెను. తర్వాత అనేక కోట్ల రూపాయిలతని చేతిమీద వ్యయపడినను మొదట తాను తన తలితండ్రులకై సంపాదించిన 2 రూపాయిల విలువను తానెన్నటికి మరువజాలననియు, తర్వాత తానార్జించిన కోట్లకంటె నారెండు రూపాయిలనె ఎన్నిరెట్లో ఎక్కువగ చూచుచుండెడివాడననియు, అప్పుడు తానుపడిన కాయకష్టము బానిసవృత్తికంటె యధమముగ నుండినను తన తలిదండ్రులకు సహాయపడుటకై గానిచో దుర్భరమై యుండెడిదనియు కార్నీజీ వ్రాసియున్నాడు.

ఒక సంవత్సరము దూదిఫ్యాక్టరీలో పనిచేసిన తర్వాత ఆవిరియంత్రముతో పనిచేయు మరియొక ఫ్యాక్టరీలో బాయిలరులో నిప్పునుజూచు పనియందు కార్నీజీ ప్రవేశించి, ప్రతిదినము ఎక్కువకష్టపడి పనిచేయుచుండెడివాడు. అంతమాత్రము కష్టముచేత నాతడు అధైర్యముచెందలేదు. ఎప్పటికైనను మంచిదినములు రాకబోవునా యను మనోధైర్యము కలిగియుండెను. పేదరికము వలన భయమును జెందుటకు మారుగ సంపన్నుల గృహములయందు జూడజాలని నిజమైన సౌఖ్యము పేదవా

రి యింటనే గలదని యాతడు తృప్తి జెందుచుండెను; తర్వాత స్వయంకృషిచే మిక్కిలి ధనవంతుడైనప్పుడు సహితము తన యభిప్రాయమును మార్చుకొనజాలనని కార్నీజీ నుడివియున్నాడు. ఈప్రకారము బాయిలరు వద్ద ఒక సంవత్సరకాలము పనిచేసి ఓహియో టెలిగ్రాఫు కచ్చేరీలో తంత్రీవార్తలను బట్వాడాచేయు కుర్రవాడుగా ప్రవేశించెను. అచ్చటనున్న కాలములో టెలిగ్రాఫు పనులను దెలిసికొని శీఘ్రకాలములో నెలకు ముప్పది రూపాయిల జీతము సంపాదింపగల టెలిగ్రాఫు ఉద్యోగమును రైలుస్టేషనునందు సంపాదింపగలిగెను. ఆజీతమునకు అతడు చాల సంతృప్తినిజెంది యానందమును బొందుచుండెడివాడు. అప్పుడు తన తండ్రియొక్క గృహమును తాకట్టుబెట్టి ఆడామ్సు యక్స్ప్రెస్సు కంపెనీలో 10 భాగములను కొనెను. వ్యాపారప్రారంభమున కిదియే కార్నీజీయొక్క ప్రథమ ప్రయత్నము. అనుభవశాలియగుటచేత నావ్యాపారములో భాగములు కొనినచో లాభము రాగలదని ఊహింపగలిగెను. దూరదృష్టితో నాలోచించి తనవద్ద సొమ్ములేనప్పటికి నప్పుచేసి వ్యాపారమున జొరబడెను. సాహసములేని దెట్టి స్వల్పకార్యమైనను సాధింపజాలముగదా.

రైలు కంపెనీవారు కార్నీజీయొక్క తెలివి తేటలను గనిపెట్టి వెంటనే పిట్సుబర్గు డివిజనునకు సూపరింటెండెంటుపని నిచ్చిరి. ఆకాలమున అమెరికాలో జరిగిన దేశీయ యుద్ధమునందు మిలిటరీ రైలురోడ్డును టెలిగ్రాఫులను కాపాడుటకు కార్నీజీ నియమింపబడెను. యుద్ధమును ప్రత్యక్షముగ సందర్శించుట కవకాశము కలిగి యందలి ఘోరము లాతని మనసునకు దృఢముగ నాటుటచేత నిప్పటికిని యుద్ధవార్త యతనికి కర్ణకఠోరముగ నుండును.

ఆయుద్ధకాలమున కార్నీజీ వాషింగ్టనులో పనిచేసి తిరిగి పిట్సుబర్గునకు రాగా, నిద్రకనుగుణ్యమైన రైలుబండ్లనుకనుగొనిన 'వుడురఫ్' అను వానితోకలసి భాగస్థుడుగజేరి బ్యాంకిలో కొంతసొమ్మును ఋణముతెచ్చి, 'పెనిసిల్వేనియా' రోడ్డుమీదకూడతమబండ్లనేవాడుకలోనికి రప్పించగలిగెను. ఆడమ్సు కంపెనీకంటె ఈకంపెనీలో కార్నీజీ కెక్కువ లాభము గలిగెను.

1861 సంవత్సరములో పెనిసిల్వేనియాలో కనిపెట్టబడిన కిరసనాయిలు వ్యాపారమునకై తానప్పటికి నిలవజేసిన 8000 నవరసులను వినియోగించి యానూనె వొరకు క్షేత్రము నొకదానిని కొనెను. కార్నీజీ యదృష్టమంతయు అతని నప్పటినుండి యుచ్చస్థితికి దెచ్చినది. ఇనుపవ్యాపారములుజేయు అనేక కంపెనీలలో భాగస్థుడై 1868 సంవత్సరములో ఆంగ్లేయ దేశములో ప్రశస్తమైన బెస్మరు ఉక్కు తయారుచేయుపద్ధతిని పరిశీలించుటకై పోయియుండి అమెరికాకు వచ్చినపిమ్మట, ఉక్కురైళ్ళను తయారుచేయుటకు యంత్రశాలలను స్థాపించెను. రైళ్ళకు కావలసిన యినుపసామగ్రిని తానే తయారుచేయించవలెనని దీక్షవహించి కార్నీజే ఉక్కు యంత్రశాలలను స్థాపించియుండెను. తన పట్టుదలప్రకారము తన పనులకు కావలసిన సామానులనన్నిటిని తన యంత్రశాలలోనే తయారుచేయగలిగి యితరులపై యాధారపడి యుండనందులకు కార్నీజీపొందిన యానందమును మనమూహింపజాలము. 1883 సంవత్సరములో మరియొక ఉక్కుయంత్రశాల కధికారియయ్యెను. కార్నీజీ ఉక్కుయంత్రశాలల కంపెనీ పేరబరగు వ్యాపారములందు 50 లక్షల నవరసులను మూలధనముగా కార్నీజీ యుంచగలిగెను. 1892 వ సంవత్సరములో బొగ్గునుసి కంపెనీ నొకదానిని సంపాదించెను. 1900 సంవత్సరము నాటికి తన కంపెనీలలో మూలధనము కోటిన్నర నవరసులుగ జేసెను. తనకు 62 సంవత్సరముల వయసు వచ్చుసరికే కార్నీజీ వ్యాపారములనుండి చాలించుకొని 50 కోట్ల నవరసుల స్థితితో తులతూగుచుండెను.

కార్నీజీ యీవిధముగ లాభమును సంపాదించగలుగుటకు ముఖ్యకారణము, వ్యాపారములో పనిచేయు వారికి తన లాభములో కొంతపాలు పంచియిచ్చుటయని బోధించుచున్నాడు. మరియొక రహస్యమేమనగా తెలివిగలవా డెచ్చటకన్పించినను వానిని తగువిధముగా ప్రోత్సాహపరచి లాభములో భాగమునిచ్చి తనవ్యాపారములో చేర్చుకొనుచుండెడివాడు. ఎవరైన భాగస్థుడు కాలముచేసినయెడల నెల దినములలో వాని వారసులకు

జెందవలసిన సొమ్మును పంచియిచ్చివేసి యాభాగమును మిగిలిన భాగస్థులే పంచుకొనెడివారుగాని చనిపోయిన వాని కొమాళ్ళనుగాని యితర వారసులనుగాని వ్యాపారమునందు జొరనిచ్చుటలేదు. ఇందువల్ల అగస్త్యభ్రాతలు జేరి మంచి వ్యాపారములను మంటగలుపుట కవకాశము తగ్గునుగదా! కార్నీజీ వ్యాపారపు పనులనుండి విశ్రాంతినిబొందుట దేహదారుఢ్యము లేకకాదు. భాగస్థుల వత్తిడివల్లను గాదు. తానార్జించిన విశేషధనమును తన జీవితకాలములోనే సద్వినియోగము చేయవలెనను ముఖ్యోద్దేశ్యముతో ఆయన వ్యాపారమును మాని జీవయాత్రను గడుపుచున్నాడు.

కార్నీజీ అభిప్రాయప్రకారము ధనమార్జించుటకంటె దానిని వ్యయముజేయుట కష్టమని తేలుచున్నది. ధనికుడుగా జనిపోవువాడు తనను తా నగౌరవపరుచుకొనువాడని కార్నీజీ అభిప్రాయమై యున్నది. సాధారణముగ మనముచేయు ధర్మముల పద్ధతులు సరియైనవి గావని కార్నీజీయొక్క నమ్మకము. ధనము సద్వినియోగము జేయుట యనగా సరియైన వ్యయము చేయుటయె గాని యిష్టమువచ్చినటుల వెచ్చించుటకాదు. 1881 సంవత్సరములో అమెరికాదేశ పత్రికలకు వ్రాయుచు ధర్మముచేయు పద్ధతులలో విద్యాలయములు సర్వకళాశాలలు స్థాపించుట, ధర్మపుస్తక భాండాగారములు, వైద్యశాలలు, యంత్రశాలలు, విహారవనములు, పురమందిరములు, ఈతనేర్పుస్థలములు మొదలగువానిని నేర్పరచుట అత్యుత్తమంబులని ఆయనజెప్పియున్నాడు.

కార్నీజీయొక్క ధర్మములయందు గ్రంథ భాండాగారములే అగ్రస్థానమును వహించియున్నవి. ఈ గ్రంథభాండాగారోద్దేశ్యము మొదట కార్నీజీ కెట్లు కలిగెనో, యీ ధర్మమునుగురించి యతని యభిప్రాయమేమిటో కొంచెము విచారించుట కర్తవ్యము. పిట్సుబర్గులో పిల్లలు వారమునకొకసారి చదువుకొనుట కవకాశము కలిగిన 400 పుస్తకములు గల యొక చిన్న భాండాగారమునందు, తనకు గల యభిమానమును తానుపొందిన సంతోషమును కార్నీజీ యెన్నటికిని మరపుజెందినవాడుగాడు. అప్పుడతని మనస్సులో, ఎప్పటికైన నాకు ధనము చేకూరెనేని ఇటువంటి ధర్మపుస్తకభాండాగారములను దేశమున వెదజల్లి బీదజనులకు నుపయోగకారు లగునటుల చేయుదునుగదా యని నువిళ్ళూరుచుండెడివాడు. ఆయన పేదపిల్లవాడుగా నున్నప్పుడు కలిగిన యూహా యట్టిది. ఇప్పుడు వృద్ధుడై కోటీశ్వరుడైన కార్నీజీ, సంఘమునకు జేయగల ధర్మములయందెల్ల ధర్మగ్రంథ భాండాగారస్థాపనయే ఉత్కృష్టమైనదిగ పరిగణింపబడవలెనని చాటుచున్నాడు.

కార్నీజీని కొందరు ధర్మగ్రంథభాండాగారములను గూర్చి ఆయన యభిప్రాయమును దెలుపవలసినదిగా కోరినప్పుడు ఈదిగువ సంగతులను శెలవిచ్చెను.

“గ్రంథాలయములు కష్టపడనిదే ఫలమునియ్యవు; స్వయంసహాయము జేసికొనువారికే అవి లాభమును గలిగించును; కాబట్టి అవి మనుజులను దరిద్రుల నెన్నటికిని చేయజాలవు. ఈకారణములచేత ధర్మగ్రంథాలయములు జనసామాన్యము నభివృద్ధికిదెచ్చు పరమోత్కృష్ట సాధనములుగ నేను పరిగణించుచున్నాను. ఆసక్తిగలవారికెల్ల గ్రంథములలో నిమిడియున్న యమూల్యరత్నములను గ్రంథభాండాగారములే యొసంగగలవు. గ్రంథపఠన కభిరుచిగలవారిబుద్ధి ఇతర నీచ రుచులయందు ప్రవేశించుట కిష్టపడదు. ఇదిగాక జక్కని నవలల జదువుటచేత బీదలకు విశ్రాంతికుదిరి వారి దుర్భరజీవితములకు హాయి గలుగునని నమ్ముచున్నాను. ఇట్టివియేయగు ననేక కారణములచేత, ఇతరధర్మము లనేకములకంటె ధర్మ పుస్తక భాండాగారములు ప్రజాసౌఖ్యమునకును అభివృద్ధికిని ముఖ్యసాధనము లగుటంజేసి, నేను వానిని స్థాపించుచున్నాను.”

1891 సంవత్సరమునందు ‘పీటరుహెడు’ గ్రంథ భాండాగారశాలను తెరచుసమయమున కార్నీజీ గ్రంథ భాండాగారములను గురించిన తన ప్రథమ ఉపన్యాసము నిచ్చియుండెను. సంవత్సరమునకు 25 నవరసులు ధర్మముచేయ దలచినవారున్నయెడల చిన్నగ్రామమునకు దగిన గ్రంథభాండాగారము నేర్పరచుటకు వీలుగలదని యప్పట్టున కార్నీజీ నుడివియున్నాడు. ఇంకొక 5 నవరసులు వెచ్చించినయెడల విద్యార్థులకు దగిన పుస్తకములను చేరుచుట కవకాశము గలదనెను.

గ్రంథములు భాండాగారమునకు జేర్చవచ్చునని. ఒక బడిపిల్లలు జదివిన గ్రంథములు మరియొక బడికి బంపుట కును, సంచార కార్యదర్శుల నేర్పరచి మంచి గ్రంథము లను జదువుటకు దగిన ఏర్పాట్లుచేయుటకును బూనవలె ను. 'లగ్గాను' పట్టణములోనున్న భాండాగారములో అన్నియు సద్గ్రంధములే గలవనియు, ఆజిల్లాలో నున్న మూడుపాఠశాలలలో నన్యోన్యసహాయమును బొందుచు పరస్పరము పుస్తకముల నెరువుదీసికొనుచున్నారనియు, స్వల్పవ్యయముతో నంత యెక్కువలాభమును పొందుచున్న యితర మార్గములను తాను జూడలేదనియు కార్నీజీ నుడివెను.

"తనకుండుకున్న విశేషధనములో స్వల్పభాగ మునుమాత్రము వెచ్చించిన లోకమున కెంతో ఉపకార ము చేయగలుగుదునను సంగతిని ధనికులైనవారు గుర్తెఱిగి యుండవలసియున్నది. నేను 'ఐశ్వర్యసువార్త' ను గురించి వ్రాసిన వ్యాసములో విశేష ధనముండుట ధర్మకృత్యము వహించుటకేయని వ్రాసి యుంటిని. ధనికు లాసంగతి గమనింపవలెను. 5 గాని 10 గాని 25 గాని నవరసులు మాత్రము గ్రంథభాండాగారములలో వినియోగించిన అందువలన నూరురెట్లో లేక వేయిరెట్లో ఫలప్రాప్తి గలుగుననుసంగతి అనుభవమువల్ల తెలియన గును. గ్రంథభాండాగారములకు ధనమిచ్చు ధనికులకంటె యట్టి భాండాగారములవల్ల లాభమునుపొందినవారు స్వయముగ దాని యభివృద్ధిని కనుగొనుట కెక్కువ అవకాశము గలదు. ఏమహానుభావుడు తన ధన మునేగాక తన శక్తినికూడ ధార్మికవిషయము లందు వినియోగించునో అతడు మాత్రము నిజమయిన దేశభక్తుడు' ధనసహాయము జేసినంతమాత్రముచేత వానివిధి సంపూర్ణముగ నెరవేరజాల డు. ధనమిచ్చుటకంటె శ్రద్ధవహించి కొనసాగించుటలో విశేషము గలదు."

ఈప్రకారము కార్నీజీ ముత్యములవంటి మాటల తో హితోపదేశము చేసియున్నాడు. అందు ప్రతిమాట కును విలువగలదు. 'మనకుగల లోకానుభవమువలన, చే [illegible] పనియనియు సంయముగ చేయుట కష్టమైన పనియనియు దెలియుచున్నది. కార్నీజీ వట్టిమాటలవా డెన్నటికిని గాడు. క్రియాశూరు డు. నిజమైన లోకబాంధవుడు. తాను నిర్ధారణజేసిన పద్ధతిప్రకారము తనయొక్క ధనము నెటుల ధర్మపుస్తక భాండాగారములకు వినియోగించెనో ఆమహనీయునియొక్క దిగువ ధర్మములపట్టికను పరిశీలింపుడు.

(1) 1902 సంవత్సరమున 'కార్నీజీ యిన్‌స్టిట్యూటు' అనుదానిని వాషింగ్టను పట్టణమునందు స్థాపించి దానికి 44 లక్షల నవరసుల నిచ్చియుండెను. ఈధర్మమువల్ల మానవకోటికి మిక్కిలి యుపయోగకరమయిన శాస్త్రచర్చజేయుటకు పరిశోధనకు నవకాశము గలిగినది.

(2) ఉపాధ్యాయుల బోధనాభివృద్ధికి కార్నీజీ స్థాపితము.—1905 సంవత్సరములో ఉపాధ్యాయులకు పించను వసతికిని వారి వితంతువుల మనోవర్తికిని ఉత్తర అమెరికాఖండములో 30 లక్షల నవరసుల నిచ్చియుండెను.

(3) కార్నీజీ ధీరులనిధి.—ప్రాణరక్షణ గావించినవారికి అప్రయత్నములో నాపదజెందినవారికిని, నష్టపడినవారి వారసులకును, అనివార్యమైన బాధజెందువారికిని సహాయముగ బహుమానములిచ్చుటకు ఈనిధి 1904 సంవత్సరములో 10 లక్షల నవరసులతో స్థాపింపబడినది. ఇది సంయుక్తరాష్ట్రములకు మాత్రము చేయబడిన ధర్మము.

(4) ఈ ప్రకారము ఆంగ్లేయరాజ్యమునకు 1908 సంవత్సరములో 2 లక్షలన్నర నవరసులను, ఫ్రాంసుకు 1909 సంవత్సరములో 2 లక్షల నవరసులును, రాక్షసకృత్యములకాలవాలమగు జర్మనీకి 1910 సంవత్సరములో 24 లక్షల నవరసులును ధీరులనిధికై యిచ్చియుండెను.

(5) కార్నీజీ సంధినిధికి 1910 సంవత్సరములో 20 లక్షల నవరసుల నిచ్చెను.

(6) కార్నీజీ కార్పొరేషనుకు 1911 సంవత్సరములో 50 లక్షల నవరసులను ప్రకృతిశాస్త్రవిద్యకును భాండాగారాభివృద్ధికిని సంయుక్తరాష్ట్రములవారికై యిచ్చియుండెను.

ఈ విధముగ చేయబడిన కార్నిజీయొక్క వైధర్మముల మొత్తము మన రూపాయిలలో 30 కోట్ల 52 లక్షల 50 వేల రూపాయలు కాగలదు. ఈమొత్తమును తలంచిన యే ఆంధ్రునిగుండె ఝల్లుమనకుండును? కార్నిజీయొక్క ఐశ్వర్యమువార్త మన దేశములో నెల్లరు చదువవలెను. హిందువులలో "అపుత్రస్య గతిర్నాస్తి" యని నమ్మకము గలదు. తాను ధనమెద్విధముగా సంపాదించినను కొడుక నేవాడున్నాడా దానికి కర్తయని చూచుచుండుట హిందువుని స్వభావము. అట్టివాని కర్ణములకు కార్నిజీ బోధ బాధకరముగా నుండవచ్చును. కాని ఆయన దారపుత్రాదులకు తగినంతమాత్రమిచ్చి శేషించినది ధర్మమునకు వినియోగించవలె ననుచున్నాడు. ఆంగ్లేయ పత్రికాధిపతులలో సుప్రసిద్ధుడైనట్టి కీర్తిశేషుడయిన స్టెడు కార్నిజీకినిచ్చిన సలహాలను, కార్నిజీ స్వయముగా వ్రాసిన యనేకవిషయములను మన యాంధ్రయువకులు ముఖ్యముగా జదువవలెనని బరోడా పత్రికాధిపతుల యభిప్రాయమై యున్నది.

అమెరికాలోని గ్రంథభాండాగారములకు కార్నిజీ 1913 సంవత్సరమునందు చేసిన ధర్మములయొక్క మొత్తము 4 లక్షల అరువదివేల నవరసులు. ఇతరు లిందునిమిత్తమిచ్చినది 4 లక్షల నవరసులు ఇదిగాక లక్ష 68 వేల 655 గ్రంథములును, గ్రంథభాండాగారముల నిమిత్తము 12 స్థలములును, 10 భవనములును ఇంక చిల్లర ధర్మము లనేకములును చేయబడినవి. 1913 సంవత్సరాంతమునకు ఆంద్రూ కార్నిజీయొక్క ధర్మముల మొత్తము 18 కోట్ల 24 లక్షల రూపాయిలై యుండెను.

పెద్దిభొట్ల వీరయ్య, బి.ఏ., బి.యల్.

---

# పుస్తక భాండాగారములు

## వాని నభివృద్ధి జేయవలసిన పద్ధతులు.

### మన విద్యయొక్క స్థితి.

మనదేశమునందు జనులలో ననేకులు విద్యాగంధము లేనివారు. విద్యతో నంతగా నవసరములేదని తలంపబడు స్త్రీలమాటయటుండనిచ్చి, పురుషులలో సహితము రాజకీయోద్యోగములం బ్రవేశింప నెంచువారును, తమ జీవనోపాధికి విద్య యత్యంతయవసరమని తలచెడి కొలదిమందియును, మాత్రమే తమబిడ్డలకు విద్య నేర్పించుచున్నారు. కావున దేశమునందు బహుసంఖ్యాకులు విద్యావిహీనులేగాక నిరక్షరకుక్షులు నై యున్నారు.

### మన దేశముయొక్క స్థితి.

దేశమునందు జ్ఞానము వ్యాప్తమై జనులు మాఢ్యమును బోనడుపవలయునన్న చిన్నపిల్లలనిమిత్తమై పాఠశాలలును, కర్మకారులు వ్యవసాయదారులు మొదలగు వారినిమిత్తమై రాత్రిపాఠశాలలను పెట్టవలెను, ఇదివరకే కొంత చదువ నేర్చినవారికొఱకై యప్పుడప్పుడు యుపన్యాసముల నిప్పించుటకై ప్రయత్నములుగూడ జరుగవలసియున్నవి. తానే దేశమునందు జన్మించినదియు, తన దేశముయొక్క నైసర్గికస్థితి, శీతోష్ణాదిమార్పులు, పాడిపంటలకును వ్యాపారమునకును గల సౌకర్యములు, జనులు, వారియాచారవ్యవహారములు మున్నగాగలయంశములను తెలిసికొని యానందించలేనంతటి దౌర్భాగ్యస్థితివంటిది మానవునకు మఱియొకటి యుండబోదు. ఏదేశమైనను అట్టి బలపరాక్రమశీలురగు నాగరికాగ్రేసరులగు జాతులు గలిగినదైనను, తన పూర్వపు ఔన్నత్యమును మఱచి తన పూర్వపురుషుల సాధుచరితంబులనుపఠింపక తన్మూలకముగ ధైర్యసాహసములకు గోల్పోవుటకిచ్చగింపదు. మన ప్రస్తుతవిద్యా విహీనావస్థకు కారణము మన పూర్వచారిత్రమును మఱచిపోవుటయేయని వేఱుగ చెప్పనేల!

## జరుగవలసిన పని.

జనులలో ననేకులు తమ గ్రామసరిహద్దులను దాటనివారును, తమదేశ యితిహాసము నేమాత్రమును తెలియనివారును, తమచుట్టుప్రక్కలనుండు నన్యదేశములలో నెట్టి యద్భుతకార్యములు జరుగుచుండునదియు తెలిసికొనుటకయినను వీలులేనంతటి యజ్ఞానావస్థలో నున్నవారును గలరు. అట్టిజనుల యజ్ఞానమునుబోగొట్టి వారికి ప్రపంచజ్ఞానమొసంగుటకు తగినప్రయత్నములు జరుగవలసియున్నవి. విద్యనభ్యసించుటకు గ్రంథపఠన మెటుల సులభసాధనమో అటులనే గ్రంథవ్యాపనమును, గ్రంథరచనమును జ్ఞానప్రచారమునకు అత్యంత పరమసాధనములై యున్నవి. నాగరికదేశములలో నెల్ల యీగ్రంథవ్యాపనము పుస్తకభాండాగారములమూలమున అతికౌశలముతో నెరవేర్పబడుచున్నది.

## మనము జదువవలసిన గ్రంథములయొక్క నిర్ణయము.

ఈకాలమున గ్రంథము లనేకవిషయములంగూర్చి వ్రాయబడుచుండుటచేతను, మానవుని యార్థికావస్థ యెటుల సామాన్యమో అటులనే జీవితకాలమును స్వల్పమగుటంజేసి, బుద్ధిమంతుడగువాడు తాను చేతంబూనుటకు పూర్వమే యేయేగ్రంథములను దాను జదువవలసినదియు స్థిరపరుచుకొనవలసియున్నది. ఈవిషయమును నిర్ధారణచేయుటకు ప్రతివానికిని సుసాధ్యముకాదు. కావున జనులకు సులభముగా గ్రంథములనన్నిటిని అందజేసి, వారు యేయేగ్రంథములను వారివారి అభిజ్ఞతానుసారముగ పఠింపవలసియుండునో, నావిషయమై సలహానిచ్చుటకును గ్రంథభాండాగారములు అత్యంత ప్రయోజనీయములయియున్నవి.

## మహాభాండాగారములు.

మానవసంఘముయొక్క యభ్యున్నతికై తోడ్పడెడి జ్ఞానప్రతిపాదకములగుగ్రంథరాజములనెల్ల పుస్తకభాండాగారముల నుంచదగినవియే. అట్టిపనిని చక్కగా నిర్వహింపవలయునన్న జనులందరును యేకీభవించి దేశమునందలి ప్రధానపట్టణములలో నట్టి మహాభాండాగారములను నెలకొల్పవలసియున్నది. ఈ వ్యాసము ఆంధ్రదేశమునుగూర్చియే వ్రాయబడుచున్నదిగాన, అట్టి మహాభాండాగారము ఉత్తరసర్కారులకెల్ల మధ్యస్థానమనందగుబెజవాడయందో గుంటూరునందోనొకటియు, దత్తమండలములు నెల్లూరు చిత్తూరుజిల్లాలవారికి తదితరద్రవిడదేశవాసులగు నాంధ్రులయుపయోగార్థమై తిరుపతియందో కాళహస్తియందో మఱియొకటియును, స్థాపింపబడినచాలును. ఈమహాభాండాగారముల (Central Libraries) యందు అమూల్యగ్రంథములును, సంస్కృత, ఆంధ్ర, ఆంగ్లభాషాగ్రంథముల నుంచుటయేగాక దొరతనమువారిచే నప్పుడప్పుడు ప్రచురింపబడు పరిపాలనాసంబంధములగు వార్షికవృత్తాంతములును, ప్రచురములు గూడ నుంచుటకు ప్రయత్నములు జరుపవలయును.

## జిల్లా భాండాగారములు.

ఈ మహాభాండాగారములుగాక ప్రతిజిల్లాపట్టణమునందును నొక పుస్తకభాండాగారము నెలకొల్పబడి, అట్టి భాండాగారప్రతినిధులతోగూడిన మఱియొక కార్యనిర్వాహకసంఘమువారి యధీనమున దేశమునందలి పుస్తకభాండాగారములన్నియు నుండవలయును. ఆసంఘమువారు యేసమయమున కాసమయమున యేయే నూతనపుస్తకములు ప్రచురింపబడుచున్నవో తెలిసికొని యీపుస్తకములను తమ మహాభాండాగారమున నుంచుటయేగాక జిల్లాభాండాగారములవారికెల్ల పంపి వారివారి శక్తినుసరించి కొనునట్లును, వారొకవేళ కొనలేకపోయిన వారికి యెరువుగానిచ్చుటకును యేర్పాటుచేయవలయును. ఎట్లుండినను జిల్లాసంఘమువారు సంపుట మొక్కటికి పదిరూపాయిలకంటె యెక్కువవెలనిచ్చి కొనకుండునట్లును నియమమేర్పరచి అంతకన్న నెక్కువ వెలగల గ్రంథములను మహాభాండాగారములలో నుంచుచు తమయధీనములోనున్న జిల్లాభాండాగారముల కరువుగా నిచ్చుచుండిన బాగు.

## గ్రామ భాండాగారములు.

ఇదేతీరున ప్రతిజిల్లాభాండాగారాధికులు తమజిల్లాలోని ప్రతిగ్రామమందుగాని, లేక చిన్నవయినచో సమీపముననుండు నాలుగైదుగ్రామముల కొక్కభాండా

గారముచొప్పునగాని, స్థాపించి ప్రతిభాండాగార నిర్వాహకసంఘమువారి ప్రతినిధిని తమ కార్యనిర్వాహకసంఘమున చేర్చుకొనవలయును. గ్రామభాండాగారములలో నింగ్లీషుగ్రంథము లుండనక్కరలేదు. ఏగ్రామభాండాగారముగాని రు 1000 లకంటె యెక్కువ విలువగల గ్రంథముల నుంచుకొన యగత్యములేదు. గ్రామభాండాగారముయొక్క సభ్యులలో నేరికైన తమ భాండాగారమున లభించని ఆంధ్ర, ఆంగ్లగ్రంథములుండిన వాటిని జిల్లాభాండాగారమునుండి అరువుగా తెప్పించుకొనుటకు తగినయేర్పాటు లుండవలయును. అదేతీరున జిల్లాభాండాగారముల సభ్యులును మహాభాండాగారములనుండి తమకులభింపని పుస్తకములను తెచ్చుకొనుచుండవచ్చును.

## భాండాగారముల పరస్పరసంబంధము.

ఇక నధమపక్షము రు 100 లు విలువగల 250 పుస్తకములును గలిగిన ప్రతి గ్రామభాండాగారమును, జిల్లాభాండాగారముక్రింద నుంచుకొనవలెను. రు 2500 విలువగలిగి 2000 గ్రంథములుగల భాండాగారములను మహాభాండాగారముక్రిందను తెచ్చుకొనవలెను. ఇట్లన్ని భాండాగారములవారును కలిసి అన్యోన్యమైత్రతతో పని చేసిన మనదేశమున అచిరకాలముననే జ్ఞానమువిలసిల్లి మనలనావరించిన యంధకారము పటాపంచలై పోవుననుట కేమాత్రమును సందియములేదు.

## భాండాగారముల నిబంధనలు.

భాండాగారములలో వచ్చి చదువువారందరును ఉచితముగనే చదువనియ్యవలయును. కాని పుస్తకములను గృహమునకు తీసికొనిపోవుటకు సభ్యులకుమాత్రమే యధికారముండవలయును. గ్రామభాండాగారసభ్యులకు నెలకు రెండణాలకన్నను, జిల్లాభాండాగారములవారికి నాలుగణాలకన్నను మహాభాండాగారమందలి సభికులకు నెలకు యెనిమిదణాలకన్నను తక్కువకానిచందాను క్రమముగా సభ్యులవల్ల వసూలుచేయబడి, అందులో సగముకంటె మించనిమొత్తము వార్తాపత్రికలకై వినియోగింపబడిన, జనులను భాండాగారముల కాకర్షించుట కిదియొక సాధనమగును.

## సభలు.

ప్రతిసంవత్సరమునను గ్రంథభాండాగారప్రతినిధులందరునుగూడి గ్రంథభాండాగారముల స్థితిగతులనుగూర్చి ముచ్చటించుట యత్యంతావశ్యకము. ఈ సభ కేవలము, కార్యనిర్వాహకసభా ప్రతినిధులసభగానుండవలయునుగాని పాఠకప్రపంచమున కీసభలో విశేషముపనియుండదు. గ్రంథభాండాగార నిర్వాహకులు అప్పుడప్పుడు మంచివిషయములనుగూర్చి పండితులచే నుపన్యాసములనిప్పించుచు జనులలో జ్ఞానపిపాస గలిగించవలయును. పలువురుగూడి నేదైన నొకగ్రంథమును చదువుటకు పాఠకమండలులను గూడ నేర్పరుపవచ్చును. ఈభాండాగారములయొక్క యభివృద్ధినిసూచించు పత్రికయు నుండిన బాగే.

## ఒకరుప్రారంభించినపనినే అందఱును జేయుట.

మనదేశమున ముఖ్యముగా తెలుగుదేశమున నొకరు ప్రారంభించినపనికి ఇతరులుతోడ్పడుటకుమారు మఱియొకరును ఆదేపనిని నిర్వహింపబూనుకొని ధనవ్యయమును, కాలహరణమును జేయుచున్నారు. సంఘీభావమునగల శక్తిని గ్రంథపూర్వకముగ చదివి సంతసించుటకును, యితరులలోనుండుటను చూచి సంతసించుటకును, మనలో యాశక్తిలేదని విలపించుటకునుమాత్రమే నేర్చుకొంటిమిగాని మనలాభమును కోల్పోయి, స్వగౌరవమును పాటించక, ఇతరులతోకలసి పనిచేయుట కింకను మనము నేర్చుకొనలేదు. రెండు మూడు సంవత్సరములకు పూర్వ మొక్క నర్సాపురమునతాలూకా అభివృద్ధిసంఘమువారేచేయుచున్నపని ఇపు డెందరుచేయుచున్నారో చూడుడు! విజ్ఞానచంద్రికా మండలివంటి సంఘములు మనదేశమున నెన్నిప్రబలినవికావు. ఒక రాజమహేంద్రవరమువనే ఇంకను పుస్తకభాండాగారములు స్థాపింపబడుటలేదా? కమ్మరవీధికి సూదుల నమ్మబోయిన ప్రయోజనమేమి?

## మన స్థితిగతులు.

మనదేశ మతివిస్తారమైనది. మన కార్యనిర్వాహణశక్తియో అతిసంకుచితమైనది. మన దాతృత్వమో అతిస్వల్పము. మనవ్యయమన్ననో విచ్చలవిడి. దేశకార్య

పురంధరులా? అరుదు. స్వకార్యసాధకులు మెండు! ఇట్టి స్థితిలో మనదేశము నుద్ధరించుటకు బుద్ధిమంతులగువారు కచోఁగూడినపుడు కేవలము మాటలతో తృప్తినొందక కార్యాచరణమునకై తగినపద్ధతుల నవలంభించవలసియుండును. పరమేశ్వరుడు మనప్రయత్నములకుతోడ్పడి మన దేశమును తేజోవంతముగ జేయునుగాక! ఓం తత్సత్.

ఇప్పగుంట సుబ్బకృష్ణయ్య.

---

# జన్మకథ.

శ్రీయుత రవీంద్రనాధ ఠాకూరుగారిచే వ్రాయబడినదానినుండి అత్తిలి సూర్యనారాయణ గారిచే భాషాంతరీకరింప బడినది.

'ఏకడలనుండి వచ్చితి నెఱుఁగఁ జెప్ప
వమ్మ! యెచ్చోటఁగన్గొంటి వమ్మ! నన్ను?"
ననుచుఁదల్లిని బసిపాప యడుగఁ జొచ్చె;
నంతశిశువును దనయక్కునందుఁ జేర్చి
యింతకన్నీరు విడుచుచు నింతనగుచు,
నీవిధంబున నుత్తర మిచ్చె, మాత:—
నాదుమురిపెంపుబిడ్డ! వినంగదమ్మ!
యల్ల నాబాల్యమందాట లాడునప్పు
డూయెలలోన నాతోడ నుంటివమ్మ!
మట్టిశివుఁజేయ నెద నమకట్టినపుడు,
చేయుచును జెఱుపుచును వచ్చితిని నిన్ను;
నాదు గృహదైవతముతోడ నీదుమూర్తి
వెలయు చుండెను సింగపుఁ బీఠియందు;
పూజజేసితి నిన్నుఁదత్పూజనమున
బిడ్డ! నాముద్దుపట్టి! సత్ప్రియములైన
మధురవాంఛలనెల్లఁ, బ్రేమములనెల్ల,
రాగములనెల్ల, మాయంబ బ్రతుకునందు,
మఱియు నమ్మమ్మ జీవితమహితవార్ధి
జీవమందుచు నుంటివి చిన్నయపుడు.
మన గృహంబును బాలించు మానవతికి
నొడిని యుగయుగంబులు డాగియుండి యెపుడు
నూర్జితానందమును గూర్చుచుంటికదవె
బాల్యమున నాదుహృదయంబు ప్రసవమట్లు
క్రమవికాసము నందెడి కాలమందు
దానిచుట్టును గమ్మని తావివోచు
వెలయుచుంటివి గాదె! నీలలితమైన
మార్దవంబు నదెట్టులో మచ్ఛరీర
మునను జవ్వనమున్నిల్పఁ బనుచు చుందు,
బిడ్డ! ముద్దులపట్టి! యీవిశ్వమందుఁ
బరిఢవిల్లువాని కనుంగుపట్టి వీవు!
శాశ్వతా పరివర్తిత చారుమూర్తి
వఖిలవిశ్వంబు నుదయించునపు డ యుంటి
వైహిక స్వప్నజీవనమందు నుండి
సత్పదార్థమురీతి నాస్వాంత మందుఁ
గూడి యాడంగ నోబిడ్డ! కోర్కెలూర
గురుతరానంద వార్ధులఁగూడి యిటకుఁ
దేఁజడితివీవు; నీమోముఁ జేఱిచూడఁ
దెలియరాదయ్యె నీమాయ తేటపడఁగ;
నెల్లవానికిఁ జెందుచు నెసఁగునీవు
నాపదార్థంబ వెట్లాదు? నాతనువునె
నీతనువునందుఁ జుంబింతు; నీ వొకర్తు
బిడ్డవై యుంట, నాముద్దుబిడ్డ! నవ్వు
చుండి యీభూమికరుదెంచి యుంటి వీవు.
నిన్నుఁగోల్పోవుదునెయంచు, నేభయాన
నదిమిపట్టుదు బిగ్గ నా యక్కునందు;
నిన్ను నుక్షణ మేఁ గననేరకున్నఁ
దద్దయు న్విలపించెదఁ దనువు మఱచి;
నాసుకోమల హస్తంబునన్ గనంగ
నెట్టిమాయ విశ్వధనంబునెల్ల నొకట
నెట్టు బో నొగ్గిపట్టనో యెఱుఁగ; బిడ్డ!

# సారస్వత జీవనము.

ఉ. భూషలు గావు మర్త్యులకు ♦ భూరిమయాంగద తారహారముల్
భూషిత కేశపాశ మృదు ♦ పుష్పసుగంధజలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని ♦ భూషితుఁ జేయు పవిత్రవాణివా
గ్భూషణమే సుభూషణము ♦ భూషణముల్ నశియించు నన్నియున్. (లక్ష్మణకవి)

## సారస్వత జీవన మన నేమి?

సారస్వత జీవన మన నేమో యాంగ్లేయభాషాపరిచితులు కానివారికి బోధపడక యెద్దిరెూయొక క్రొత్తవిశేషముగాఁ బొడకట్టవచ్చును. గ్రంథరూపమున నున్న వాఙ్మయమునకే సారస్వతమను నామము వర్తించుచున్నది. అట్టిసారస్వతనిర్మాణము నే జీవనాధారముగాఁ జేసికొని లోకయాత్ర గడపునట్టి వృత్తికే సారస్వత జీవనమని నామకరణముఁ జేయుచున్నాఁడను. దీని నే గ్రంథములు వ్రాసి తన్మూలమున ధనమార్జించుటయే వృత్తిగాఁ గలిగి యుండుట యని తేటమాటలతోఁ జెప్పఁదగును. ఇట్టి సారస్వత జీవనము నాగరికులైన విదేశీయులలో నెక్కువగాఁ గాన్పించుచున్నను మనయాంధ్రులలో నరుదై యున్నది. ఈవిషయము మహత్తరమైన దగుటచేతను, యిదియొకవృత్తిగా మన దేశమున నిదివఱకుఁ బరిగణింపఁబడ కుండుటచేతను, ఆంధ్రసారస్వతమునుగూర్చి మాత్రమే వ్రాయుదును.

## ప్రాచీనకాలమున సారస్వతజీవనము.

"సారస్వత జీవనము పూర్వముండెనా? ఉన్నచో నేరీతి నుండెను? ఇప్పుడేరీతినున్నది? దీని నవలంబించుటవలనఁ గలుగు లాభనష్టము లెట్టివి? దీని నభివృద్ధిపరచు టెట్లు?" అను నీ మొదలగు ప్రశ్నంబులకుఁ దగిన ప్రత్యుత్తరంబులు సంగ్రహముగానైనఁ జర్చించి చెప్పవలసియుండును. సారస్వతజీవన మొకరీతిగాఁ బూర్వకాలమున మన దేశమునను ండెనుగాని స్వచ్ఛమైన రీతినుండక యది యొక ప్రత్యేక మొకశాఖవారిలో నే యత్యల్ప సంఖ్యాకులులచే నలంకరించుకొనఁబడి దేశకాల స్థితులనుబట్టి యెదుగుబొదుగు లేక సంస్కారరహితమైయొప్పుచుండెను.

పూర్వకాలమున రాజ్యపరిపాలనముచేసిన మహారాజులు, మండలాధిపతులు, సేనానాయకులు, మంత్రులు, ధనికులు మొదలగువారు కొందఱు భాషాభిమానులును కీర్తికాములునై కవులనాదరించి భూవసతులను, కొన్నివేళల నగ్రహారములను నొసంగియు, ధన కనకవస్తు వాహనాదులచే సంతరింపఁజేసియు బహువిధంబుల సత్కరించుచుండుటచేత ననేకులు వారలకు కృతుల నంకితములఁ గావించి కుటుంబపోషణముఁ జేసికొనుచుఁ వచ్చిరిగాని యది యంతయుత్తమ మార్గముగాఁ గనుపట్టకుండెను. అంతియగాక మహాసముద్రములో నొక జలబిందువువలె మహాసంఘములో వారిసంఖ్య యత్యల్పమై యుండెను. ఆయత్యల్పసంఖ్యగలవారి మార్గముకూడ నిఱుపేదలై, భక్తాగ్రగణ్యులయిన కవివరేణ్యులచే నీచమైనదిగాఁ గర్హింపఁబడుచునే వచ్చినదికాని యుత్తమమార్గమని సూచింపఁబడలేదు.

## బమ్మెర పోతన.

పూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా ప్రపంచ రచనా కుతూహలుండును, సహజ పాండిత్యుండును, కవివరుండును, భక్తాగ్రేసరుండునగు బమ్మెర పోతన నిఱుపేదయయ్యును నరకృతి నిషేధించి, తనభాగవతమును శ్రీహరి కంకితము చేసినట్టుగ నేతత్కృతిలోని

"ఉ. ఇమ్మనుజేశ్వరాధముల
కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని
సొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెట వ్రేటులంబడక
సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పెనీ

బమ్మెర పోతరాజు కండు
భాగవతంబు జగద్ధితంబుగన్."

అనుపద్యమువలన విస్పష్టమగుచున్నది.

మఱియు సంకుసాల నృసింహకవియు తన కవిక
ర్ణరసాయనమున

"సీ. ఆందోళికలయందు నంతరచరులైన
శవకృతాకృతులఁ బిశాచజనుల
వాలవీజనములఁ గ్రాలుచునీఁగకు
గాలునిఖరవర్తు లాండసముల
వేత్రపరంపరా విలకంటకాకృతిఁ
జేరఁబోరానిఖర్జూరతరుల
పరకరాలంబులై ప్రార్థింపఁగ్రైకోక
వాయెత్తమందు జీవచ్ఛవముల
శంఖనాగస్వరాదిక శ్రవణసమద
విస్ఫుటచ్ఛత్ర విస్ఫారిత స్ఫుటాక
దిష్టవిమవైద్య వశవర్తి దుష్టఘణుల
ప్రభుదురాత్ముల నెవ్వాఁడు ప్రస్తుతించు."
గీ. నరగుణాంకిత మయ్యెనే సరసకృతియు
దూష్యమగు కునకోద్వృత్తదుగ్ధమట్లు
హరిగుణాంకితమయ్యెనే సరసకృతియు
హారసూత్రంబుగలివ్వాదయంగమంబు."

అనివ్రాసిచ్చి గర్హించి యున్నాఁడు. బమ్మెర పోతరాజు కర్ణాటులకుఁ గృతియొసంగి ధనము సంపాదింపవలసినదని శ్రీనాథునిచేఁ బ్రేరేపింపఁ బడినపుడు భారతి కన్నీరు మున్నీరుగా నేడ్చుచుఁ బ్రత్యక్షమైనట్లుగాఁ గాన్పించిన నతఁడు

"ఉ. కాటుకకంటినీరు చను
కట్టుపయింబడ నేలయేడ్చెదో
కైటభదైత్యమర్దనుని
గాదిలికోడల! యోమదంబ! యో
హాటకగర్భురాణి! నిను
నాకటికిం గొనిపోయి, యల్ల క
ర్ణాట కిరాట కీచకుల
[illegible]గానీ!"

అనిపలికి యూ మెనూరార్చి నట్లుగాఁ జెప్పెదరు.

ఒకప్పుడు బమ్మెర పోతరాజు పొలముదున్నుకొనుచు నలసిగట్టునఁ గూర్చుండియుండఁగా నతని బావమఱదియనిచెప్పఁబడెడి పై శ్రీనాథకవి "హాలికులు సుఖముగా నున్నారా"యని పరిహాసముజేయఁగా నమ్మహానీయుఁడు

"ఉ. బాలరసాలసాలనవ
పల్లవకోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపు
కూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహ
నాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికులైననేమి నిజ
దారసుతోదర పోషణార్థమై."

అని యతఁడు మాఱుమాటాడకుండునట్లుగాఁ బ్రత్యుత్తరం బిచ్చెననికూడ చెప్పెదరు. ఇట్టి దృష్టాంతములను మఱికొన్నిటి నాంధ్రసారస్వతమునుండి యెత్తిచూపవచ్చునుగాని గ్రంథవిస్తర భీతివలన వానిని విరమించుచున్నాను.

## ప్రాచీనకాలమున సారస్వత జీవనము వృద్ధి బొందకుండుటకు గారణము.

ఈకాలమునందువలె నాకాలమున నచ్చుకూటములు వెలసి, గ్రంథములు ముద్రింపబడి మూల్యమునకు విక్రయింపఁబడుట లేనికారణమున, నాకాలమున స్వతంత్రమైన సారస్వత జీవనమున కవకాశము లేకయుండెను. ఏతన్మూలమున నాంధ్రసారస్వత మీకాలమునందువలె శాఖోపశాఖలతో వర్ధిల్లుటకు మార్గము లేక యున్నతావున నేయుండి యాకాలఁపుం బ్రభువర్యుల దయాధర్మభిక్షములకులోనై మనవలసిన దయ్యెను. కాఁబట్టి యాకాలమునాటి సారస్వత జీవనము నొక జీవనముగాఁ బరిగణింప వలసిన పనిలేదు.

## పూర్వకాలమునందు కవులు.

పూర్వమునఁ గవులయెడఁ బ్రజలకు భక్తికన్న భయమెక్కువగ నుండెను. కవులుతిట్టిన శాపమై తగులు

నన్న వెఱ్ఱిభయ మాకాలమున నుంటచేఁ గొందఱుకవులు భూషించియు, దూషించియుఁగూడ ధనమార్జించుచుండిరి. ఒకని గుఱించిన కీర్తిగాని యపకీర్తిగాని వ్యాపింపఁజేయుటకు నీకాలమునందలి వార్తాపత్రికలవలె నాకాలమునందలి కవులు కారకులగుటచేత సాధారణముగా నెల్లవారును కవులకు భయపడుచు, శుభకార్యాదులలో కట్నములు కానుకలుగూడ చెల్లించువారుగ నుండిరి. ఎవ్వరు సన్మానింపరో వారిపైకత్తికట్టి, కలముచేఁబట్టి, చలముచేనొక దూషణపద్యమునుగాని గ్రంథమునుగాని వ్రాసి దేశదేశములఁజాటు దుష్కవులుకూడ నుంటచే గ్రంథకర్తపదము భయంకరమైనదై యపకీర్తిపాలయ్యెను. సామాన్యులలో "గ్రంథకర్త" యనఁగా చెడుగుచేయువాఁడని యపార్థమేర్పడినది. అతఁడు "గ్రంథసాంగుఁడు; మనవాఁడు గ్రంథకర్తయైనాఁడు" అనునవి చెడుపనులు చేయువారిని గూర్చిపలుకునట్టి వాక్యములుగానున్నవి.

## గీర్వాణభాషాపండితులు.

ఇట్లే గీర్వాణభాషాపండితులు కొందఱు సామాన్యజనుల దేశభాషల నధిక్షేపించుచు నౌచితి నెఱుంగక ఛాందసులై పామరులతో సంభాషించునపుడు నయితము సంస్కృత పదాడంబరమును జూపుచుంటచేత సామాన్యజనులకు వారిభాష యర్థముగాక యుండెను. అందువలన సామాన్యజనులా గీర్వాణపండితులను గర్వభూయిష్ఠులనుగాఁ దలంచుచుండిరి. ఏతత్కారణము వలన గీర్వాణశబ్దమున కపార్థమేర్పడినది. అతనికి గీర్వాణము బలిసిపోయినదనఁగా వానికి గర్వమతిశయించినదను నర్థము స్ఫురించుచున్నది. ఎంతటిసద్వస్తువైనను సద్వినియోగమునకుఁ దేక దుర్వినియోగ పఱచుచున్నయెడల దానియందు సహజ గౌరవముకూడ చెడుచుండుననుటకు పైవిషయములను తార్కాణముగఁ జూపవచ్చును. కాఁబట్టి గ్రంథకర్త శబ్దమునకట్టి యపార్థమేర్పడినప్పుడు సారస్వత జీవనమునకు సంఘములో గౌరవ మెట్లేర్పడఁగలదు?

## నవీనకాలమునందలి యభివృద్ధి.

కనుకనే మనదేశములో నింతకుఁబూర్వము గ్రంథరచన యొకవృత్తిగాఁ బరిగణింపఁబడుచుండలేదు. అదిసద్వృత్తులలో నొక్కటియనుమాట జనసామాన్యమునకుఁ దెలియకుండెను. ప్రస్తుతస్థితియొకింత పరికింతము. బ్రిటిషుప్రభుత్వము మనదేశమునకు లభించిననాటనుండి మనదేశములో ముద్రాయంత్రములు వెలసి ప్రాచీనాంధ్ర గ్రంథములనేకములు ముద్రింపఁబడి నాకవెలలకు వేనవేలు విక్రయింపఁ బడుచున్నవి. వార్తాపత్రికల మూలమునను యేయేటను ముద్రాయంత్రములనుండి వెలువడు గ్రంథములవలనను భాషాభివృద్ధి యగుచున్నది. స్వదేశోద్యమమువలన మనదేశమునకుఁ గలిగిన లాభము భాషోజ్జీవనమని ముఖ్యముగాఁ జెప్పఁదగును. సర్వకళాశాలాధికారులు దేశభాషల నుద్ధరింప నుదాసీనులై యున్నను దేశమున గ్రంథప్రచారమునకై యనేక సమాజములేర్పడి యేయేట బెక్కుగ్రంథములనచ్చొత్తించుచు దేశమున వెదఁజల్లుచున్నవి. ఆఙ్గ్లేయభాషావిశారదులైనవారు మాతృభాషపట్ల విముఖులుగాక యనేకులిప్పుడు మాతృభాషాభిజ్ఞులై యత్యంతోత్సాహముతో మాతృభాషాసేవకై గడంగుచున్నారు. పల్లెలలో సైతము గ్రంథభాండారములు వెలయుచున్నవి.

## మార్పు కాలము.

శాస్త్రగ్రంథములు, చరిత్రగ్రంథములు, నవలలు, నాటకములు, ముద్రాయంత్రములనుండి వెలువడుచు నొకరీతిగా నమ్ముడువోవు కాలమువచ్చినది. ఇదియొక మార్పుకాలము. ఈకాలస్థితినిజూచి యనేకులాకర్షింపఁబడి గ్రంథరచనకుఁ బూనుకొని దానినే జీవనాధారమగు వృత్తిగఁ జేసికొనవలయునని సాహసించి ముందుకువచ్చుచుండుటచే భాషాప్రపంచమున నొకగొప్పకలవరము జనించుచున్నది. దానిస్వరూపమిట్టిదని తెలిసికొనుట గ్రంథరచనకు దొరకొనఁబూనిన ప్రతిమనుష్యున కవశ్యకర్తవ్యమైయున్నది. గ్రంథకర్తలకు మాత్రమేకాదు. దేశక్షేమము నభిలషించి సారస్వతాభివృద్ధికై పాటుపడుచున్నట్టి ప్రతిదేశాభిమానికిని కలవరస్వరూపమును దెలిసికొనుట విధియైయున్నది. ఈకలవరమే నేఁడీవ్యాసమును వ్రాయుటకు నన్నుఁ బ్రేరేపించుచున్నది.

## ఈకాలమునందలికవులు.

వస్తుస్వరూపమును సరిగా గ్రహింప శక్తులుకాక దురాశాబద్ధులై యనేకులు సరియైన భాషాజ్ఞానముగాని

క్షు గాని, లోకానుభవము గాని, యోప్పు గాని లేక గ్రంథకర్తలయందు బాధ్యతలను గుర్తెఱుంగక దుస్సాహసమునకుఁగూడ నొడిగట్టి చేతగాని పనులకుఁ జేయిచాచి, తాము నష్టముఁ బొందుటయె కాక తాఁజెడ్డకోతి వనమెల్లఁ జెఱచినదన్నట్లు ప్రతిభాయుతులయిన గ్రంథకర్తల ప్రయత్నములకుఁ గూడ నాశనమును గల్పించి, దేశమునకుఁ గీడువాటిల్లురీతి వర్తింపసమకట్టుట శోచనీయము. మన దేశములో నెవ్వఁడేని సమర్థుఁడొకఁ డొక వ్యాపారమును జేసి, యావ్యాపారమునకై నానాకష్టములుపడి సమర్థతతో దానిని నిర్వహించి కొంచెము లాభము బొందుట తటస్థమైనతోడనే యనేకులదివఱకు మాంద్యులైయుండియు, మఱియొక వృత్తికి దొరకొనక వానిపై పోటీకి బోయి, యావ్యాపారమునే చేయనవలంబించి, తాము నష్టమును బొందుటయేగాక, లాభమునుబొందుచున్న మొదటివానికి నష్టముగలిగించి, చెఱచుచుండుట, మనము కన్నులారఁ జూచుచున్నారము. సారస్వత విషయమునఁ గూడ నిట్టిచందములే గానఁబడుచున్నవి. సారస్వత జీవనము కష్టసాధ్యము. మిక్కిలి పవిత్రవంతము. సుగుణాన్యులకు సులభసాధ్యము, దురాశాపాశబద్ధులకు దుస్సాధ్యము. నాల్గుపద్యము లల్లఁగల్గినవాఁడు కవియు నాల్గు పత్రములుగీకినవాఁడు గ్రంథకర్తయుఁ గాఁజాలడు. సత్కావ్యములను రచించువారు సత్కవులు. సత్కవులసంవృత్తమును సంకుసాల నృసింహకవి కవికర్ణరసాయనమున నిట్లభివర్ణించి యున్నాఁడు.

"చ. మననునఁగొన్న నెవ్వగలు
మాన్పి ఘటింతురకాండసమ్మదం
బనఘ కథాముఖంబున హి
తాహితబోధ మొనర్తు రింపుగా
గనుఁగొనుకంటె నద్భుతము
గా నెఱిగింతు రతీంద్రియార్థముల్
ఘనమతు లెల్లవారికి స
కారణబంధులుకారె సత్కవుల్."

ఇక్కాలమున నిట్టిసత్కవు లెక్కడనో గాని కానంబడరు. సత్కవులెట్టివారో సద్గ్రంథకర్తలుగూడ నట్టివారె యగుదురనుటకు సందియము లేదు. నిష్కళంకమైన యోచన, సత్యమందనురాగము, కీర్తిప్రదమైన స్వేచ్ఛ వీనితోఁగూడుకొన్నదైనయెడల సారస్వతజీవనము తక్కినవానికన్న శ్రేష్ఠమైనదనుటకు లవమాత్రము సందియము లేదు.

## గ్రంథకర్తలు.

తనంతగ తానొకపక్షమునకు మొగ్గ నూహించిన ప్పుడుతక్క గ్రంథకర్త యెన్నఁడును నొకమనుష్యునకుఁ గాని, యొకస్థలమునకుఁ గాని, యొకపక్షమునకుఁగాని వశుఁడు కాఁజాలఁడు. గ్రంథకర్తకు జనసామాన్యమైనను రాజాధిరాజైనను నొక్కటియె. గ్రంథకర్త యనేక ప్రజలను బరిపాలింప సమర్థతగలవాఁడు. అతనిశక్తి మహత్తరమైనది, అప్రతిమానమైనది. కనుక సారస్వతజీవనము తక్కినవానికన్న నధిక సంతోషకరము యినదిగా నే నూహించెదను. అయినను గొందఱు నాయభిప్రాయముతో నేకీభవింపకపోవచ్చును. అట్టివారు సారస్వతజీవనముగలవారిలోనే పెక్కండ్రుకలరని నేనెఱుంగుదును. అగ్నిమాంద్యముచే కష్టపడువారనఁగా మనోరథభగ్నులైన గ్రంథకర్తలు పెక్కండ్రుగలరు. ప్రచురణకర్తలకు ననేకసంవత్సరములవఱకు నొడంబడికలు వ్రాయువారు శృంఖలములలో నృత్యములు సేయువారిపగిది దుఃఖభాజనులగుచున్నారు. సారస్వతజీవనమువలనఁ గలుగవలసిన యానందము గలుగనేరదు. ప్రచురణకర్తలు తమ కృషికి నెంతప్రతిఫలము నొసంగుదురో యని యనుదినమును తానువ్రాసిన కాగితములను లెక్కపెట్టుకొనుచుండు గ్రంథకర్త యెన్నఁడును సుఖమనుభవింపఁజాలఁడు. జనప్రవాహ మెట్లీడ్చిన నట్లుపోవుచు, నేఁడిచ్చట, రేపు వేఱొక్కచోట, నెల్లుండి మఱొక్కచోట స్తుతిపాఠములంగనుచు, తబ్బిబ్బులగుచు, అప్పటి కానందమును బొందఁగోరు గ్రంథకర్త దేవతాప్రసాదమునకు దూరగుఁడై, తానెవ్వరితోఁ గలిసిమెలసి తిరుగఁదలంచెనో యట్టి గొప్పవారిచేతనే పరిత్యజింపఁబడి తుదకు కష్టకాలమునకు నసహాయుఁడై పరితప్తుఁడుగాక మానఁడు.

## శ్రీనాథుని యవసానదశ.

మహారాజుల చెలిమిఁజేసి, బంగరుతూగుటుయ్యెలలో నూగుచు, హంసితూలికాతల్పంబుల శయనించుచుఁ

జల్లకులలో నెక్కి యెల్లవేళల విహరించుచు, బమ్మెర పోతరాజు దారిద్ర్యమును బరిహసించిన కవిసార్వభౌముఁడు శ్రీనాథునివంటివాఁడు సయితము వార్ధక్యమునఁ గష్ట పరంపరలపాలయినవిషయము శ్రీనాథకవికృతములైన

"సీ. కవిరాజుకంఠంబుఁ గౌఁగలించెనుగదా
పురవీధి నెదురెండ పొగడదండ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెనుగదా
నగరివాకిటనుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసముంజేత
వియ్యమొందెనుగదా వెదురుగొడియ
కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు తినిపోయె తిలలుఁ బెసలు
బొడ్డుపల్లెను గొడ్డేలి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబులేనునూర్లు."

"సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయఁడిచ్చుఁ
గైలాసగిరిఁ బండె మైలారువిభుఁడేగ
దినవెచ్చమేరాజు దీర్పఁగలఁడు
రంభఁ గూడె తెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు
భాస్కరుండు మున్నె దేవునిపాలికరిగెఁ
గలియుగంబున నిఁక నుండఁ గష్టమనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గురనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి."

అను పద్యములలోఁ దెలుపఁబడియుండెను.

## "రాబర్టు బరన్సు."

ఇల్లే ప్రసిద్ధిఁగాంచిన "రాబర్టు బరన్సు" యను నాంగ్లేయకవి యౌవనకాలమున గొప్పవారిచే సన్మానింపఁబడుచు వారిచేఁ గావింపఁబడువిందులం గుడుచుచు నుండియు, తుదకవసానకాలమున తన్నావఱకు గౌరవించి శ్లాఘించుచుండెడి తనతోంటిమిత్రు లుపేక్షాపరులై, యొక్కరొక్కరే విడిచిపోవ "నైదుపౌను" లప్పియవలసినదని యొకప్రచురణకర్తను బ్రార్థింపవలసివచ్చినది. తన యౌవనమున దన్ను స్తుతించిన ధనాఢ్యులగు ప్రభువులందఱు నేమైరి? వారిసంబంధములు, వారికార్యములు నెఱవేరినంతవఱకె. కుక్షింభరణార్థము స్తోత్రప్రియులైన ప్రభువులను ధనాఢ్యులను బొగడుచుండెడి కవుల కెప్పటికి సారస్వతజీవనమువలనఁ గలిగెడి నిజమైనసౌఖ్యము గలుగనేరదు. కుక్షింభరణార్థము తన యమూల్యమయిన స్వాతంత్ర్యామృతమును ధారవోసి, నానిపతనము నలంకరించుకొను గ్రంథకర్తకు నిజమైనసౌఖ్య మెట్లులభించును? మఱికొందఱు గ్రంథకర్తలు కుక్షింభరణార్థము తమకృతినాథుల సంతోషపెట్టుటకై యోగ్యులైన సత్కవులెన్నఁడును, వినరాని కనరాని క్షుద్రవిషయములకుఁ దిగి తమశక్తులను భ్రష్టపఱచుకొనుచున్నారు.

## గ్రంథకర్త కష్టములు.

ఇట్టివారివిషయ మటుండనిచ్చి, సారస్వతము జీవనముగాఁ జేసికొన్న సద్గ్రంథకర్తలకు కష్టములు లేవాయని యడుగవచ్చును. గ్రంథకర్తలకు ఆశాభంగములు, నిరుత్సాహములు, కష్టములు లేక యున్న యెడల వారు ఆనందముయొక్క విలువ యెట్లు తెలసికొననగును? సుస్థిరచిత్తుఁడైన గ్రంథకర్త ఫలసిద్ధినిగోరువాఁ డగునేని యెన్నఁడు నాశాభంగములకు, నిరుత్సాహములకు, నాటంకములకు భయపడి వెనుదీయఁడు. అతఁడు వానినే విజయకారణములుగాఁ జేసికొనఁ జూచును. సారస్వతమునకు సేవఁ జేయఁబూనిన నిజమైనగ్రంథకర్త యుత్కృష్టాదర్శములను గలిగియుండు భాగ్యము వహించియుండెనేని సౌఖ్యప్రదములయిన వస్తువులను వ్యర్థవ్యయములను దాంభికత్వమును విడిచి సులభజీవనమున కలవాటుపడి, తృప్తిఁ గాంచియుండును. పుష్టికరమైన భోజనము మెదటికి చుఱుకుఁబుట్టింపఁజాలదు. ప్రతిభాశాలి లక్షాధికారిగఁ బుట్టియుండలేదు. అసూయాపిశాచగ్రస్తులగు సవిమర్శకులవలన గ్రంథకర్తలకు మనస్తాపములు కలుగుచుండును. గొప్పతనమునుగోరి ముందుకుసాగివచ్చు ప్రతిగ్రంథకర్తకు నిట్టిపీడ కలుగుచునేయుండును.

## నిజమైన గ్రంథకర్త.

కాని ప్రతిభాశాలియైన గ్రంథకర్త యెన్నఁడును నిరుత్సాహమును జెందక, పట్టుదలయు, నభినివేశమునుగలిగి నిరంతరకృషిచే నట్టిశత్రువుల కందనివాఁడై యున్నతస్థానమును జేరి పరమానందమును బడయుచుండును. సత్యానురక్తి, ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము, ఆత్మశిక్ష, జితేంద్రియత్వము, నిరంతరపరిశ్రమ, అభినివేశము, సాహసము, ధైర్యము గలిగియుండునట్టి ప్రతిభాశాలియైన గ్రంథకర్త పామరజనానురాగమునకై యుత్తమగుణములను గోల్పోవఁ జూడఁడు. ప్రపంచమును దనవెంట నీడ్చుకొనిపోవఁ జూచును కాని ప్రపంచము వెంటఁ దాను బఱుగిడఁజూడఁడు. ఇట్టిశక్తులు లేనివాఁడు గ్రంథరచనమునకు దిగరాదు. దిగినను నిష్ప్రయోజనము.

"క. నేరిచి సుకవికృతిచే
బేరెటిఁగించుకొని జగతిఁ బెంపగుటొప్పున్
నేరక కృతిచెప్పుటతగ
నేరమియపకీర్తి జగతినిలుపుటకాదే!

క. "ఏరసము జెప్పఁబూనిన
నారసమాలించువాని నలరింపని యా
నీరసపుకావ్యశవముల
దూరమున నబరిహరింపుదురునీతిజ్ఞుల్."

చ. "ఘణతులరెంటమూఁట నొక
పద్యముఁ గూర్చెడివారు లక్ష్యల
క్షణసహకావ్యనిర్వహత
కల్గుట చిత్రముగాని యట్లపో
ఫణమణిమాత్రధారులగు
పాము లసంఖ్యముగాక తత్ఫణా
మణివిధ విశ్వభూభృతి స
మర్థుఁడు శేషుఁడుగాక కల్గునే.

అని పైపద్యములోఁ గవికర్ణరసాయనకావ్యకర్త విస్పష్టములగు వాక్కులతోఁ బ్రతివాఁడును గ్రంథరచనమునకు దిగరాదని సూచించియున్నాఁడు.

"Valuable energy is wasted by being misdirected. Men are constantly attempting without special aptitude, work for which special aptitude is indispensable" అని జార్జి హెన్రీ లూయిస్ వక్కాణించుచున్నాఁడు. అన్నిఁటికంటెను సారస్వతజీవన ముత్కృష్టమైనదనుటకు సందియము లేదు. ప్రతిభాశాలియైన గ్రంథకర్త యొక్కఁడు మాత్రమే కష్టపరంపరలనుండి తప్పించుకొని, సానంబట్టిన మణివలెఁ బ్రకాశింపఁగలఁడు గాన ప్రతిభాశాలురుమాత్రమే సారస్వతమును స్వతంత్రజీవనముగఁ జేసికొనఁదగియుందురుగాని యేవిధమైన విద్యాశిక్షణమును లేక యచ్చుకూటములు తెరగనున్న వికదాయని పాడు పొత్తములనురచించి ముద్రణముగావించి యదియొక జీవనోపాధిగఁ జేసికొనఁగోరువారు తుదకు నష్టమును బొందగలుగుదురే కాని లాభమును బడయఁజాలరు. ఎల్లవారును సద్గ్రంథకర్తలను బ్రోత్సాహపఱచుచు నసద్గ్రంథకర్తల నిరుత్సాహపఱచుచు నాంధ్రసారస్వతము పరిశుద్ధమైనదానినిగఁ జేయుట విధ్యుక్తధర్మమని వేఱుగ నేఁ జెప్పనక్కఱలేదు.

## మనము చేయవలసిన పని.

ఆంధ్రసారస్వతముఁ బెక్కువిధముల నేఁడభివృద్ధిగాంచుచున్నను, సంస్కార మభిలషించుచున్నది. నేటికాలమున వందలకొలఁది నవలలు ముద్రింపఁబడుచున్నను గొన్నిట మృదుమధురమయిన శైలి మృగ్యమగుచున్నది. మన యాంధ్రులలో బ్రతిభాశాలురైన మేధావులుకొందఱాంధ్రసారస్వతమును జీవనాధారముగఁ జేసికొని సంఘమున కత్యావశ్యకములును, ఆరోగ్యప్రదములునగు గ్రంథసముదాయము నుజ్జీవింపఁజేయవలసియున్నది. అట్టి ప్రతిభాశాలురు బయల్వెడలినయెడల దేశభాషాభిమాను లెల్లరును వారికి సర్వవిధములఁ దోడ్పడి, యాంధ్రసారస్వతమున్నతస్థితికి వచ్చునట్టులను జేయుటయగాక సారస్వతజీవనముగూడఁ బవిత్రమైనదనియు, నత్యావశ్యకమైనదనియు, బ్రోత్సాహపఱుపఁదగినదనియు నాంధ్రలోకము గ్రహించునట్లు కృషిసల్పుట మనకెల్లరకు ముఖ్యకర్తవ్యమని నివేదించుచుఁ బ్రస్తుత మింతటితో విరమించుచున్నాఁడను.

చిలుకూరి వీరభద్రరావు.

# అపూర్వప్రకటన.

అమెరికాదేశమునందున్న 'బుఫెలో' సార్వజనిక గ్రంథాలయమువారు ఈ క్రింది రీతిని ప్రకటనను గావించిరి.

"మీకు గావలసినదెల్ల గ్రంథాలయమునందు లభ్యమగుచున్నదా? 'బుఫెలో' యందుండు సర్వజనుల చేతను ఈ గ్రంథాలయము పోషింపబడుచున్నది. సాధ్యమైనంతమంది జనులకు విశేషముగ నుపకారము జేయవలెనని దీని కోరికయైయున్నది. దీని యుపయోగమును ఇంకను వృద్ధిజేయుటకు తగు సలహాల నియ్యవలయునని ప్రజలు కోరబడుచున్నారు. మీకు గావలసిన ఏ పుస్తకములు గ్రంథాలయమునందు లేవు?

ఇంకను గ్రంథాలయము ఏరీతిని మీకు సహకారి కాగలదు?"

దీనినిబట్టి జూచిన ఆదేశమున ఒక పట్టణమునందుండు జనుల వాంఛితార్థములను బట్టి అచటి గ్రంథాలయము పనిజేయుచుండునని దేలుచున్నది. ఆహా! అట్లు పనిజేయు గ్రంథాలయముగల పట్టణమే స్వర్గతుల్యము గదా!

గత వత్సరమున గోదావరి జిల్లాయందొక గ్రామమునందున్న గ్రంథ భాండాగారమును దర్శింపవల యునని బోతిమి. ఆభాండాగారము ప్రథమమున పదు నైదుగురు పౌరులచే స్థాపింపబడినది. కాని ఇపుడు దా నియందు ఇతర పౌరులును జేరి చందాల నిచ్చుచున్నా రు. ఐనప్పటికిని ప్రథమమున స్థాపించిన పదునైదుగురే ఆభాండాగారముయొక్క పరిపాలనను తమ వశమునం దుంచుకొన వాంఛించుచున్నారని వింటిమి. ఈ సంగతి నిజమేయైనచో మన దేశమునకును అమెరికాదేశమునకు ను—అంతవరకును బోనేల, బరోడారాష్ట్రమునకును తారతమ్య మెంతగలదో చదువరులకే గోచరింమును ఆరాష్ట్రమునందు మూడువందలనేబదికంటె నెక్కువ సార్వజనిక గ్రంథాలయములు గలవు. వీటియందు గొ న్ని శ్రీశాయాజీ గాయక్వార్ మహారాజుగారిచే స్థాపిం పబడినవి. మరికొన్నిటిని మహారాజుగారి సహాయముచే ప్రజలు స్థాపించిరి. ఐనప్పటికిని వీటియొక్క పరిపాలన యంతయు జనులకే విడచిపెట్టబడినది.

---

# గ్రాహ్యపుస్తకవిమర్శ.

భారతఖండమునందు పుస్తకములకు పుస్తకాలయములకు చరిత్రకందనికాలమునాటనుండి యుత్తమ గౌరవస్థాన మొసంగబడుచుండినను, లిపి ప్రాచుర్యములో నుండినను, చదువను వ్రాయను, నేర్చుట విద్యకు ముఖ్యాంగముగా నెన్నఁబడినను, వీనితోపాటు జ్ఞానప్రాచుర్యమునందుమాత్రము లాతిదేశములకంటె వేయిమడుంగులు ధారణాశక్తి గౌరవము జేయఁబడుచుండెను. ప్రమాణశక్తితోపాటు ధారణగూడ ప్రయత్నపూర్వకాభ్యాసముచే నీదేశమునందు పెంపుసేయబడుచుండెను. పుస్తకముకంటెగూడ నోక్కుకతతి ధారణకే పూజ్యత గలుగుచుండెను. మనకాదిగ్రంథమైన వేదమునందు సంశయముగలిగినప్పు డిప్పటికిగూడ నచ్చైనగ్రంథముల కంటె పండితుల ధారణయే ప్రమాణము. చదువను వ్రాయను నేరువనివాఁడు జ్ఞానశూన్యుఁడని యుత్తరదేశములందు వాడినట్లు భరతఖండమందు వాఁడనైతేఁగాదు. జనాభాలెక్కలనుఁబట్టి నూటికెంతతక్కువమంది చదువగలవారు తేలినను తక్కినవాండ్రందరు ప్రాకృతులనియు స్త్రీలు సామాన్యముగ గ్రహించబడినట్లు అజానాంధ

రనిమగ్నులనియు మన మధైర్యపడ నవసరములేదు. కతిపత రములైనశాస్త్రగ్రంథములు జనులెరుంగకపోయినను, ధర్మాధర్మస్వరూపజ్ఞానము, యుక్తాయుక్తవిచక్షణ, సాంప్రదాయవేత్తృత్వము, జనసామాన్యమునకు కలుఁగకపోలేదు. సామాన్యజనులు వాడుకొనుపదములు వేదశాస్త్రమూలకములు. అవి వారి ప్రవర్తనను శాసింపుచుండును. ఈ విషయము ముందు గ్రహించినగాని పుస్తకములు, పుస్తకాలయములను గుఱించి చర్చింపఁబోవు నంశములు స్పష్టములుగావు. వ్రాయబడిన పుస్తకములేగాక వ్రాయని వేదములు, వ్రాయని యచలబోధ, వ్రాయని యాధ్యాత్మరామాయణము, వ్రాయని తత్వములు, వ్రాయని పదములు, ద్విపదలు, రగడలు జనసామాన్య కర్ణగోచరములై భరతఖండమునందు జ్ఞానవ్యాపకము చేయుచున్న విషయము మనమందరము ముఖ్యముగా నెఱుంగదగినది.

కాన పుస్తకములన్న నేమో కొంత విచారించవలసి యున్నది. పుస్తకములన, అట్టలుగలిగిన కాగితపు బొత్తులు కావు. పుస్తకములన వ్యష్టిదేశముయొక్క సాంప్రదాయమును, అనుభవమును పరమావధులు, రచలు సంస్కారములు, మొదలగువాని స్థూలశరీరములు. ఈ యర్థము మనమంగీకరించినచో పూర్వోదాహృత సంస్కారాదులు గుణకర్మభేదములు కలిగిన వేరువేరు దేశముల వేరువేరుగ నుండును. కాన ఆయాపుస్తకములు గూడ వేరువేరుగనుండును. ఇవియన్నియు మొత్తము మీఁద మానవసమిష్టి జ్ఞానదాయకములై యొప్పుచుండు. సాంప్రదాయములు, సంస్కారపరమావధులు, అన్ని దేశముల కొక్కటిరుగ నుంచవలయునని ప్రయత్నించుట యసంగతము. అవి యట్లుండుట యసంభవము. వాని పృథక్త్వము కాపాడుట ముఖ్యకర్తవ్యము. జనసమిష్టి జ్ఞానమును పొందగోరువానికి సర్వదేశపుస్తకసారమును గాంచవలసిన యావశ్యకత యేర్పడును.

భిన్నభిన్న దేశములకు కొన్ని సమానధర్మములు, విశిష్టధర్మము లుండును. సామాన్యవిశేష ధర్మస్వరూపము నెఱింగి వ్యష్టివ్యక్తులయందున్న విశిష్టధర్మములను కాపాడవలయును. అవిశిష్టధర్మరక్షణ తద్ధర్ములకే వలనుపడునుగాని లాతులకు చేతగాదు.

కాన మన విశిష్టధర్మములను తెలియపర్చి పెంపొందించు పాత్రము లవశ్యపఠనీయములని యెఱుంగునది. పుస్తకాలయములందు వీనికి ప్రథమగౌరవస్థాన మొసంగుచుండవలయును. శ్రీరంగాది దేవాలయ నిర్మాణమునకు ఆర్యశిల్పశాస్త్రము, "టాజ్ మహాల్" నిర్మాణమునకు మహమ్మదీయ శిల్పము, అధ్యాత్మవిచారణకు భరతఖండజ్ఞాన సంస్కారము, ప్రకృతిశాస్త్ర కళానైపుణ్యమునకు పాశ్చాత్యవిజ్ఞానము, నిట్టుల నొక్కొక వ్యష్టివిశిష్టగుణములు నొక్కొకటి నొసంగుచు సమిష్టిజ్ఞానమును వృద్ధిచేయుచుండును.

వ్యష్టికిగాని సమిష్టికిగాని విద్యగఱప పెంచినప్పుడది ఆవ్యష్టిసమిష్టుల సంస్కారసాంప్రదాయానుసారముగ నొసంగబడవలయునేగాని తద్విరుద్ధప్రయత్నము వ్యర్థము.


అధునిక కాలమందలి పుస్తకములు కొన్ని సాంప్రదాయ జ్ఞానములేక వ్రాయఁబడిన వగుటచే తద్భావములు పెండ్లింటపాలికలలో తొలుదొల్త నేవళముగావచ్చి వేరులలోతంటకపాలి పడిపోవు భంగి యంతరించుచుండును. మఖలోపుట్టి పుబ్బలోమాడు. పుస్తకములు, నాచంద్రస్థాయిలగు పుస్తకములు అను రెండు తెఱఁగులలో, వ్యష్టి సాంప్రదాయసంస్కార పరిణామములు గలిగినవే యాచంద్రస్థాయిలగును. తక్కొరులు మొదటి తరగతి అని గ్రహించనగును. పుస్తకముల యొక్క యదార్థము నెరింగి పుస్తకాలయములు స్థాపించినచో దేశమున కెల్లయెడల మేలు గలుగ గలదు.

డాక్టరు దంటు సుబ్బావధాని.

U8A

48B

బరోడా మహారాణి.



బొంబాయి రాజధానియందలి స్త్రీల ఉన్నతవిద్యాభివృద్ధి నిమిత్తము విద్యార్థిని
వేతనముల నిచ్చుటకు లక్షరూపాయిల నిధి నొకదానిని ఈమె స్థాపించినది.

48c



మహాజనసభకు అగ్రాసనాధిపతిగారగు హానరబిల్
పానుగంటి రామారాయనింగారు.



ఆహ్వాన సంఘాధ్యక్షులగు
బాబు శ్రీరామనరసింహారావుగారు.

# ద్వితీయ ఆంధ్ర దేశ గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభ.

రాజమహేంద్రవర పట్టణమున శ్రీ. వీరేశలింగ, వసురాయ పుస్తకభాండాగారముల యాహ్వానము ననుసరించి 1915 సం॥ మే నెల 9 వ తేదీ మధ్యాహ్నము 2-30 గంటలకు శ్రీ వీరేశలింగముగారి హైస్కూలు భవనమున ద్వితీయ ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధుల మహాసభకూడెను. కృష్ణా, గుంటూరు, గోదావరి, విశాఖపట్నము, గంజాం, నెల్లూరు జిల్లాలనుండి 120 కంటె నెక్కువగ ప్రతినిధు లేతెంచిరి. ప్రతినిధులును ఇతర జనులును మొత్తముమీద 300 మంది జనులు సభ నలంకరించిరి.

ప్రథమమున సన్మానసంఘాధ్యక్షులగు శ్రీ బారు నరసింహారావు, బి.ఏ., బి.ఎల్., గారు తమ స్వాగతోపన్యాసమును జదివిరి. తరువాత చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు శ్రీ పానుగంటి రామారాయనింగారిని సభకు అగ్రాసనాధిపతిగా నుండునట్లు కోరుచు వారి విషయమై కొంత ముచ్చటించిరి. పెద్దిభొట్ల వీరయ్యగారును, కొండమూడి శ్రీరాములుగారును పై విషయమును బలపరచిరి. అంతట నేకగ్రీవముగ నొప్పుకొనుచు కరతాళధ్వనుల జేసిరి. అనంతరము శ్రీ పానుగంటి రామారాయనింగారిని పూలహారముతో గౌరవించి అగ్రాసనాసీనునిం జేసిరి. అగ్రాసనాధిపతిగారు తమ ప్రారంభోపన్యాసమును ఆంధ్రభాషయందు జదివిరి. శ్రీ రామారాయనింగారి సోదరులుగూడ నేతెంచి సభనలంకరించిరి.

తరువాత కార్యదర్శిగారిచే సభకు రాజాలమని వ్రాసిన లేఖలు జదువబడెను. అందు రవీంద్రనాథ ఠాకూరుగారి శాంతి నికేతన మందు విద్యాభ్యాసము జేయుచున్న రాయప్రోలు సుబ్బారావుగారు వ్రాసిపంపించిన పద్యములు మిగుల రసవంతములై, మనోరంజకములై, భావపూరితములై సభ్యుల నంతరిని ఆనందవార్ధిలో నోలలాడించెను. తరువాత నాళం కృష్ణారావుగారు ఆంధ్రదేశగ్రంథ భాండాగారసంఘముయొక్క 1914 ఏప్రిలు మొదలు 1915 ఏప్రిలు ఆఖరువరకు జరిగిన వృత్తాంతమును జదివిరి. పిమ్మట విషయనిర్ణయసంఘమేర్పాటు గావింపబడి నాటి సభముగింపబడెను.

10 వ తేదీన ఉదయము 8 గంటలకు తిరిగి సభకూడెను. ప్రథమమున వడ్డాది సుబ్బారాయడుగారు దైవప్రార్థన గావించిరి. తరువాత సూరి వేంకటనరసింహంగారు ఆంధ్రదేశగ్రంథభాండాగారోద్యమును గూర్చియు, సంచారపుస్తక భాండాగారములనుగూర్చి శ్రీపాద సుబ్రహ్మణ్యముగారును, గ్రంథాలయములననేమి? అవి చేయదగిన పనియేమి ? అను విషయమును గూర్చి అయ్యంకి వేంకటరమణయ్యగారును, దేశభాషాప్రాముఖ్యతనుగూర్చి వల్లూరి సూర్యనారాయణరావుగారును, ప్రారంభవిద్యకు గ్రంథభాండాగారము లెట్లు తోడ్పడును ? యను వంశమునుగూర్చి సత్తెనపల్లి హనుమంతరావుగారును, గ్రంథపాలకుని ధర్మములనుగూర్చి తేకుమళ్ళ వెంకాజీరావుగారును, గ్రంథవిభజనమునుగూర్చి వెలిదెండ శ్రీనివాసరావుగారిచే వ్రాయబడిన వ్యాసమును మరొకరును, గ్రంథాలయ ధర్మములనుగూర్చి గుడిపాటి సూర్యనారాయణగారును ఉపన్యాసముల నిచ్చిరి.

అంతటితో ప్రాతఃకాలసభ ముగిసెను. సాయంకాలము తిరిగి 3-20 గంటలకు సభ సమావేశమయ్యెను. గ్రంథభాండాగారము లెట్లుండవలెను యను విషయమునుగూర్చి ంచితపంటి వేంకటరమణయ్యగారును, తిత్తి బలరామయ్యగారును, దుగ్గిరాలనుండివచ్చిన వారొకరును ముచ్చటించిరి. ‘నా యనుభవము’లను గూర్చి కే. జోగారావుగారు జెప్పిరి. అనంతర మీదిగువ తీర్మానములు జేయబడినవి:—

## 1-వ తీర్మానము.

గోపాలకృష్ణగోక్లేగారును, కొక్కొండ వేంకటరత్నం పంతులుగారును, పురాణం వెంకటప్పయ్యగారును, జొన్నవిత్తుల గురునాథంగారును, చనిపోయినందుల

కీసభవారు వారి కుటుంబములకు తమ సానుభూతిని దె లుపుచున్నారు.

అగ్రాసనాధిపతిగారిచే నుపపాదింపబడినది.

2.వ తీర్మానము.

విద్యాభివృద్ధి చేయుటయందు గ్రంథాలయములు ముఖ్యస్థానములు గనుక (ఏ) ప్రస్తుతము ఆంధ్రదేశమున స్థాపింపబడియున్న గ్రంథాలయములకును, పఠనమందిర ములకును, మ్యునిసిపాలిటీ, డిస్ట్రిక్టు తాలూకాబోర్డుల యొక్క ద్రవ్యములనుండియు, ప్రావిన్షియల్ రివిన్యూ లనుండియు ద్రవ్యసహాయమును జేయుటకు సదుపాయ ములను గలుగజేయవలసినదని ప్రభుత్వమువారిని ఈ సభ వారు ప్రార్థించుచున్నారు. (బి) ఆంధ్రదేశమధ్యము న అనుకూలమైన స్థలమునందు, ఆంధ్రభాషయందు ప్ర చురింపబడు గ్రంథములనన్నిటిని పత్రికలనన్నిటిని చెన్న పట్టణ ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమందలి ఇతర అముద్రితగ్రంథప్రతుల నన్నిటినిజేర్చి ఆంధ్రదేశమందలి ఇతర గ్రంథాలయములకు సహాయభూతముగ నుండున టుల గ్రంథాలయము నొకదానిని ప్రభుత్వమువారు నెల కొల్పుట అత్యావశ్యకము గనుక అట్టి గ్రంథాలయమును త్వరలో స్థాపించుటకు ప్రభుత్వమువారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

ఈతీర్మానమును హానరబిల్ రావుబహద్దరు మో చర్ల రామచంద్రరావు పంతులుగారు ఉపపాదించిరి. ఒంగోలు పురవాసులగు మిట్టదొడ్డి సుబ్బారావుపంతులు గారు బలపరచిరి.

3.వ తీర్మానము.

దొరతనమువారిచే ప్రచురింపబడు పరిశ్రామిక ఆ రోగ్యవిషయిక ప్రచురముల నన్నిటిని, జిల్లాగెజిటీలను, ఆంధ్రభాషయందు ముద్రింపబడిన గ్రంథములపట్టికలను ఆంధ్రదేశమునందలి గ్రంథాలయముల కన్నిటికిని ఉచిత ముగా దయచేయవలెనని ఈసభవారు ప్రభుత్వమువారిని ప్రార్థించుచున్నారు.

4.వ తీర్మానము.

ఆంధ్రదేశమునందంతటను గ్రంథాలయోద్యమము ను వ్యాపింపజేయుటకై సంచారకార్యదర్శి నేర్పాటుజే యుటకు కావలసిన ద్రవ్యమును సమకూర్చుటకు అంద ఱును సహాయపడెదరని ఈసభవారు జనులనందఱిని ప్రా ర్థించుచున్నారు.

5.వ తీర్మానము.

ఆంధ్రదేశమునందున్న అన్ని పట్టణములయందును పల్లెలయందునుగూడ గ్రంథాలయములనుగాని పఠనమం దిరములనుగాని స్థాపింపవలెనని జనుల నీసభవారు ప్రా ర్థించుచున్నారు.

6.వ తీర్మానము.

ప్రతి గ్రంథాలయమును తాము గతసంవత్సరము నందు చేసినపనిని నివేదించుటకును, ముందు చేయబూ నుకొన్న పనిని గూర్చి ప్రస్తావన చేయుటకును, జనసామా న్యమునకు సంఘోద్దేశ్యములను తెలియజేయుటకునుగాను సంవత్సరోత్సవములను జరుపుటకును ఆసమయమున జ రుపబడిన కార్యనివేదనమును ఈసంఘపక్షమున ప్రకటిం చు పత్రికలో ప్రకటించుటకుగాను కార్యదర్శులకు బం పుటకును గ్రంథాలయసంఘములను ఈసభవారు గోరు చున్నారు.

7.వ తీర్మానము.

ప్రతినిధులకట్నములవలన వసూలు అయిన సొ మ్మును సంచారకార్యదర్శియొక్క ఖర్చులకొఱకును ఇ తరఖర్చులకొఱకును ఈసభవారిచే నేర్పరుపబడిన గ్రం థాలయసంఘమునకు ఇచ్చుటకు ఈసభవారు తీర్మానిం చుచున్నారు.

8.వ తీర్మానము.

ఆంధ్రదేశగ్రంథ భాండాగారసంఘమునకు ఈ సంవత్సరమున నీదిగువ నుదహరింపబడినవారు కార్యని ర్వాహక సభ్యులుగ నెన్నుకొనబడిరి.

అగ్రాసనాధిపతి.— గౌ. మోచర్ల రామచంద్ర రావుగారు.

ఉపాగ్రాసనాధిపతులు.—చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు, నూరి నరసింహముగారు.

కార్యదర్శులు.—నాళం కృష్ణారావుగారు, అయ్యంకి వేంకటరమణయ్యగారు.

ఇతరసభ్యులు.

రాయప్రోలు రామచంద్రప్రసాదరావుగారు, రాయప్రోలు.
గోపరాజు బ్రహ్మానందంగారు, బెజవాడ.
బొడ్డపాటి శేషగిరిరావుగారు, పొద్దుటూరు.
బొడ్డపాటి హనుమంతరావుగారు, బొడ్డపాడు.
బాలసరస్వతీ సంఘము, అంగలూరు.
వేమూరి రాంజీరావుగారు, మచిలీపట్నం.
కొడాలి శివరామకృష్ణారావుగారు, డిట్టో
టి. యన్. శర్మగారు, ఉంగుటూరు.
నిడమర్తి లక్ష్మీనారాయణగారు, నిడమర్రు.
బెల్లంకొండ రాఘవరావుగారు, పమిడిపాడు. నర్సారావుపేటపోష్టు.
సత్తెనపల్లి హనుమంతరావుగారు, దుగ్గిరాల.
చట్టి నరసింహారావుగారు, గుంటూరు.
చల్లా శేషగిరిరావుగారు, గుంటూరు.
పులిపాక వెంకటరామారావుగారు, ఈమని.
అంచే శివయ్యగారు, ఈమని. తెనాలి తాలూకా.
కుప్పా శ్రీరామశర్మగారు, అనంతవరం. తెనాలి తాలూకా.
అద్దంకి సత్యనారాయణమూర్తిగారు, రాజమండ్రి.
రామానుజ పుస్తక భాండాగారము, తుని.
ఆకెళ్ళ వెంకట సుబ్బారాయుడుగారు, అమలాపురం.
పీపిల్సు ఎసోసియేషన్, కాకినాడ.
బిక్కిని వెంకటరత్నంగారు, చోడవరం. రామచంద్రపురం తా.
భాగి సుబ్రహ్మణ్యంగారు, శికింద్రాబాదు.
ఇ. సుబ్బుకృష్ణయ్యగారు, హైదరాబాదు.
చివుకుల అప్పయ్యశాస్త్రిగారు, శికింద్రాబాదు.
యన్. నగరాజారావుగారు, జ్ఞానోదయసమాజం. నెల్లూరు.
తిక్కనపుస్తకభాండాగారము, డిటో
రామమోహనధర్మపుస్తక భాండాగారము, గండవరం. కడవలూరు పోష్టు, నెల్లూరుజిల్లా.
పొణకా పట్టాభిరామరెడ్డిగారు, పాట్లపూడి.
మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు, విశాఖపట్నము.
కే. జోగారావుగారు, ఎలమంచిలి.
ఆంధ్రభాషాభివర్ధనీ సంఘము, బరంపురం.
తిత్తి బలరామయ్యగారు, బారువ.
డి. కృష్ణారావుగారు, బరంపురం.
ఆంధ్రభాషాభివర్ధనీ సంఘము, పొద్దుటూరు. కడపజిల్లా.
రామకృష్ణపరమహంస రీడింగురూమ్, కడప.
దేశపాండ్య సుబ్బారావుగారు, నంద్యాల.
మిత్రమండలి, బళ్ళారి.

9 వ తీర్మానము.

తెనాలి తాలూకా దుగ్గిరాల భాషాభిలాషిణీ సంఘమునకు భవనమునునిర్మించుచున్న పునాదిపాటిగ్రామవాస్తవ్యులును ఉదారస్వభావులునగు, యేర్లగడ్డ వెన్నీడువాదరిగారి కీసభవారు వందనము లర్పించుచున్నారు. ఇట్లే ఆంధ్రదేశములోని జమీందారులును ధనవంతులును గ్రంధాలయోద్యమమునకు సహాయమును జేయుదురని ప్రార్థించుచున్నారము.

10 వ తీర్మానము.

ముందుసంవత్సరపుసభను నెల్లూరు జిల్లాయందు చేయుటకు తీర్మానింపడమైనది. ఈతీర్మానమును పాట్లపూడి వాస్తవ్యులగు పొణకా పట్టాభిరామరెడ్డిగారు ఉపపాదించిరి. నెల్లూరు వాస్తవ్యులగు యన్. నాగరాజారావుగారు బలపరచిరి.

తదుపరి అగ్రాసనాధిపతిగారు తమ యంత్యోపన్యాసమును ముగించినపిమ్మట, కొప్పూరు వాస్తవ్యులగు తల్లాప్రగడ సూర్యనారాయణరావుపంతులుగారు అగ్రాసనాధిపతిగారికిని, ప్రతినిధులకును వందనము లర్పించిరి. అంతటితో సభముగిసెను.

## ఆహ్వాన సంఘాధ్యక్షులగు
## బారు శ్రీరామ నరసింహారావుగారి
## యుపన్యాసము.

మహనీయులారా! ఆంధ్రభాషాభిమానులారా! ఆంధ్రదేశాభివృద్ధిచికీర్షులారా!

ఆంధ్రదేశగ్రంథ భాండాగార ద్వితీయమహాసభా ప్రతినిధిప్రముఖ సన్మానసంఘపక్షమున మీకందఱకు నాహ్లాదియపూర్వక స్వాగతము నిచ్చుటకై నాకవకాశము కలిగింపఁబడినందుకు మిక్కిలి సంతసించుచున్నాను. ఈదినములలో తీవ్రనిదాఘతాపమున బాధలనోర్చి కడు దూరమునుండి మిక్కిలి ప్రయాసముతోఁ బ్రయాణముచేసి మాయాహ్వానమును గౌరవించి ఇచటికి దయచేసినందులకు ఈభాండాగారోద్యమమునందు మీకెల్లరకుగల సానుభూతియు, నుత్సాహమును మాత్రమే కారణంబులుగాని మరియొకటి కాదు. ఇంత శ్రమపడి మీరందఱిక్కడకు విచ్చేసినందులకు మీకుఁ దగిన సత్కారము లొనర్చి మీభోజనము జలపానాదులకుందగు సౌకర్యములను ఉచితరీతిని గలుగఁజేయునంతటి శక్తి మాకు లేనందులకు మిక్కిలి చింతించుచున్నారము. అయినను ఈభారము మాపై వైచుకొనుట దానిని జయప్రదముగా కొనసాగింపఁగల శక్తి మాకుఁ గలదనెడి ధైర్యముండికాదు. మీయందఱివలెనే మాకును ఈ భాండాగారోద్యమమందుగల యుత్సాహమే కారణము. శ్రీమదఖండగౌతమీపవిత్రసలిలస్నానపానములును, పౌరాణిక, చరిత్రాత్మక గాథలతో నిండియుండి సుప్రసిద్ధ ప్రాచీనాధునిక కవులచే నలంకరింపఁబడినటువంటియు, దక్షిణకాశీ నా వాసిగాంచిన మారాణ్మహేంద్రవర పుణ్యక్షేత్రసందర్శనమును మాత్రమే మీకుఁ గలుగఁజేయఁగలిగిన లాభములని యెంచుకొనుచున్నాము. మేము మీయెడల జరుపవలసిన యుదారకృత్యముల విషయమై మాకుఁగల యుద్దేశముల మాత్రమే మీరు భావించి లోపములను మన్నింపఁ గోరుచున్నాము.

ఈ యాంధ్రదేశగ్రంథభాండాగార, మహాసభ నిరుటి సంవత్సరము విజయవాడలోపుట్టిన పసికూనయని మీయెల్లరకు విశదమే. దీనిని కడుశ్రద్ధతోఁ, నాదరముతోఁ బోషించి పెంచుభారము మనదైయున్నది.

ఆంధ్రసాహిత్యపరిషత్తు భాషాభిమానులైన యనేక రాజులయొక్కయు, రాజకీయోద్యోగులు మొదలయినవారియొక్కయు నాదరమువలన వర్థిల్లుచున్న సంగతి మీకుఁ దెలిసియేయుండును. ఆపరిషత్తుయొక్కయు నీగ్రంథభాండాగార సభయొక్కయు నుద్దేశము లించుమించుగా సమానములై, యన్యోన్యసంబంధము గలవై యున్నందున నీరెండు సభలును ప్రతిసంవత్సర మొకచోటనే యేకకాలమున జరుపుట యనుకూలమనియు, నవి పరస్పరసహకారములుగా నుండుననియు నాయభిప్రాయము. ఇపుడు మీరందఱువిషయమైకూడ నాలోచించి ముందు సంవత్సరమునుంచి యీమహాసభ యెక్కడ జరుగవలసియుండిన లాభకరమో నిశ్చయింపవలసియున్నది.

ఈ యుద్యమముయొక్క ముఖ్యోద్దేశము జనసామాన్యమునకు జ్ఞానోపదేశము చేయుటయే. ఈ యుద్యమము మన హిందూదేశమునకు క్రొత్తకాదు. ఐహికాముష్మికములకుఁ దగిన జ్ఞానము మన పురాణములయందు నిబిడీకృతమై యున్నది. అట్టి పురాణములను వీధులలోను, తదితర బహిరంగ ప్రదేశములలోను పఠనము చేయుటవలన, వీధినాటకములు మొదలగు వానిని ప్రదర్శించుటవలనను జనసామాన్యమునకు జ్ఞానోపదేశము కలుగఁజేయఁబడుచుండెడిది. కాని యిప్పటి కాలస్థితిని బట్టి అరీతుల జ్ఞానాభివృద్ధిని కలుగఁజేయుట కందఱకవకాశము లేదు. ప్రాచీనకాలమున మన హిందూరాజ్యమున గూడ ననేక భాండాగారములను మనరాజులు నెలకొల్పియుండిరన్న సంగతి చరిత్రలవలన తెలిసికొనుచున్నారము. తరువాత తురుష్కరాజ్యములో నెట్టి దురవస్థకలిగి యెంతెంతటి భాండాగారము లెటుల నశించినవో తెలిసిన యంశమే. ఇప్పుడో, ప్రస్తుతాంగ్లేయరాజ్యపాలనము నందలి ప్రశాంతకాలమున మన కట్టి యిక్కట్టులెల్ల తొలగిపోయినవి. ఈయుద్యమము ప్రబలి జనసామాన్యమునకు జ్ఞానదాయకమగుట కనుకూలసమయమై యున్నది. ఈభాండాగారోద్యమమును సర్వై

న రీతిని నిర్వహింపజేసినచో నిందువలన గలిగెడు లాభ మమితము. అమెరికా దేశమున నీయుద్యమ మనేకవిధముల సర్వజనాదరణీయముగా జేయబడి దేశమున కమితోపకారము కలుగజేయుచున్నది. ఇట్టిభాండాగారముల వలననే జ్ఞానోపదేశము బొంది ఆండ్రూ కార్నీజీ అనునతడు అపరిమితైశ్వర్యసంపన్నుఁడై యట్టి లాభము నె యితరుల కందఱకు గలుగజేయ నిచ్చగించి తన యార్జితములో విస్తారభాగ మీయుద్యమము నిమిత్తము వినియోగపఱచి యెల్లెడల గ్రంథభాండాగారములను స్థాపనముచేసి బీదసాదల కుచితముగా జ్ఞానసంపాదన సాధనముల కలుగజేసి యున్నాడు. అట్టి పద్ధతులనెల్ల కడు శ్రద్ధతో పరిశీలించి శ్రీ బరోడా మహారాజావారుగూడ తమ రాష్ట్రములో నట్టి భాండాగారములను స్థాపించి, కుగ్రామవాసులకు గూడ వానిలాభము నందజేయు నుద్దేశముతో (Circulating Libraries) పరివర్తన పుస్తక భాండాగారములను కూడ నెలకొల్పినారు. అట్టిప్రయత్నము లమిత ధనసాధ్యములు. మన కిప్పుడవి దుస్సాధ్యములు. అయినను కాలక్రమమున దొరతనమువారి సహాయ్యమువలన గాని, మన పరస్పర సహాయమువలన గాని లేక జమీందారులయొక్కయు మహారాజులయొక్కయు తోడుపాటువలనగాని యవి సాధ్యములు కావచ్చును. ఈ భాండాగారములు చేయవలసిన కార్యవిధానము మనకింకను సరిగా బోధపడలేదు. ఈకార్యము నందు దగు ననుభవము గల వారిని నియమించి ఆయా దేశముల కనిపి, అక్కడక్కడి పద్ధతులను పరిశీలించి వానిని మన దేశమున బ్రవేశపెట్టవలసి యున్నది.

ఈ భాండాగారముల నేయేవిధముగా నడిపిన నెక్కువ లాభకరముగా నుండునో యామార్గముల నెల్ల మీరారసి చూడవలయును. వీనిని క్రమమైన విధమున నడిపినచో నత్యంతోపయోగకరములుగ నుండుననుట మాత్రము నిస్సందేహము.

మతాంతరుల నేకులు మన దేశమందుండి స్వమత భూషణము, పరమత దూషణము చేసి మనలను మత దూరులుగ జేయుచున్నారు. జనసామాన్య మజ్ఞానాంధకారమున మునిగియున్నది. ఇట్టి యరిష్టముల నన్నిటిని దొలగించుటలో నీయుద్యమ మొక ముఖ్యసాధనము గనుక దీనిని క్రమముగ నుపయోగించు మార్గము ననుభవశాలులైన మీరందఱు కనిపెట్టుదురు గాక! మనమట్టి విషయమై యిప్పుడు చర్చింప సమావేశమై యున్నాము గావున నానాస్థలములనుండి యిందుకొఱకై యిటకువచ్చిన ప్రతినిధులయెడల సన్మానసంఘమువారి వలన కలిగిన లోపములనుమన్నింపుడని సంఘపక్షమున మిమ్ములను గ్రమ్మఱ వేడుకొనుచు నపారానుభవము, కార్యనిర్వహణ నైపుణ్యము జ్ఞానసంపద మొదలగు సుగుణముల కాకరమై మనకందఱకు మార్గదర్శకులుగా నుండదగు నగ్రాసనాధిపతి నెన్నుకొని యీసభను జయప్రదముగా జరుపుదురు గాక!

## మహాజన సభాధ్యక్షులగు హానరబిల్ పానుగంటి రామారాయనింగారి యుపన్యాసము.

సోదరసోదరీమణులారా! భాషాభిమాన ఘనులారా! ఆంధ్రగ్రంథాలయ కార్యనిర్వాహక సభ్యులారా! అవధరింపుడు.

ఆంధ్రమహామండలికి మండనాయమానమై రాజిల్లు నీరాజమహేంద్రవరమున నేడు జరుగనున్న శ్రీమదాంధ్రదేశ గ్రంథాలయ సభయందు నన్ను గౌరవించి యగ్రాసనాధిపతిత్వము వహింప నాజ్ఞాపించినందుకుఁ దమయెడ నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

ప్రప్రథమమున లోకమున లిపి యేర్పడకమునుపు మానవులు తమ ప్రజ్ఞాబలముచే జ్ఞానమును సంపాదించి జ్ఞాననిధులై జిజ్ఞాసువులగు నితరులకుఁ దామెఱిగిన విషయముల సమయోచితముగఁ గఱపుచు లోకోపకారము చేయుచుండిరి. జ్ఞాన మభివృద్ధి కానుగాను నట్టి జ్ఞానము నశింపకుండుటకై జ్ఞానులు తాము సంపాదించిన జ్ఞానమును ఛందోబద్ధముగ భాషయందు నిలిపి స్థిరపఱచిరి. మన వేదాదులట్టివి. వానిని మనఋషులు తమశిష్యపరంపరకు గఱపి ప్రపంచమున వ్యాపింపఁజేయుచుండిరి. చిరకాలానంతరము లిపి యేర్పడి జ్ఞానమును గ్రంథస్థాపితమై సుస్థిరమయ్యె.

ఇట్లు జ్ఞానము లిఖితగ్రంథస్థమైన యనంతరము నిట్టి గ్రంథము లరుదుగ దొఱకుటచేతఁ బ్రభువులు ప్రసిద్ధ దేవాలయముల యందును దమనగరుల సరస్వతీ నిలయములందును నట్టిగ్రంథముల సంపాదించియుంచి జనులకు జ్ఞానాధారమును గల్పించుచుండిరి. ఇదియె మనదేశమునఁ బుస్తక భాండాగారముల కారంభము.

మనదేశమున నార్యస్వతంత్ర ప్రభువులు ప్రభుత్వము చేయుచుండ భాండాగారములు క్రమక్రమముగా వర్ధిల్లుచుండినవి. తరువాత జైనబౌద్ధులు ప్రబలి తమమతములయందు మొదట తమతమ గ్రంథములను బిమ్మట నితరగ్రంథముల సైతము సేకరించి గ్రంథభాండాగారముల నభివృద్ధి చేయుచుండిరి.

అనంతరము భరతఖండమున మహమ్మదీయ ప్రభువులు ప్రవేశింప మన దౌర్భాగ్య కృష్ణపక్షాంధతమసము దేశమంతయు నావరించె. గ్రంథభాండాగారములంగారకున కాహుతులయ్యె. జ్ఞానాభివృద్ధికి హానిగల్గె. భావలకు క్షైణ్యము సంభవించె.

అంత భారతీయ భాగ్యవశమునఁ నాంగ్లేయప్రభుత్వమను శుక్లపక్షము ప్రారంభమయ్యె. ఆంగ్లేయరాజ్యము చల్లదనమున మాత్రము చందురునిబోలి వాని యస్థిరతి వహింపక సూర్యునిపగిది సుస్థిరమై తేజోవంతమై నిఖిలజీవనాధారమై దేశీయ స్వాతంత్ర్యప్రదాయకమై నాట నాటుకొని నానాటఁ బలపడుచు వెలుంగుచుండుగాత.

గ్రంథభాండాగారముల పునరుద్ధానముచేయ సమయము వచ్చినయది. మనదేశము మహమ్మదీయప్రభుత్వాంధకారమున మునిఁగి బలవత్సుషుప్తిని బొంది జీవచ్ఛవముపగిది నిర్వ్యాపారతఁ జెందియుండు కాలమున నన్యదేశీయులు విజ్ఞానమందును నాగరికత యందును మనల దాఁటి ముందు మిగిలిపోయిరి. మనము మేల్కొని మనల మిగిలిపోయినవారినిఁ బరువంటుకొనవలసి యున్నది. ఇది ప్రబలప్రయత్నమున గాని సాధ్యము గానేరదు. మన యదృష్టవశమున ప్రభుత్వమువారు మన కన్నివిధములఁ దోడ్పడనున్నారు. మన ముత్సాహసమన్వితులమై ప్రయత్నింపఁదగును. దేశమున కొలఁదిమందిమాత్ర ముత్తమజ్ఞానము సంపాదించుట వలన దేశాభివృద్ధి కలుగఁజాలదు. జనసామాన్యమునకు యథోచితజ్ఞానము కలుగవలయు. వలయు గ్రంథభాండాగారముల స్థాపించ ముందడుగిడినారము. ఇఁక వెనుకతీయక పట్టువిడువక మన ప్రయత్నమును గొనసాగించి కృతకృత్యులముగావలయు.

"విఘ్నైర్ముహుర్ముహురపి ప్రతిహన్యమానాః
ప్రారబ్ధముత్తమగుణానపరిత్యజంతి"

ఇట్టి గ్రంథాలయము లన్యదేశములందుఁ మిగులఁ బ్రబలియున్నవి. వీనికిని పూర్వకాలపు గ్రంథాలయములకును గొంత తారతమ్యము కలదు. రాకపోకలకు సులభములు కాని కాలమందెక్కడ నేగ్రంథము దొరకునది యెఱుఁగుటయే దుస్తరముగా నుండినది. తెలిసిన యనంతరము నొక్కొక్క గ్రంథమునకై యెంతెంత దూరప్రయాణములో చేయవలసియుండె. అచ్చులేనందున బ్రచురము లేక యెన్నియో కష్టముల యనంతరము లభించిన గ్రంథమును మొదలునుండి చివరవఱకుఁ జేతులార వ్రాసికొనినం గాని తనదిగాదు. ఇట్లొక్కొక్క గ్రంథమును సంపాదించుటయం దింతటి కష్టముండ నాకాలమున గ్రంథభాండాగారములఁ జేర్చుటయన్న నెంతటి కష్టకార్యమొ యోజింపుఁడు. ఇట్టి గ్రంథభాండాగారము లరుదుగ మూలకొక్క టెక్కడెక్కడనో మాత్రముండుట చిత్రముగాదు.

పండితు లీ పుస్తకభాండాగారములకు యాత్రలు సలిపి యేఁడులకొలఁది యట నిల్చి జ్ఞానము సంపాదించుచుండిరి. అట్టి యాత్రికులకు వలయునన్ని విధములయిన సౌకర్యములును నన్నపానాది సాహాయ్యములును భాండాగారాధిపతు లొడగూర్చుచుండిరి. కాని యెన్నిచేసినను జనసామాన్యమున కీ గ్రంథభాండాగారము లుపయోగించుచుండినవి కావు. జనసామాన్యమునకు చదువక్కఱలేదను నాకాలపు దురభిప్రాయము గూడ దీనికి గారణముగా నుండవోపు. అప్పటియభిప్రాయము లెట్లుండినను కాల మిప్పుడు మాఱినది. చదువందఱకు నవశ్యమనుట తేటపడినది.

ఇప్పుడనేక దేశములయందు జనుల కందఱకును జదువను వ్రాయను దెలిసియుండవలసినదని నిర్బంధపఱ

చు జట్టములఁజేసి యందు కనుగుణ్యముగ ధర్మపాఠశాలల సైతము నేర్పాటు చేయుచున్నారు. జనసామాన్యమునకుఁ జదువను వ్రాయను దెలియునంతవరకు మాత్ర మీపాఠశాలయందు నిర్బంధముగ నేర్పవచ్చునే గాని యంతకు పైన నిర్బంధ పఱచుట యిప్పటి కాలస్థితినిబట్టి కర్తవ్యముగాదు. అంతకు పైన జ్ఞానము సంపాదించుకొను విషయములో స్వాతంత్ర్యమునిచ్చి పైనఁ గోరువారి కవకాశము కల్పించి మార్గముచూపి సాహాయ్యము చేయవలయును. ద్రవ్యాద్యుపపత్తులుగల విద్యార్థుల కుత్తమపాఠశాలల నట్టి యవకాశము కలిగి యున్నది. అట్టి యుపపత్తులులేని బీదసాదలకు జ్ఞానార్జనకు గ్రంథాలయములే శరణ్యములు కావలయు. పాఠశాలలఁ జదువఁదగినవారలు సైతము సర్వకాలమును పాఠశాలలయందు జదువుచుండుట సాధ్యము గాదు. పాఠశాలలను విడిచిన యనంతరము నూతనముగ నుత్పన్నములగు గ్రంథములఁ జదువవలయుననిన స్వయముగ వానిని సంపాదింపలేని వారికి నీ గ్రంథాలయములే శరణ్యములు.

గ్రంథసాన్నిధ్యము గ్రంథకర్తల సాన్నిధ్యము నంతటిది. అట్టి యీసాన్నిధ్య మెంతటి మేలులఁ జేయఁగలదు. చదువని వారలంగూడఁ జదువఁ బురికొల్పఁగలదు. నలువురతోఁ జేరినతోడనే గ్రంథముల గురించిన ప్రస్తావము రాకపోవదు. ఆమాటల వినువారు గ్రంథముల స్వయముగఁజదివి యందలి సారస్యముల గ్రహింప నువ్విళు లూరుచుందురు. తద్గ్రంథములఁ జదువ నిదియె పెద్ద ప్రోత్సాహము కాఁగలదు. కాఁబట్టి యీగ్రంథాలయముల నెంతవిరివిగ నేర్పాటుచేసి జనులకెంత సులభసాధ్యములుగఁ జేసిన దేశమున కంత క్షేమము. లోకమునందేమూల నేమి జరుగుచున్నదియు నిముసములోన నెఱుఁగ గలిగినట్టియు, మాసత్రయమున భూప్రదక్షిణము చేయనగునట్టియు, గడియలోన వేనవేల ప్రతుల ముద్రింపఁ దగినట్టియు, నీకాలమున గ్రంథముల ప్రతుల సేకరించుట కష్టముగాదు. పాశ్చాత్యదేశస్థు లీవిషయమున నెక్కువ ప్రయత్నము చేసి యనేక గ్రంథాలయముల నేర్పఱచి జనులకు మేలుజేయుచున్నారు. మన హిందూ దేశములో స్వదేశాభిమానమునకుఁ బేరుగాంచిన బరోడా మహారాజుగారు వారి రాష్ట్రమున ననేక పుస్తకభాండాగారముల స్థాపించి ప్రజల కన్నివిధముల సుఖములు గలిగించుచున్నారు. ఇంతటితోఁ దృప్తినందక వారు కేవల కుగ్రామవాసులకుఁ గూడ! నీలాభము కలుగుటకుగాను నూరూర దిరుగుచుండుటకునై చరద్గ్రంథ భాండాగారముల సయితము కల్పించి యితరులకు మార్గము చూపుచున్నారు. మన మాతృభాష నభివృద్ధి జేయ సమకట్టియున్నారముకదా. ఈవిషయమున మిగుల ననుభవము గలిగియుండు పాశ్చాత్యదేశీయుల గ్రంథభాండాగారముల మాతృకలఁగా నిడికొని మన భాండాగారములు స్థిరములుగాను జనోపయోగకరములుగాను నడుచునట్లు కట్టుదిట్టముల జేయవలెను.

౧౭౫౩ వ సంవత్సరమున స్థాపింపఁబడిన బ్రిటిష్ మ్యూజియమను వస్తుప్రదర్శకశాలా సంబంధమగు గ్రంథాలయము లోకములోని యన్నిటికన్న మిక్కిలి ప్రసిద్ధికాంచినయది. ప్యారిస్ పట్టణమునందలి బిబ్లియోథికె న్యాషనేల్ యను గ్రంథాలయము గ్రంథసంఖ్యయందు బ్రిటిష్ మ్యూజియమును మించియుండినను పాఠక సౌకర్యములగు నేర్పాటులందు బ్రిటిషు గ్రంథాలయమునకు సాటిరాదని చెప్పఁదగియున్నది. ఈబ్రిటిష్ గ్రంథాలయమందు ౧౫౫౦౦౦ ముద్రితగ్రంథములును ౫౦౦౦౦ యముద్రితగ్రంథములు నున్నవి. ఇందొక విశేషము. కేవలమాంగ్లేయ భాషాగ్రంథములేకాక యన్యభాషాగ్రంథములుకూడఁ బెక్కులుగలవు. ఐరోపాఖండము దేశభాషలలో నాయాదేశమునంగల శ్రేష్ఠగ్రంథ సముదాయముల నెల్ల నిందుఁ జేర్చియున్నారు.

ఈగ్రంథములన్నిటిని వలయాకృతిఁగల పఠనాలయమునఁ జుట్టును మంచలపై నమర్చియున్నారు. పఠనాలయములోని ౬౦౦౦౦ గ్రంథములలో పాఠకుల యవిచ్ఛిన్నోపయోగమునకై క్రిందియంతస్తున ౨౦౦౦౦ గ్రంథములున్నవి. గ్రంథముల వాడునతఁడు చదువరులకు సహాయము చేయుచుండును. ఈగ్రంథాలయమునఁ జదువుటకు గ్రంథాలయాధిపతి యనుమతి యుండవలయు. ఈయనుమతి ౨౧ సంవత్సరములకుఁ బైబడినవారికి మాత్ర మొసగబడును. వారికిని మఱియొకగృహస్థుని ప్రార్థనమీఁదనె యొసగఁ బడును.

చదువఁగోరువారు ముఖ్యగ్రంథాలయాధిపతి యనుమతిలేఖను గవాటమునొద్దఁ గనఁబఱచినసే యంతః ప్రవేశము గలుగఁ గలదు.

౧౮౮౧ సంవత్సరమున ౧౩౩౮౮౭ రు చదువరులీ గ్రంథముల నుపయోగించిరట. సామాన్య గ్రంథాలయములును బ్రత్యేక శాస్త్రగ్రంథాలయములును ననేక ప్రదేశముల ననేకము లున్నవిగాని యిదియే బ్రిటిషు రాష్ట్రములలో ముఖ్యగ్రంథాలయము.

చందాలవలన నేర్పాటుచేయఁబడిన గ్రంథాలయములలో లండన్ లైబ్రరియను గ్రంథాలయము ముఖ్యమైనది. ఆక్స్‌ఫర్డ్ పట్టణమునందలి బోడ్లియన్ గ్రంథాలయమున నచ్చటి విశ్వవిద్యాలయ విద్యాబ్రహ్మచారులకును, పలుకుతోడుఁగల వారికిని, ౧౮ సంవత్సరముల వయస్సురు మిగిలిన యితరులకును మాత్రము ప్రవేశము కలదు. గ్రంథాలయ పాలకుల ప్రత్యేకానుమతిలేనిదే గ్రంథముల గ్రంథాలయము బైటకుఁ బంపుటలేదు.

బర్మనీదేశపు గ్రంథాలయములలో జదువరుల విషయమైన చట్టము లంతకన్న కొంత ధారాళముగ నున్నవి. ప్రాయికముగ యౌవనులకందఱకును బఠనాలయమునఁ బ్రవేశము కలదు. గొప్పయుద్యోగస్థులకందఱకును, దటస్థుల ప్రార్థనమీఁద నితరులకును గ్రంథములు చదువ నవకాశము గలదు. పత్రికాశాఖకుమాత్రము ప్రవేశము గొంత కష్టతరము.

ఇటలీదేశమున గ్రంథాలయములు తఱుచుగ ప్రభుత్వ సంబంధము గలవియై వారి విధులచేఁ బాలింపబడుచుండును. అమెరికాదేశమున గ్రంథాలయములు మిక్కిలి యాధునికములు. ఈదేశమున గ్రంథాలయములు మిక్కిలి ప్రబలియున్నవి. కట్టుదిట్టములును జక్కఁగఁజేసియున్నారు కాఁబట్టినూతన సృష్టిచేయవలసియుండు మనకు మనయాంధ్రదేశ గ్రంథాలయ నిర్మాణమునందు వీరి గ్రంథాలయము లాదర్శములుగ నుపయోగింపఁ దగియున్నవి. అయిన నీవిషయమున నిర్ణయముగ నిబంధనలఁజేయుట యనపేక్షణీయము. ఆయాసందర్భముల ననుసరించి సమయోచితముగ నేర్పాటులఁ జేసికొనుచుండవలయును. అయిన స్థూలముగఁ గొంతమట్టు కాలోచింపవచ్చును.

గ్రంథాలయముయొక్క గృహనిర్మాణమువిషయములో గ్రంథాలయోపయోగమును జక్కఁగ నెఱిఁగిన యనుభవశాలి యభిప్రాయము ననుసరించి గృహభాగములు నిర్మింపవలయు. పఠనాగారములు గ్రంథాగారములు కర్మాగారములు కార్యస్థానములు మొదలగునవన్నియు నొక్కటొకటికిఁ గలసంబంధము ననుసరించి చక్కఁగ నమర్పఁబడవలయు. గ్రంథాలయ మవిచ్ఛిన్నముగ నభివృద్ధియగుచుండునది కనుక నట్టి యభివృద్ధి కభ్యంతరము లేకుండ గృహవిన్యాసము నేర్పాటుచేయవలయు. చెమ్మలేనిచోటున నగ్నిభయమున కెడమియ్యని పరికరములతో గృహనిర్మాణము చేయునదియుక్తము.

అలంకారముకంటె గ్రంథక్షేమమును సౌకర్యమును ముఖ్యముగ గమనింపఁదగును. అయినను ప్రసిద్ధగ్రంథకర్తల చిత్తరువులచే రమ్యముగ నలంకరింపఁబడి జనాకర్షకముగా నుండుట యవశ్యకము. పఠనాగారములు వైశాల్యముగలిగి వలయునంతవాయుసంచారముగలవిగాను, నైఘంటికగ్రంథ భరితములుగాను నుండవలయు. పఠనాగారములలో స్త్రీ పురుషులకుఁ బ్రత్యేకమవకాశముండుట యుక్తము. ప్రధానగ్రంథనిలయము పాఠకులకుఁ బ్రవేశముండునది కాదు కావున నందు గ్రంథముల నిమిడికగా నుంచవచ్చును. పొడవగు నిచ్చెనల నుపయోగింప నక్కఱలేకుండునట్లు మిక్కిలి యున్నతముగాని మంచెలను గోడలంటకుండ వెంబడిగా నుంచవచ్చును. నడుమ గజముచోటిచ్చి ద్విముఖములగు మంచెల నుంచవచ్చు. ఈవిధమున నెక్కువస్థలము నాక్రమింపక స్వల్పస్థలముననే యనేక గ్రంథముల నిమిడింపవచ్చు. గ్రంథాలయము వలయాకృతిగ నుండుటలో స్థలము కలసిరాఁగలదు. మనుష్యులకువలెనె పుస్తకములకును గాలి వెలుతురు నవశ్యకము గనుక దీనిని గమనింపఁదగును. గ్రంథములనుఁ జెదలంటకుండ దుమ్ముచేఁ జెడకుండను భద్రపఱచవలెను. గ్రంథాలయములకు ముఖ్యాంగము గ్రంథముల పట్టిక. పట్టికను మిక్కిలి నేర్పుతో నేర్పాటు చేయవలయు. పట్టికను జక్కఁగా నేర్పాటుచేయ

నంతట గ్రంథాలయమునకు న్యూనత కలిగి దాని ముఖ్యోద్దేశమునకు భంగము కలుగవచ్చును. చదువరులకు వలయు గ్రంథము లున్నదియు లేనిదియు సులభముగాఁ దెలియునట్లు పట్టికల నేర్పఱచ వలయును. పాఠకుఁడే దేని విషయమును జదువఁగోరి యావిషయమునవే యేగ్రంథకర్త రచియించిన యేయేగ్రంథములున్నవో తెలిసికొనఁ గోరవచ్చును. అది సులభముగ దెలియునట్లు పట్టికను గావింపవలయు. ప్రాయికముగ నొక్కొక్క గ్రంథాలయమునందును బహువిధపట్టిక లుండవలయును. గ్రంథనామములఁబట్టియొక పట్టికను, గ్రంథవిషయమునుబట్టి వేఱొకటిని నేర్పఱచునది యవశ్యము. గ్రంథాలయము వృద్ధిపొందుచుండుకొలఁది పట్టికయు మాఱుచుండవలయును. పట్టిక నేర్పఱచుటలో గ్రంథాలయాధిపతి తోడ్పాటు ముఖ్యముగా నుండవలయును. గ్రంథాలయమునందుగల గ్రంథములను గ్రంథాలయాధిపతి యెఱిఁగియుండవలయును. పట్టికలు పలుమాఱు మాఱుచుండుటనుబట్టి వాని నచ్చువేయించుట వ్రయకరమైనను వ్రయమునకుఁ బ్రాల్మలక పాఠకసౌకర్యమునకై యచ్చొత్తించుట కార్యము. చదువరుల కుపయోగించు నీపట్టికలుగాక గ్రంథాలయపాఠకుల యొుక్కకై మఱి రెండువిధములగు పట్టికలుండవలెను. ఒకటి గ్రంథసంపాదనపట్టిక. ఇందు గ్రంథాలయమునకు వచ్చు పూర్ణగ్రంథములనుగాని గ్రంథభాగములనుగాని మాసాదిపత్రికలనుగాని యప్పటప్పటికి జేర్చుచుండవలయు. ఎట్లు లభించినది యెవరివలననొసంగబడినదియేనాఁడుచేరినది మొదలగు నన్నియంశములు నిందుండవలెను. రెండవది మంచలపట్టిక. ఏయేమంచయం దేయేగ్రంథములున్నదియు నిందుండవలెను.

## గ్రంథాలయ పాలన.

పైనఁజెప్పిన రెండుపట్టికలనుబట్టి గ్రంథాలయపాలకు, డప్పుడప్పుడు గ్రంథముల నుండఁజూచుచుండవలయును. క్రొత్తగావచ్చిన గ్రంథములను గొంతకాలమువరకును బ్రత్యేకముగా నుంచియుండి తరువాత వాని నిర్ణీతస్థలములఁ జేర్చుచుండవలయు. గ్రంథాలయమునందు జదువరులకుఁ దోఁచు గుణాగుణములు సూచించి వారికిఁ దోఁచిన సంస్కారమార్గములను బోధించుటకుఁగా నొక పుస్తకము నుంచఁదగు. పత్రములఁగ్రంథించు నుద్యోగము చదువరులకు విడువక గ్రంథమురాగానే గ్రంథాలయోద్యోగస్థులే యాపనిఁ దీర్చుచు గ్రంథములందు దుమ్ము నిలువనీయక నేర్పుతో గ్రంథములు నలుగకుండఁ దట్టివేయుచుండవలెను.

చదువఁగోరువారికి వలయుగ్రంథములఁ జదువ నవకాశమిచ్చుటయే గాక యుక్తమగు విషయములను జదువునట్లు జదువరులఁబ్రోత్సాహపఱచుటయు గ్రంథాలయ ప్రయత్నముగా నుండవలయు. ఈవిషయమై గ్రంథాలయములలో నప్పుడప్పుడు నుపన్యాసములఁ బండితులచే నిప్పించుచుఁ జరద్బింబప్రదర్శనములచే విషయముల జనులకు బోధపఱచుచుఁ జదువనివారికిసైతము చదువవలయునను నభిలాష కలిగించుచుఁ జదువువారి కెట్టివిషయముల నేతీరునఁ జదువవలసినదియుఁ దెలుపుచు గ్రంథాలయముల యుద్యమము సఫలముఁ జేయవలయును. గ్రంథాలయపాలకుని సామర్థ్యమునఁ జాలవఱకు నీకార్యము నెఱవేఱఁగలదు. గ్రంథాలయపాలకుఁడు పండితుఁడుగాను గ్రంథములయందును దత్పఠనమునందును మిగుల నాసక్తి గలవాఁడుగాను, శాంతుఁడుగాను, గంభీరుఁడుగాను, సమయస్ఫూర్తి కలవాఁడుగా నుండవలయు. పాలకుని సహాయోద్యోగస్థులుగూడఁ జదివినవారుగాను ననుభవశాలురుగాను నుండవలయును. ఐన మనదేశమున గ్రంథాలయముల నేర్పఱచుట కిదియే యారంభముగాన మనకట్టి యనుభవముగల యుద్యోగస్థులు దొఱకుట దుస్సాధ్యము. మొదట నేర్పడు గ్రంథాలయమున నట్టి యుద్యోగస్థులకుఁ బనులఁగఱపి కాలక్రమమున నేర్పడు గ్రంథాలయములకుఁ బంపుచుండవలయును. అట్టి యుద్యోగములు నేర్చుకొనుటకుఁ గొందఱఁ బ్రోత్సహించి సహాయముచేసి వారల కుద్యోగముల నొసంగుచుండిన గొలఁదికాలములోనే వలయు నుద్యోగస్థులు దొఱకఁగలరని తలఁచెద.

## గ్రంథముల నేర్పఱచుట.

కేంద్ర గ్రంథాలయమునందు భాషలోనున్న గ్రంథములన్నియు నుండవలయుఁగాని తక్కినశాఖా గ్రంథా

లయముల నది సాధ్యముకాదు. మఱి యంతగాఁ గోరఁ దగినదియును గాదు. కాఁబట్టి యట్టిగ్రంథాలయమున నే యేగ్రంథముల నుంపవలయుననుట చక్కఁగా నాలోచింపఁదగిన విషయము. దుర్నీతులఁ గఱపునట్టి గ్రంథముల గ్రంథాలయముఁ జేరనీయకుండుట క్షేమము. గ్రంథాలయముయొక్క స్థితిగతులను నుపపత్తిని అనుసరించి దొఱకఁగల గ్రంథములలోనుండి యుచితములగు గ్రంథముల నేర్పఱచుకొనవలెను. కేంద్రగ్రంథాలయమున మాత్రము భాషలోనియన్ని గ్రంథములుంచుట యుక్తమని చెప్పియుంటినిగదా? ముద్రితగ్రంథములు ద్రవ్యసాధ్యములు. అముద్రితగ్రంథములు కేవల ద్రవ్యైకసాధ్యములుగావు. ఇదివరకట్టి గ్రంథములఁజేర్చియుండు విద్యారసికులు మహానుభావులందఱును దోడ్పడినగాని సాధ్యముకాదు. ఇఁక ముద్రించు గ్రంథముల విషయములోఁ బ్రభుత్వమువారును భాషాభిమానులును ముద్రించువారును గ్రంథకర్తలును దాముముద్రించు ప్రతిగ్రంథముయొక్క ప్రతిని మన కేంద్రగ్రంథాలయమునకుఁ బంపెదరేని వారుమిక్కిలి సహాయము చేసినవారగుదురు.

### పత్రిక.

గ్రంథాలయమున కనుబంధముగ గ్రంథాలయ విషయమును గ్రంథవిమర్శనములను బ్రచురించు మాసపత్రికయో వారపత్రికయో యొకటియున్న యుక్తముగానుండును. కాలక్రమమున నట్టివిమర్శనయందు తేలినగ్రంథములు మాత్రమె పఠనీయగ్రంథములుగాఁ గావచ్చును. ఆంధ్రరాష్ట్రమునఁ బ్రత్యేక విశ్వవిద్యాలయమునకై మనము జేయు ప్రయత్నము సఫలమగునేని కేంద్రగ్రంథాలయ మావిశ్వవిద్యాలయమున కనుబంధముగ నుండఁదగు.

మహాజనులార! గ్రంథాలయప్రయత్నము ద్రవ్యైకసాధ్యమనునది తమకు సమర్పకమె. ఆంధ్రులలో ప్రభువులు ధనికుల నేకులుగలరు. శ్రీమాననీయ పీఠికాపురప్రభుప్రభృతు లయాచితముగఁ దమ సానుభూతిని నుదారదాతృత్వమును గనబఱచియితరులకు మార్గదర్శకులై యున్నారు. అధైర్యపడ నక్కఱలేదు. సర్వేశ్వరుఁడు గ్రంథాలయ ప్రయత్నమును సఫలము జేయుఁగాత.

---

## శాయాజీ గాయక్వార్, బరోడామహారాజు.

హిందూదేశ గ్రంథభాండాగారోద్యమమునకు కల్పతరువు.

శా. రాజన్నన్ బ్రజలన్న నెట్టులభువిన్ • రాజింపనౌనన్న వి
భ్రాజత్కీర్తిదిగంతరుండు బడోదా • రాజన్యునిన్ శాయజీ
రాజానామకు డెందమున్ దలపగా • రాదేసమాధాన మ
ట్లేజేయంగనరాజులెల్లఁ బ్రజల • ట్లే సౌఖ్యమున్ జెందరే.

సీ. వ్రాలెఱుంగనివాఁడు • రాజ్యమందుండగా రాదటంచనగ నే • రాజుకొను
గ్రంథాలయము లేని • గ్రామంబు కుగ్రామ మది లేని రాజ్య మే • యధిపుడేలు
భూప్రదక్షిణము నే • భూపుండు పలుమాఱు సలిపి రాజ్యములఁ బ • సలనుగాంచె
ఉన్నది చెడకుండ • నుపరిమంచివిమొంచి రాజ్యాననిల్పె నే • రాజమౌళి

గీ. అతఁడు లండను టైమ్సాది • వితతపత్రి । కాగ్రసంస్తూయమాన వి • ఖ్యాతయశుఁడు
శేష భారతరాజ్య వి • భూషణంబు । ఆశలకుతావు మనకు శా • యాజిరావు.

దంటు సుబ్బావధాని.

# శ్రీరామమోహన ధర్మపుస్తక భాండాగారము, బెజవాడ.

ఆధునిక కాలమందు మానవుని జీవయాత్ర కష్టతరమైపోయినది. ఎవరికి వారు కాలూది నిలుచుటకుఁ గొట్టుకాడుచున్నారు. విశ్రాంతి తగ్గినది. కాలపరిణామముచేతను పూర్వపశ్చిమ పరిజ్ఞాన సంఘట్టనముచేతను, మన ప్రాప్యములు మన యలవాటులు మన మర్యాదలు ఎన్నియో విధములఁ బూర్వముకంటె మార్పుజెందినవి. మనపూర్వులు దమ విశ్రాంతి కాలములయందు, నేదేవళమునకో, యేతటాకోపాంత తరుచ్ఛాయలనో కూడి ఇహపరసౌఖ్యదాయకములగు నంశములనుగూర్చి ముచ్చటించుకొనుచుండిరి. ఇందువలన పుస్తకములను జదువగలిగినవారికే గాక, వ్రాయనుఁజదువను రాని వారలకు గూడ జ్ఞానమబ్బుచుండెడిది.

ఇప్పు డిదియంతయు మారినది. పూర్వముకంటె జనులు పట్టణముల కెక్కువగా మూగుచున్నారు. జనులకు విశ్రాంతి తగ్గినది. ఒకరి విశ్రాంతిసమయము మఱియొకరిదిగాదు. దేవాలయములయందు భక్తి రానురాను తగ్గుచున్నది. ఇది యుచితమా యనుచితమా యను నంశము ప్రస్తుతము విచారణీయముకాదు.

మనము క్రొత్తత్రోవల ద్రొక్కిననేగాని జ్ఞానాభివృద్ధి కానేరదు. పూర్వమువలె మనదేశ మభివృద్ధిఁ బొందవలెనన్న మన పూర్వుల హృదయసీమలయందు దేవళము లెంత గౌరవనీయములుగా నెలకొల్పబడినవో, మన హృదయములయం దీనాడు పుస్తక భాండాగారములంతగౌరవనీయములుగ నెలకొల్పబడవలెను. ఒండొరులు కలసికొని తమభావములను బ్రకటించుకొని యన్యోన్యము లాభము పొందుటకును, ప్రజాసామాన్యమునకు జ్ఞానమును వ్యాపింపజేయుటకును నేటి పుస్తకాలయములే ముఖ్యసాధనములు. ఈ యుద్దేశ్యములను మనస్సులయందుంచుకొని, నలుదిక్కులకలుగు నినుపదారులకు కూడలియై, ఆంధ్రదేశమునకంతకును నాయకమణిగా నొప్పుచున్న బెజవాడపురమున నీ "రామమోహన ధర్మపుస్తక భాండాగారము" ను నెలకొల్పిరి.

## చరిత్ర సంగ్రహము.

కలకత్తా నివాసులగు శ్రీయుత బాబు హేమచంద్రసర్కారు యం. ఏ., గారివలనను, లండను నగరమునందున్న "బ్రిటిషు అండు ఫారిన్ యూనిటేరియన్ సంఘము" వారివలనను ధర్మముగా నొసంగబడిన 200 పుస్తకములను జేర్చి 1903 సంవత్సరమునందు "ఆస్తిక పుస్తకభాండాగారము" అనునామమున పుస్తకభాండాగారము నొకదానిని ప్రార్థనసమాజమందిరమునఁ బ్రస్తుతము బ్రహ్మమతవ్యాపకులుగానున్న శ్రీయుత ఇ. సుబ్బుకృష్ణయ్యగారు స్థాపించిరి. కాని అయ్యది యొక మూరుమూల నుండుటంబట్టి జనసామాన్యమున కుపయోగకారి కాజాలదయ్యె. ఇట్లుండ 1911 సం. జనవరిమాసమునందు కొందఱు యువకులు కూడి స్వల్పముగ చందాలను వేసికొని, ప్రార్థనసమాజమువారి యనుమతిమీద నాపుస్తకములను దీసికొనివచ్చి బకింగుహాంపేటలో నెల్లఱు వచ్చుటకు వీలయిన ప్రదేశమునందు "రామమోహన ధర్మపుస్తకభాండాగార" మను నామమున బ్రస్తుతభాండాగారమును నెలకొల్పిరి.

ప్రథమమున కొందఱు పెద్దలనడిగి యొకటి రెండువార్తాపత్రికల నుచితముగ దెచ్చి సాయంకాలమునందు జదువుకొనుచుండిరి. వసూలయిన చందామొత్తము ఇంటి యద్దెకును దీపపు ఖర్చునకుమాత్రము సరిపోవుచుండెను. కాని, యీభాండాగార మట్టి హీనస్థితియందు రెండుమూడు మాసములకన్న నెక్కువకాల ముండ లేదు. దినదినాభివృద్ధినొందుచు వచ్చినది.

ఇట్లు భాండాగార మభివృద్ధికాగా ప్రథమ వార్షికోత్సవసమయమున, కీర్తిశేషులైన శ్రీరాజా వెల్లంకి చిన వేంకట్రామారావు బహద్దరు జమీందారుగారు భాండాగారమునకు శాశ్వతభవనమును తమ స్వంత ఖర్చుతో నిర్మించి యిచ్చెదమని వాగ్దానమొనర్చి తమ సహజౌదార్యమును వెల్లడించిరి.

## నివేశన స్థలము.

గ్రంథభాండాగారములకు స్వంతభవనములుండినగాని శాశ్వత ప్రతిష్టాపనలు కాజాలవని ప్రథమమునుండియు ఈగ్రంథాలయమువారికి గట్టి నమ్మకముగలదు. అభిమానులగువారు కొందఱు గ్రంథములను గొన్నిటిని, సామానులను గొన్నిటిని, సమకూర్చి నొకచో నుంచుటయు, కాలక్రమమున నవి నామమాత్రావశిష్టము లగుటయు వీరుతరుచుగా జూచుచుండిరి. గ్రంథ భాండాగారము లెంతచిన్నవైనను తగుపాటిగృహములు వానికుండుట ప్రధానకర్తవ్యమని వీరి యాశయము; అట్టి శాశ్వత పయత్నలోపమే 'మఖ'లోపుట్టి 'పుబ్బ'లో మాడెడు సంఘములకు మూలకారణమని వీరియనుభవమునుబట్టి జెప్పగలరని వ్రాయుచున్నారు. అందుచేత ప్రత్యేకభవనము వలయుననెడి వాంఛ కేవలశైశవావస్థయందుండగనే వీరినావేశించినది. శ్రీ తిరువూరు రాజాగారు భవనమును గట్టించెదమని జేసిన వాగ్దానము వీరి నుత్సాహపరుప, నివేశనస్థలమును సేకరించుటకై ప్రయత్నించిరి. దినదినాభివృద్ధినిగాంచుచున్న బెజవాడ పట్నమున స్థలమును సేకరించుట అల్పకార్యముగాదు.

అంతట 8-4-13 తేదీన ఈసంఘమును కృష్ణాజిల్లా రిజష్ట్రారువారి ఆఫీసునందు 1860 సం॥ 21 నంబరు అక్టు ప్రకారము రిజష్టరు జేసిరి. అది జరిగిన రెండుదినములకే బెజవాడ మునిసిపాలిటీవారు నివేశనస్థలములను వేలమున విక్రయించెదమని ప్రకటించిరి. అప్పుడు వీరిచేతులలో సొమ్మేమియులేదు. ఉత్సాహమును, స్వార్థత్యాగుల యభిమానమును, మూలధనముగా జూచుకొని 2191 చ. గజముల స్థలమును రు 3424-2-3 లకు కొన్నారు. నివేశనస్థలమున కయిన ఖర్చులో శ్రీ మునగాల రాజాగారు శ్రీరాజా నాయని వేంకటరంగారావు బహద్దరు జమీందారుగా రయిదువందల రూపాయిలును, శ్రీపాటిబండ సుబ్రహ్మణ్యముగా రయిదువందలరూపాయిలును, శ్రీబొడ్డపాటి వెంకటప్పయ్యగా రయిదువందలరూపాయిలను యిచ్చియుండిరి. మిగిలినసొమ్ము విరాళముల వలన వసూలయినది.

## భవననిర్మాణము.

నివేశనస్థలమును గొనుటతోడను, అందుకై చందాలు వేయించుటతోడను వీరి పని పూర్తికాలేదు. శ్రీతిరువూరు జమీందారుగారి దగ్గరకుబోయి తమ వాగ్దానమును జెల్లింపవలసినదని కోరిరి. దయాపూర్ణుడగు నామహానీయుడు వారి కోరికను నిర్వర్తించుట కంగీకరించెను. అప్పుడు, మద్రాసుగవర్నరుగారి శాసన నిర్మాణసభ్యులగు ఘనతవహించిన పి. యస్. శివస్వామి అయ్యగారిచే 1913 సం॥ సెప్టెంబరునెల 1వ తేదీన మునిసిపాలిటీవారివద్ద కొన్నస్థలమునందు పునాదిరాతిని వేయించిరి. పిమ్మట భవననిర్మాణమును జేయనారంభించిరి. కడచిన డిశంబరునెలలో శ్రీ చెన్నపురిరాజధాని గవర్నరుగారు బెజవాడకు విచ్చేయు సందర్భమున శ్రీవారిచే ప్రవేశమహోత్సవమును జేయింపవలెనని కుతూహలమును జెందిరి. కాని ఈభాండాగార భవనమును కట్టించుచున్న శ్రీతిరువూరు జమీందారుగారు అకాలమరణము నొందుటచే వీరి కోరికను నెరవేర్చుకొన జాలకపోయిరి. పనిప్రారంభించినపిమ్మట అపుటకు వీలులేక, శ్రీతిరువూరు రాజాగారు ఇచ్చిన రు 2100 లను వ్యయపరచినపిమ్మట, రు 4000లను అప్పుజేసి పనిని సాగించి చాలాభాగమును పూర్తిజేసి అందుభాండాగారము నుంచగలిగిరి. ఈభవనముయొక్క మొదటి అంతస్తు పూర్తియగుట కింకను రు 2000 లు గావలసియున్నవి. దీనికి శ్రీ తేలప్రోలు జమీందారుగారు రు 1000 ల నిచ్చెదమని వాగ్దానము చేసియున్నారు.

## పంచములకు పాఠశాల.


శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు బి. ఏ., బి. యల్., గారి యాజమాన్యముక్రింద ప్రారంభింపబడిన పంచముల పాఠశాల 1914 జనవరినెల నుండియు ఈసంఘముయొక్క యాజమాన్యమునకు దీసికొనబడినది. ఇది పగటి పాఠశాలయైయున్నది. ఇందు బాలురు 24 గురును బాలికలు 8 గురును కలరు.

## స్త్రీ చదువరులు.

స్త్రీలకు ఉచితముగనే చదువు కొనుటకుగాను

60A

రామమోహన ధర్మపుస్తక భాండాగారము. బెజవాడ.




నాల్గవ సాంవత్సరికోత్సవ సమయమున దీయబడిన పటము.


అగ్రాసనాధిపతియగు ఆనరబిల్ బయ్యా నరసింహేశ్వర శర్మగారు కుర్చీమీద కూర్చుని యున్నారు.

పటమునందు వెనుక...

60B



పంచముల పాఠశాలయందు విద్య నభ్యసించుచున్న బాలురు బాలికలు.



శ్రీ రాజా వెల్లంకి చిన వేంకటరామారావు బహద్దరు
జమీందారుగారు.

60D

వారిగృహములకు వీరినౌకరుచేతనే గ్రంథముల నంపుచున్నారు. ప్రస్తుతము 24 గురు స్త్రీలుమాత్రము ఈలాభమునుపయోగించు కొనుచున్నారు.

### ప్రార్థన సమాజము.

ఈభాండాగారమునకు కొనబడిన నివేశన స్థలమునకు శ్రీ పాటిబండ సుబ్రహ్మణ్యంగారు రు 500ల విరాళ మొసంగియున్నారు. వారికోరిక ప్రకారము బెజవాడ ప్రార్థన సమాజమువారు మందిరమును నిర్మాణముజేసుకొనుటకుగాను ఒక మూలను 200 చ. గజముల స్థలమునిచ్చిరి.

### ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధుల మహాసభ.

మన ఆంధ్రదేశము నందుగల గ్రంథాలయముల నన్నింటికిని పరస్పరమైత్రికలిగిన మిగుల లాభముగ నుండుననియు, భాండాగారములయొక్క అభివృద్ధికి సాధనభూతముగ నుండుననియు తలంచి 1914 ఏప్రిలు 10 వ తేదీన, ఈభాండాగారముయొక్క యాదరణక్రింద బెజవాడ పట్టణమున "ప్రథమ ఆంధ్రదేశగ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభ" గావింపబడినది.

ఇప్పుడీభాండాగారమునకు 130 చందాదారులును 24 మంది స్త్రీచదువరులును గలిగి పదునాలుగు వందలు ఆంధ్రఆంగ్లేయ సంస్కృత గ్రంథములతోను ముప్పదినాలుగు ఆంధ్రాంగ్లేయ వార్తాపత్రికలతోను నలంకరింపబడి యనుదినము ముప్పది మంది చదువరుల నాకర్షించుచున్నది. ఈభాండాగారముయొక్క భవనము తయారగుటకును, గ్రంథములను గొనుటకును పదివేల రూపాయలయిన గావలెనని మదింపువేయబడినది. ఈ గ్రంథాలయమిట్టి యున్నతస్థితిని వహించుటకు అగ్రాసనాధిపతుల కార్యదక్షతయు, కార్యదర్శుల నిరంతరపరిశ్రమయు నైయున్నది.

### ఈగ్రంథాలయముయొక్క ముఖ్యోద్దేశములు.

శ్రీరాజా రామమోహన రాయులవారి యొక్క జ్ఞాపకార్థ మీభాండాగారము స్థాపింపబడినది.

1. ధర్మభాండాగారములను, పఠనమందిరములను బెజవాడపురమున స్థాపించుటయు కృష్ణా, గుంటూరు జిల్లాలయం దితరస్థలములలో స్థాపింపబడినవానిని దీనికి జేర్చుకొనుటయు,

2. చందాలను జెల్లించు చందాదారులకును, సభికులకును పుస్తకములను, పత్రికలను యెరువిచ్చుటయు,

3. సాంఘిక సమావేశములవలనను, ఉపన్యాసముల మూలమునను ముఖ్యమగు విషయములంగూర్చి చర్చలను జరుపుటచేత, స్వస్థానమునందున్నట్టియు, ఇతరస్థలములయందున్నట్టియు జనులయందు పరిచయము నభివృద్ధిజేయుటయు,

4. భరతవర్షీయుల ఉత్సవములను, కవులయొక్కయు, ప్రవక్తలయొక్కయు, తత్వజ్ఞానవేత్తలయొక్కయు సాంవత్సరికోత్సవములను జరుపుటయు,

5. విద్యావిషయిక ప్రతిష్ఠాపనలను స్థాపించుటయు, ఇదివరకే స్థాపింపబడిన వానిని దీనికి జేర్చుకొనుటయు,

6. భాష, మతము, శాస్త్రము, పరిశ్రమ మొదలగు విషయములనుగూర్చి జనసామాన్యమున కుపన్యాసముల నొసంగుటయు; జనసామాన్యమునకు జ్ఞానాభివృద్ధి కరములగు కరపత్రములను, పుస్తకములను ప్రచురించుటయు; పై విషయములకు వ్యతిరిక్తముగానట్టియు జనసామాన్యమునందు జ్ఞానాభివృద్ధి గలుగజేయునట్టియు ఇతరపద్ధతుల నవలంబించుటయునై యున్నవి.

---

## సమస్యలు.

1. మ. కులమున్ బాణముగొట్టగా నణగె బెక్కుల్ వర్ణముల్ గంటివే.
2. చీమ తుమ్మెగదరా దిగ్గంతులల్లాడగన్.

# ఆంధ్రగ్రంథములు విరివిగ వ్యాపించుటెట్లు.

పూర్వము సౌకర్యములు తక్కువగ నున్నపుడు మన ప్రాచీనకవులు తమ యనుభవముల నన్నిటిని తాళపత్రముల వ్రాసి గ్రంథస్థము జేసియుండిరి. వాటి వాసన గ్రహించినవారు ఎంతయో శ్రమపడి వాటి ప్రతులను వ్రాసికొనుచుండెడివారు. ఇప్పటికిని కొన్ని యిండ్లయందు వ్రేలాడగట్టబడియుండు తాళపత్రగ్రంథముల నేమి, కాగితములమీద అచ్చుగుద్దినలాగు వ్రాసిన ప్రతుల నేమి, జూచుట తటస్థించినపుడు ఆ గ్రంథములు వ్రాయుటకు వారుపడిన శ్రమ, వారి శ్రద్ధాభక్తులు, మనకు ఆశ్చర్యమునుగొలుపక మానవు.

ప్రస్తుతము ముద్రాయంత్రములు విరివిగ ప్రబలుటచే తాళపత్రములమీదను వ్రాసికొను దశ యంతరించి స్వల్పధరలకు నందరికి లభించులాగున అచ్చుప్రతులు దొరుకుచున్నవి. పూర్వులు వ్రాసిన గ్రంథములను వారు అంతరించుటతోడనే వారిసంతతివారు వాటివిలువ తెలియక కొందరు, యచ్చువేయ సమర్థతలేక కొందరు, వ్యర్థముగావించియుందురు. ఇప్పటికిని గ్రంథము అచ్చువేయించినవారు గతించుటతోడనే వారిసంతతివారి తెలివి లేమిచే నయ్యవి యింటనే యొదిగి బైటకు రాకున్నవి. ఖరీదునకు చిక్కకున్నవి. కొందరు పూర్వగ్రంథములను సాధించి సంపాదించి, అచ్చువేయించి ప్రజల కుపకారము చేయుచున్నారు. ఇప్పటివారిలో బుద్ధిమంతులు తమ శక్తికొలది గ్రంథములు వ్రాసి ప్రచురింపుచు భాషకు నూతనాలంకారముల నొనగూర్చుచున్నారు. ఏ విధమునచూచినను గ్రంథములు విరివిగ బయలుదేరుచున్నవి. వాటి గ్రంథకర్తలకు తగినంత ఉత్సాహము కలుగులాగున యవి దేశమందంతటను వ్యాపించుట లేదు. ఇట్లు వ్యాపింపకుండుటకు గారణము లెవ్వియో నించుక విచారింతము. ఇతరదేశములలో పుస్తకము అచ్చువేయించుటకగు ఖర్చులకన్న హెచ్చుమొత్తమును ఆ పుస్తకము అమ్ముడుపోవుటకై ప్రకటించు ప్రకటన పత్రికల నిమిత్తము వెచ్చింతురు. మనమో ర్పు 100 లు గాని ర్పు 200 లు గాని పుస్తకము అచ్చువేయించుటకై ఖర్చుపెట్టి, ర్పు 10 లు అయినను ప్రకటన పత్రికలనిమిత్తము వెచ్చించుటకై శంకించుచున్నాము. అందువలన మన అసలుగ్రంథము అచ్చుపడినదన్న సంగతియే వెల్లడికాకపోవుటయు, దేశమంతట వ్యాపింపకపోవుటయు తటస్థించుచున్నది. మనలో ఆంధ్ర పుస్తకము లన్నిటిని ఒకచో జేర్చి అమ్ము పుస్తకశాల గాని, అన్ని పుస్తకములు లభింపగల గొప్పగ్రంథ భాండాగారముగాని లేదు. సాధారణముగా కొన్ని దేశములయందు గ్రంథము మంచిదైనను కాకున్నను, గ్రంథకర్తలను నూతన గ్రంథముల వ్రాయ ప్రోత్సహించుటకై ఆ గ్రంథమును కొనెదరు. అది వారి నైజస్వభావముగా నున్నది. మన కట్టి స్వభావము లేదు. మన మితరదేశములవారితో ద్రవ్యవిషయమున సమానముగా నేరకున్నను, ఉన్నదానిలోనైన, చేయ తగినంతమట్టుకు గ్రంథకర్తలకు ప్రోత్సాహము చేయకున్నారము.

ఇక మనగ్రంథములు విరివిగ వ్యాపింపజేయుటకై సాధనము లాలోచింతము.

తామసు కార్లలియస్ వ్రాసినట్లు మనగ్రంథములలో రుచిచూడవలసినవి, నమలవలసినవి, నమలి మ్రింగవలసినవి గలవు. వీటియొక్క ప్రాశస్త్యాప్రాశస్త్యములను లోకమునకు తమ యభిప్రాయములమూలమున వెల్లడింపగల పండితసంఘము నొకదాని నేర్పరచుట ముఖ్యము. అయ్యది శాఖలుగానుండవలెను. అనగా పద్యకావ్యములను పరిశీలించు నుపసంఘము, చరిత్రలను పరిశీలించు నుపసంఘము, ఈమాదిరి నుపసంఘములుగలిగిన పెద్ద సంఘమొకటి అత్యవసరము. వీరివలన మన్ననందినగ్రంథముయొక్క విరివి వ్యాపనకై మనము తోడ్పడవలెను.

చివర కెట్టి చిన్నగ్రంథమైనను ఎంతవిలువగల గొప్పగ్రంథమైనను కార్డువ్రాసినతోడనే సప్లయి చేయగల పుస్తకశాల యొకటి ఆంధ్రదేశమధ్యమున స్థాపింపబడవ

లెను. ఇదివరకు ప్రచురించినవి, ఇప్పుడు ప్రచురింపబోవునవి, అన్నిగ్రంథములును ఇందు దొరకవలెను. ఇయ్యది ధనాధిపు లెవరైన స్థాపింపవచ్చును. లేదా వాటాలపద్ధతినైన నొక సంఘము స్థాపింపవచ్చును.

ప్రతిమానవుడు ప్రతిగ్రంథమును కొనగల ద్రవ్యసంపత్తి గలిగియుండకపోవచ్చును గాని ప్రతిగ్రామము కలసి అధమపక్షు మొకగ్రంథముకొని పఠింపకపోలేదు. అట్టితరుణమున కొద్దియెత్తునవైన పుస్తక భాండాగారములను ప్రతిగ్రామమున స్థాపించుటకై ప్రయత్నములు సలుపవలెను.

ఈపై నుదహరించిన పుస్తకశాలవారు ఈగ్రంథభాండాగారమువారు తమతావున దొరకు పుస్తకముల పట్టీలను విరివిగ ప్రతిగ్రామము ప్రతియింటా జేరునట్లు పంచివేయవలెను. అం దేనెలకానెల నూతనగ్రంథములని ప్రశస్తగ్రంథములని పైపట్టికలో జూపుచుండవలెను. వాటిపై ప్రముఖులిచ్చిన అభిప్రాయములను ప్రచురింపుచుండవలెను.

గ్రంథకర్తలైనవారు తమ గ్రంథములను ప్రాముఖ్యుల కుచితముగ బంపి వాటిపై వారి యభిప్రాయములు వచ్చునటుల చేయవలెను. వీలయినతావులనగా ప్రతిపట్టణములోను, ముఖ్య రెయిల్వేస్టేషనులలోను, సామాన్య అంగడులలోను, దొరుకులాగున కమీషన్ పద్ధతిని ఏజంట్ల నేర్పరచి అమ్మించవలెను. అట్టి ఏజంట్లు సరిగా లెక్క చెప్పరను భయముకద్దు. కాని సౌమ్యులనే యేరుకొనవలెను. పుస్తకధరలు కొంచెము సరసముగా నుండవలెను.

ఇందువిషయమై మన జయమంతయు, తుదకు ఆదానికలక్రింద మనము ధారాళముగా వెచ్చించు ద్రవ్యమునుబట్టియు ఆదానికలు వ్రాయురీతిని బట్టియు నుండునని జ్ఞాపకముచేయుచున్నాను. ఆదానికలక్రింద విరివిగా వెచ్చించినవారు ఎవరును చెడిపోయినవారు లేరు. ఇందులకై హిగిన్‌బాతం మున్నగు కంపినీలవారిని చూడుడు. వారెట్లు విరివిగ ఆదానికలప్రకటించి వెల్లడించెదరో! మనలోను ఇందులకు విక్టోరియాడిపో, విలియం అండు కో, మున్నగువారు నిదర్శనముగానున్నారు. ఈ పద్ధతులమీద ఆంధ్రగ్రంథముల వ్యాపనకై ప్రయత్నింపుడని ప్రార్థింపుచు విరమించుచున్నాను.

కొడాలి శివరామ కృష్ణారావు.

## శ్రీ వీరేశలింగకవి పుస్తకభాండాగారము, రాజమహేంద్రవరము.

దేశాభ్యుదయమునకు భాషాభివృద్ధి ప్రథమ సోపానము. భాషాభివృద్ధికిఁ బుస్తక భాండాగారములె ప్రధాన సాధనములు. ఏదేశమునఁ బుస్తకభాండాగారములు మిక్కుటముగ వెలయుచుండునో, యాదేశము సకల కళలకు నెలవై నాగరకతకుఁ దావలమై యఖిల సంపదలతోఁ దులతూఁగుచు నత్యున్నతపదవి నలంకరించియుండును. భాండాగారములవలనఁ గలుగుప్రయోజనపరంపరల నెన్నఁగ గ్రహించియె జర్మని, ఇంగ్లండు, అమెరికా, జపాను మున్నగు విదేశములవారు తమతమ దేశములఁ బ్రతిపట్టణమునఁ, బ్రతిగ్రామమున, వేయేల ప్రతిగృహమున భాండాగారములఁ గుప్పలుతిప్పలుగ వెలయింపఁజేసి ప్రపంచమునందలి జాతీయులలో నెల్ల నాగరకాగ్రగణ్యులని వినుతికెక్కియుండిరి.

ప్రకృతము మనహిందూదేశమునఁ గూడ పుస్తకభాండాగారముల యావశ్యకత గ్రహింపఁబడి బరోడా మున్నగుప్రదేశములయందు భాండాగారములు నెలకొల్పబడుచున్నవి. మన యాంధ్రదేశమునందు నయిత మచ్చటచ్చట కొన్నిభాండాగారము లిపుడిప్పుడు స్థాపింపబడుచున్నవి. సుమారు పదునైదువత్సరముల క్రిందట మన యాంధ్రదేశమున నాంధ్రభాండాగారము లంతగ వ్యాపించియుండని సమయమున మనమాతృభాషకుఁ గలిగిన యీకొఱంతను గొంతవఱకు నివారించి యోపినంతవరకు దేశసంసేవన మొనరింపఁగోరి, యాంధ్రభాషావధూటికిఁ బుట్టినిల్లనఁ దగు రాజమహేంద్రవరమున 'వీరేశలింగ పుస్తకభాండాగార'మను పేరిట నొక భాండాగారమును స్థాపించిరి.

శ్రీవీరేశలింగపుస్తక భాండాగారము 1900 వ సంవత్సరమున రాజమహేంద్రవరమున శ్రీయుత నాళము కృష్ణారావుగారిచే స్థాపింపఁబడినది. ఈభాండాగారము మొట్టమొదట తెనుఁగు పుస్తకములతో నారంభింపఁబడి, కొంతకాలమువఱకు పేనామమును ధరింపకయే చిన్నపఠన మందిరమువలె నొప్పుచు, నచ్చటికి వచ్చుచదువరులకుమాత్రమె యుపయుక్తముగ నుండెడిది. సేవకుఁడు లేకపోవుటచే పుస్తకములనింటికిఁ దీసికొనఁ గోరువారికడ చందాలగైకొని పుస్తకములిచ్చు పద్ధతి యప్పుడు లేకుండెను. ఐనను పరిచితులగు కొందరకు చందాలేకయే పుస్తకములు వారిగృహములకీయఁబడు చుండెడివి. ఇట్లొకవత్సరము గడిచినపిదప కీర్తిశేషులైన శ్రీనాళము జగ్గారావుగారు భాండాగారాభివృద్ధికై పూనుకొని కేవల మొక్కయాంధ్రగ్రంధములతోనే భాండాగారము సంపూర్ణమైనది కాదనియెంచి, యందాంగ్లేయగ్రంధములుగూడ పెక్కింటిని జేర్చిరి.

అప్పు డీభాండాగారమునకుఁ దగిననామ మొసంగు తరుణము వచ్చినదని యెంచి, తదీయ స్థాపకులును నభిమానులును జేరి "శ్రీ వీరేశలింగ యువజనసమాజము" అను పేరనొక సంఘముగ నేర్పడి, భాండాగారమును దమయధీనమున నుంచికొని, దానికి "శ్రీవీరేశలింగ పుస్తక భాండాగారము" అని నామకరణమొనర్చిరి. తోడనే యొకచిన్న మేడ యద్దెకుఁ దీసికొనఁబడి యందీ భాండాగారము నెలకొల్పఁబడెను. సేవకులు నియమింపఁబడిరి. పౌరులకడ చందాలఁ గైకొని వారికింటికి పుస్తకముల నిచ్చుపద్ధతి యవలంబింపఁబడెను. స్త్రీల కుచితముగ వారి గృహములకు పుస్తకముల బంపుటయారంభింపబడెను. మఱియు నీసమాజము మతసంఘసంస్కార విషయముల యొక్కవానిదీక్ష వహించి తద్వ్యాప్తికై యనేకసభలఁ గావించియు, కరపత్రములను పొత్తములను వెలువరించియు, భాండారాభివృద్ధికై నిరంతరము పాటుపడుచు, సుమారు 8 వత్సరములు తృప్తికరముగఁ గార్యముల నిర్వహించి 1909 వ సంవత్సరమున విరమించెను.

అంత నీభాండాగారమును గూర్చి మొదటినుండియు కృషిచేయుచున్న కొందఱు వేఱొకసంఘముగ నేర్పడి నూతన నిబంధనలను పద్ధతులను నేర్పఱచి ఆరు సంవత్సరములనుండియు శ్రద్ధతోఁ బనిచేయుచు భాండాగారమును ప్రస్తుతాభివృద్ధికిఁ గొనితెచ్చిరి. ఇప్పుడీభాండారము పురమందిరమునందలి ప్రార్థనసమాజ సౌధమున నలరారుచు, 42 గురు సామాజికులను, 218 మంది చందాదారులను, 144 మంది స్త్రీచదువరులను గలిగి 2200 ఆంధ్రగ్రంధములతో, 1900 ఆంగ్లేయగ్రంధములతో, 228 సంస్కృత గ్రంధములతో, 55 తాళపత్రగ్రంధములతో నొప్పుచు, 53 ఆంధ్రాంగ్లేయవార్తాపత్రికలచే నలంకరింపబడి, యనుదినము 30 మంది చదువరుల నాకర్షించుచున్నది.

ఈభాండాగారముయొక్క ప్రధానోద్దేశములలో స్త్రీవిద్యాభివృద్ధి యగ్రగణ్య మైనది. ఈభాండాగారము స్థాపించినది మొదలు నేఁటిదనుక స్త్రీలకు వారు కోరు పొత్తముల చందా గ్రహింపకయె వారినిలయములకు గ్రంధాగార సేవకునిచే బంపి స్త్రీవిద్యను ప్రోత్సాహపఱచుచుండిరి. దీనికై ప్రత్యేకముగ నొకసేవకునిఁగూడ నియమించియుండిరి. ప్రస్తుతము 144 గురు నారీమణులు ఈ భాండాగారగ్రంధముల నుపయోగపఱచుచున్నారు. గతవత్సరమున సుమారు 2785 ఆంధ్రగ్రంధములు వీరిచేఁ బఠింపఁబడినవి. స్త్రీవిద్యను ప్రోత్సాహపరచుటకై గతవత్సరమునుండి స్త్రీలకు బహుమాన పరీక్షలు గావించుచున్నారు.

విజ్ఞానవల్లరిఅను పేరున నీతిబోధకములు జ్ఞానదాయకములునగు కరపత్రములు నాలుగువత్సరములనుండి ఈ భాండాగారపక్షమున మాసమునకొకసారి ప్రచురింపఁబడుచున్నవి. జనసామాన్యము యొక్కహృదయ సీమలందు సుజ్ఞానబీజముల నాటుట యీకరపత్రముల ముఖ్యోద్దేశమై యున్నది. దీనికి శ్రీపాలపర్తి నరసింహముగారు కార్యదర్శిగ నియమింపఁబడిరి.

గ్రంథభాండారముల కముద్రిత గ్రంథము లమూల్యాలంకారములు. ఒకపుస్తక భాండాగారముయొక్క యుత్కృష్టత యందలి యముద్రిత గ్రంధములయొక్క సంఖ్యనుబట్టి నిర్ణయింపఁదగును. ప్రాచ్యలిఖిత పుస్తక భాండారములయొక్క ప్రయోజనము లనంతములు. ఇట్టి భాండాగారములు ప్రతిపట్టణమున ప్రతిగ్రామమున నెలకొలుపఁబడవలయును.

64A

శ్రీ వీరేశలింగ పుస్తకభాండాగారము.




పెక్కువత్సరములు అధ్యక్షులుగానున్న
చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

GLB

వీరేశలింగ పుస్తక భాండాగారము.



ఆంగ్లేయ గ్రంథములున్న బీరువాలవరుస.




ఆంధ్ర గ్రంథములున్న బీరువాలవరుస.

64C

64D

శ్రీ వీరేశలింగ పుస్తకభాండాగారము.



సంస్థాపకులగు నాళం కృష్ణారావుగారు.

మనయాంధ్రదేశమున తాళపత్రగ్రంథము లింటింటను కుప్పలుతిప్పలుగ నున్నవి. కాని యవి యటుకులపైఁ బేర్పబడి కీటకములపాలై చివుకుచు జనసామాన్యమున కుపయుక్తములుగాక యున్నవి. ఇట్టి గ్రంథముల నెల్ల సంతరించివానిని సుస్థితియందుంచి జనోపయుక్తముగనొనర్చుట పుస్తకభాండాగారముల ముఖ్యవిధియైయున్నది. కాని యిపుడిప్పుడు మనయాంధ్రదేశమున వెలయుచున్న పుస్తక భాండాగారములు ముద్రిత గ్రంథములనె కాని యముద్రితగ్రంథముల సేకరించుటకై యత్నములు సలుపకున్నవి. ఇది మిగుల శోచనీయము. ఐనను ముద్రితగ్రంథములవలె నముద్రితగ్రంథముల సంపాదించుట యెల్లరకు సుకరముకాదు. కావున ప్రస్తుత మిట్టిభాండాగారములు ఆంధ్రదేశమునందలి ముఖ్యపట్టణములలోనైన నెలకొల్పఁబడినఁజాలును.

ప్రకృతము మన యాంధ్రభాషయందు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములు మూఁడుమాత్రమె యున్నట్లుకన్పట్టుచున్నది. అందు ఒకటి తంజావూరునందు రాజుగారి కోటయందును, తక్కినవి చెన్నపురిలో దొరతనమువారి చిత్రవస్తు ప్రదర్శనశాలయందొకటియు, ఆంధ్రభాషాపరిషత్తువారి కార్యస్థానమునం దొకటియునున్నవి. ఇందు తంజావూరు పూర్ణముగ నఱవదేశము. అచ్చటి కేగుట, యన్న ఆంధ్రులకు 'చీమకాశీప్రయాణము' వంటిది. ఇఁక చెన్నపురియో, అచ్చటనున్న యాంధ్రులకంటె అఱవలే హెచ్చు. కావున నీరెండు ప్రదేశములు ఆంధ్రులకు మిగుల దూరమున నుండుటచే, అందలి గ్రంథములు ఆంధ్రులకు 'అందనిమ్రానిఫలములు'. కావున నిట్టిభాండాగారములు ఆంధ్రులకందఱకు కరతలామలకములుగ నుండునట్లు ఆంధ్రదేశమునకు మధ్య నున్న ప్రదేశములయందున్నచో నత్యంతోపయుక్తముగ నుండును.

ఆంధ్రభాషకు పుట్టినిల్లయి, యాంధ్రమండలమునకు మండనాయమానముగనున్న రాజమహేంద్రవరమున నిట్టి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమును స్థాపించవలయునని చిరకాలమునుండి సంకల్పించుకొని రెండుసంవత్సరములక్రిందట తాళపత్రగ్రంథములను సేకరింప మొదలిడిరి. పెద్దాపురవాస్తవ్యులగు శ్రీరాజా వత్సవాయ రాయజగపతివర్మగారు తమయాస్థానమున నున్న సుమారు 40 తాళపత్రగ్రంథరత్నములు ఈ భాండాగారవధూటికి కంఠహారముగ నర్పించిరి. ఇప్పు డీభాండాగారమున తాళపత్రగ్రంథములును వ్రాతప్రతులునుసుమారు 60 గ్రంథములుకలవు. ఇందు పెక్కుగ్రంథములు ముద్రితములై యున్నవి. శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహముగారీసంఘమునకు పెక్కుసంవత్సరములు అధ్యక్షులుగ నుండియుండిరి.

ఈభాండాగారముయొక్క ఉద్దేశములు.

1. ఆంధ్రగీర్వాణభాషలయందుఁ గల గ్రంథముల నన్నియు, వలనుపడినంతవఱకు నాంగ్లేయగ్రంథములను అందు ముఖ్యముగ హిందూదేశ సంబంధమైన గ్రంథములను సంపాదించుట.
2. అముద్రితములగు ప్రాచీనాంధ్రమహాకవి ప్రణీత గ్రంథముల దొరికినంతవఱకు సేకరించి, యందు సుప్రసిద్ధ గ్రంథముల నచ్చొత్తించుట.
3. ఆంధ్రాంగ్లేయవార్తాపత్రికలను మాసపత్రికలను దెప్పించుట.
4. ఈగ్రంథములను పత్రికలను పఠనమందిరమునకుఁ జనుదెంచు చదువరుల నెల్ల నుచితముగఁ జదువుకొన నిచ్చుట.
5. ఇందలిగ్రంథములఁ దమగృహములకుఁ దీసికొనఁగోరుపురుషులకడ చందాగైకొని తన్మూలమున భాండాగారము నభివృద్ధిపరచుట.
6. ఇందలి గ్రంథములఁ జదువుకొనఁగోరు స్త్రీలకడ చందాగైకొనకయె వలయు పుస్తకముల వారిగృహములకు సేవకునిచేఁ బంపి స్త్రీవిద్య ప్రోత్సాహపఱచుట.
7. జ్ఞానదాయకములు దేశాభివృద్ధికరములు నగు నుపన్యాసముల నిప్పించుట.
8. భాషాభివృద్ధిని దేశభక్తిని నీతిని బురిగొల్పు పొత్తములను పత్రికలను కరపత్రములను ప్రచురించుట.
9. స్త్రీపురుషులయం దున్నతజ్ఞానమును వెంపొందించుటకై వత్సరమునకొకసారి పరీక్షలఁ గావించుచు నందుఁ గృతార్థులైనవారికి బహుమతుల నొసంగుట.

ఈ భాండాగారమునకు రాజమహేంద్రవరమున "హిందూబాల సమాజము" శాఖాసంఘముగనున్నది. ఈ గ్రంథభాండాగారమునకు భవనమును నిర్మించుటకై ఆరువేల రూపాయిలు గావలసియుండునని మదింపువేసియున్నారు. ఈగ్రంథాలయముయొక్క నామము యిటీవల "సర్వజన గ్రంథాలయ"మని మార్చియుండిరని దెలియవచ్చుచున్నది.

# నాచన సోమనాథుడు.

## చారిత్రికవిషయములు.

ఈకవిశేఖరుని చరిత్రము సంపూర్ణముగ నిదివఱకాంధ్రలోకమునఁ బ్రకటింపఁబడియుండలేదు. కవిజీవితకర్తలగు శ్రీ గురుజాడ శ్రీరామమూర్తి పంతులవారీతని చరిత్రము దొరకలేదని వ్రాసియుండిరి. పిమ్మట శ్రీవీరేశలింగము పంతులుగారీ మహాత్ముఁడు రచియించిన యుత్తర హరివంశమును వ్యయప్రయాసలకోర్చి తంజావూరు మహారాజావారి పుస్తక భాండాగారమునుండి వ్రాయించి తెప్పించి, ప్రకటించి యాంధ్రలోకమున కమితోపకారమొనర్చిరి. కాని ఈగ్రంథమువలనఁ గవిచరిత్రమేమియుఁ దెలియుటకాధారములు లేకపోయెను. గద్యమెక్కటి యీతఁడు తిక్కన సోమయాజి యనంతరమీ గ్రంథము వ్రాసినట్లు తెలియఁజేయుచున్నది. శ్రీవీరేశలింగము పంతులవారీతని గ్రంథమును బరిశీలించియు, నితరాధారములఁ జూచియు, నూహలఁజేసియు సందేహముతోఁ గొంత చరిత్రమును గవుల చరిత్రములోఁ బ్రకటించిరి. ఇటీవల శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారొకచోట నొక శాసనమును బ్రకటించి, శ్రీ వీరేశలింగము పంతులవారితోఁ గాలనిర్ణయ విషయమున నంగీకరించి, తక్కిన విషయములలో భేదాభిప్రాయముల నొసఁగిరి. అవియైన నూహించి వ్రాసినవి. కావున నింతవఱకీ కవిచక్రవర్తి చరిత్రము మనవారికిఁ దెలియదు. తెలిసికొనుటయైన సుకరముకాదు.

### ఈకవి యెప్పటివాఁడు?

ఈవిషయమై శ్రీ వీరేశలింగము పంతులవారిట్లు వ్రాసిరి. "వీనినన్నిటినిబట్టి విచారింపగా సోమకవి యెఱ్ఱాప్రగడకుఁ దరువాతను, శ్రీనాథాదులకుఁ బూర్వము నుండుట స్పష్టము. కాబట్టి యీతఁడు హూణశకము 1380 ప్రాంతములయందున్నాడని యించుమించుగా నిశ్చయింపవచ్చును." దీనికాధారములు మాత్రము వారెవ్వియుఁ జూపలేదు. వీరుచూపిన ముఖ్యకారణము "పిల్లలమఱ్ఱి పినవీరన్నయు 'మానన్నయ భట్టు దిక్కనకవి నెఱ్ఱాప్రగ్గడ సోమునిన్' అని యెఱ్ఱాప్రెగడ తరువాత సోముని జెప్పినాఁడు" అని కవులు ప్రబంధములయందు వ్రాసిన యాదికవిస్తుతి యందున్న వరుసనుబట్టి సోముఁడు యెఱ్ఱాప్రెగ్గడ తరువాతవాఁడని నిర్ణయించినారు. "ఇది న్యాయమా? సత్యమగునా?" అని సందియము గలిగి నేనీవిషయమున సూక్ష్మముగఁ బరిశీలించితిని. నీలాసుందరీ పరిణయము, యేకాదశీ మహాత్మ్యము మున్నగు ప్రబంధములలో ననేకచోట్ల సోముని యెఱ్ఱాప్రగడకంటె బూర్వమే పేర్కొనిరి. కొందఱు కేవలము యతిప్రాసములకొఱకు సోముని తిక్కనకంటెఁ బూర్వము పేర్కొనిరి. కావున నట్టి స్వల్పకారణముల నాధారము చేసికొని కాలనిర్ణయము చేయరాదు. శ్రీవీరభద్రరావుగారొక శాసనమును కనుగొని రంటినిగదా! అందువలన సోముని విషయమై మనకనేక నూతనాంశములు తెలిసినవి. శ్రీ వీరభద్రరావుగారు మాత్ర మాశాసనమునకుఁ గొంత విపరీతార్థములఁ గల్పించిరి.

ఆశాసనమున కాలనిర్ణయభాగమిట్లున్నది:—

"అలంకృత శకస్యాబ్దే రసా(ర్తు)నయ నేందుభిః॥

ఇందు(ర్తు) అను నది శాసనమును కనుగొనిన "రైసు" గారు ఎపిగ్రాఫికా కర్నాటికా పదియవసంపుటమున, విపరీత వ్యాఖ్యానములతో నీ"ర్తు" నుపూరించిరి. ఇందున్న రస=6, అర్తు=6 ఋతువులు, నయన=2, ఇందు=1 గణితశాస్త్రప్రకారము 6621(అంకానాం వామతో గతిః.) యెడమవైపునుండి లెక్కించినయెడల 1266 శాలివాహన శకమగుచున్నది. అది పూరించిన వారిపొరపాటు సరిగఁ జూడక 1266+78=1244 క్రీ. శ. మని యంగీకరించి, వీరేశలింగము పంతులవారి కాలనిర్ణయ సిద్ధాంతమును వీరభద్రరావుగారంగీకరించిరి.

నాకీవిషయమై సందేహము కలిగి పరిశీలనము చేయుచుండ నదృష్టవశమున నాకు మఱియొక శాసనము దొరికినది. అందు కాలనిర్ణయ భాగమిట్లున్నది:—

"అలంకృత శకస్యాబ్దే । రసభునయ సేందుభిః"
శాసనమూలము కన్నడ లిపియందుండుటచే నేనెట్లో శ్రమ చేసి యది "రసాభూనయ సేందుభిః" యని యొక కన్నడ మిత్రుని సాయమున స్థిరపఱచితిని. అందువలన నది 6121=1216+78=1294 క్రీ. శ. మైనది. కాని యిది యు సందేహముగనేయుండెను. పిమ్మట వీరభద్రరావు గారి శాసనమునకు మూలముచూచితిని. అందు "రసాభ్ర నయ సేందుభిః" అనియుండెను. ఇది దిద్దుబాటులక్కర లేక యున్నదియున్నట్లున్నది. అందువలన నది 1206+78=1284 క్రీ. శ. మగుచున్నది. వీరభద్రరావుగారుపా రబాటున ప్రతి లిఖియించిరో, అచ్చుతప్పోయని నేనీ కడపటి పాఠము నున్నదియున్నట్లుతీసికొంటిని. వెంటనే 1284 లో నాశాసనము పుట్టియుండునని నే తలఁచి య ట్లు కొంతకాలమున తెలుఁగు పత్రికలలో బ్రకటించితిని. నాకుఁ దోఁచినమఱికొన్ని యితరా ధారములఁగూడనప్పు డు చూపియుంటిని. కాని, యవి యిచ్చట వ్రాయుట మానితిని. నాసిద్ధాంతము నెవ్వరు పూర్వపక్షము చేయ లేదు. వీరభద్రరావుగారిని బ్రత్యుత్తరముకూడ వ్రాయుఁ డని పత్రికాముఖమునఁ గోరియుంటిని. వారొకసారియొ నర్చిన ప్రసంగమున సోముఁడు శంభుదాసునకంటె నిం చుక బూర్వుఁడనవచ్చునని మాత్రము చెప్పిరి. నేను 27-10-14 న సువర్ణ లేఖాపత్రికలో వ్రాసిన వ్యాసము నందలి యుక్తులకెవ్వరును సమాధానము వ్రాయలేదు.

ఇటీవల నాంధ్రసాహిత్య పరిషత్పత్రికలోఁ బ్ర కటింపఁబడిన విప్రనారాయణచరిత్రమున మఱలనాకుఁ గొన్నియాధారములు దొరికెను. అప్పుడుమఱల నేనిట్లు ప్రకటించితిని.

"సోముఁడుత్తర హరివంశమును వ్రాసినపిమ్మట యెఱ్ఱాప్రగడ హరివంశమును వ్రాసెను. చెదల్వాడమల్ల య్య రచియించిన విప్రనారాయణ చరిత్రావతారిక పద్య ములలో

ఉ. శాతకృపాణ నిర్దళిత
 శత్రుఁడు నారసింహధా
 త్రీతల భర్తయా గజప
 తి ప్రముఖుల్ చతురంతయానభూ
 పాలపనీయ వస్తువులొ
 సంగదనర్చిరి నీయనుంగు ము
 త్తాతయుఁ దాతయున్సుభవి వి
 ధాతలు మల్లనయెఱ్ఱనాహ్వయుల్.
 ఆ. ౧. ౧౬.

(ఇందు 'యెఱ్ఱన మల్లనాహ్వయుల్' అనియుండ వలసినట్లు తోఁచుచున్నది?)

కవితాతయగు యెఱ్ఱాప్రగడ (ముత్తాతనై యుం డవలయునని తోఁచుచున్నది?) సాళువ నరసింహరాజు కడ బహుమానములందినట్లున్నది. ఈయెఱ్ఱన శంభుదా సుఁడే! విప్రనారాయణ చరిత్రముననే యిట్లున్నది.

గీ. సుకవిసంస్తుత్యుశంభుదా ♦ సుని నుతింప
 నేర్తునేనైన నేనువ ♦ ర్ణింతునతని
 చిన్నమనుముఁడ గావున ♦ చిన్నవాండ్ర
 కొదవుపలుకులు ముద్దునే ♦ యుదురుకాదె.
 ఆ. ౧. ౧౨.

కావున హరివంశము రచియించిన శంభుదాసుఁ డే యీతఁడు. ఇంకనుసందేహముండినచో నిదిచూడుఁడు.

ఆ. దురితహరుప్రబంధ పరమేశ్వరుని
 జెదల్వాడ నిలయు వాడు వంశకర్త
 ధన్యమూర్తి శంభుదాసు నెఱ్ఱాప్రెగ
 డ ను నుతింపబ్రహ్మకునుదరంబె.
 ఆ. ౧. ౧౩.

కాబట్టి యెఱ్ఱాప్రెగడ సాళువ నరసింహరాజు కడ బహుమానములనంది యాతని కాలమున నుండెను. ఈ సాళువ నరసింహరాజు విజయనగర నిర్మాణమైన పి మ్మట రాజ్యముచేసిన (1) హరిహర (2) బుక్కరాయ లు మొదలగు వారివంశములోఁ గడపటి పురుషుఁడు. అనగా విజయనగరమును 1334 మొ॥ క్రీ॥ శ॥ 1400 వఱ కును, (నావాదమునుసరించి 128- మొదలు 1400 వఱ కును) పాలించిన పదముగ్గురురాజులలో పదమూడు తర ములవఱకు నరసింహరాజను పేరుగల రాజేలేఁడు! ఇఁక నున్న వారెవరనగా 1490—1509 వఱకు ముగ్గురు నరస

రాయలు కలరు. విప్రనారాయణ చరిత్రమునఁ జెప్పిన "ఉ. శాతకృపాణనిర్దళిత" యనుపద్యమునందలి సాళువ నరసింహరాజు పిల్లలమఱ్ఱి పినవీరన జైమినీభారతమును కృతినందిన నరసింహరాయుడే యైయుండు ననుకొనిన చో (అనగా మొదటినరసింహరాయలే యనుకొనినను) యెఱ్ఱాప్రగడ పిల్లలమఱ్ఱి పిన వీరనకాలీనుఁ డగుచున్నాడు. కావుననే వీరన్న, నన్నయ, తిక్కన, నాచన సోమన, శ్రీనాథులను మాత్రమే శృంగార శాకుంతలమున వర్ణించియున్నాడు. దీనిని బట్టి శ్రీనాథుఁడు యెఱ్ఱాప్రగడ పిల్లలమఱ్ఱి పిన వీరన, సమకాలీనులని దోఁచుచున్నది. కాని యెఱ్ఱాప్రగడయంతకుఁ బూర్వము పండ్రెండుగురు రాజులకుఁ బూర్వముగల బుక్కరాయనితోసమకాలీనుఁడైన నాచనసోమనాథునితో మాత్రమెన్నటికిని సమకాలీనుఁడుకాఁడు!!"(19-1-1915(సువర్ణ లేఖ' చూడుఁడు) ఇందువలన నాచన సోమనాథుఁడు 1284 క్రీ॥ శ॥న బుక్కరాయఁడిచ్చిన శాసనమునసురించి, 18 వ శతాబ్దాంతమునను14 వ శతాబ్దాదిని యుండియుండవలయునని దలంచెదను. పెద్దలు నిర్ణయింతురుగాక!

## కవికులమెద్ది?

వీరేశలింగము పంతులుగారు వీలైనచోటులనెల్ల "యీకవి యారువేల నియోగి" యనిచెప్పినట్లే యీతనినియోగియని చెప్పిరి. "అట్లుకాదు శాసనమున (అష్టాదశపురాణజ్ఞుఁడ'ని వ్రాసియున్నది. ఈతఁడు వైదికియైయుండును"ని వీరభద్రరావుగారనిరి. "ఏదియుకాదునాకు కొన్నిచాటుధారలువచ్చును; ఈతిడు క్షత్రియుఁ"డనిసెలవిచ్చిన క్షత్రియమిత్రుఁడెను శాసనమునం దతఁడు బ్రాహ్మణుఁడని స్పష్టముగ వివరింపఁబడియున్నది. నియోగియా వైదికియాయను విచారణమంత యావశ్యకమైనదికాదు. కేవలమొక్క మతమునందున్న స్మార్తుల యందీ స్వల్పభేదమును గురించి తెలియకపోయిన నష్టములేదు. తెలిసికొనక తప్పదందురా?

ఈతని యింటిపేరు నాచిరాజువారు. ఇందుకు దాహరణము:— కూచిమంచి జగ్గకవి సుభద్రాపరిణయమునందలి కృత్యాదిని "నాచిరాజు సోముని" అనివర్ణించినాఁడు. జగ్గకవి యిటీవల వాఁడాతనిమాటలు పనికిరావందుమా? సోమునికిఁ బిమ్మట శతాబ్దముననున్న పిల్లలమఱ్ఱి పినవీరన శృంగార శాకుంతలమున "నాచిరాజుని సోము" అని వ్రాసియున్నాడు. 'రాజు' అని యింటిపేరు వైదికులయందరుదు. కావున నీతఁడు నియోగియని చెప్పఁగును. ఇంకను సందేహమున్న నారువేల నియోగి కవియగు కోవెల గోపరాజు వైదిక కవులవేఱుఁగ వర్ణించి నియోగుల నిట్లు వర్ణించెను చూడుఁడు!

చ. అనఘుహుళక్కి భాస్కరుమ
హామతి పిల్లలమఱ్ఱి పెద్దరా
జును బినవీరరాజు కవి
సోముని తిక్కనసోమయాజి కే
తనకవి రంగనాథునుచి
. తజ్ఞుని నెఱ్ఱన నాచిరాజుసో
మన నమరేశ్వరుం దలతు
మత్కులచంద్రుల సత్కవీంద్రులకా.

అని స్పష్టముగ "నాకులచంద్రులు" అని వ్రాసియున్నాడు. కావున నాచనసోమనాథుఁడు నియోగియని స్పష్టముగ చెప్పవచ్చును.

## ఇంటిపేరు.

నాచిరాజను పూర్వపురుషుని పేరున బిలువఁబడు యింటిపేరుగల యాతఁడని చెప్పవచ్చును. ఈయింటిపేరు నాచిరాజను సోమునితాతనుండియో తండ్రినుండియో వచ్చియుండు పౌరుషనామమే యైయుండును.

## గోత్రము. సూత్రము.

భరద్వాజస గోత్రజుఁడని శాసనమున స్పష్టముగనున్నది. స్థలాభావమున నుదాహరింపనైతిని. (ఎపిగ్రాఫికా కర్నాటికాలో నేకనుగొనిన 46 గొరి బిదునూరు శాసనముకాని, వీరభద్రరావుగారు కనుగొనిన 158 మళబాగల శాసనముకాని చూడుఁడు)

అపస్తంబసూత్రుఁడగుట బ్రాహ్మణుఁడగుట నిర్వివాదాంశము! (Vide inscription).

## గురువు.

"ఇది బుధారాధనవిరాజి కొమ్మనామాత్యపుత్ర తిక్కన సోమయాజి ప్రణీతభారతకథానంతరము" అని తనయుత్తర హరివంశ గద్యమున సోముఁడు వ్రాసియుంట నీతఁడు తిక్కనయందు గురుభావముకలిగి ప్రవర్తిల్లెనని నిర్ణయింపనగును. ఈతఁడు తిక్కన వృద్ధాప్యమున పడుచువాఁడై యుండవచ్చును. శిష్యుఁడైనఁగావచ్చును.

## ఇష్టదైవము.

తిక్కన సోమయాజికి వలెనే యీతనికిఁగూడ హరిహరదేవుఁడే యిష్టదైవము. కావుననే బైచరాజు వేంకటనాథ కవి తన పంచతంత్రమున నిట్లు వక్కాణించియున్నాఁడు.

క. ఏచనువుకలదు హరిహర
సాచివ్యమునొంద నన్యజనులకు మదినా
లోచింపఁదిక్కయజ్వకు
నాచనసోమునకు మఱియు నాకుందక్కన్.

## మతము.

స్మార్త బ్రాహ్మణుఁడు. శివకేశవ భేదములేని మహామహుఁడు నద్వైయితియని యాతని గ్రంథమునుబట్టియు శాసనమునుబట్టియు నిర్ణయింపనగును.

## తండ్రి.

ఎఱ్ఱయకవి సకలనీతి కథానిదానమునందీ సోముని నిట్లు వర్ణించియున్నాఁడు.

చ. వినుతియొనర్తు నాంధ్రసుక
వీంద్రుల నన్నయభట్టు దిక్కయ
* * *
* * * నా
చనసుతు సోముభాస్కరుని

ఇందలి "నాచనసుతు" అనుదాని ననుసరించియు శాసనమునందలి "నాచనాత్మజః" అనియుఁ గలవాక్యముల ననుసరించియు నీతని తండ్రిపేరు 'నాచన్న' యని తెలియుచున్నది. వీరభద్రరావుగారు శాసనమునందలి "నాచనాంబుధిః" అనువాక్యములఁజూచి 'నాచన' యీతని తండ్రిపేరు కాదనిరి. 'నాచన' యనునది తండ్రిపేరు నింటిపేరుకూడనని తోఁచుచున్నది.

## వ్రాసినగ్రంథములు.

ఈతఁడు వ్రాసినది యుత్తరహరివంశ మొక్కటియె దొరికినది. అదియైన కృత్యాదిలేదు. అదియెంతవఱకు వ్రాయఁబడినదో తెలియదు. సోముని వసంత విలాసములోనిదని "అత్తరి విట నాగరికులు" అనుపద్యము లక్షణగ్రంథములఁజూచి వీరేశలింగము పంతులుగారు వ్రాసియున్నారు. "అంజెదవుగాక" అనునది రెండవపద్యము. ఈరెంటిలో రెండవది యుత్తర హరివంశములోనిదే! "అత్తరివిట నాగరికుల" నునది పైజయంతీ విలాసములోనిదని శబ్దరత్నాకరములో వ్రాయఁబడియున్నది. నా మిత్రులగు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారా వసంతవిలాస గ్రంథమునందలి మఱికొన్ని పద్యములు దొరికినట్లును, వసంతవిలాసముయక్షగానమైనట్లును చెప్పెదరు. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారివద్ద వసంతవిలాస ప్రతియున్నట్లు కొందఱు మిత్రులు చెప్పెదరు. ఇదమిద్ధమని చెప్పుటకువీలులేకున్నది.

నాకుఁదెలిసినంతవఱకుఁ గవిచరిత్రమును సంగ్రహముగ వ్రాసితిని. ఇందు ప్రమాదములుండినసుండవచ్చును. ఈమహాకవికవిత్వ విమర్శనమునకు మఱియొకసారి ప్రయత్నింప దలఁచితిని. దయామయులగు చదువరులిందలి గుణదోషముల నరసి సత్యప్రకటనమునకు సాయపడుదురుగాక!

వం. సుబ్బారావు.

# గ్రంథభాండాగారసంఘములు.

## అమెరికాదేశము.

అమెరికాదేశ గ్రంథ భాండాగార సంఘము. "ఫిలడెల్ఫియా" యను పట్టణమున 1876వ సంవత్సరమున ప్రసిద్ధికలుగు భాండాగారాధిపులచే సమకూర్పబడినది. ప్రథమవత్సరము నందాసంఘమున 108 మందిమాత్రము సభ్యులుగానుండిరి; ఇపుడాసంఖ్య 1900 వరకు బెరిగినది. ప్రాథమిక దశయందా సంఘముయొక్క వృత్తాంతములన్నియు 'గ్రంథభాండాగారపత్రిక' యందు బ్రకటింపబడుచుండెను. 1907 సం॥ నందు ఆసంఘమువారు ప్రత్యేక మొకపత్రికను బ్రకటింప నారంభించిరి. గ్రంథాలయ ప్రయోజనముల నాలోచించుటయు, పరస్పరము అభిప్రాయములను అనుభవములను వెల్లడించుకొనుటయు, గ్రంథాలయముల కొరకు ఉపయోగించుచున్న శ్రమను ద్రవ్యమును ఎక్కువయుపయోగ కరముగ వినియోగించునటుల జేయుటయు పుస్తకశాలాధిపత్యమును వృత్తిగ నభివృద్ధిజేయుటయు, ఆసంఘముయొక్క ముఖ్యవిధులై యున్నవి. ప్రత్యేక మొక వ్యక్తివలన కాజాలని సంస్కరణములను అభివృద్ధులను సంఘముగా జేయుటవలన గలిగెడు బలమువలన సాధించుటయు, అందరును కలసి పనిజేయుటవలన గ్రంథాలయమునకు వినియోగమగు శ్రమను ద్రవ్యమును తగ్గించుటయు, కష్టవిషయములను తీర్మానించుటకుగాను వివిధశోధనలను అనుభవములను పోల్చుకొని చర్చించుటయు, సభలమూలమునను, ఉత్తరప్రత్యుత్తరముల మూలమునను పరిచయమును స్నేహభావమును అభివృద్ధి జేసికొనుటయుగూడ ఈసంఘముయొక్క అభిప్రాయములై యున్నవి.

ఈప్రకారము, సార్వజనిక గ్రంథాలయము విద్యావిధానమునందు ప్రాధాన్య భాగముగ వికసించి పెంపొందుటకు వలయు అనుభవవేద్యములగు మార్గములన్నిటిని ఈసంఘము వెదకు చుండును. కొన్ని స్థలములయందు సాంఘికుల ప్రత్యేక ప్రయత్నములవలనను, మఱికొన్ని స్థలములయందు కొందరుకూడి ప్రయత్నించుటవలనను, గ్రంథాలయములను స్థాపించుటకుగాని అభివృద్ధి జేయుటకుగాని ఈసంఘము పాటుబడుచుండును. తద్వారా ఉత్తమంబగు విద్య సర్వజనులకును సులభసాధ్యమగునటుల జేయును. పుస్తకశాలాధికారులును, గ్రంథాలయోద్యమమునందు అభిమానముగలవారందరును ఈసంఘమునందు జేరవచ్చును.

అమెరికాదేశ గ్రంథభాండాగారసంఘముయొక్క స్థాపన మనేక దేశములయొక్క దృష్టినాకర్షించినది. అందుమీద ఇంగ్లాండుదేశమునకు రాజధానినగరంబగు 'లండను' నందు 1879వ సంవత్సరమున 'అమెరికా' 'ఇంగ్లాండు' దేశముల పుస్తకశాలాధికారులందరును గలసి సమావేశమై "సంయుక్తరాష్ట్ర భాండాగార సంఘము"ను ఏర్పాటుగావించిరి.

మఱియు అమెరికాఖండమునందు 'రాజధాని సంఘములు'ను గలవు. 'అమెరికా దేశ గ్రంథభాండాగార సంఘము' దేశమునంతకును ఎట్టిలాభమును జేకూర్చుచున్నదియో, యట్టిలాభమునే "రాజధాని సంఘములు" తమతమ రాజధానులకు జేయుచున్నవి. పల్లెగ్రామముల యందున్న గ్రంథశాలాధికారులు 'అమెరికాదేశ గ్రంథభాండాగారసంఘము' యొక్క సభలకుబోవుట దుస్సాధ్యముగానుండును. కాబట్టి అట్టివారు "రాజధాని సంఘము"యొక్క సభలకు బోయెదరు. ఇట్టిరాజధాని సంఘములా దేశమున ముప్పదియారు గలవు.

చదువరులారా? ఇంతటితో ఇట్టి సంఘములకు మితియుండునని మీరు తలంచితిరేని అట్టియూహ సత్యమునకు దూరమైయుండును. ఒక్క పట్టణమునందుండు వివిధగ్రంథభాండాగారములవారుగాని, చుట్టుప్రక్కలనుండు గ్రామముల గ్రంథభాండాగారములుగాని, కూడి గ్రంథభాండాగార సమాజముల నేర్పరచుకొనెదరు. ఈసమాజములవలన వివిధ భాండాగారములవారు పరస్పరపరిచయము నభివృద్ధి జేసికొని తమకు సంబంధించిన విషయములనుగూర్చి చర్చించుకొనెదరు. మఱియు విద్యాధికులను రప్పించి వారి యుపన్యాసములను వినెదరు. ఇట్టి సమాజములలో కొన్ని గ్రంథవిషయ విభజనమునందును

ఇతరవిషయములయందునుగూడ అమూల్యమగు పనిని సల్పినవి. గొప్ప గ్రంధాలయముల యందలి ఉద్యోగస్థులందరునుగూడి "ఉద్యోగస్థుల సముదాయము"ల నేర్పరచుకొందురు. సమాజములకును వీటికిని స్వల్పభేద ముండునప్పటికిని వీరును వారుజేయుపనినే సలుపుచుందురు; వీరి సభలకు ఇతర పెద్దమనుష్యులనుగూడ నాహ్వానము జేసెదరు.

ఇంతియగాక 'గ్రంధాలయ సంఘములు' గూడ గలవు. ఇవి ఆయాపట్టణములకు సంబంధించి మాత్రముండును. కావలసిన విషయములను ఇతరస్థలములకు బోయి నేర్చుకొనుటకుగాని, మహాజనసభలకు బోవుటకుగాని, కాలమును ద్రవ్యమును గలిగియుండని వారందరికిని ఈ సంఘములు అత్యంతోపయుక్తములు.

## బరోడారాష్ట్రము.

ఉచితప్రారంభవిద్యతోబాటు సరిసమానముగా గ్రంధభాండాగారోద్యమమును బరోడారాష్ట్రమున నెలకొల్పబడినది. ఆరాష్ట్రప్రభువులగు శ్రీ శాయాజీరావు మహారాజాగారు దీనికంతకును ప్రాణాధారము. పైన జెప్పబడిన మార్గముల ననుసరించియే బరోడా యందును "గ్రంధభాండాగార సమాజ" మొకటిస్థాపింపబడినది. గ్రంధభాండాగారోద్యమమునం దభిమానము గలిగినవారందరును ఈసమాజమునందుజేరి వారికభిమానములగు విషయములను గూర్చి జర్చింపవచ్చును.

బరోడాయందున్న కేంద్ర గ్రంధాలయమునందు మొదట నీసంఘమిరువది యైదుగురు గ్రంధభాండాగారకులతో ప్రారంభింపబడెను. ఇప్పుడుబరోడారాష్ట్రమున మూడువందలనేబది కంటె నెక్కుడుభాండాగారములుగలవు. సర్వగ్రంధాలయాధ్యక్షులును నొక్కచో సమావేశమైయందు వారియనుభవముల నన్యోన్యము దెలిసికొని, పుస్తకాలయ వ్యాపనమునకు సంబంధించిన వివిధవిషయములను జర్చించుటవారి యుద్దేశము. ఈసంఘము కేవలము బరోడా రాజ్యమునందలి గ్రంధాలయాధికారులనేగాక భరతవర్షమునందన్ని తావులను గలవారి నాకర్షించి, సంఘీభావమును వృద్ధిపరచి, జర్మనీ, యింగ్లాండు, అమెరికా మొదలగు దేశములందువలె జాతీయసంఘముగా నేర్పడుచున్నది.

## ఆంధ్రదేశము.

గ్రంథభాండాగారోద్యమమునుగూర్చి ప్రపంచమునందు జరుగుచున్న యభివృద్ధినిజూచి సంతసించి, ఆంధ్రదేశముయొక్క దుస్థితికి జింతించి, బెజవాడయందున్న రామమోహన ధర్మపుస్తకభాండాగారము వారి యాదరణక్రింద 1914 సం. ఏప్రియలు నెల 10 వ తేదీన బెజవాడపట్టణమున "ప్రథమ ఆంధ్రదేశగ్రంధ భాండాగార ప్రతినిధులమహాసభ" కూడినది, "ఆంధ్రదేశమునందు గ్రంధభాండాగారోద్యమమును వ్యాపింపజేయుట" యే ఈసభాతీర్మానములయందు ప్రాధాన్యమును వహించినది. ఆతీర్మానముల నన్నిటిని ఆచరణయందు బెట్టుటకుగాను "ఆంధ్రదేశగ్రంధ భాండాగార సంఘ" మేర్పాటు గావింపబడినది. కృష్ణాజిల్లా యందున్న బెజవాడ, గుడివాడ, తణుకు తాలూకాలయందును, గుంటూరుజిల్లా తెనాలి తాలూకాయందును, గోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకాయందును ఇతరతాలూకాలకంటె కొంచెమెక్కువ భాండాగారములు కలవు. అందుచేత ఈ తాలూకాలయందు గ్రంధాలయముల నేర్పాటుజేసి పనిజేసిన మిక్కిలి యభివృద్ధిజెందుననుట కెంతమాత్రమును సందియము లేదు.

---

మ. లలినొక్కొక్కతెఱంగు రంగులనులీలల్ మబ్బులందుండుఁ బెం
దులకో ధాత్రిని బుష్పజాతిఁ గనువిందుల్ సేయగానైన వెం
దులకోయుండుట రంగులంచని మదిన్ యోజింపగా గాంచితిన్
పలురంగుల్ గల యాటవస్తువులు బాబాసీకు దెచ్చుచో. (గీతాంజలి).

# * క్షాత్రయుగమునాటి హిందూర్యులు, వారి యుడుపులు.

క్షాత్రయుగమునాఁటి మనవారి స్థితిగతులను వారి యాచారవ్యవహారములను దెలుపు ముఖ్యగ్రంథములు భారత రామాయణములు. వేల సంవత్సరముల క్రింద నుండిన మన పూర్వికు లెట్టియుడుపులను ధరించుచుండిరో తెలిసికొనవలయుననిన మన మా గ్రంథములతో నెక్కువ పనిఁగొనవలసియున్నాము. ఈ యంశమును గుఱించిన వివరములు వానిలోనైనను విస్తారముగా గానరావు. అయినను ఉన్న సంగతులనుబట్టి మన మేమి గ్రహింపవలయునో చూతము.

పురుషు లాకాలమున ధరించుచుండిన యుడుపులు మిక్కిలి సామాన్యమైనవి. అప్పటివారి యుడుపులనఁగా, ఎక్కువపొడవు తక్కువవెడల్పుగల రెండు విడి వస్త్రములుమాత్రమే యైయుండవచ్చును. ఒకటి కట్టుకొనఁబడునది, రెండవది కప్పుకొనఁబడునది. మొదటిది నడుమునుండి క్రిందిభాగమును గప్పుచుండెను; రెండవది నడుముమీఁదిభాగము నాచ్ఛాదించుచుండెను. ఈయూహ కేవలము కల్పితమైనదని తలఁపఁగూడదు. ఇది సప్రమాణమనుట నిస్సంశయము. ద్రౌపది కౌరవసభలోనికి లాగికొనిరాఁబడినపుడు, దుర్యోధనుఁడు ఆమె చూచుచుండఁగాఁ దన కుడితొడమీది వస్త్రమును దొలగించెనని మహాభారతమందున్నది. దాదాపుగా నిప్పటికాలమున వాడుకయందున్న విధమున ధోవతిఁగట్టికొనిననేకాని అతఁడట్లు తన కుడితొడను అనాచ్ఛాదితముగాఁ జేయుట సంభవింపదు. రాజు మొదలు జనసామాన్యమువఱకు నందఱును ధోవతినే కట్టుకొనుచుండినట్లుకూడ తోఁచుచున్నది. భేదమేమైన నుండినచో వస్త్రముయొక్క మృదులత్వమునందును నేతయొక్క సన్నదనమునందును ఉండవచ్చును. ధృతరాష్ట్రుఁడు పుత్రునిశరీరము కృశించినందునకుఁ గారణమునడుగుసందర్భమున నిట్లనును "నీవు ప్రావారవస్త్రములను ధరించుచున్నావు. మాంసముతో నన్నమును భుజించుచున్నావు. దివ్యాశ్వముల నెక్కి సవారీచేయుచున్నావు. ఇట్టి నీవు కృశించుటకుఁ గారణ మేమి?" 'ప్రావారవస్త్రము'లనఁగా నేమో వ్యాఖ్యాత వివరించలేదు. అయినను పైశబ్దమునకు మనము అందమైన వస్త్రములని యర్థము చెప్పిన చెప్పవచ్చునని తలఁచెదను. శరీరోర్ధ్వభాగము నాచ్ఛాదించుచుండిన రెండవ వస్త్రమును గుఱించి మనకంతగాఁ దెలియదు. మతగ్రంథములలో వచ్చిన 'ఉత్తరీయ' శబ్దమునుబట్టి మన మీ రెండవ వస్త్రముండెనని నిశ్చయించుకొనవలసినవారమైతిమి. ఈవస్త్రము వెనుకఁజెప్పినప్రకారము శరీరోర్ధ్వభాగమున గప్పికొనఁబడుచుండెడిది. కొన్నివేళలయందు కుడిచేయి అనాచ్ఛాదితముగా వదలివేయఁబడుచుండెను. అట్టి సమయమున నీ యుత్తరీయము కుడిచంకక్రిందినుండి యెడమభుజముమీఁదికిఁ బోవుచుండెనని యూహింపవలయును. విద్యార్థులు 'తమ చేతిని బయటకుఁతీసియుంచవలయు'నని మనుస్మృతి విధించియున్నది. ¶ దీనికి వ్యాఖ్యాత 'ఉత్తరీయముకప్పక బయటకుఁ దీసియుంచవలయు'నని యర్థముచెప్పియున్నాఁడు. పురాతనకాలపు హిందూర్యులు యుద్ధ సమయములందు ఉత్తరీయము నిట్లే వైచికొని దానిచెఱఁగులను ఎడమభుజముపైనఁ గట్టిగా ముడివేసికొనుచుండిరని తోఁచుచున్నది.

---

* క్షాత్రయుగమనఁగా మన దేశచరిత్రములోని యొక నిర్ణీతకాలము. ఈకాలమున మనదేశమునందలి వీరకావ్యములగు రామాయణభారతములు రచింపఁబడినందున దీనికి క్షాత్రయుగమని పేరు పెట్టఁబడినది. పాశ్చాత్యవిద్వాంసులును వారి ననుసరించిన మనవిద్వాంసులును ఈయుగముయొక్క పరిమితి వేయిసంవత్సరముల (క్రీ. పూ. ౧౨౦౦ నుండి క్రీ. పూ. ౨౦౦ సంవత్సరములవఱకు) దని సిద్ధాంతీకరించియున్నారు. సి. వి. వైద్యా ఎం.ఏ., ఎల్. ఎల్, బి. గారు క్షాత్రయుగవైశాల్యమును ఇంచుమించుగా క్రీ. పూ. 3000 నుండి క్రీ. పూ ౨౫౦ వఱకు నిర్ధారణ చేసియున్నారు. వీరి యభిప్రాయముతో నందఱు ఏకీభవింపకపోయినను, వీరు చెప్పినయంశములను వివరములను మనము పాశ్చాత్యవిద్వాంసులచే నిశ్చయింపఁబడిన క్షాత్రయుగమునకే వర్తించునవి యని యూహించుకొనవచ్చును. వైద్యాగారి మతమున భారతయుద్ధము క్రీ- పూ- 3౧౦౧ వ సంవత్సరమున జరిగినది- గ్రంథము తరువాత కొలఁదికాలమునకే వ్రాయఁబడెనని వారభిప్రాయపడుచున్నారు.

¶ నిత్యముద్ధృతపాణిస్స్యాత్-

వెనుకఁ జెప్పఁబడియున్న రెండు వస్త్రములు తప్ప, అధమపక్షము క్షాత్రయుగారంభమున, హింద్వార్యులు మఱేయుడుపులను ధరించియుండినవారు కారు. లాగులు జాకెట్లు ఎట్టివో వారెఱుఁగరు. కోట్లు చొక్కాలు వారికిఁ దెలియవు. బట్టలను గత్తిరించి తీరుతీరు ఉడుపులుగా గుట్టుట ఆకాలమున లేదు. కుట్టుపని మొట్టమొదట బహుశః * 'సెమిటిక్కు'లలోఁబుట్టినదై యుండవచ్చును. అది గ్రీకులు పంజాబుదేశమును జయించిన కాలముననో, అంతకుఁ బూర్వము హింద్వార్యులకు పారసీకులతో సంబంధము కలిగినట్టి డేరయసు పరిపాలన కాలముననో మనదేశమునఁ బ్రవేశించి యుండవచ్చును. రామాయణమున † కుట్టుపనివాఁడు వచ్చియున్నాఁడు. కాని మహాభారతమున వానిజాడ ఎచ్చటను కానరాదు. ఇంతమాత్రమున మహాభారతము రచింపఁబడిన కాలమున కుట్టుపనివాఁడు ఉండనేలేదను × అభావవాదమున కవకాశము లేదు. అది యటుండనిండు. మొత్తముమీఁద క్షాత్రయుగారంభమున హింద్వార్యులలో పురుషులు రెండు వస్త్రములలో నొకదానిఁ గట్టికొని రెండవదానిఁ గప్పుకొనుచుండిరని విశ్వసించుటయందభ్యంతరమేమియును లేదు.

ఆకాలపు స్త్రీలుసైతము రెండు వస్త్రములనే ధరించుచుండిరని తోఁచుచున్నది. అయినను వీరివస్త్రములు పురుషుల వస్త్రములకంటె నెక్కువ పొడవుగా నుండెడివి. కట్టుకొనఁబడు వస్త్రము శరీరోర్ధ్వభాగమును గూడ—అనఁగా భుజములవఱకు—గప్పియుంచుచుండెను. చేతులనుమాత్రము దానితో కప్పుకొనక విడిగా నుంచుచుండిరి. గుజరాతు, బంగాళము, మద్రాసు, దక్కనులలోని స్త్రీలు నేఁటికిని అట్లే తమ చీరెలఁ గట్టుకొనుచున్నారు. ఉత్తరీయము తలపైనఁ గప్పుకొనుచు సమయమువచ్చినపుడు దానిని ముసుకుగా వేసుకొనుచుండిరి. ఉత్తరహిందూస్థానమం దిప్పటికిని స్త్రీలు ఉత్తరీయమును విధిగా ధరించుచుందురు. దక్షిణహిందూదేశమందు ఇప్పుడు వాడుకలోనున్న చీరెలు పొడవుగానుండుటవలన వేఱే యుత్తరీయము అనవసరమయినది. ఉత్తర హిందూస్థానమున ఇప్పటివలెనే పూర్వమునఁగూడ స్త్రీలు బయటికిఁబోవునపుడు మాత్రమే యుత్తరీయమును ధరించుచుండిరి.

ద్రౌపదిని అంతఃపురమునుండి బలాత్కారముగా కౌరవసభకు ఈడ్చుకొనివచ్చిన సందర్భమును వర్ణించుచు మహాభారతమున వ్రాయఁబడిన సంగతులు పైయభిప్రాయమును బలపఱచుచున్నవి. సభాంగణమున నామె పలుమాఱు 'నేను ఏకవస్త్రను' 'ఏకవస్త్రను' అని జాలిపుట్టునట్లు మొఱపెట్టుకొనెను. దుర్యోధను నాజ్ఞానుసారము ఆయేకవస్త్రమునుగూడ వదల్ప యత్నించిరి. ఈసంగతులను విచారించి చూచితిమేని ఆకాలమున స్త్రీలు కట్టుకొను వస్త్రము సులభముగా నూడివచ్చునట్లు ధరింపఁబడుచుండెననియు, మొలనూలువంటి దేదియు నుండలేదనియు, ఇప్పుడు ఉత్తరహిందూస్థానమునందు వాడుకలోనున్న లంగావంటిదానిని వారు తొడుగుకొనుచుండలేదనియు తేలుచున్నది. లంగావంటి వస్త్రమే యైనయెడల నంత యవలీలగా నూడియుండునా? ఆకాలమున రవికయనఁబడునదికూడ నుండలేదని తోఁచుచున్నది.

ఈ సందర్భమున నొక చిత్రము చూడఁదగియున్నది. పురాతన కాలపు గ్రీకు స్త్రీపురుషులు ధరించుచుండిన యుడుపులను హోమరు వర్ణించియున్నాఁడు. అవి మన హింద్వార్యుల వస్త్రములను బోలి యున్నవి. హోమరు కాలపు స్త్రీ ముసుగాక "ఎక్కువ పొడవు తక్కువ వెడల్పుగలట్టిదియు దేశములోనే తయారయినట్టిదియు కత్తిరింపుగాని కుట్టుపనిగాని లేనట్టిదియు నగు నొక వస్త్రమును గట్టుకొనుచుండెను; ఆ వస్త్రము భుజముపైన నొక సూదితోను నడుముచుట్టు మొలనూలుతోను బిగింపఁబడుచుండెను; చేతులు బయటనే యుండుచు వచ్చెను". ¶ పురుషులకు మొలనూలు ఉండలేదు. పైన నుల్లేఖింపఁబడిన

* ఇది ఏష్యాఖండముయొక్క పశ్చిమభాగమున నుండిన యొకజాతి.

† తున్నవాయి.

× అభావవాదమనఁగా, ఒక గ్రంథమున ఒకానొక వస్తువు ప్రసక్తి లేదు కనుక ఆగ్రంథము రచింపఁబడిన కాలమున ఆవస్తువే యుండలేదని వాదించుట.

¶ Women of Homer by Walter Capt. Perry.

ముసుకు హింద్వార్యస్త్రీల యుత్తరీయమువంటిదే యని వేఱుగాఁ జెప్పఁబనిలేదు. "హోమరుకాలపు స్త్రీ దుఃఖసమయములందును, స్వతంత్రముగా నేదయిన పని చేయవలసివచ్చినప్పుడును, ముసుకును తీసివేయుచుండెడిది" సీత తన్నుఁ బరుఁడొకఁడు బలాత్కారముగా చెఱఁగొనిపోవునపుడు ఆసమాచారము భర్తకెఱుకపఱచు నుద్దేశముతోఁ దన యుత్తరీయమును వానరసేనాపరివృతుఁడగు సుగ్రీవుఁడుండిన ఋష్యమూకముపైనఁ బడవైచెను. కనుక హింద్వార్యస్త్రీయును హోమరునాఁటి స్త్రీయును ఉత్తరీయము నొక్కొకమారు వదలివేయుచుఁగూడ నుండిరి. హిందూస్త్రీవలెనే హోమరుని స్త్రీకిఁగూడ కంచుకముండలేదను సంగతి హోమరు వర్ణనములవలననేమి పురాతన గ్రీకుల విగ్రహములవలననేమి మనకుఁ దెలియుచున్నది.

దక్షిణహిందూస్థానమున నిప్పుడు వాడుక యందున్న గోచీపెట్టుకొనుపద్ధతి ఆకాలమున లేదని తోఁచుచున్నది. గోచీపెట్టుకొను నాచారము స్త్రీలలో నాకాలమున నుండినయెడల ద్రౌపది కట్టు పుట్టము దుశ్శాసనుఁడట్లు ఊడఁగుంజుటకు వీలులేకయుండును. మహాభారతమునం దెచ్చటను నీగోచీమాట రానేలేదు. బాలురకు ఉపనయన సమయమున కౌపీనము పెట్టించు పద్ధతి ననుసరించియే స్త్రీలలో నిట్టి యాచారమారంభమై యుండవచ్చును. పురుషులకు ఉపనయనమెట్టిదో స్త్రీలకు వివాహమట్టిదగుటచేతనే కాఁబోలు వివాహితలయిన స్త్రీలవిషయమున మాత్రమే గోచీపద్ధతి విధింపఁబడియున్నది. దక్షిణ హిందూస్థానమందు సయితము కన్యలు గోచీ లేకుండనే బట్టగట్టుకొనుచున్నారు. క్షాత్రయుగమున నుత్తరీయమును గౌరవనీయురాండ్రు మాత్రమే ధరించుచుండిరి. కావుననే ద్రౌపది సైరంధ్రివేషముతో విరాటునిపురమున నుండినపుడు ఏకవస్త్రగానే సుదేష్ణయొద్దకు వచ్చినది. × బహిష్టులుగా నున్నప్పుడుకూడ స్త్రీలకు ఉత్తరీయముతోఁ బనిలేకయుండెను. ఇంట గృహకృత్యములను నెరవేర్చువేళ సయితము వారుత్తరీయమును వేసికొనకుండిరి. వితంతువులాకాలమునఁ దెల్లని యుత్తరీయముల ధరించుచుండిరి. అరణ్యముననుండిన ధృతరాష్ట్రుని దర్శించుటకై అతని కుటుంబములోనివారగు వితంతువులు పాండవుల రాణివాసముతోఁ బోయినప్పుడు వారు తెల్లని యుత్తరీయములను ధరించి యుండిరని చెప్పఁబడియున్నది. * దీనిఁబట్టి యాలోచింపఁగా, తెల్లని యుత్తరీయము వితంతువులకొఱకు మాత్రము విధింపఁబడి యుండెననియు తదితర స్త్రీజనము ఎఱుపు నలుపు మొదలగు రంగుల యుత్తరీయములను వేసికొనుచుండిరనియు తేలుచున్నది. ఇప్పటికాలమున వితంతువుల వస్త్రములు ఎఱ్ఱఁగానుండిన మంచిదని తలఁచుచున్నారు. ఇది ప్రాయశః బౌద్ధభిక్షుకుల పద్ధతి ననుసరించి వచ్చిన యాచారమై యుండవచ్చును. వివాహితలగు స్త్రీలు కట్టుకొను బట్టలుకూడ వేఱువేఱు రంగులుకలవిగా నుండవచ్చును. కట్టుకొను వస్త్రములును ఉత్తరీయములును ఇప్పటికాలమువానివలెనే అంచులుకలవై యుండెనని తోఁచెడిని.

ఇఁక శిరోవేష్టములను గురించి విచారింతము. ఆకాలమునను స్త్రీలకు శిరోవేష్టము లుండినట్లు కానరాదు. వారి తలలకు టోపీకాని మఱేదయిన నాచ్ఛాదనముగాని యుండలేదు. ¶ వితంతువుల తెల్లని వస్త్రములను గురించి వెనుక నుల్లేఖింపబడిన శ్లోకపు మొదటి చరణము 'ఏతాస్తుసీమంతశిరోరుహాయాః' అనునది. ఇది చతుర్ధరుని గ్రంథమునందలి పాఠము. అతఁడు దీనికి బదులుగా 'ఏతా స్త్వసీమంతశిరోరుహాయాః' అని యుండిన నింతకంటె బాగుండునని వ్రాసియున్నాఁడు. పాపటను చూర్ణముతో నలంకరించుటకై వెండ్రుకలను రెండు పాయలుగాఁ దీసి తలముడుచుటకు 'సీమంత' మని పేరు. ముత్తయిదువులగు స్త్రీలు మాత్రమే ఈవిధముగా తలల ముడిచికొనుచుండిరి. కనుక వితంతువులను ఇట్టి యలంకరణము లేనివారినిగా వర్ణించుట సహజము. ఇంతేకా

× వాసశ్చ పరిధాయైకం కృష్ణా సుమలినం మహత్॥ విరాట॥ ౯॥ ౨

* శుక్లోత్తరీయాం నరరాజపత్న్యః॥ ఆశ్రమ॥ ౨౫॥ ౧౦

¶ బయటకు వెడలినప్పుడు మాత్రము వారు తలలపై నుత్తరీయమును గప్పికొనుచుండిరనుట నిశ్చయము.

దు. "సర్వజనసంహారముజరగి పృథ్వియంతయు శోకమయమై ఉత్తమ స్త్రీల సీమంతము తీసివేయబడినప్పుడు ..." అను నర్థముగల శ్లోకము * కూడ సీమంతము పోవుట వైధవ్యముయొక్క ముఖ్యలక్షణమని స్పష్టముగాఁ జాటుచున్నది.

మర్యాదగల పురుషులు వెండ్రుకలను ముడివేసికొనుచు బయటికి వచ్చినపుడు తలగుడ్డ పెట్టుకొనుచునుండిరి. ఈతలగుడ్డ పద్ధతి హిందువులు స్వయముగా నేర్పఱచుకొనినదేకాని ఇతరులను జూచి నేర్చుకొనినదికాదని తోఁచుచున్నది. ఇప్పటివలెనే ఆకాలమునందును వారు ధరించు తలగుడ్డ యొక పొడుగుపాటి వస్త్రము. దీనిని వారు తలచుట్టును ఏవిధములుగాఁ జుట్టుకొనుచుండిరి. యుద్ధరంగమునకుఁ బోవుసమయమున భీష్ముఁడు తెల్ల తలపాగను ధరించినట్లు చెప్పఁబడి యున్నది. ద్రోణుని విషయమునఁగూడ నట్టి వర్ణనయే కలదు. కనుక వయసుమీరినవారి శిరోవేష్టము సాధారణముగా తెల్లరంగుదిగాను యౌవనుల తలగుడ్డ యెఱ్ఱఁగానో లేక ఏదయిన మరియొక రంగుదిగానో యుండవలెను. హిందువుల తలగుడ్డలు గ్రీకులకు విచిత్రముగఁ గాన్పించినట్లు తోఁచుచున్నది. కనుకనే 'ఏరియను' గ్రంథకారుఁడు 'ఇండికా' యను గ్రంథమున నిట్లు వచించియున్నాఁడు. "హిందువులు దూదితోఁ జేయబడిన యొక వస్త్రమును గట్టుకొనెదరు. అది మోకాళ్ళకును చీలమండలకును మధ్యభాగమునకు నుండును. ఇదిగాక వేఱొకవస్త్రమును పయినవేసికొందురు. దీనిలో కొంతభాగమును వారు భుజములపయినఁ గప్పికొని తక్కినభాగమును తమ తలకుఁ జుట్టుకొనెదరు".† 'ఏరియను'చెప్పినట్లు ఒకటేవస్త్రమును తలకుఁ జుట్టుకొనుటకును శరీరమును గప్పికొనుటకు గూడ వాడుకొనువారు బహుశః బీదవారయి యుండవలెను. గొప్పవారి తలగుడ్డ ప్రత్యేకవస్త్రమై యుండవచ్చును. 'కర్టియను రూఫను' అను గ్రంథకారుఁడు హిందూదేశమును హిందువులను వర్ణించుచు "వీరు తమ శరీరమును పాదములవఱకు మృదువయిన సన్నని వస్త్రములతో నాచ్ఛాదించుకొనెదరు. పాదుకలు తొడిగెదరు ; దూదితోఁ జేయఁబడినబట్టను తలకుఁజుట్టికొందురు." ¶ అని చెప్పియున్నాఁడు. అయినను అప్పటి తలగుడ్డ ఇప్పటికాలమున మనదేశమందలి కొన్ని ప్రాంతములలోనున్నంత చిక్కులుకలదిగాను పొడుగుగాను ఉండలేదని తోఁచుచున్నది. దానిని జుట్టుకొనుపద్ధతి బహుశః ఇప్పుడు ఉత్తర హిందూస్థానములోని పేదవాండ్ర పద్ధతివంటిదై యుండవచ్చును. ప్రతివాఁడును తన తలగుడ్డను తానే చుట్టుకొనుచుండెను. రాజులు మాత్రము కిరీటముల ధరించుచుండిరి. దుర్యోధనుఁడు భీమునితోఁజేసిన తుది ద్వంద్వయుద్ధసమయమున కిరీటము అతని తలపైనుండెను. భగ్నోరుఁడై నేలఁబడిన పిమ్మట నాతని తలపయిన నది యట్లే నిలచియుండెను. కావుననే భీముఁడు దాని కాలితోఁ దన్నఁగలిగెను. ఆకాలమున కిరీటము శిరమునకు గట్టిగా బిగింపఁబడుచుండెననియు బంధముల వదలించిననేకాని వీడిరాకుండ నుండెననియు మనమూహింపవచ్చును.

హిందువుల వస్త్రములు తఱచుగా దూదితో నేయబడుచుండెడివి. ఆకాలమున హిందూదేశమున తప్ప మఱెచ్చటను ప్రత్తి పండుచుండుటలేదు. ఈజిప్టులోగాని టర్కీలోగాని యది పండుచుండునట్లు కానరాదు. అట్లు కాదేని "హిందువులు చెట్లపైనఁ బండు ఉన్నితోఁ జేయఁబడిన వస్త్రములను ధరింతురు" అని గ్రీకులు వ్రాసియుండరు. ధనవంతులు అందు ముఖ్యముగా స్త్రీలు పట్టుబట్టలు ధరించుచుండిరి. × రాజాంతఃపురములలోని స్త్రీలు "పీతకౌశేయ వాసినులు"గా వర్ణింపఁబడి యున్నారు. పురుషులుకూడ పసపుపచ్చని బట్టలధరించుచుండినట్లు కానవచ్చుచున్నది. మనదేశములోని కాశ్మీరము,

* శ్లో॥ సంహారేసర్వతోజాతే పృథివ్యాం శోకసంభవే । బహూనాముత్తమ స్త్రీణాం సీమంతోద్ధరణేతథా॥ శల్య॥ ౨౧॥ ౨౦

† Ancient India. Magasthanes and Arrian by Mac Crindle P. 219.

¶ Invasion of India by Abxander. Mac Crindle P. 188.

× సుభద్ర మొట్టమొదట వచ్చి గోపాలికవేషమున ద్రౌపదితోఁ గలసికొనినప్పుడు ఆమె ఎఱ్ఱని పట్టుపుట్టమును ధరించియుండెను. శ్లో॥ సుభద్రాంత్వర మాణాచ్చ రక్తకౌశేయవాసినీం । పార్థః ప్రస్థాపయామాస కృత్వాగోపాలికావపుః॥ ఆది॥ ౨౧॥ ౧౬

పంజాబు, గాంధారములలో బహుళః ఉన్నిబట్టలు కూడ వాడఁబడుచుండెడివి. భరతుని తాతయగు కేకయ రాజు మనుమనికి కంబళాజినముల నేకములు బహుమాన పూర్వకముగా నిచ్చినట్లు రామాయణమునందున్నది. ఇప్పటి కాలమున నెట్లో యట్లే త్రేతాయుగమునందును * సొగసైన నేతయును, మిగుల వెచ్చఁదనమును గల ఉన్ని శాలువలకు పంజాబు కాశ్మీర దేశములు ప్రసిద్ధి వహించి యుండవచ్చును. నూలుబట్టలు వీనికంటె నెక్కువ సన్నని నేతఁ గలిగియుండి రాణివాసమువారును గొప్ప వారును ధరించుటకుఁ దగినవిగానుండెనని భారత రామాయణములు చెప్పుచున్నవి.

నూలు, పట్టు, ఉన్నితో మాత్రమే కాక గడ్డితోఁ గూడ వస్త్రములు నేయఁబడుచుండెనని వీరకావ్యముల వలనఁ దెలియుచున్నది. వీనిని తాపసులు ధరించుచుండిరి. సీతారాములు తాపసవేషములతో నరణ్యమునకుఁ బోవునపుడు వారు కుశనిర్మితములగు వస్త్రముల ధరించి యుండిరి. అట్లే పాండవులు అరణ్యావాసమునకుఁ జనినప్పుడు అజినములను ఉత్తరీయములుగా వాడుకొనిరి. ×
ధృతరాష్ట్రుఁడు వానప్రస్థుఁడు గాన నరణ్యమునకుఁ బోవువేళ వల్కలాజినములను ధరించెను. ¶ ఋషులును ఇతర తాపసులును వల్కలాజిన ధారులుగా వర్ణింపఁబడియున్నారు. ఒక వీరకావ్యములలోనే కాక, వాని తరువాత రచింపఁబడిన వందలకొలఁది గ్రంథములలో తాపసులు ధరించు వల్కలాజినములు వచ్చినవి. కాని ఇట్టి వస్త్రములు ఏగడ్డితోఁ జేయఁ బడుచుండెనో ఎట్లు చేయఁ బడుచుండెనో కానరాదు. ఇప్పటికాలమున మాత్రము మనదేశమున కేవలము గడ్డితోఁ జేయఁబడు వస్త్రములు ఎచ్చటను కానఁబడవు. అయినను ఒకప్పుడు మనదేశమందు గడ్డితోఁ జేయఁబడు వస్త్రములుండెనను సంగతి మాత్రము నిజము. "ఈ హిందువులు గడ్డితోఁ జేయఁబడు బట్టలను గట్టుకొనెదరు. వారు నదులలో రెల్లునుగోసి తెచ్చి చీల్చి చాపవలెనల్లి వస్త్రముగా ధరింతురు." అను 'హిరోడోటసు' వ్రాత పైయంశమును బలపఱచుచున్నది.

మాడపాటి హనుమంతరావు.

సీ. వంకరపాగతో • వలెవాటుతోఁ దంబు-రాతోడ నారంగ • రాయ చరిత
జడకట్టునెరులతో • జాబగావల్వతోఁ - బోతులూర్ధ్వపుండ్రమ్మన్న • బోధనములు
ఊఁదుకొమ్ములతోడ • నుఱుముపంబలతోడ - నుల్లసిల్లుచునుండు • గొల్లసుద్ది
హరి ! హరీ ! నారాయ•ణాయనుధ్వనులతో - రంజితంబగుచుండు • రామునికథ

గీ. చేతనముదాల్చి సరసమై • చిత్తరంజ
కంబుసేయుచు నొక్కొక్క • గ్రామమునను
సంచరించెడు వైఖరు • లెంచిచూడ
జ్ఞానదములౌచు జనులకుఁ • గ్రాలవొక్క.

* పానూనబృహతీగారీ సూక్ష్మకంబలవాసినీ। కర్ణ। ౮౮। ౧౩

× శ్లో। తతఃపరాజితాఃపార్థాః వనవాసాయదీక్షితాః। అజినాన్యుత్తరీయాణి జగృహుశ్చయథాక్రమం। సభా। ౨౨। ౧

¶ శ్లో। అగ్నిహోత్రం పురస్కృత్య వల్కలాజినసంవృతః। వధూజనవృతోరాజా నిర్యయౌభవనాత్తతః। ఆశ్రమ। ౨౫। ౩

# మనుచరిత్ర నాయికలు

## I

### వరూధిని-

ఆహా! రసదేవతా! నీ తారుణ్యము నారాధించిన సహృదయులు ధన్యులు. మహాకవి పెద్దనార్యుని నీవెఱుంగుదువు. ఆరోచిషుని కావ్యపుత్రికయు నిను సేవించినదే; కాని కాల మనేక గతుల భ్రమించినది. ఆమహాకవి నివసించిన నగరము పాడయినది. విద్యానగరనాగరకతయందలి నానాగుణవికాసముల నిపుడు చర్చించుచున్నారు. అమృతాంశుఁడగు చంద్రుని కిరణగుచ్ఛము లేనగరీమతల్లి యందములను లాలించినవో, అచట నిపుడు పాడుపడిన దిబ్బలపై వ్రాలి మాసిపోవుచున్నవి. మనుచరిత్ర నాయికల నుజ్జీవింపఁజేసిన మనోహరవ్యక్తు లేమయిపోయినవో? పోయినవి. వారిబింబములు రసికులగు నాంధ్రులహృదయ ఫలకములపై నున్నవి. ఏసెలయేటి కలకలములలోనో వారి స్మృతిగీతికలు వినవచ్చుచునేయున్నవి. ఇఁక స్థూలరూపప్రసక్తి యెందుకు? భావనయందుఁ బ్రతిబింబించు నాయికాస్వరూపమును విమర్శింతము.

### చరిత్ర.

వరూధిని పుట్టిల్లు 'సుధాబ్ధి'. చంద్రుని చెల్లెలగు లక్ష్మీదేవి 'తోఁబుట్టువు'. దేశము 'కనకనగ' ప్రాంతము. 'రాలుగరఁగించు గాంధర్వము' విద్య. మన్మథశాస్త్రాధ్యయనము' వెన్నతిన్ననాటినుండియుఁ జేసినది. 'నవనతంత్రములు' ఓలిపెట్టించుకొన్న లాంఛనములు. రచ్చపట్టులు కల్పవృక్షచ్ఛాయలక్రింది మరకతమణీ వేదికలు. వైకుంఠ కైలాసములు ఆమెకు నాట్యసభలు. ఇదియంతయు వరూథిని స్వయముగాఁ జెప్పినదే! ప్రవరాఖ్యసందర్శనాసమయమందే కవి యీనాయికా పూర్వవృత్తమును జిత్రించియున్నాడు. నాయిక అపుడు 'అబ్బురపాటు' లో నున్నది. కాని యింకను 'రయోద్ధతి' కి వశురాలగు ఉత్కంఠ దీపింపలేదు. ఈలోపల 'ఎవ్వఁడవీవ' ను 'భూసురకైతవకుసుమశరాసనునకు' బదులు చెప్పినది. వరూథిని వాక్యములయందివి ప్రథమములు కావు. 'ఇంతంత కన్నులుండఁగా తెరువెవ్వరివేఁడెదవను' తొలిసారి మాటలయందు కేవల నర్మప్రాగల్భ్యము సూచింపఁబడినది; 'భయములేదా' యను సుకుమారప్రౌఢిమ కొంత తరువాత తోపకపోదు. కాని 'ఎల్లిదమైతిమి మాటలేటికిక' అను చివరనుడువులయందే వరూథినీస్వభావమునకుఁ గవి బీజబిందువులు వేసినాఁడు. ఈనాయికా ప్రథమసంభాషణమునుబట్టి కొన్ని నైజవిలక్షణములు విమర్శకుఁ డూహింపక పోఁడు; ఈమె మితభాషిణి; కాని ప్రౌఢసూక్తి యెఱుఁగనిది కాదు. సరళధోరణి కలదు; కాని దేవదేవీ మేనకల వలె ధారాళవాచాలత లేదు. నిశితశిక్షాలబ్ధమయిన నాతిప్రౌఢిమ యెంతయో రుచించుచున్నది; అయితే ఆ జన్మసిద్ధమగు ధోరణీ చాతుర్యము ఉలూచీనాయికాదులయందుంబలె స్ఫురింపదు. వరూథిని స్వభావసిద్ధమయిన సరళనాయిక; అందువలననే భావమున కనువయిన భావపూవున కనురూపమయిన తొడిమవలె నొప్పులొదవుచుండును. అవస్థలనుబట్టి యాలాపములు మాఱుట ప్రకృతిసిద్ధము. వరూథినియందు ఛాయలు మాఱునుగాని శైలి సంపూర్ణమగు మార్పును బొందుట గావరాదు. ప్రవరాఖ్యుడు 'హుమ్మంచుఁ ద్రోసిన' సందర్భమును బరిశీలింపుఁడు. ఆబిడ యాశాపతనమువలెనే యామె మాటల మధురిమయును ఖిన్నమైపోయినది. అపుడు 'కోపమునఁ జూచి'నదఁట. 'క్రేఁటుగొనుచు' బలికినదఁట. అవస్థలయందెంత తెచ్చుకోలు కోపమున్నను, సహజ సరళమయిన వాణియందాపరిణామము వచ్చినదికాదు. కలస్వనములో నేడ్చుచు ఆబ్రాహ్మణుని దిట్టిన తిట్లన్నియు నాలకింపుఁడు. ఈరహస్యము గోచరింపఁగలదు. వరూథిని ప్రవరాఖ్యుని దూఱుభాగమును సత్యభామ శ్రీకృష్ణుని దూఱుభాగముతోఁ గలిసి చదువుఁడు. వరూథిని ప్రవరాఖ్యుని 'భూసురవర్య' యని సంబోధించినది. సత్య 'పనులకాపరి, వల్లవీకింకర' యని తృణీకరించినది. సత్యా తిరస్కారమునకుఁ జిరపరిచయపారమ్యము నొక

కొంతసహాకారముగ సహృదయులు 'రసపోషణ'మును సమర్థింపవచ్చును; నాకిచట కావలసినదియవస్థాంతర ప్రసక్తి మాత్రమె.

## వరూధిని యాకారము.

కవిరచించిన నాయిక పదములలో ఆమె యాకృతియు నణఁగియుండును. నాయికల కందఱకును సమాన రీతిగల వర్ణన లనేకములు కలవు. అయినను ప్రతిభావంతుఁడగు సుకవి తననాయికకు 'విలక్షణత'ఁ గల్పింపక విడువఁడు. పాత్రౌచితీ నిరూపణమునందు ఈవిలక్షణత్వ చర్చ కవకాశమధికము. పెద్దన మహాకవి. ప్రకృతి విలాసమును చక్కఁగా గుర్తించిన రాచికుఁడు. వరూధుని వంటి నాయికకు ఆకృతి స్వభావములందుఁ బరిస్ఫుటముగు వైలక్షణ్యమును బాటించి యుండకపోఁడు. వరూధిని సర్వాంగ సౌందర్యముగల నాయికయని భావవీధి యందాలోకింతము. ఊహాప్రతిష్ఠితమగు బింబము నందేమోహానాంగము విలక్షణశోభతో రాణించుచున్నది? పెద్దనార్యుఁడిచ్చిన వర్ణనలతోఁ జిత్రకారుఁడొక పటము వ్రాయుననుకొందము. అతఁడేయంగమునందుఁ గళాప్రాణమగు విలక్షణతను దిద్దవలెను? ఈప్రశ్నలకు మన చరిత్ర వర్ణనలే ప్రత్యుత్తరము లీయవలసియున్నవి. వరూధినీ సౌందర్యము నేత్రములయందుఁ బరమావధి నందినదని నా యూహ. ఇట్లంటినని యితరావయవములు యథాసుందరములుగా పొందుపొంకములందలేదని నాయాశయముకాదు. తీర్చిదిద్దిన చక్కఁదనాల రేకలలో నేది విలక్షణమయిన శోభను జూపుచున్నదని నాయర్థము. ప్రవరాఖ్యునకు గానఁబడిన నాయికామూర్తిని భావింతము. మొదట 'విద్యుల్లతా విగ్రహ'యని విశేషణముతో వరూధిని యాకృతిని మొత్తముమీద సూచించినాఁడు. తరువాత శతపత్రేక్షణయని పలికి నేత్రములకుఁ బ్రధాన సౌభాగ్యము నిచ్చినాఁడు. ఇదియె ఆమె నేత్రలావణ్యమునకుఁ బ్రథమ బీజము. పిదప కొంతసేపటికి వరూధినికి 'అబ్బురపాటు' దయించినది. ఆయవస్థయందుఁ గూడ ప్రథమ రాగము 'నయనాంబుజములు వికసించుట'తో నుదయించినట్లు జిత్రించుట కారంభించినాఁడు. అందు కాంతి వెల్లుబ్బినది. 'కనీనికలు' పూచిన కలువమాలలను గ్రుమ్మరించినవి. అనంతర దశయును కావ్యసౌందర్యమును దోహలించునదె. 'లేనడుమల్లల నాడగా' పూచినపోక బోదియచాటునకుఁ బోయినది. అందెలు రవళించినవి. అచటనుండి దృగంచల ప్రభాతరంగములు త్రోవయందు వెల్లువఁ బెట్టినవి. అప్పటికి 'ప్రఫుల్ల నేత్రమ్ములతో' నాయిక నాయకునిఁ జూచినది. అంతట పులకలు మేననంకురించినవి, ఆవాలకమునందు 'కన్నంగవ... ముఖచంద్రు నాక్రమించుకొనునో' యను భ్రమ మన్మథునకారోపించిన కవి రసాత్మకుఁడనుట నిర్వివాదము. ఇందును కన్నులయందమె పుష్పించుచున్నది. ఇంకను భ్రమరకీట న్యాయముననుకరించినపుడు గూడ నాయికకు మొట్టమొదటి మార్పు నేత్రాంచలములయందే పొలుపువారినది. బిత్తరిచూపు అనిమేషస్థితిని మాన్పినది. ఇంతటితో నయనానందమాగలేదు. కవికి నాయికా కటాక్ష సౌభాగ్యమునందుఁగల యాసక్తమమత యపారమైనదిగఁ దోఁచుచున్నది.

"చెలువగు వానిఁ జూచినను
జెల్వకుఁ జూపులఁ గావె కూటముల్"

అను రసరహస్య పక్షపాతముగూడ వరూధినీ సౌందర్య రాశియందు కటాక్షకాంతి కదంబ ప్రాధాన్యము సూచించుటకే సంఘటించినాఁడు. 'నితంబాభోగ ధవళాంశుక'మను పెద్దనార్యప్రయోగము నందు సార్థకమంజిమ యున్నది. ధవళాంశుక ప్రశంసచే తెలుఁగు పడఁతుల సహజ దేశీయ వేషమునకు 'విలక్షణత'ఁ బోసియున్నాఁడు. తెల్లచీరలు ధరించు నితంబినీమణులలో తెలుఁగు దేశీయులు ప్రధానులు.

## వయసు.

వరూధినికి తరుణి, నవలా, మున్నగు విశేషణములు వాడఁబడి యున్నవి. ఐనను వయసు నిర్ణయించుట కింతకంటె సహజరసోచితములును, ప్రత్యేకస్థల ప్రసక్తములును నగు నిదర్శనములు కావలెను. నాయిక వయస్సును నిరూపించుటకుఁ గావ్యమునందే అంతస్సాక్ష్య సంపత్తి నన్వేషింతము. విజయవిలాసమునందు

చం. 'కన్నియఁ గాని వేఱొకటిగాదు......నీవు నే
జన్నియఁ బట్టియుంటి నెలజవ్వనమంతయు'

అను పద్యమునుబట్టి కావ్యక్రమమున ఉలూచి వయసు నూహింతము. ఇంత స్ఫుటముగ వరూధిని వయసు ని

రూపించుటకు అవకాశములు లేవు. తరుణీ అని ప్రవరాఖ్యుఁడు సంబోధించినాఁడు. అందువలన లేఁతపడతిగా నతనికి గన్పడితీరవలెను. 'అనన్యకాంత'యనుటచేఁ గూడ నామె యీఁడువాడినది గాదని భావము. నవలాశబ్దమునకు (ఆ ౨.౨౯.) కోమలియను స్ఫురణకలదని కొందఱనిరి; కాని అచ్చతెనుఁగు నిఘంటువులా యర్థమును శాసించుటలేదు. ప్రాచీనులగు కవుల రసవద్రచనయందుఁ గూడ ఆయర్థముగానరాదు. వరూధినీ విలాపమునందు (ఆ 3-౭).

......నోఁచని యింతిదైన యా
చక్కఁదనంబదేమిటికి జవ్వనమేటికి'...

అను పలుకులు వినఁబడుచున్నవి. నాయికకు వియోగదశ యలమినది. 'త్రోఁపువడి' 'లజ్జాపరవశ భావముల తో'గుమారిల్లుచున్నది. నిస్పృహాదృష్టితోనున్న నాయికా సంకల్పములు ఆత్మవిలాపమునందు ధ్వనించుట సహజము. ఈచక్కఁదన జవ్వనములు వరూధినివేమైయుండు ననుట రసచర్చకు సమీపము. ఇంకను శోధింతము. వనవిహారమునందున్న వరూధిని నామెసఖులు దర్శించిన భాగమునకుఁ బోవుదము. వారి సంభాషణయందును అనునయాలాపములయందును ఒక సొబగుస్ఫురించుచున్నది. వరూధిని చిన్నతనమందున్నట్లును. కులనీతులను సామెతలు నెఱిగిన పెద్దముత్తైదువలామెసకియ లయినట్లును తోఁచుచున్నది.

* * * ముల్లుపుచ్చికొ
ఱడచిన చందమాయె పదమా?......

అను సఖీమణుల సంభాషణలనుండి వారియాఱితేఱిన లోకజ్ఞానమూహ్యము. అందఱును 'లేమ?' అని యామె నాదేశించిరి. ఇవియన్నియునటులుంతము. పెద్దనార్యుడింతకంటె రసముగ్ధమైన విశేషణముచే వరూధిని వయసును సూచించియున్నాఁడు.

'తరుణాంగుళీ ధూత తంత్రీస్వరంబుతో'......

లేఁతరకము వదలని వ్రేళ్ళచేత మీటబడిన వీణాతంత్రులనుండి లేచు కలస్వనముతో నామె 'జిలిబిలి పాట ముద్దులు నటించు'చున్నదని చెప్పినాడు. లేఁతవగు వ్రేళ్ళనుటచే వరూధినీ వయఃకోమలతయంతయు ధ్వనించుచునేయున్నది.

## వైదగ్ధ్యము.

వరూధిని చక్కని విదుషి. నిశితమయిన సాహిత్యపచయము ఆమె సంభాషణయందెందుఁ జూచినను ఉట్టిపడుచున్నది. కాని నాయికయందు వైదగ్ధ్యము కంటె వైదుష్యమెక్కువ. మన్మథశాస్త్రాధ్యయనము తాను చిన్ననాఁటనుండియు జేసితినని చెప్పికొనినది; కాని వీణావాదనమునందును, కీరశారికలకు 'పలుకులు నేర్పు'టయందును ఆప్తలాలసము గానవచ్చుచున్నది. వీణావాదనముఁ జేయుచు నాయిక మన కగపడుచున్నది. రామభూషణుని గిరికానాయికయును ఈయవస్థయందె చిత్రింపఁబడినది; కాని ఈనాయికాద్వయము నడుమ ఒకభేదమును దీయవచ్చును. వరూధిని వీణపాటయందు 'ఆలాపగతియు' 'పారవశ్య విభ్రమమును' ప్రధానములుగా మ్రోగుచున్నవి. అందువలన గానకళయందు నాయికకు గల స్వాదురస పక్షపాతము సూచ్యము. ఇఁక గిరికాగానమునాలకింతము. 'ప్రాణానుబంధములు'వానికిగల'తాళగతులు,' ముందుఁ జీవింపబడుచున్నవి. 'ఆలాపభంగి' యన్ననో 'అత్యక్తసంవాది స్వరంబులకు గ్రామంబు'లును చుచున్నవి. ఇందు శాస్త్రీయ సంకేతము లధికము. గిరికకుగల శాస్త్రప్రవేశ ప్రాగల్భ్యమును, తదాభిముఖ్యమును ఇందుధ్వనించుచున్నవి. వరూధిని కిన్నరలోఁగలవాయి, గిరికావాదనములో లేదు. వరూధినికిఁ బ్రకృతి సౌందర్యము ననుభవించు 'నవనీత హృదయము' కలదు. 'భోగపరుఁడవై' యానందింపుమని ప్రవరాఖ్యుని సంబోధించినది. అపుడా పరిసర ప్రకృతిని తేనెలూఱునట్లు వర్ణించినది. ఆమె కాంక్షపడి వలచిన కస్తూరి 'సద్యోవినిర్భిన్నమై పడియున్నది;' కాని బంగారపు బరిణలలో లేదు. జవ్వాజి యెండకుఁగరఁగి, కసటువోయినది. పిదప 'కఱ్ఱలనంటి' గుమగుమలాడుచున్నది; కాని కృత్రిమపు రూపములతో దాపఁబడి యుండలేదు. ఘనసార తరువుల పొరలలోనుండి పచ్చకర్పూరము పొడిపొడిగా రాలియున్నది. 'పన్నీరుపూలనుండిజాఱినది.' ఈవర్ణనమును భావనయందు జీవింపఁజేయుఁడు. ఎక్కడి సౌందర్యమక్కడనే! ఎచ్చటి పరిమళమచ్చటనే! ప్రకృతిసిద్ధముగాఁబడియున్నవి. ఇదియే నైసర్గిక సౌందర్యము. ఇందు సఖిజనులు దిద్దిన కృత్రిమాలంకారఁమేమియు లేదు.

పూ దినవపూవును పూచినట్లే దర్శించు మానసికరుచి వేఱు. దానినికోసి యామవలతో దారములతోఁ బొదివిచూచు మనోవికారము వేఱు. సహజముగా కొండదాపున పారలి పోవు సెలయేటి చక్కదనము నాస్వాదించువారు కొందఱు. కత్తవలతో తవ్విన నిలువుకాల్వలను జూచి యానందించువారు కొందఱు. ఇందు మొదటివారు సహజశోభనప్రియులు. రెండవవారు కృత్రిమవిలాసపరతంత్రులు. వరూథిని మొదటిజాతిలోనిది. ప్రవరాఖ్యసంబోధనముపట్ల నాయికావైదగ్ధ్యము నిరూపించు భావచిహ్నములు కొన్నియున్నవి. ఆరంభదశయందు నర్మపరిచితి కొంత కానవచ్చినను, ప్రణయజనమదకలితములగు నానార్థప్రచారములు తోపవు. నాయిక వాక్కులలో మధురమగు నొక దైన్యలాలనము రసజ్ఞుఁడు చవిచూడఁ గలడు. అనంతర సంభాషణయందుగూడ మోహావస్థల యందుఁ జూపట్టు 'చిక్కులు' వరూధినీ వచనములలో లేవు.

కం. ......యిట్లుపలుక వరుసయె వ్రతులై
దినములు గడపెదు విప్రుల
జను నే గామింప......

అని ప్రవరాఖ్యుఁడు పలుకగా వరూథునికి 'వదనంబున విన్నబాటు' వాటిల్లినది.

కం. కాముకుఁడగాక వ్రతినై
భూమిప్రదక్షిణముఁ జేయఁ బోయెదువానిం
గామించితోడితే తగవా ?

అను అర్జునభాషాపార్థము నూహించిన యులూచికి 'మోమున మొలకనవ్వు' పేటెత్తినది. ఇట వరూథిని యజ్ఞకోటియందు 'పావను లాటకు' మాకవుగిండ్ల సుఖించుటేగదా ఫలము ? అని యెత్తిపలికినది. అట ఉలూచి

కం. నిను గీతిసాహితీమో
హనవాణులు చెవులువట్టి యాడింపంగా
గనియుండి కాముకుఁడంగా
నని పలికిన నాకు నమ్మికానె నృపాలా !

కం. అతులితవిలాసరేఖా
కృతులన్ వలపించియిట్లు త్రిభువనలీలా
వతుల నలయించుటేనా ?
వ్రతమనఁగానీకు ? రూపవంచితమదనా ?

అని భావగర్భితముగా గడుసైన యెత్తెత్తినది. రసపుత్రులీ భాగములు తలఁచినకొలఁది నాయాశయము తేటలు తేఁగలదు. మనుచరిత్రనాయికయందు మనోరథరక్తి యధికమైనదే ; కాని తత్సాధనానైపుణ్యమునందు విలాసపరములగు 'త్రిప్పులాటలు' తక్కువ.

ప్రణయమువంటి కార్యకరణములయందు పన్నఁబడెడి వలలు మిగుల రహస్యములు. తత్కల్పనములుగూడ క్రమానుగతములై యుండవలెను. అది చతురిమకు లక్షణము. వరూథునీ రాగసంకల్పముల పరిణామమునందును ఈ భేదము స్ఫురించుచున్నది. రాగపుష్పము క్రమక్రమముగా రేకులురేకులై వికసించినది ; కాని వశీకరణవాగురులు మాత్రము పోఁగువెంట పోఁగుతీసి నేసినట్లు తోపవు. ప్రవరాఖ్యుని 'ధీరచిత్తము' పరిమళించినతోడనే

'నిక్కముదాపనేల ? ధరణీసురనందన ! యింక
నీపయిన్ జిక్కె మనంబు నాకు'......

అని ఒక్కసారిగాఁ బలికినది. ఇది ఈనాయికాగుణములయందొక లోపమని నేను భ్రమింపను ; కాని చాతుర్యవతియగు నాయిక యిట్లు ప్రవర్తింపదు. ప్రవరాఖ్యునివంటి బుద్ధిజాడ్యోన్మాదుఁడుగూడ 'ఈ పాండిత్యము నీకు దక్క మఱి యెందేగంటిమే?' యని సాభిప్రాయముగఁ బ్రబోధించి వరూధినీ వైదుష్యమునకు గతిఁ గల్పించియున్నాఁడు. ఇందు నర్మమయిన వ్యతిరేకధ్వనియును గలదు. ఎందుకుఁ జెప్పవచ్చితినన నాయికయందు వైదగ్ధ్యముకన్న వైదుష్యమధికమని ప్రతిపాదించుటకే !

## స్వభావము.

వరూధిని పరిస్ఫుటమైన ప్రణయపాత్ర. 'వెన్నవలె కఱఁగు' హృదయము గలదని కవిసూక్తి చెప్పినట్లు చెప్పుచున్నది. 'వనపిల్లుశాస్త్రము' నావర్తించినది ; కాని యభిమానశాస్త్రము 'రహిపుట్టించు గాంధర్వ'మనక తీరదు. పాటయందు అన్నిటికన్న 'హాయి' నెట్లుపాసించినదో ! సౌందర్యార్చనయందుగూడ నైసర్గికరామణీయకమునే యాప్తముగా నాదరించినది. ఈమె గుణస్వరూపము నాలోచించినచో ఒక రహస్యము పొడకట్టుచున్నది. వరూధునీ స్వభావమందు వశీకరణశక్తికన్న

వశ్యమార్దవ మధికము. ఆమె సురచారణ విద్యాధర కుమారుల నెందఱనో చూచియున్నది. సుందరపురుషసందర్శన మెఱుఁగనిదికాదు. మఱియు నొక గంధర్వుడు రాగాంధుఁడై యామె చక్కఁదనమునకుఁ బట్టుపడెను. కాని అతనికి 'హత్తి'నదికాదు. కవి చిత్రించిన వరూథిని యందమునందు కన్నులసోయగము ముఖ్యమయినది. ఆమె నేత్రాభినయ ప్రౌఢిమయును జూచియున్నాము. మొట్టమొదట ప్రవరాఖ్యుని ఆలేఖ్యతనూవిలాసమునందు నాయికాదృఙ్మోహము లగ్నమయినది. ఇందువలన వరూథినియందు రూపమునకుఁ బట్టువడు మానసికరుచి స్ఫురించకపోదు. ప్రవరాఖ్యునిఁగూర్చి నాయిక అదివఱకెఱుఁగదు. ఉలూచి విజయు యశోగానమున నావఱకె యున్మాదినియై యుండెను. నల గుణకథనమధురిమవలన దమయంతి తగులమునకు 'ఉదయవ్యవస్థ' యేర్పడినది. ఉషాకన్యకు స్వప్నసాంగత్యముచేఁ గవి రసోదయముఁ జేసియున్నాడు. వరూథినియందిట్టి 'దశాచిత్ర' మేమియు లేదు. నలకూబరసన్నిభునిఁ జూచినది అబ్బురపాటుదయించినది. లేచి నడుమల్లాడగా దాగినది. సంపూర్ణమగుచూపుచే ఆబ్రాహ్మణకుమారుని 'తారుణ్యమాధుర్యము'లను ద్రావినది. భావమందాతని స్వర్గ్యామంజిమ ననుభవించినది.

ఉత్తమవిమర్శయందు కేవల రూపవివశమయిన నాయికాహృదయము ఉదాత్తస్థానము నాక్రమించుకొనలేదు. ఈరసభేద మెట్లుకలిగినదో తుల్యనాయికల యౌచిత్యప్రసక్తివలన తేలఁగలదు.

'వనిత తనంతఁదా వలచివచ్చిన చుల్కనగాదె యేరికిన్" అను కవిమధురచరణమునందు నాయికాశయము కొంత బోధపడుచున్నది. మదనవ్యథాఖిన్నతచే 'అలివేణులు వాడిశత్తు లగుచున్నారని' పలికెను. అనునయపూర్వమగు భావదైన్య మిందు చాలఁగలదు. నైజసిద్ధముగా ఈ నాయిక 'నయభయ' సాధనసంపత్తికలది కాదు. దేవదేవివలె నయచాతుర్య మెఱుఁగదు. భయపెట్టి కాంక్షామాధుర్యమును బోషించు ప్రౌఢనాయికాలక్షణములును లేవు. ఇట్టి జాతినాయికలలో రసవిశిష్టమగు 'మిటార'ముండినను శుకసప్తతి పాత్రలవలె రుచి నైచ్యమునకు లోనుగాకుండవలెను. అపుడె సాహిత్యచర్చకు యోగ్యమగుదురు.

సాహసము తక్కువ. ఆత్మగతమయిన ప్రజ్ఞావిశ్వాసముగూడ గానరాదు. 'ఇటుజపియించినన్ విడుతునే' యని ఉలూచి విజయాపహరణమున కాయత్తపడినది. మన్మగుని 'ఏలనిబంటుగా' దక్కించుకొనరాదా? 'నను వీడు పరిగ్రహించినచో' అని వరూథిని సంకల్పమును కదపినది. వాడు తన్ను పరిగ్రహింపవలసినదే కాని, తన్ను వానినేలుకొను ముచ్చటలు దోచవు. నాయిక సాత్త్వికభావవిశిష్టయయిన ట్లూహించు సరసవర్ణనలుం జాలఁగలవు. త్రోపువడిన తరువాతగూడ నాయిక నాయకుని నిందించి యెఱుఁగదు. తిట్లు తూఱుపాఱఁబట్టలేదు. విఫలమనోరథయైన దేవయాని కచునకు 'సంజీవని పనిసేయకుండెడుమని శాప' మిచ్చినది. పార్థనిరాకృతయయిన ఊర్వశి కామినీజననిరర్థకమయిన నపుంసకత్వమును వానికిఁ గట్టిపెట్టినది. కాని వరూథిని 'నేనెక్కడ? వానిగాఁగిలెక్కడ?' అని నిస్పృహా విలాపము నారంభించినది.

తరువాత విరహము. వరూథిని ప్రణయిని యనిచెప్పియున్నాను. నిశితమధురమైన యుత్కంఠ నందినది. అచట భగ్నదశకుఁ బాత్రమయినది; అయితే దుర్మోహనైజమగు ఉన్మాద దోషమున కగ్గమయినది కాదు. చూడుఁడు! హంసీముఖమున 'ప్రియోదంతమును' వినిన ప్రభావతి

సీ. ఆరతికిఁగరంబు లైతిరే నవ్విభుఁ
గౌఁగిలింపఁగ నబ్బు కరములార!
యాయింతికిఁ గుచంబులైతిరే నతని వ
క్షోనిపీడనమబ్బు కుచములార!
యాలతాంగికిఁ జెక్కులైతిరే నారమ్య
శీలు చుంబనమబ్బు చెక్కులార!
యాచెలంతకు వీనులైతిరే నాకళా
విదు మంతనములబ్బు వీనులార!
గీ. అట్లుగానోఁచకేల నాకైతిరకట!
యని నిజావయవంబుల కాత్మవగుచు

బాల్యమునఁదన్ను రమణసౌభాగ్యకలిత
యనిన సాముద్రికులమాట లరసి తిట్టు.

అని ఉన్మాద విరహము ననుభవించినది. ఇది యింక ను ప్రద్యుమ్న సహవాససుఖమబ్బకమును పే. మనవరూధిని యన్నతో 'విసివివిసివితనువుదొఱఁగ' దలచినది. విరహ దశలయందు వరూధిని యపస్మారము ఆమె స్వభావస్నిగ్ధతను సహస్రముఖములతోఁ జాడుచున్నది.

'సగము గొఱికినయాకును, సఖులుపిలువ
సగ మొసగును త్తరము, తెల్వి సగము, చుఱవు
సగము,నయి చింతచే సగమగుచు నరిగె.'

ఈ నాయిక యొక్క ప్రేమాదర్శనమును చక్కగా గుర్తించుటకుఁ గొన్ని యవకాశము లున్నవి.

'నానోముల్ ఫలియించె, నావయసుధన్యం
బయ్యె విప్రోత్తమా'?

అను వాక్యములె యామె యాదర్శమునకు సూత్రములు: బాల్యయౌవన కౌమారాదికములగు దశలు నాలుగు. అందొక్కటొక్కటి 'ధన్య'ము గావలయునని యామె యాశయము. బాల్యమునఁ రంభాది సఖీసాహచర్యమబ్బినది. వెన్నతో ననవిల్తునిసుకులావర్తించినది. ఇక జవ్వనమాముకొనినది. 'మానంజాల'నను ప్రియసల్లాపముచే నదియు 'ధన్య' మైనట్లు ఆనందించుచున్నది. 'కవియునెడఁ గన్నుమూయు'ట కొప్పుకొనిన నాయికా భావదైన్య మత్యంత కరుణము. రసోపపత్తి యిందొదుగు నవకాశములు లేవు. 'ఆనందో బ్రహ్మ' మున్నగు సాంప్రదాయకములు తడవిన యీనాయికను విమర్శకుఁడు వైష్ణవమత స్పర్శను సూచింపకపోఁడు. ఇంకొకమాఱు 'మనోరమ'ను దిలకింతము.

రాయప్రోలు సుబ్బారావు.

---

# పుస్తకావాహన

సీ. నిండాఱఁబాఱు నఖండగోదావరి
దాగిన చాళుక్య నాగరికత,
పాడైన పెనుకోటగోడల దీర్ఘని
ద్రలువోవు కాకతి ప్రాభవమ్ము,
పల్లెపదాల జీవమునిల్పికొన్న ప
ల్నాటివీరుల రక్తనాళ పటిమ,
కడలేక యేచ్చు తుంగాభద్ర కెరటాల
మణఁగినపూజ్యసామ్రాజ్యభరము

తే.గీ. హృదయములువినపలుకక చదువుజెప్పు
పుస్తకతపస్విని తెలుంగుపూఁబొదల
నిలచి సేవాశుకమ్ములఁ బిలచిపిలచి
స్థిరత పాడించుగాత జాతీయగీతి.

సీ. ఆచారమునకుదాస్యముఁజేయుచునువంట
యిల్లుదాటఁగ లేనియిందుముఖుల,
ఉదయాస్తమయములు నుడలిచెమ్మటఁదీసి
క్షేత్రసేవలు జేయు సేద్యగాంధ్ర,
బ్రతికినన్నాళ్ళు తీఱనికస్తి, రెక్కలు
విఱచిజీవించెడు పేదజనుల,
అక్షరపంక్తులె యరయరాదనుచు, దు
ర్గతులఁద్రోసిన చెప్పరానివాంధ్ర,

తే.గీ. పూలతోనిండి కమ్మదనాలు చిమ్మ
పుస్తకనికుంజపుంజాళి పొంతఁబిలచి
'నాజనము, నాదుదేశ'మనంగఁజాలు
ఇంతజ్ఞాన భిక్షాదానమిమ్మ తల్లి!

సీ. ఆంధ్రులశిల్ప విన్యాసంబుచూపించు
కలిమిగోపురములగలదటంచు,
ఆంధ్రనాగరిక కళ్యాణచిహ్నములైన
గానసాహిత్యముల్ గలవటంచు,

ఆంధ్రభాగ్యమ్ము మోయగ గౌతమీకృష్ణ
దరులను నావలు దిరిగెననదు,
ఆంధ్రవీరులకు స్వర్గాతిథ్యమిచ్చి పా
టలుపాడిన యుగమ్ముకలదటంచు,

తే.గీ. చెప్పిమెప్పించు పుస్తక శ్రీకుమారి
యందగింపఁగఁగల యాలయములుగట్టుఁ
డాంధ్రదేశమునందెల్ల నాంధ్రపుత్రు
లాప్తమానవసంఘ సేవానురక్తి.

రాయప్రోలు సుబ్బారావు.

# ఆంధ్రము నందనుస్వారము

పురాణమిత్యేవ నసాధుసర్వం । నచాపికావ్యం నవమిత్యవద్యం । సన్తః పరీక్ష్యాన్య తరద్భజన్తే । మూఢః పరప్రత్యయనేయబుద్ధిః॥ యని అభియుక్తోక్తి కలదు. ప్రాచీనులు చెప్పిన మాత్రాన సాధువనియు, నవీనులు చెప్పినమాత్రాన నసాధువనియు నెంచక గుణాగుణ విచారణచేసి సత్పురుషులు గ్రహింతురనియు నట్లుకాకుండుట మూర్ఖపద్ధతియనియు దీని భావము. బాలాదపి సుభాషితమ్మను మాట యీయర్థమునే దృఢపఱచుచున్నది. ప్రియ పాఠకులారా, నేనీదృష్టితోనే త్రిలింగయను పత్రికయందుండిన "ఆంధ్రము నందనుస్వార కలదా" యను వ్యాసమును జదివితిని. అవ్యాసములో వక్తవ్యాంశమునకు ముందుగానుండు కొన్నిమాటల న్యాయదృష్టితో నంగీకరించితిని. అవసరమైనను గాకపోయినను బ్రాచీనాచార్యులను సంస్కృత వ్యాకరణ రచయితలగు పాణిన్యాదులఁజేసిన స్తుతికి మిగుల సంతసించితిని. ఆంధ్ర వైయాకరణులకేమి, ఆధునిక కేవల సంస్కృత వ్యాకరణాభిజ్ఞులకేమి, కొంత యజ్ఞాన మారోపించినను వీరు చూపింపఁబోవు నపూర్వ విషయము గ్రహించుటకై సైచితిని. చివరకు నామతమిందుపైఁ దెలుపవలసిన యవసరము గన్పట్టినందున, నాపనికిఁ బూనితిని.

ఆవ్యాసమెంత పొడుగుగ నుండినను దాని సారమిది:- "ఆంధ్రము నందనుస్వారము లేదు. ఙ, ఞ, లున్నవి. అను స్వారమునకు కవర్గము పరమగుచో, 'ఙ' కారమును చ వర్గము పరమగుచో 'ఞ' కారమును, ట వర్గము పరమగుచో 'ణ' కారమును, త వర్గము పరమగుచో 'న' కారమును 'ప' వర్గము పరమగుచో మ, కారమును అనుస్వారస్థానమందు వ్రాయవలయును. పఙ్గ, గఞ్జి, కణ్డ, కన్త, చమ్బు యథాక్రమముగా నుదాహరణములు. సూక్ష్మదృష్టితో విచారించిన నుచ్చారణ స్థానముల బట్టి, బోధకాఁగలదు. పాణినీయములోని "నశ్చాపదాన్తస్య ఝలి," "మోనుస్వారః," అను సూత్రములచే నిరనునాసికలగు స్పర్శలు నూష్మలు పరమగునపుడు అపదాన్త నకారమునకును పదాన్తమందుఁ గూడ మకారమునకును అనుస్వారమువచ్చును. "అనుస్వారస్యయయి పరసవర్ణః," అను సూత్రముచే నీయనుస్వారమునకు స్పర్శలు నంతస్థలములు పరమగు నపుడు క్రమముగా ఙ, ఞ, ణ, న, మ, లగును. లక్ష్యములు, అఙ్కితము, అఞ్చితము, కుణ్ఠితము, శాన్తము, గుమ్భితము అని వ్రాయుట సాధువుగాని, అంకితము, అంచితము, కుంఠితము శాంతము, గుంభితము అనునవి యెట్లు సాధువులుగావో అట్లే పంగ, గంజి, కండ, కంత, చంబు అనునవి కూడ సాధువులు గావు."

కాని సంస్కృతమున నింకొకటి విచారణీయాంశము గలదు. "హిపదాన్తస్య"యను సూత్రముచే పదాన్తమగు ననుస్వారమునకు వర్గీయములు పరమైనచోఁ బరసవర్ణము కంసఙ్ఘాన యనియు ననుస్వార ఘటితరూపము కంసంఙఘాన యనునదియు సాధువే. కాన సంస్కృతమును, తద్వైయాకరణులఁ బ్రమాణముగాఁ గొనిన మనము "దృతంచ బిందుస్యాత్," "ప్రథమా విభక్తి శమోర్బిందుశ్చ" యను సూత్రములచే పదాన్త నకార మకారములకు బిందువులను వచ్చెంగమలాక్షుఁడు భయంపడి యనువాని నొప్పుకొనవలయుఁగదా. అట్లయిన నాంధ్ర

మున ననుస్వారమున్నదని యైన ననవలె, లేనిచో సంస్కృత వ్యాకరణ ప్రణేతయగు పాణినికిం గొంత యజ్ఞత నారోపింపవలయును. గీర్వాణ వ్యాకరణ ప్రణేతల నంత పెద్దగాఁ బొగడిన మీరలాయన కజ్ఞత నారోపింపఁజాలరు. కాన నాంధ్రమున ననుస్వారమున్నదనియొప్పుకొనుఁడు. ఇఁక పంగ యనునట్టి యేకపదములుండునవి యనుస్వారములా పంచమ వర్ణములా? "తస్యస్యాచ్ఛపూర్ణ బిన్దురపి" "షట్త్రింశదత్రైతే," ఇత్యాది సూత్రములు తప్పులని చెప్పిన యాక్షేపము తప్పా కాదా యని విచారింపవలయును. అనుస్వారమునకు స్థానము కేవలనాసిక. వర్గీయ పంచమవర్ణములకు నాసిక, తత్తద్వర్గ స్థానములగు ఙకారమునకుఁ గంఠము, ఞకారమునకు దాలువు, ణకారమునకు మూర్ధము, నకారమునకు దన్తము, మకారమున కోష్ఠములు స్థానములు గలవు. కానఁ పంగయనునప్పుడు. అనుస్వారము కేవలము నాసికచేతనే యుచ్చరింపఁబడినను, తదవ్యవహితోత్తరవర్తి యగు గకారమునకున్న కంఠస్థాన మీయనుస్వార నాసికాస్థానముతోఁ గూడఁ జేరినట్లు దోచుటచే వారికట్లు భ్రమకలిగెను. అనుస్వారమునకుఁ నాసికయు దానికిఁ బరమగు గకారమునకు గంఠము, రెండు సంహితగా నుచ్చరింపఁబడుచున్నవి యని యనుకొని సూక్ష్మదృష్టితోఁ జూడుఁడు. పంగ యనుచోఁ ఙకారమే లేదు, యనుస్వారమే యున్నదియని మీకు బోధయగు. ఙకారమే యున్నయెడల నాసికా స్థానమైనతరువాత కంఠము ఙకారమున కొకసారియు గకారమున కొకసారియు వినియోగింపఁ బడనగు. అట్లు రెండుసార్లు కంఠ ముపయోగింపఁబడుచున్నదా? లేదు. సంస్కృతములోననో ఙ ఞ లు ప్రత్యేకమున్నవి. ఙ ఞ లు హల్లులు ప్రాణులు. ప్రాణులు ప్రాణములతోఁగూడి వ్యవహరింపఁబడనగు. ఙకారము ప్రత్యఙ్ఞాత్మా. ఞకారము ప్రజ్ఞాయాచ్ఞా, యనుచో నచ్చులతోఁగలసి ప్రత్యేకవర్ణములై వ్యవహరింపఁబడుచున్నవి. ఇట్లైచోఁనయినఁ దెలుఁగున బ్రత్యేక మచ్చుతోఁగలసి ఙ ఞ లు కానవచ్చునా? అట్లులేనిచో నీని జీర్ణప్రతిమలఁ జేర్చినచో లాభమేమో మృగ్యము. సంస్కృతముననో అఙ్క్తః, అఞ్క్తః ఇత్యాదులయందుండు ఙ ఞ లు లక్ష్యాంతరములయందు ప్రకృతిసిద్ధములై యిచ్చట ననుస్వారస్థానమం దాదేశముగావచ్చినవి గాని స్వతసిద్ధములు గావు. అఙ్, అఞ్చు ధాతువుల వలనఁబుట్టిన యీరూపములు మొదల నకారము గలవి యని తజ్ఞులకు విశదము. గంజి, పంగ లలో నుండునవి నకారమనిగాని ఙ ఞ లనిగాని సప్రమాణముగా వ్యుత్పత్తి ననుసరించి మీరు చూపింపలేదు గనుకను అనుస్వారమున కుండవలసిన నాసికామాత్రమే పైవర్ణములకుండిన కంఠాదిస్థానములతో నేకీభవించిన ననుభవసిద్ధమగు సుఖోచ్చారణము సిద్ధించుచున్నది గనుకను ననుస్వారమనియే యొప్పుకొనక తప్పదు. స్థూలదృష్టితో విచారించినను మీమతమం దింకొకతప్పు గలదు. అనుస్వారము లేదనిన నర్థమెక్కడిది? అదియులేదందురా, అతిసాహసము. ఉన్నదందురా దేనికర్థము? దీనికిఁ బూర్ణమేది? నకారస్థానికము పూర్ణము. దానికి లోపము ప్రాపించినపు డర్థమని వైయాకరణులు వ్యవహరించిరి. కాన నాంధ్రమునం దర్థపూర్ణానుస్వారములున్నవనియు ఙ ఞ లులేవనియుఁ జెప్పినది సర్వమనవద్యము. నిర్వికారదృష్టితో నీవ్యాసమునుజూచిన సత్యము గోచరమగుననియెంచి శాస్త్రీయచర్చ నొకింతఁజూపి విరమించుచున్నాడను.

తత్ - సత్.

వే. శివస్వామిశాస్త్రి.

# ఆంధ్ర దేశ గ్రంథ భాండాగార సంఘము.

ఈసంఘమునకిచ్చిన ఈక్రింది చందాలు వందనములతో నందుకొనబడినవి.

మ. రా. రా.

## 1914—1915.

| | | | |
|---|---|---|---|
| 1. | కొండా వేంకటప్పయ్యగారు | రు | 25 |
| 2. | గొల్లపూడి రామనాథయ్యగారు | | 25 |
| 3. | కొంపల్లి కోటిలింగంగారు | | 15 |
| 4. | లగడపాటి వేంకటనాగభూషణంగారు | | 15 |
| 5. | ఏకా లక్ష్మీనరసింహంగారు | | 10 |
| 6. | గోవిందరాజుల వెంకటశ్రీనివాసరావుగారు | | 10 |
| 7. | మామిడన్న బుచ్చయ్యగారు | | 10 |
| 8 | నాళం పద్మనాభంగారు | | 10 |
| 9 | నాళం రామలింగయ్యగారు | | 10 |
| 10 | పత్రి వెంకట శ్రీనివాసరావుగారు | | 5 |
| 11 | న్యాపతి హనుమంతరావుగారు | | 5 |
| 12 | ఏకా రామయ్యగారు | | 5 |
| 13 | వోరుగంటి సుబ్బారావుగారు | | 5 |
| 14 | యస్. శ్యామలరావుగారు | | 5 |
| 15 | గంటి లక్ష్మన్నగారు | | 5 |
| 16 | ఒకరు | | 3 |
| | | రు | 163 |

## 1915—1916.

| | | | |
|---|---|---|---|
| 1 | న్యాపతి సుబ్బారావు పంతులుగారు | రు | 100 |
| 2 | ద్వితీయ ఆంధ్రదేశగ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభ | | 53½ |
| 3 | వేమూరి రామచంద్రరావుగారు | | 10 |
| 4 | జంధ్యాల గౌరీనాథ శాస్త్రిలుగారు | | 10 |
| 5 | భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు | | 5 |
| 6 | కోపల్లె హనుమంతరావుగారు | | 5 |
| 7 | కట్టమూడి చిదంబరరావుగారు | | 3 |
| | | రు | 186½ |

అ. వేంకటరమణయ్య,

కార్యదర్శి.

RSVM01A101



# The Telugu Romantic Poetry

అపూర్వములు! రసప్రధానములు!!

## గ్రంథాలయముల నలంకరింపవలసిన పంచరత్నములు.

రాయప్రోలు సుబ్బరాయ కవీంద్రునిచే రచియింపబడినవి.

ఇట్టి గ్రంథము లిదివఱకు తెలుగులో లేవు. భావనలు నూతనములు. కల్పనలు విచిత్రబుద్ధి కుశలములు. భాషాశైలి సరళమధురము. నవ్యకవితా సౌందర్యము తెలియఁగోరువారు వీనిని చదివితీరవలెను. అందమైన ముద్రణము మనోహరమగు ఆకృతి.

### 1 తృణకంకణము

భంగమనోరథులయిన పడుచు మిత్రుల పరస్పర సంభాషణము. ఇందలి స్త్రీవర్ణనమెందును చదివియుండరు. విరహోత్కంఠుఁడైన పడుచువాని స్వగతవిలాపము వర్ణింపతరముగాదు. మైత్రీ విశ్వాసమున కిన్ని కన్నీళ్ళువిడచి, తృణకంకణము కట్టుభాగము అతికరుణము. వెల రు 0-4-0.

### 2 కష్టకమల

ఒక పండితకుమారి యాగంతుక మరణము. బ్రాహ్మణులయింటితోఁట వర్ణనము నిసర్గ మనోహరము. గొడ్డురాలయిన పూర్ణమాంబ కడుపుకోతలు చెప్పనలవిగాదు "అట్లతద్దె" వర్ణనమిందలి యందములలో నందమైనది. ఇది చదివిగాని వినిగాని కనులనీరు పెట్టనివారు లేరు. వెల 0-4-0.

### 3 స్నేహలతాదేవి

ఇల్లుకుదువఁబెట్టి వరదక్షిణ చెల్లించనెంచిన తండ్రి దురవస్థనెరిగి, అగ్నిహోత్రుని కన్న తండ్రివలె కౌఁగిలించికొని శాంతించిన ఒక వంగదేశ కుమారి చరిత్రము. ఈపుస్తకముయొక్క సురుచిర సంపత్తిచదివి యనుభవింప వలసినదే. స్నేహలతాదేవి రూపపటము ఇందుఁగలదు.

వెల రు 0-4-0.

### 4 తెనుఁగుతోఁట

ఆంధ్రబాలను సంబోధించుచు అనేకవిషయములిందు ధ్వని మనోహరములుగ వర్ణింపఁబడియున్నవి. ఒక్కొక్కగీతి యొక్కొక్క చిత్తసంస్కారమును హృదయంగమముగ నొనర్చును. గీతాసఖ్యపు పాటలత్యంత రసవంతములు. వెల రు 0-4-0.

### 5 స్వప్నకుమారము

ఇందు ప్రేమస్వరూపము రసస్ఫుటముగాఁ జిత్రింపఁబడినది. 'చింతాపుష్పము' లేరు ప్రణయుని భావరక్తి చదివితీరవలెను. పూలువిచ్చినట్లు విచ్చు మనోవేదన లిందుస్వభావసిద్ధములుగా వర్ణింపఁబడినవి. వెల రు 0-4-0.

ఈగ్రంథములు వలయువారిట్లు వ్రాయవలెను.

మేనేజరు అభినవకవితామండలి,

బెజవాడ.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 101 |
| పుస్తకం పేరు | గ్రంథాలయ సర్వస్వము |
| తారీఖు | 17/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NOS |
| మొత్తం పేజీలు | 117 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO, 32A, 48A, 48C, 60A, 64C |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |